
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18 సంచిక: 17
ESIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



చైనాపై మరో 50 శాతం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పనీ చేశారు. చైనాపై మరో 50 శాతం అదనపు సుంకాలు విధించారు.

- వివరాలు 6లో▶



భారీ మార్పులే లక్ష్యం

భారీ సంస్థాగత మార్పులు లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అహ్మదాబాద్‌లో నేడు జరిగే ఏఐసీసీ భేటీలో మేధోమథనానికి సిద్ధమైంది.

- వివరాలు 6లో▶



గవర్నర్‌కు గడువు 3 నెలలే

బిల్లులపై ఆలోగా నిర్ణయం తీసుకోవాల్సిందే: సుప్రీంకోర్టు

- రెండోసారి పంపితే నెలలోగా సమ్మతి తెలపాల్సిందే... లేదంటే న్యాయసమీక్షకు సిద్ధంగా ఉండాలి
- అసాధారణ జాప్యం రాజ్యాంగ విరుద్ధమే... బిల్లులపై గవర్నర్‌కు వీటో అధికారం లేదు
- తమిళనాడు గవర్నర్ రవి తీరు చట్టవిరుద్ధం... ఆయనకు పంపిన 10 బిల్లులు ఆమోదం పొందినట్లే
- అసాధారణ అధికారాలు ఉపయోగిస్తూ సర్వోన్నత ధర్మాసనం చరిత్రాత్మక తీర్పు
- గవర్నర్లు నిరోధకంగా ఉండొద్దంటూ కీలక వ్యాఖ్యలు

6 లో

ఉరే సరి



ఐదుగురు ఉగ్రవాదులకు శిక్షను సమర్థించిన హైకోర్టు

దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసులో దోషుల అప్పీళ్లు కొట్టివేత

- ఎన్‌ఐఏ కోర్టు తీర్పును ధ్రువీకరించిన ఉన్నత న్యాయస్థానం
- ఇది అత్యంత క్రూరమైన నేరమని వ్యాఖ్య... పన్నెండేళ్ల క్రితం హైదరాబాద్‌లో భయానక ఘటన
- మొత్తం 18 మందిని బలి తీసుకున్న ముష్కరులు
- ఆరుగురు నిందితుల్లో ఐదుగురికి ఉరి శిక్ష విధించిన ఎన్‌ఐఏ కోర్టు
- ట్రయల్ కోర్టు ఉత్తర్వులపై హైకోర్టులో దోషుల అప్పీల్
- యావజ్జీవ శిక్షతో లక్ష్యం నెరవేరదన్న ధర్మాసనం

2 లో

"అమాయక పౌరులపై ఉగ్రదాడులు జరిపి వారి మరణానికి కారణమైనప్పుడు ఉరిశిక్ష విధించాలనే వాదన సరైందే. నగరంలో పేలుళ్లకు పాల్పడటాన్ని సాధారణ నేరంగా పరిగణించరాదు. చిన్నా పెద్దా, ఆడామగా తేడా లేకుండా అంత మొందించి భయభ్రాంతులకు గురిచేయడం క్రూరత్వమే. దీన్ని వ్యవస్థీకృత నేరంగా పరిగణించాల్సి ఉంది. అరుదైన నేరాల్లో ఒకటిగా భావించాలి. విచక్షణా రహితంగా ప్రాణాలను హరించడమే లక్ష్యంగా బాంబు పేలుళ్లకు పాల్పడ్డారు. ప్రాసిక్యూషన్‌లోని చిన్న చిన్న లోపాలతో దోషులు లబ్ధి పొందలేరు. సాక్షులు తప్పుడు సాక్ష్యం చెప్పారని దోషుల తరఫు న్యాయవా దులు పేర్కొనడంలో అర్థంలేదు. మృతుల్లో పసికందు కూడా ఉంది. వారి కుటుంబీకులకు తప్పుడు సాక్ష్యం చెప్పాల్సిన అవసరం లేదు. మరణ వాంగ్మూలాలను నమోదు చేయనంత మాత్రాన ఇలాంటి కేసుల్లో నష్టం జరగదు. దోషుల్లో కొందరు తుపాకీ సహా ఇతర ఆయుధాలను వినియోగించడంలో సిద్ధహస్తులు. ఇలాంటి కిరాతక హత్యల విషయంలో ఉపశమనం ఇవ్వడం అర్థరహితం. కనికరం అన్న దానికి తావే లేదు. అంతిమ శిక్ష మరణశిక్షే.."

- హైకోర్టు ధర్మాసనం

ఇలాంటి శిక్ష ఇదే తొలిసారి! 2 లో 17 ఏళ్లుగా పరారీలోనే..

ఏ-1 మిర్చి సెంటర్ వద్ద మిఠాయిల పంపిణీ



దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్ చౌక్‌లో స్వీట్లు పంచిపెడుతున్న కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ జంట బాంబు పేలుళ్ల నిందితులకు ఎన్‌ఐఏ కోర్టు విధించిన ఉరిశిక్షను సమర్థిస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వటంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. బాధిత కుటుంబాలతో పాటు పేలుళ్లు జరిగిన సమీప ప్రాంతాల ప్రజలు సంబరాలు జరుపుకున్నారు. దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్ సమీపంలోని ఏ-1 మిర్చి సెంటర్ వద్ద మిఠాయిలు పంచి పెట్టారు.

ఉరిశిక్ష త్వరగా అమలు చేయాలి



ఏ-1 మిర్చి సెంటర్ వద్ద జరిగిన బాంబు పేలుడు వల్ల అక్కడికి అతి సమీపంలో ఉన్న మా బ్యాంగిల్ స్టోర్ పూర్తిగా ధ్వంసం అయ్యింది. కానీ ఇంతవరకు మాకు ప్రభుత్వం నుంచి ఎటు వంటి సాయం అందలేదు. బ్లాస్ట్ శబ్దానికి నా కుడి చెవి పనిచేయకుండా పోయింది. పేలుడు శకలాలు నా చెవిని కట్ చేసుకుంటూ వెళ్లాయి. అప్పటి నుంచి కుడి చెవి అలాగే ఉంది. ఆ ఘటన తలుచుకుంటేనే వెన్నులో వణుకు పుడుతుంది. దోషులకు ఉరి శిక్ష త్వరగా అమలు చేయాలి.

\- పి.రామకృష్ణ

అప్పట్లో మేం సర్వం కోల్పోయాం



ఏ-1 మిర్చి సెంటర్ వద్ద బాంబు పేలుడు ఘటనలో మా సోదరుడు గోపాల్‌రెడ్డి చేతి వేళ్లు పోయాయి. మేం సర్వం కోల్పోయాం. విధిలేని పరిస్థితుల్లో ఉప్పల్‌లో ఓ హోటల్‌లో మాస్టర్‌గా చేశా. కొన్నాళ్ల తర్వాత మళ్లీ మిర్చి పాయింట్ పెట్టుకుని ఇప్పుడిప్పుడే స్థిరపడుతున్నా. ఆనాటి ఘటనను ఎవరో ఒకరు గుర్తు చేస్తుంటారు. హైకోర్టు తీర్పుతో నేనే స్వీట్లు పంచిపెట్టా. దోషులకు శిక్షలు త్వరగా అమలు చేస్తే అందరూ సంతోషిస్తారు.

\- కొత్తపల్లి పాండురెడ్డి

పీడకలలా వెన్నాడుతున్న పేలుళ్లు

ఆశలన్నీ ఆవిరైపోయాయన్న చింతూరు వాసి

చింతూరు: దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల కేసులో దోషులకు ఉరి శిక్షను హైకోర్టు సమర్థించడంపై, ఆనాటి ఘటన బాధితుడు ఏపీలోని అల్లూరి జిల్లా చింతూరుకు చెందిన పురాల శెట్టి దుర్గాప్రసాద్ హర్షం వ్యక్తం చేశాడు. దుర్గాప్రసాద్ హైదరాబాద్‌లో విద్యనభ్యసిస్తున్న సమయంలో ఈ పేలుళ్లు సంభవించాయి. ఆ సమయంలో స్నేహితులతో కలిసి అక్కడ ఉన్న దుర్గాప్రసాద్ పేలుళ్ల ధాటికి తీవ్రంగా గాయపడ్డాడు. ఆ ఘటన తనను ఇంకా పీడకలలా వెన్నాడుతోందన్నాడు. ప్రాణాలతో బయట పడినా చాలాకాలం మంచానికే పరిమితం కావాల్సి వచ్చిందన్నారు.

విష్ణువర్ధన్‌రెడ్డిది రెడ్డిపాలెం



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసులో ఎన్‌ఐఏ తరఫున వాదించిన పి.విష్ణువర్ధన్‌రెడ్డి బూర్గంపాడు మండలం రెడ్డిపాలెంకు చెందినవారు. పలు కుటుంబాల్లో కల్లోలం సృష్టించిన దోషుల విషయంలో హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ నెలకొంది. అయితే విష్ణువర్ధన్‌రెడ్డి సమర్థమైన వాదనలు వినిపించారు. ఉమ్మడి ఏపీ హైకోర్టులో 2000 నుంచి వాదనలు వినిపిస్తున్న ఆయన అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియాగా 2010లో కేవలం 35 ఏళ్ల వయస్సులోనే ఎంపికయ్యారు. ఆ తర్వాత 2014లో ఎన్‌ఐఏకి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. గోకుల్‌చాట్, లుంబినీ పార్క్ పేలుళ్ల కేసుల్లోనూ వాదించారు.

ఇదం జగత్





గత ఏడాది కంటే కటాఫ్ తగ్గే చాన్స్

- ఈసారి 92 పర్సంటైల్ ఉండొచ్చని అంచనా
- జేఈఈ-మెయిన్ పరీక్షలు రెండు సెషన్లూ క్లిష్టంగానే..
- జనవరితో పోలిస్తే ఏప్రిల్ సెషన్‌లో ఉపశమనం
- ముగిసిన రెండో సెషన్ పరీక్షలు

సాక్షి, ఎడ్యుకేషన్: జాతీయస్థాయిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన జేఈఈ మెయిన్-2025లో గత ఏడాదితో పోలిస్తే కటాఫ్ కొంత తగ్గే అవకాశం ఉంది. 2024లో జేఈఈ మెయిన్స్‌లో పర్సంటైల్ 94 ఉండగా, ఈసారి అది 92 ఉండొచ్చని సబ్జెక్ట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది జనవరి, ఏప్రిల్‌లో నిర్వహించిన రెండు సెషన్లలోనూ ప్రశ్నలు కాసింత క్లిష్టంగా ఉండటమే కారణమని చెబుతున్నారు. దేశవ్యాప్తంగా రెండు సెషన్లలో.. 19 షిఫ్టులలో నిర్వహించిన జేఈఈ మెయిన్ ప్రవేశ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. దాదాపు 12 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా 90 శాతం మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు లక్షన్నర మంది అభ్యర్థులు ఉంటారని అంచనా.

పర్సంటైల్ అంచనా..: ఈసారి మ్యాథమెటిక్స్‌లో 20 మార్కులతో; ఫిజిక్స్‌లో 50 మార్కులతో; కెమిస్ట్రీలో 35 మార్కులతో 92 పర్సంటైల్ ఉండొచ్చని చెబుతున్నారు. అదేవిధంగా మ్యాథమెటి క్స్‌లో 35 మార్కులు; ఫిజిక్స్‌లో 45 మార్కులు; కెమిస్ట్రీలో 65 మార్కులతో 99 పర్సంటైల్‌ను ఆశించొచ్చని అంటున్నారు.

చివరి రోజు కాస్త కఠినం: జేఈఈ-మెయిన్ చివరి రోజు ప్రశ్నపత్రం ఓ మోస్తరు క్లిష్టంగా ఉందని సబ్జెక్ట్ నిపుణులు చెప్పారు. మ్యాథమెటిక్స్ ప్రశ్నలు సులభంగా ఉన్నాయని, కెమిస్ట్రీ ప్రశ్నలు సుదీర్ఘ కసరత్తు చేసేలా ఉన్నాయన్నారు. ఫిజిక్స్‌లో కూడా ఓ మాదిరి కఠినంగానే ప్రశ్నలు అడిగారని తెలిపారు. కెమిస్ట్రీలో ఆర్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీలకు ఎక్కువ వెయిటేజీ కల్పించారని, అదేవిధంగా ప్రశ్నలు మెమొరీ బేస్డ్‌గా ఉన్నాయని విద్యార్థులు చెప్పారు. ఫిజిక్స్‌లో కాన్సెప్ట్స్, కాలిక్యులేషన్స్ అవసరమైన ప్రశ్నలు అడగడంతో కొంత సమయాభావం ఎదురైంది. మ్యాథమెటిక్స్‌లో కాలిక్యులస్, కోఆర్డినేట్ జామెట్రీ, ఆల్జీబ్రాలకు వెయిటేజీ కల్పించారు.

నేడు పేపర్-2ఎ, 2బి పరీక్షలు: ఎన్‌ఐటీల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికి అర్హతగా నిలిచే పేపర్-2ఎ(బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్), పేపర్-2బి (బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్) పేపర్ల పరీక్షలను బుధవారం నిర్వహించనున్నారు.

ఈఏపీసెట్, అడ్వాన్స్‌డ్ రెండింటికీ ఇలా..


జేఈఈ మెయిన్ పరీక్షలు ముగిసిన నేపథ్యంలో విద్యార్థుల దృష్టి ఈఏపీసెట్, జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రిపరేషన్‌పై ఉంటుంది. ఈ రెండింటికీ ఉమ్మడిగా ప్రిపరేషన్ సాగించాలని భావిస్తారు. కానీ, జేఈఈ-మెయిన్‌లో కటాఫ్ అంచనా కంటే కనీసం పది మార్కులు ఎక్కువ సాధిస్తామనే నమ్మకం ఉంటేనే ఉమ్మడి ప్రిపరేషన్ దిశగా కదలాలి. లేదంటే ముందుగా ఈఏపీసెట్ ప్రిపరేషన్‌కు పదును పెట్టుకోవాలి. ఎందుకంటే ఈఏపీసెట్‌లో వేగం, కచ్చితత్వం అత్యంత అవశ్యకం. మూడు గంటల్లో 160 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని గుర్తుపెట్టుకోవాలి. ఈ ఏడాది జేఈఈ మెయిన్‌ను విశ్లేషిస్తే సాగదీత ప్రశ్నలు, న్యూమరికల్ ప్రశ్నలు ఎక్కువగా ఉండటంతో అభ్యర్థులకు సమయం సమస్యగా మారింది.

\-ఎంఎన్ రావు, జేఈఈ శిక్షణ నిపుణుడు

ఉరే సరి

ఐదుగురు ఉగ్రవాదులకు శిక్షను సమర్థించిన హైకోర్టు

- దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసులో దోషుల అప్పీళ్లు కొట్టివేత
- ఎన్‌ఐఏ కోర్టు తీర్పును ధ్రువీకరించిన ఉన్నత న్యాయస్థానం
- ఇది అత్యంత క్రూరమైన నేరమని వ్యాఖ్య





దిల్‌సుఖ్‌నగర్ వద్ద పేలుడు దృశ్యం(ఫైల్)

సాక్షి, హైదరాబాద్: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసులో హైకోర్టు సంచలనాత్మక తీర్పు వెలువరించింది. దోషులుగా తేలిన ఉగ్రవాదులకు ఉరి శిక్షే సరైందని స్పష్టం చేసింది. ఈ మేరకు 2016 డిసెంబర్‌లో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును యథాతథంగా సమర్థించింది. ట్రయల్ కోర్టు ఉత్తర్వుల్లో ఎందుకు జోక్యం చేసుకోవాలో నిరూపించడంలో అప్పీల్‌దారులు విఫలమయ్యారని పేర్కొంది. అసదుల్లా అక్తర్, జియా ఉర్ రెహమాన్, తెహసీన్ అక్తర్, మహ్మద్ అహ్మద్ సిద్ధిబప్ప అలియాస్ యాసీన్ భత్కల్, ఎజాజ్ షేక్ దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టివేసింది. దోషులకు మరణ శిక్ష ఖరారు చేస్తూ జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ శ్రీసుధ ధర్మాసనం మంగళవారం 357 పేజీల సుదీర్ఘ తీర్పు వెలువరించింది.

పన్నెండేళ్ల క్రితం..

2013 ఫిబ్రవరి 21న దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగిన జంట పేలుళ్లలో 18 మంది మృతి చెందగా, 131 మంది గాయపడ్డారు. ఈ కేసులో దోషులుగా తేలిన ఐదుగురికి ఎన్‌ఐఏ ఫాస్ట్ ట్రాక్ కోర్టు 2016లో ఉరి శిక్ష విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ముద్దాయిలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ అప్పీళ్లపై హైకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. నిందితుల తరఫున న్యాయవాదులు ఆర్.మహదేవన్, అప్పం చంద్రశేఖర్ వాదనలు వినిపించగా, ఎన్‌ఐఏ తరఫున సీనియర్ న్యాయవాది, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.విష్ణువర్ధన్ రెడ్డి వాదనలు వినిపించారు. సుమారు 45 రోజుల పాటు సాగిన సుదీర్ఘ వాదనలు, సాక్ష్యాధారాల పరిశీలన అనంతరం తీర్పును రిజర్వు చేసిన ధర్మాసనం మంగళవారం కింది కోర్టు తీర్పును సమర్థిస్తూ తీర్పునిచ్చింది.

మొత్తం సమాజంపై దుష్ప్రభావం..

'ఎన్‌ఐఏ కోర్టు వాస్తవ పరిస్థితులన్నింటినీ పరిగణనలోకి తీసుకుని అప్పీలుదారులకు వివిధ సెక్షన్ల కింద మరణశిక్ష, జీవిత ఖైదు, ఇతర శిక్షలను విధించింది. అప్పీలుదారులు చేసిన వ్యక్తిగత వాదనలు, సాక్షుల వాంగ్మూలాలను కూలంకషంగా పరిశీలించింది. అప్పీలుదారులకు వ్యతిరేకంగా శిక్షలను విధించడానికి బలమైన, సహేతుకమైన కారణాలను నమోదు చేసింది. శిక్షలను విధించడంలో ట్రయల్ కోర్టు ఎక్కడా ఏకపక్షంగా, అసమంజసంగా వ్యవహరించలేదు. ప్రభుత్వ నివేదికలను పరిశీలించిన తర్వాత.. సీఆర్‌పీసీ సెక్షన్ 366 ప్రకారం 2016, డిసెంబర్ 19న ట్రయల్ కోర్టు విధించిన మరణశిక్ష సరైనదేనని ఈ ధర్మాసనం భావిస్తోంది. ఇలాంటి కేసుల విచారణలో కునాల్ మజుందార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ రాజస్తాన్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. ఇది అత్యంత క్రూరమైన నేరం. ఇది బాధితులపైనే కాదు, మొత్తం సమాజంపై దుష్ప్రభావాలు చూపించింది. ఇలాంటి కేసుల్లో నేరస్తుల మనస్తత్వం, నేరం జరిగిన వెంటనే, ఆ తర్వాత దోషుల ప్రవర్తన, నేరస్తుల గత చరిత్ర, నేర పరిమాణం, బాధితులపై ఆధారపడిన వారిపై దాని పరిణామాలు.. ఇలా అన్ని అంశాలను పరిశీలించాల్సి ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. అలాగే ఇలాంటి కేసుల్లో ఇచ్చే తీర్పు శాంతిని ప్రేమించే పౌరుల మనసుల్లో విశ్వాసాన్ని నింపాలి. ఇతరులు అలాంటి నేరాలకు పాల్పడకుండా నిరోధించే లక్ష్యాన్ని సాధించేలా ఉండాలి. కాబట్టి దోషుల సంస్కరణకు, పునరావాసానికి అవకాశం ఇచ్చే పరిస్థితి లేదు. ఇక్కడ జీవిత ఖైదు పూర్తిగా వ్యర్థం. ఎందుకంటే ఇలాంటి నేరస్తుల విషయంలో సంస్కరణ శిక్షతో లక్ష్యం పూర్తిగా నెరవేరదు. కాబట్టి దోషుల అప్పీళ్లను కొట్టివేస్తున్నాం. వీరికి ఎన్‌ఐఏ కోర్టు విధించిన మరణశిక్షను ధ్రువీకరిస్తున్నాం. సీఆర్‌పీసీ సెక్షన్ 363లోని సబ్ సెక్షన్(2) నిబంధన మేరకు దోషులకు తీర్పు కాపీని ఉచితంగా అందజేయాలి. నేటి నుంచి 30 రోజుల్లోగా సుప్రీంకోర్టు ముందు అప్పీల్ చేసుకునే హక్కు దోషులకు ఉంటుంది..' అని ధర్మాసనం పేర్కొంది.

ఏ-1 రియాజ్ భత్కల్

ఈ కేసులో ఎన్‌ఐఏ రియాజ్ భత్కల్‌ను ఏ-1గా చేర్చింది. అసదుల్లా అక్తర్ (ఏ-2), జియా ఉర్ రెహ్మాన్ (పాకిస్తాన్ వాసి, ఏ-3), తెహసీన్ అక్తర్ (ఏ-4), మొహమ్మద్ అహ్మద్ సిద్ధిబప్ప అలియాస్ యాసీన్ భత్కల్(ఏ-5), ఎజాజ్ షేక్ (ఏ-6)గా ఉన్నారు. 157 మంది సాక్షులుగా ఉన్నారు. ఎన్‌ఐఏ కోర్టు 502 డాక్యుమెంట్లు, 201 ఎవిడెన్స్‌లను (సాక్ష్యాధారాలు) పరిశీలించి నిందితులను దోషులుగా నిర్ధారించింది. ఐదుగురికి ఉరి శిక్ష వేసింది. 2016 డిసెంబర్ 24న దోషులు హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు.

17 ఏళ్లుగా పరారీలోనే!

ఇప్పటికీ చిక్కని పేలుళ్ల మాస్టర్ మైండ్ రియాజ్ భత్కల్

- అతడి నేతృత్వంలో నగరంలో 'రెండు ఆపరేషన్స్'
- 2008 నుంచి పాకిస్తాన్‌లోనే తలదాచుకున్న మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది

సాక్షి, హైదరాబాద్: రియాజ్ భత్కల్.. 2007 నాటి గోకుల్ చాట్, లుంబినీ పార్క్, 2013 నాటి దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్లకు సూత్రధారిగా, ఈ కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్న మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది. తెలంగాణ సహా తొమ్మిది రాష్ట్రాల్లో నమోదైన విధ్వంసాల కేసుల్లో ఇతని పేరు ప్రముఖంగా ఉంది. 2008లో అజ్ఞాతంలోకి వెళ్లిపోయి, 17 ఏళ్లుగా పరారీలో ఉన్న రియాజ్ భత్కల్ ఇప్పటికీ చిక్కలేదు.

భత్కల్‌లో పుట్టి.. నేరబాట పట్టి

రియాజ్ భత్కల్ అసలు పేరు రియాజ్ అహ్మద్ షహబంద్రి. కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లా భత్కల్ గ్రామంలో 1976 మే 19న పుట్టాడు. ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు, స్మగ్లింగ్ వ్యవహారాలు ఎక్కువ. వాటి ప్రభావంతో నేరబాట పట్టాడు. వీరి కుటుంబం కొన్నాళ్ల పాటు మహారాష్ట్రలోని ముంబైలో నివసించింది. ఇతనికి ఆది నుంచీ డబ్బుపైన ఆశ ఎక్కువ. ఆ యావలోనే ముంబై గ్యాంగ్‌స్టర్ ఫజల్ ఉర్ రెహ్మాన్ ముఠాలో చేరాడు. బెదిరింపులు, కిడ్నాప్‌లు తదితర వ్యవహారాల ద్వారా డబ్బు సంపాదించడం ప్రారంభించాడు. ఈ మేరకు ఇతనిపై కోల్‌కతా, ముంబయి, కర్ణాటకల్లో అనేక కేసులు నమోదైనా..ఒక్కసారీ అరెస్టు కాలేదు. ఈ గ్యాంగు నుంచి బయటకు వచ్చిన తర్వాత కుర్లా ప్రాంతంలో 'ఆర్‌ఎస్' పేరుతో కొత్తముఠా కట్టి కొంతకాలం వ్యవహారాలు సాగించాడు. అక్కడ స్థానికంగా ఓ ప్రార్థన స్థలానికి, ప్రత్యేక కార్యక్రమాలకు తరచూ వెళ్లేవాడు. ఆ క్రమంలో నిషిద్ధ స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి)లో కొంతకాలం పని చేశాడు. అప్పుడికే ఇతని అన్న ఇక్బాల్ భత్కల్ పాక్ ప్రేరేపిత లష్కరే తొయిబాతో సంబంధాలు పెట్టుకోవడంతో అతని ద్వారా ఉగ్రవాదం వైపు మళ్లాడు. ఇండియన్ ముజాహిదీన్ (ఐఎం) ఏర్పాటులో కీలక పాత్ర పోషించి, రెండో కమాండ్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నాడు. ఆసిఫ్ రజా కమెండో ఫోర్స్ పేరుతో ఉగ్రవాద సంస్థను ప్రారంభించిన కోల్‌కతా వాసి అమీర్ రజా ఖాన్ నుంచి అందే ఆదేశాల ప్రకారం చేపట్టాల్సిన విధ్వంసాలకు పేలుడు పదార్థాలు, మనుషులు, డబ్బు ఏర్పాటు చేస్తుంటాడు.

ధనార్జన కోసం రియల్టర్ అవతారం...

జిహాద్ పేరుతో యువకులను ఉగ్రవాదం వైపు నడిపించి వారి భవితను భత్కల్ బుగ్గిపాలు చేశాడు. తాను మాత్రం ఉగ్రవాదం పేరు చెప్పి వసూలు చేసిన నిధులను భారీగా దారి మళ్లించి రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహించాడు. మరిన్ని నిధుల కోసం పుణేకు చెందిన వ్యాపారులను కిడ్నాప్ చేయాలని కుట్రపన్నాడు. విధ్వంసాలకు శిక్షణ, పేలుడు పదార్థాల కొనుగోలు, ఆయుధాల సేకరణ పేరుతో కొన్ని విదేశీ సంస్థల నుంచి హవాలా ద్వారా భారీగా నిధులు సమీకరించాడు. అయితే వాటిని తన సొంత ఖాతాల్లోకి మార్చుకుంటూ మంగళూరు సమీపంలోని థొయ్యత్తు, ఉల్లాల్ పరిసరాల్లో భారీగా రియల్ ఎస్టేట్ వెంచర్లు నిర్వహించాడు. హైదరాబాద్, జైపూర్, బెంగళూరు, అహ్మదాబాద్ పేలుళ్ల నిమిత్తం అంటూ విదేశీ సంస్థల నుంచి రూ.లక్షల్లో నిధులు సమీకరించాడు.

గుట్టు బయటపడింది ఇతని వల్లే..

ఐఎంలో కీలక వ్యక్తిగా ఉన్న రియాజ్ భత్కల్ అనేక పేలుళ్ల సందర్భంలో కొన్ని ఈ-మెయిల్స్ రూపొందించి మీడియా సంస్థలకు పంపాడు. ఇలా చేయడాన్ని మరో ఉగ్రవాదైన సాదిక్ షేక్ పూర్తిగా వ్యతిరేకించాడు. దీనివల్ల తమ ఉనికి బయటపడుతుందని, దర్యాప్తు సంస్థలకు పట్టుబడే అవకాశం ఉందని వాదిస్తూ వచ్చాడు. ఈ మాటలను రియాజ్ పెడచెవిన పెట్టాడు. ప్రతి విధ్వంసానికీ అత్యంత పకడ్బందీగా వ్యూహరచన చేసి కథనడిపేది తామైతే... చివరకు పేరు మాత్రం సీమాంతర ఉగ్రవాద సంస్థలకు రావడం రియాజ్‌కు రుచించలేదు. తమ సంస్థ పేరు బయటకు వచ్చి ప్రచారం జరిగితే నిధులు సైతం భారీగా వస్తాయంటూ సాదిక్‌తో వాదించాడు. చివరకు తన పంతం నెగ్గించుకుని ప్రతి విధ్వంసానికీ ముందు ఈ-మెయిల్ పంపడం ప్రారంభించాడు. ఈ మెయిల్స్ వచ్చిన ఐపీ అడ్రస్ ఆధారంగా దర్యాప్తు చేసిన అధికారులు ఐఎంకు సంబంధించిన కొన్ని వివరాలు సేకరించారు. అలా ప్రారంభమైన దర్యాప్తుతోనే 2008లో ఐఎం గుట్టురట్టు అయింది. దీంతో అజ్ఞాతంలోకి వెళ్ళిపోయిన రియాజ్... ప్రస్తుతం పాకిస్తాన్‌లోని డిఫెన్స్ ఏరియాలో తలదాచుకుంటున్నట్టు సమాచారం.

ఉరిశిక్ష ఖరారు హర్షణీయం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: దిల్‌సుఖ్‌నగర్ జంట బాంబు పేలుళ్ల ఘటన పై తెలంగాణ హైకోర్టు తీర్పును కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి స్వాగతించారు. నిందితులకు ఎన్‌ఐఏ కోర్టు విధించిన ఉరిశిక్షను హైకోర్టు సమర్థించడంపై ఒక ప్రకటనలో ఆయన హర్షం వ్యక్తం చేశారు. మారణహోమాన్ని సృష్టించిన ఉగ్రవాదులకు ఉరే సరైన శిక్ష అని హైకోర్టు పేర్కొనడంతో.. ప్రజాస్వామ్యంలో హింస, ఉగ్రవాదానికి చోటు లేదని మరోసారి స్పష్టమైందని తెలిపారు. పన్నెండేళ్లుగా పీడక లలా వెంటాడుతున్న ఈ అంశంలో.. బాధి తుల కుటుంబాలకు సరైన న్యాయం జరిగిందని అభిప్రాయపడ్డారు. బాధిత కుటుంబా లకు అండగా నిలుస్తామని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఉగ్రవాద నిర్మూలనలో మోదీ ప్రభు త్వం జీరో టాలరెన్స్ విధానంతో పనిచేస్తోందని స్పష్టం చేశారు. జాతీయ దర్యాప్తు సంస్థ సమగ్ర విచారణ చేసి, నిందితులను శిక్షించడంలో కీలకపాత్ర పోషించిందని పేర్కొన్నారు. పేలుళ్లపై దర్యాప్తు చేసిన పోలీస్ సిబ్బందిని కిషన్ రెడ్డి అభినందించారు.

ఉగ్రవాదానికి ఊతమిచ్చే వారిని కట్టడి చేయాలి

బీజేపీ నేత కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసులో హైకోర్టు వెలువరించిన తీర్పును బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యు డు కె.లక్ష్మణ్ స్వాగతించారు. ఈ బాంబు పేలుళ్ల కేసులో దోషులకు ఎన్‌ఐఏ కోర్టు ఉరిశిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పునే హైకోర్టు కూడా ఖరారు చేయడం మంచి నిర్ణయమన్నారు. తెలంగాణలో లేదా హైదరాబాద్‌లో ఉగ్రవాదానికి ఊతమిచ్చే సంస్థలు, పార్టీలు ఏవైనా ఉంటే వాటిని కట్టడి చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తోందని లక్ష్మణ్ పేర్కొన్నారు.

11 గంటలు.. పలు ప్రశ్నలు

- శ్రవణ్‌రావును మూడోసారి విచారించిన సిట్ అధికారులు
- సరైన సమాధానాలు ఇవ్వలేదంటున్న అధికారులు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ

సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరో నిందితుడిగా ఉన్న ఓ చానల్ అధినేత శ్రవణ్‌రావు మంగళవారం మూడోసారి సిట్ ముందు విచారణకు వచ్చారు. ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ ఠాణాకు వచ్చిన శ్రవణ్‌రావు సిట్ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఏసీపీ పి.వెంకటగిరి ముందు హాజరయ్యారు. రాత్రి 10 గంటల వరకు.. అంటే 11 గంటల పాటు అధికారులు వివిధ కోణాల్లో ప్రశ్నలు సంధించారు. ఈ కేసులో రెండో నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు వాంగ్మూలం ఆధారంగా శ్రవణ్‌ను ప్రశ్నించారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుతో శ్రవణ్ సన్నిహితంగా మెలిగారు. 2023లో జరిగిన ఆయన ఫ్యామిలీ ఫంక్షన్‌కూ హాజరయ్యారు. అక్కడే ప్రభాకర్‌రావు ద్వారా శ్రవణ్‌రావుకు ప్రణీత్‌రావు పరిచయం అయ్యాడు. ఆ తర్వాత పలుమార్లు ఎస్ఐబీ కార్యాలయానికి వెళ్లిన శ్రవణ్ అక్కడే ప్రణీత్‌ను కలిశారు. దీనిపై సిట్ ప్రశ్నించగా... తాను ఓ చానల్ అధినేత కావడంతో వృత్తిపరమైన సమాచారం కోసమే వెళ్లానని బదులిచ్చారు. శ్రవణ్ తనకున్న పరిచయాలతో రాజకీయ, వ్యాపార రంగాలకు చెందిన వ్యక్తుల సమాచారం సేకరించేవారు. వీరిలో నాటి ప్రతిపక్షానికి మద్దతుగా ఉన్న వారిని గుర్తించి, ఆ వివరాలను ప్రణీత్‌కు అందించారన్నది ఓ ఆరోపణ. దీనిపైనా సిట్ శ్రవణ్‌ను ప్రశ్నించింది.

శ్రవణ్ ఎంపిక చేసిన వారే టార్గెట్‌గా : 2023 ఎన్నికల నేపథ్యంలో ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు సాగిన ఫోన్ ట్యాపింగ్‌లో శ్రవణ్ ఎంపిక చేసిన వారినే టార్గెట్‌గా చేసుకున్నట్లు నిందితుల విచారణలో పోలీసులకు తెలిసింది. ఈ కోణంలోనూ శ్రవణ్‌ను ప్రశ్నించారు. ఆ ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్‌కు లబ్ధి చేకూర్చాలని భావించిన నాటి మంత్రి హరీశ్‌రావు ఓ కీలక సమావేశానికి సిఫార్సు చేశారన్నది పోలీసుల ఆరోపణ. ఆయన సూచనల మేరకే ప్రభాకర్‌రావు, ప్రణీత్, శ్రవణ్ సమావేశమై నిఘా ఉంచాల్సిన వ్యక్తుల పేర్లు ఖరారు చేశారని పోలీసులు చెబుతున్నారు. ప్రణీత్ విచారణలోనూ ఇదే విషయం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శ్రవణ్‌రావుకు, హరీశ్‌రావుకు మధ్య ఉన్న సంబంధాల పైనా ఆరా తీశారు. వీరంతా కలిసి ప్రతిపక్షాలకు చెందిన నగదును పట్టుకోవడం,అధికారపక్షం నగదు రవాణాలోనూ కీలకంగా వ్యవహరించారన్న కోణంలోనూ శ్రవణ్‌ను ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు నియోజకవర్గాల వారీగా సర్వే చేసిన శ్రవణ్.. బీఆర్ఎస్‌కు 50 సీట్లు దాటడం కష్టమంటూ నివేదిక ఇచ్చినట్లు విచారణలో బయటపడింది. కాగా, శ్రవణ్‌రావు నుంచి సహకారం లభించట్లేదని, తమ ప్రశ్నలకు దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. 2023లో శ్రవణ్ నుంచి స్వాధీనం చేసుకున్న రెండు సెల్‌ఫోన్లలోని సమాచారం పోలీసులు రిట్రీవ్ చేయనున్నారు. ఈ వివరాల ఆధారంగా శ్రవణ్‌ను మరోసారి విచారించాలని భావిస్తున్నారు.

ఇలాంటి శిక్ష ఇదే తొలిసారి!

కింది కోర్టు తీర్పును యథాతథంగా సమర్థించిన హైకోర్టు • దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల కేసులో దోషులకు ఉరి ఖరారు



రియాజ్ భత్కల్



యాసీన్ భత్కల్



అసదుల్లా అక్తర్



జకీ ఉర్ రెహ్మాన్



తెహసీన్ అక్తర్



ఎజాజ్ షేక్

సాక్షి, హైదరాబాద్: దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసులో దోషులుగా తేలిన ఐదుగురు ఉగ్రవాదులకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు వేసిన ఉరి శిక్షను హైకోర్టు సమర్థించడం తెలిసిందే. అయితే ఓ కేసులో నిందితులందరికీ ఉరి శిక్ష పడటం, కింది కోర్టు తీర్పును హైకోర్టు యథాతథంగా సమర్థించడం తెలుగు రాష్ట్రాల చరిత్రలో ఇదే తొలిసారి. ఈ కేసులో మొత్తం ఆరుగురు నిందితులుగా ఉండగా.. ప్రధాన సూత్రధారి రియాజ్ భత్కల్ ఇంకా పరారీలోనే ఉన్నాడు. మిగతా ఐదుగురికి ఉరి శిక్షను ఉన్నత న్యాయస్థానం ఖరారు చేసింది. దేశంలో ఇండియన్ ముజాహిదీన్ (ఐఎం) ఉగ్రవాద సంస్థ పాల్పడిన ఘాతుకాలకు సంబంధించి విచారణ పూర్తై, కింది కోర్టులో శిక్షపడి, దాన్ని హైకోర్టు ఖరారు చేసిన తొలి కేసు ఇదే కావడం గమనార్హం.

ఎవరీ ఐదుగురు? ఇప్పుడెక్కడ ఉన్నారు?

పాకిస్తాన్‌లో తలదాచుకున్న రియాజ్ భత్కల్ ఆదేశాల మేరకు జర్ిగిన ఈ ఆపరేషన్‌లో అతడి సోదరుడు మహ్మద్ అహ్మద్ సిద్ధిబప్ప అలియాస్ యాసీస్ భత్కల్‌తో పాటు అసదుల్లా అక్తర్ అలియాస్ హడ్డీ, జియా ఉర్ రెహ్మాన్ అలియాస్ వకాస్ (పాకిస్తానీ), మహ్మద్ తెహసీన్ అక్తర్ అలియాస్ మోను, ఎజాజ్ షేక్ పాల్గొన్నారు. పేలుళ్లపై దర్యాప్తు చేపట్టిన ఎన్‌ఐఏ దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో వీరిని అదుపులోకి తీసుకుంది. వివిధ కేసులకు సంబంధించి కొంతకాలం ముంబై, పుణే జైళ్లలో ఉన్న ఈ ఐదుగురూ ప్రస్తుతం తిహార్ జైల్లో విచారణ ఖైదీలుగా ఉన్నారు.

ఏ ప్రాంతానికి చెందినవాళ్లు?

- **రియాజ్ భత్కల్:** కర్ణాటకలోని భత్కల్‌లో ఉన్న తెంగినగుడి
- **అసదుల్లా అక్తర్:** ఉత్తరప్రదేశ్‌లోని ఆజమ్‌గఢ్‌లో ఉన్న గులమ్పూర్
- **జకీ ఉర్ రెహ్మాన్:** పాకిస్తాన్ పంజాబ్‌లో ఉన్న గోజారా
- **తెహసీన్ అక్తర్:** బిహార్‌లోని సమిస్తిపూర్ జిల్లా ముట్కాపూర్
- **యాసీన్ భత్కల్:** కర్ణాటకలోని భత్కల్‌లో ఉన్న ముగ్దుం కాలనీ.
- **ఎజాజ్ షేక్:** మహారాష్ట్రలోని పుణే ఘోర్‌పేట్

ఎవరి పాత్రలు ఏంటి?

- **రియాజ్ భత్కల్:** కీలక సూత్రధారి
- **యాసీన్ భత్కల్:** నేపాల్‌లో ఉండి కుట్రను అమలు చేశాడు
- **వకాస్:** 107 బస్‌స్టాప్ వద్ద బాంబుతో ఉన్న సైకిల్ పెట్టాడు
- **మోను:** ఏ-1 మిర్చి సెంటర్ వద్ద బాంబుతో ఉన్న సైకిల్ వదిలాడు
- **హడ్డీ:** అబ్దుల్లాపూర్ మెట్‌లో షెల్టర్ తీసుకున్నాడు. సైకిళ్ళు తదితరాలు కొనుగోలు చేశాడు.
- **ఎజాజ్:** అవసరమైన పేలుడు పదార్థాలు, నగదు సమకూర్చాడు

ఎప్పుడు.. ఎక్కడ చిక్కారంటే..

ఎజాజ్ షేక్‌ను 2013 సెప్టెంబర్ 6న ఉత్తరప్రదేశ్ పశ్చిమ ప్రాంతమైన సహరంగ్‌పూర్ రైల్వే స్టేషన్‌లో పట్టుకున్నట్లు ఎన్‌ఐఏ రికార్డుల్లో పేర్కొంది. యాసీన్, హడ్డీలు 2013 ఆగస్టు 29న బిహార్‌లోని రక్సుల్ ప్రాంతంలో దొరికారని తెలిపింది. జియా ఉర్ రెహ్మాన్‌ను రాజస్తాన్‌లోని అజ్మీర్ రైల్వేస్టేషన్‌లో 2014 మార్చ్ 22న, తెహసీన్ అక్తర్‌ను పశ్చిమ బెంగాల్‌లోని కాఖర్భిత ప్రాంతంలో 2014 మార్చి 25న పట్టుకున్నట్లు పేర్కొంది. యాసీన్ అరెస్టు తర్వాత ఎజాజ్ షేక్‌కు దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్లలో పాత్ర ఉన్నట్లు తేలింది. కాగా వీరందరినీ వేర్వేరు సమయాల్లో ఎన్‌ఐఏ హైదరాబాద్‌కు తీసుకువచ్చి అరెస్టు చేసింది.

విచారణ పూర్తి, శిక్షలు..

2016 నవంబర్ 21న కేసుల విచారణ పూర్తి కాగా.. డిసెంబర్ 13న పరారీలో ఉన్న రియాజ్ మినహా మిగిలిన ఐదుగురినీ ఎన్‌ఐఏ కోర్టు దోషులుగా తేల్చింది. అదే నెల 19న వారికి ఉరి శిక్ష విధించింది.

రెండు కేసులు .. ఒకే ఉదంతం

2013 ఫిబ్రవరి 21న తొలుత దిల్‌సుఖ్‌నగర్‌లోని 107 బస్టాప్ వద్ద, తర్వాత ఏ-1 మిర్చి సెంటర్ వద్ద కొన్ని సెకన్ల తేడాతో జరిగిన పేలుళ్లలో ఓ గర్భస్థ శిశువు సహా 18 మంది మరణించగా.. 131 మంది క్షతగాత్రులయ్యారు. మొదటిది సాయంత్రం 6 గంటల 58 నిమిషాల 38 సెకండ్లకు పేలగా, రెండోది 6 గంటల 58 నిమిషాల 44 సెకండ్లకు పేలింది. హైదరాబాద్‌లోని మలక్‌పేట, అప్పటి సైబరాబాద్, ఇప్పటి రాచకొండ కమిషనరేట్‌లోని సరూర్‌నగర్ ఠాణాల్లో నమోదైన ఈ కేసులు దర్యాప్తు నిమిత్తం ఎన్‌ఐఏకు బదిలీ అయ్యాయి. దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్లకు సంబంధించి సాంకేతికంగా రెండు కేసులు నమోదైనప్పటికీ ఒకే ఘటన కింద పరిగణనలోకి తీసుకున్నారు. నగరంలో 1990ల నుంచీ ఉగ్రవాద ఛాయలు ఉండటంతో అనేక కేసులు నమోదయ్యాయి. ఇప్పటివరకు ఏ కేసులోనూ ఎవరికీ ఉరి శిక్ష పడిన దాఖలాలు లేవు. అలాగే ఒకే ఉదంతానికి సంబంధించి మొత్తం దోషులందరికీ ఉరి శిక్షలు వేసిన కేసులు కూడా లేవు.

ఎస్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ నియామకానికి గవర్నర్ ఓకే

నియామక ఉత్తర్వులను సిద్ధం చేస్తున్న ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ (ఎస్‌హెచ్‌ఆర్‌సీ)గా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌తో పాటు మరో ఇద్దరు సభ్యులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మంగళవారం ఆమోదించారు. దీంతో వీరి నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. లోకా యుక్తగా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డిని నియమించాలనే ప్రతిపాదనలను కూడా రాజ్‌భవన్‌కు ప్రభుత్వం పంపించగా, గవర్నర్ ఆమోద ముద్రతో ఇంకా ప్రభుత్వానికి తిరిగి రాలేదు. జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి తెలంగాణ 'రెరా' అప్పీలేట్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్ పోస్టుకి రాజీనామా చేసిన తర్వాత ఆయన నియామకానికి సంబంధించిన ఫైల్‌ను గవర్నర్ ఆమోదించే అవకాశం ఉంది.

క్లుప్తంగా...

విద్యపై నిర్లక్ష్యం.. క్షమించరాని నేరం: సీఎం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో చేసిన అనేక తప్పిదాలను సరిచేసుకుంటూ వస్తున్నామని, పేద బిడ్డల విద్యపై పూర్తి నిర్లక్ష్యం చేయడం క్షమించరాని నేరమని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా మంగళవారం ట్వీట్ చేశారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో 1,061 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి మార్గదర్శకాలు విడుదల చేసినట్లు సీఎం తెలిపారు. 15 ఏళ్లుగా ఈ ప్రక్రియ జరగకపోవడం ఒకింత ఆశ్చర్యం, విస్మయం కలిగించిందన్నారు. ప్రతి వ్యవస్థలో జరిగినం ఇలాంటి తప్పిదాలను గుర్తిస్తూ, సరిచేస్తూం ప్రజా ప్రభుత్వం రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా అడుగులు వేస్తోందని వెల్లడించారు.

పశు సంవర్ధక శాఖలో 'పదోన్నతుల'కు షెడ్యూల్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పశు సంవర్ధక శాఖ పదోన్నతుల కోసం వివిధ జోన్ల నుంచి వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు మొదలు లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పోస్టుల వరకు ఈనెల 9వ తేదీన కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించనున్నట్లు పశుసంవర్ధక శాఖ సంచాలకుడు డాక్టర్ బి.గోపి తెలిపారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియను గూగుల్ మీట్ ద్వారా నిర్వహించేందుకు షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ మేరకు ఈనెల 9న రాష్ట్రంలోని ఏడు జోన్ల నుంచి మొత్తం 373 మంది అభ్యర్థుల పదోన్నతుల కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

స్పీకర్, మంత్రులను కలిసిన ఉద్యోగ జేఏసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు తదితరులు అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లను వేర్వేరుగా కలిశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి 57 రకాల సమస్యలను వారికి వివరించారు. ఇందులో ఆర్థిక సంబంధమైనవి, ఆర్థిక సంబంధం లేనివి వివరిస్తూ వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

21న సీడబ్ల్యూసీ సమావేశం


సాక్షి, హైదరాబాద్: ఈ నెల 21న ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించనుంది. గోదావరిలో నీటి లభ్యతపై 2023లో కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) ఇచ్చిన నివేదికపై అప్పట్లో ఏపీ వ్యక్తం చేసిన తీవ్ర అభ్యంతరాలపై ఈభేటీ ఏర్పాటు చేశారు.

రాజస్తాన్‌లో ముగిసిన రైతుల వ్యవసాయ శిక్షణ

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలు, ప్రకృతి కాలుష్యంగా మారుతున్న తీరును రైతులకు వివరించి, ప్రకృతి వ్యవసాయం దిశగా సాగడం వల్ల కలిగే ప్రయోజనాలపై బ్రహ్మ కుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో రాజస్తాన్‌లోని మౌంట్ అబూలో నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో తెలంగాణ నుంచి జిల్లాకు ఒకరు లేదా ఇద్దరు చొప్పున ఎంపిక చేసిన 50 మంది రైతులకు 'శాశ్వత యోగిక్ అగ్రికల్చర్' అనే అంశంపై శిక్షణ ఇచ్చారు.


సిద్దిపేట జిల్లాలో బర్డ్‌ఫ్లూ కలకలం

తొగుట(దుబ్బాక): సిద్దిపేట జిల్లా తొగుట మండలం కాన్గల్‌లో బర్డ్‌ఫ్లూ కలకలం రేపింది. మంగళవారం ఒక్కరోజే ఏకంగా 15 వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ విషయాన్ని వెటర్నరీ అధికారులు సైతం ధ్రువీకరించారు. మధ్యాహ్నం సమయంలో గ్రామ శివారులోని కోళ్ల ఫారాన్ని వెటర్నరీ అధికారులు పరిశీలించారు. మృత్యువాత పడిన కోళ్లను ట్రాక్టర్లలో తరలించి.. నిర్మానుష్య స్థలంలో సామూహికంగా పాతిపెట్టారు.



మూగజీవాలకూ రక్షణ ఇద్దాం!





మండే ఎండల నుంచి ఆవులు, గేదెలు, కోళ్ల పరిరక్షణకు శాస్త్రవేత్తల సూచనలు

(సాక్షి స్పెషల్ డెస్క్)

చిన్న, సన్నకారు రైతులు పశుపోషణ ద్వారా సమకూరే ఆదాయంపైనే ఎక్కువగా ఆధారపడతారు. అయితే, ఈ ఏడాది మార్చి నుంచే సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రతలు నమో దవుతున్నాయి. దీంతో పాడి ఆవులు, గేదెలు, గొర్రె లు, మేకలు, కోళ్ల సంరక్షణ రైతులకు కత్తి మీద సాము లా మారింది. ఈ నేపథ్యంలో వరంగల్ జిల్లా మామునూరులోని పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ అనుబంధ ఐసీఏఆర్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత డాక్టర్ ఎన్. రాజన్న, శాస్త్రవేత (ఎల్‌పీఎం) డాక్టర్ సాయి కిరణ్, 'ఐసీఏఆర్-అటారి' (జోన్-10) డైరెక్టర్ డాక్ట ర్ షేక్.ఎన్.మీరా రైతులకు సూచనలు ఇస్తున్నారు.

● ఈ వేసవి మనుషులతోపాటు పశువులకూ గడ్డు కాలమే. తెలంగాణలో సుమారు 3.26 కోట్ల పశు వులు ఉన్నాయి. ఇందులో 42.3 లక్షల ఆవులు 42.26 లక్షల గేదెలు, 1.90 కోట్ల గొర్రెలు, 49.35 లక్షల మేకలు 1.78 లక్షల పందులతోపాటు 7.99 కోట్ల కోళ్లు ఉన్నాయి. రైతులు తగు జాగ్రత్తలు తీసు కుంటే వేసవిలో పాలు, మాంసం ఉత్పత్తి తగ్గకుండా కాపాడుకోవొచ్చు. విదేశీ జాతి, సంకర జాతి ఆవులు 24-27 డిగ్రీల సెల్సియస్ (డి.సె.), దేశీ ఆవులు 33 డి.సె.లు, గేదెలు 36 డి.సె.లు, కుందేళ్లు 30 డి.సె.ల కన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలను తట్టుకోలేవు.

ఎండ దెబ్బ లక్షణాలు..

నాడి వేగంగా, బలహీనంగా కొట్టుకుంటుంది. హృదయ స్పందన రేటు, శ్వాసక్రియ రేటు, పేడ ఉష్ణోగ్రత పెరగడం, అసాధారణంగా సొంగ కారటం, మైకం/అపస్మారక స్థితికి చేరటం, చర్మం చల్లగా, నిస్తేజంగా మారటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అధిక తాపం వల్ల సంకర జాతి ఆవుల్లో 15-20%, గేదెల్లో 10-15% పాల దిగుబడితోపాటు వెన్న శాతం పడిపోతుంది. ఉష్ణ తాపానికి గురైన పశువుకు చూలు నిలవదు. ఉదయం 6 -11 గంటలలోపు.. సాయంత్రం 4-6 గంటల మధ్యలోనే మేతకు వదలాలి. పచ్చిమేతతోపాటు దాణాను పగలు, ఎండు గడ్డిని రాత్రి పూట వేయాలి. రోజుకు 100 గ్రా. చొప్పున పొటాషియం అధికంగా ఉండే ఖనిజ లవణాల మిశ్రమం ఇవ్వాలి.

షెడ్ల ఎత్తు కనీసం 9 అడుగులు

పశువుల షెడ్లను తూర్పు-పడమర దిశలో 9 అడుగుల ఎత్తున నిర్మించాలి. పాకల చుట్టూ అవిసె, మునగ, సుబాబుల్ చెట్లు పెంచాలి. షెడ్ల పైకప్పులకు తెల్లని రంగువేసి, ఆపైన గడ్డి, తాటి/ కొబ్బరి /పామాయిల్ ఆకుల్ని కప్పాలి. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గంటకొకసారి చల్లని నీటితో పశువుల ఒళ్లు తడపాలి. పాకల చుట్టూ గోనె సంచులు/ 20% షేడ్ నెట్ కట్టి, తడుపుతూ ఉండాలి. అధికంగా పాలిచ్చే ఆవులు, ముర్రా గేదెల కోసం ఫ్యాన్ బిగించాలి. గోనె సంచులను నడుముపైన కప్పి, 2-3 సార్లు తడపాలి. షెడ్లపైన స్ప్రింక్లర్లు బిగించాలి. వేసవిలో పశువులకు దాదాపుగా రెట్టింపు తాగునీరు అవసరం.

ఈ జాగ్రత్తలు తీసుకోండి..

పశువుల ఆరోగ్యం, ఆహారం, నీటిసరఫరా, శరీర పరిస్థితులను ప్రతిరోజు పర్యవేక్షించాలి. ఎండదెబ్బ తగిలిన పశువును చల్లని ప్రదేశానికి తరలించి, చల్లటి నీటితో స్నానం చేయించాలి లేదా తడి దుప్పట్లలో చుట్టి, ఫ్యాన్ గాలి అందేలా చూసుకోవాలి. గొర్రెలు, మేకలకు సరైన నట్టల మందులు ఎంచుకోవాలి. వేసవి వ్యాధుల నుంచి రక్షణకు వ్యాక్సిన్లు వేయించాలి. చల్లటి నీటితో స్నానాలు చేయించాలి. చల్లని తాగునీటిని అందించాలి.



షెడ్ల పైకప్పులకు గడ్డి, తాటి, కొబ్బరి వంటి ఆకుల్ని పరచడం



షెడ్ల పైకప్పులకు తెల్లని రంగు వేయడం

కోళ్ల పెంపకంలో వేసవి జాగ్రత్తలు..

→ కోడి శరీరం చలిని తట్టుకునే విధంగా పూర్తిగా ఈకలతో నిండి ఉంటుంది. వాటి శరీరంలో చమట గ్రంధులు లేవు. సాధారణ శరీర ఉష్ణోగ్రత 107 డిగ్రీల ఫారెన్ హీట్ కంటే బయటి ఉష్ణోగ్రత పెరిగితే తట్టుకోలేవు.

→ వేడి ఒత్తిడికి గురైన కోడి పిల్లలు నీరసిస్తాయి. విరేచనాలవుతాయి. నిలబడ లేవు. వణుకుతుంటాయి. ఈ లక్షణాలుంటే మందులు వేయించాలి. కోళ్ల మెడలు వాల్చి, సన్నగా మూలుగుతూ, కళ్ల నుంచి నీరు కార్చుతున్న కోళ్లను వెంటనే ఇతర కోళ్ల నుంచి వేరుచేసి సరైన చికిత్స అందించాలి.

→ షెడ్డు ఎత్తు 10 అడుగులుండాలి. దాణా తెల్లవారుజాము, రాత్రి వేళల్లో ఇవ్వాలి. దాణాలో అవసరమైన మోతాదులో విటమిన్లు, ఖనిజ లవణాలు ఉండాలి. మాంసకృత్తులు కొంతమేర తగ్గించాలి. సి-విటమిన్ ఎక్కువగా ఇవ్వాలి.

→ ఒక టన్ను దాణాలో 100 గ్రాముల విటమిన్-సి, 50 గ్రాముల విటమిన్-ఇ ఇస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. మితియోనైన్ అనే అమైనోఆమ్లం దాణాలో కలిపి ఇవ్వాలి. అమ్మోనియం క్లోరైడ్, పొటాషియం క్లోరైడ్ 0.25 శాతం ఇస్తే శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది.

→ వేసవిలో దాణా, నీటిని 1:2 నిష్పత్తిలో ఇవ్వాలి. ఉష్ణోగ్రత అధికంగా ఉన్నప్పుడు 1:4 నిష్పత్తిలో ఉండాలి. నీటిలో ఎలక్ట్రోలైట్లు, విటమిన్లు వంటివి కలిపితే అవి ఒత్తిడికి గురికాకుండా ఉంటాయి. వీలైనంత వరకు చల్లని నీటినే ఇవ్వాలి. షెడ్డుపైన గడ్డి కప్పి, స్ప్రింక్లర్లు అమర్చి.. షెడ్డు లోపల ఫాగర్స్‌తో ఎండవేళల్లో అర గంటకొకసారి నీళ్లు చల్లాలి.

పోలవరంపై 'స్వతంత్ర' అధ్యయనం

ఏపీ, తెలంగాణతో జరిగిన సమన్వయ సమావేశంలో పీపీఏ కీలక నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టులో 150 అడుగుల గరిష్ట నీటిమట్టం (ఎఫ్‌ఆర్‌ఎల్) మేరకు నీటిని నిల్వ చేస్తే తెలంగాణ భూభాగంలో ఏర్పడనున్న ముంపు ప్రభావంపై స్వతంత్ర నిపుణులతో అధ్యయనం చేయించాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ ప్రభుత్వం ముందుకు రాకపోయినా సమగ్ర సర్వే చేయిస్తామని పీపీఏ సీఈఓ అతుల్‌జైన్ ప్రకటించారు. పోలవరం ప్రాజెక్టుతో ఏర్పడనున్న ముంపు ప్రభావంపై మంగళవారం హైదరాబాద్‌లో ఏపీ, తెలంగాణ అధికారులతో పీపీఏ నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. పోలవరం బ్యాక్‌వాటర్‌తో కిన్నెరసాని, మున్నేరువాగులు ఉప్పొంగి తెలంగాణ భూభాగంలో ఏర్పడనున్న ముంపు ప్రభావంపై మాత్రమే అధ్యయనం చేయాలని ఎన్జీటీ తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఆ మేరకే నిర్వహిస్తామని ఈ సమావేశంలో ఏపీ తేల్చి చెప్పింది. ఇప్పటికే ఈ అధ్యయనాలు పూర్తయిన నేపథ్యంలో ముంపునకు గురికానున్న ప్రాంతాలను గుర్తించడానికి డీమార్కింగ్ పూర్తి చేస్తామని స్పష్టం చేసింది. మిగిలిన 5 వాగులకు ఉండనున్న ముంపు ప్రభావంపై సైతం ఏకకాలంలో అధ్యయనం చేయాలని సమావేశంలో తెలంగాణ పట్టుబడగా, ఏపీ నిరాకరించింది. పోలవరం బ్యాక్‌వాటర్ విషయంలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల ఆందోళనలన్నింటినీ పరిష్కరించాలని ఎన్జీటీ తన ఉత్తర్వుల్లో ఆదేశించిన విషయాన్ని ఈ సందర్భంగా తెలంగాణ ఎత్తిచూపింది. ముంపు ప్రభావంపై సంయుక్త సర్వే విషయంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య సయోధ్య కుదిర్చిన నేపథ్యంలో దీనిపై ఉన్న కేసు మూసివేయాలని సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్ వేసిందని, ఇప్పుడు అధ్యయనం చేయకపోతే ఎలా అని ప్రశ్నించింది. దీంతో పీపీఏ సీఈఓ అతుల్‌జైన్ కలగజేసుకొని మిగిలిన 5 వాగులకు ఉండనున్న ముంపు ప్రభావంపై పీపీఏ ఆధ్వర్యంలో స్వతంత్ర నిపుణులతో అధ్యయనం చేయిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్య ప్రసాద్, భద్రాచలం ఎస్‌ఈ రవికుమార్, ఏపీ తరఫున పోలవరం ప్రాజెక్టు సీఈ కె.నరసింహమూర్తి, అంతర్రాష్ట్ర జలవిభాగం సీఈ సుగుణాకర్ పాల్గొన్నారు.

పోలవరం ఎత్తు కుదించాం..ఆందోళన వద్దు : ఏపీ

పోలవరం ప్రాజెక్టు ఎత్తును 135 మీటర్లకు కుదించి తొలిదశ కింద పనులు నిర్వహిస్తున్నామని, ఈ పనులు పూర్తి కావడానికి ఇంకా రెండేళ్లు పడుతుందని ఏపీ అధికారులు తెలియజేశారు. రెండో దశ పనులను ఎప్పుడు ప్రారంభిస్తారో ఎలాంటి స్పష్టత లేదన్నారు. ఈ నేపథ్యంలో 150 మీటర్ల గరిష్ట నీటిమట్టంతో ఉండనున్న ముంపు ప్రభావం విషయంలో ప్రస్తుతం ఎలాంటి ఆందోళనలు అవసరం లేదని తెలంగాణకు సూచించారు. 150 మీటర్ల ఎత్తుతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులిచ్చిన నేపథ్యంలో ఆ మేరకు నీటి నిల్వలతో ఉండనున్న ముంపు ప్రభావంపై సర్వే చేయాల్సిందేనని తెలంగాణ అధికారులు వాదించారు. పోలవరం బ్యాక్‌వాటర్‌తో ముర్రెడువాగు, కిన్నెరసానితో పాటు మిగిలిన 5 వాగులు, భద్రాచలం పట్టణానికి ఉండనున్న ముంపు ప్రభావాన్ని నిర్ధారించి రక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రెండు వాగులకు ఉన్న ముంపు ప్రభావాన్ని డీమార్కింగ్ చేసిన తర్వాత ఆ మేరకు భూసేకరణ నిర్వహించాలా? లేక రక్షణ చర్యలు తీసుకోవాలా? అని ఏపీ అధికారులు ఈ సమావేశంలో తెలంగాణ అధికారులను ప్రశ్నించారు. సర్వే నివేదిక అందిన తర్వాత ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటామని తెలంగాణ అధికారులు బదులిచ్చారు.

బనకచర్ల ప్రాజెక్టుపై మళ్లీ అభ్యంతరం తెలిపిన తెలంగాణ

పోలవరం ప్రాజెక్టు విస్తరణలో భాగంగా గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును చేపట్టుతున్నారని ఈ సమావేశంలో తెలంగాణ తీవ్రంగా అభ్యంతరం తెలిపింది. ఈ ప్రాజెక్టుతో పీపీఏకి ఎలాంటి సంబంధం లేదని సీఈఓ స్పష్టం చేయగా, గోదావరి ట్రిబ్యునల్ తీర్పునకు అనుగుణంగానే పోలవరం ప్రాజెక్టు నిర్మించాల్సిన బాధ్యత పీపీఏపై ఉందని తెలంగాణ అధికారులు గుర్తు చేశారు. ట్రిబ్యునల్ తీర్పును ఉల్లంఘించి నిర్మాణాలు చేయకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత పీపీఏపై ఉందని స్పష్టం చేశారు. గోదావరి, కృష్ణా జిల్లాల తాగునీటి అవసరాల పేరుతో పోలవరం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి 18 టీఎంసీలను తరలించడానికి ఏపీ అక్రమ ప్రాజెక్టును చేపట్టిందని సమావేశంలో తెలంగాణ అభ్యంతరం తెలిపింది. దీనిని అడ్డుకోవాలని పీపీఏని కోరింది.

గురుకులాల్లో పూర్తిస్థాయిలో కోడింగ్ కోర్సులు

ఆర్పీఎఫ్-యూకే ఫౌండేషన్‌తో అవగాహన కుదుర్చుకున్న సొసైటీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలో పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో 2025-26 విద్యా సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో కోడింగ్ కోర్సులు అమల్లోకి రానున్నాయి. ఇదివరకు కేవలం మొయినాబాద్ పాఠశాలలో మాత్రమే కోడింగ్ కోర్సు అందుబాటులో ఉండగా.. ఇకపై అన్ని పాఠశాలల్లో ఈ కోర్సును అమలు చేస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడింగ్ కోర్సుల అమలుకు ఆర్పీఎఫ్-యూకే ఫౌండేషన్‌తో ఎస్సీ గురుకుల సొసైటీ అవగాహన కుదుర్చుకుంది. ఐదేళ్ల పాటు ఈ ఫౌండేషన్ గురుకుల విద్యార్థులకు సేవలందించనుంది. విద్యార్థులకు కావాల్సిన నైపుణ్య శిక్షణ, పాఠ్య ప్రణాళిక, కార్యాచరణ ప్రణాళిక, పర్యవేక్షణ, బోధన తదితర అంశాల్లో ఈ ఫౌండేషన్ సేవలందిస్తుంది. కృత్రిమ మేధ (ఏఐ), కోడింగ్, మెషీన్ లెర్నింగ్, రోబోటిక్స్, ఆన్‌లైన్ టూల్స్‌కు సంబంధించిన పాఠ్యాంశాల్ని బోధిస్తారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ప్రతి పాఠశాలలో ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా బోధన చేపట్టిన గురుకుల సొసైటీ.. మెరుగైన ఫలితాలు రావడంతో పూర్తిస్థాయిలో అమలుకు ఉపక్రమించింది.

డిగ్రీ పరీక్షలు గంటన్నర ఆలస్యం



పరీక్ష కేంద్రంలోకి అనుమతించకపోవడంతో బయట కూర్చున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నంలో పరీక్షా కేంద్రాల గేట్లకు తాళం

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడం లేదని ప్రైవేట్ కాలేజీల నిరసన

ఇబ్రహీంపట్నం: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల పెండింగ్‌ను నిరసిస్తూ ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు నిరసన తెలిపాయి. ఇందులో భాగంగా ఆయా కాలేజీల్లో మంగళవారం తొలిరోజు డిగ్రీ పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులను లోనికి అనుమతించలేదు. పరీక్షా కేంద్రాల గేట్లు తీయకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. ఉస్మానియా వర్సిటీ పరిధిలో 347 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలుండగా 260 కాలేజీల్లో వార్షిక పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రభుత్వ, మూడు ప్రైవేటు కాలేజీల్లోనూ సెంటర్లు కేటాయించారు. అయితే ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయకపోతే తమ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించలేమని పట్టణంలోని ప్రతిభ, అశ్రిత, శ్రీగాయత్రి కాలేజీలు 20రోజుల క్రితమే ప్రభుత్వానికి సమాచారమిచ్చాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ తరఫున వినతిపత్రాలు అందించాయి. ఈ నేపథ్యంలోనే డిగ్రీ 6వ సెమిస్టర్ పరీక్షలు రాసేందుకు వచ్చి న విద్యార్థులను సెంటర్లలోకి రానీయలేదు. ఈ విషయాన్ని వారు ఓయూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వ, యూనివర్సిటీ అధికారులు ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్ నేతలతో మాట్లాడారు. అనంతరం బకాయిల చెల్లింపునకు హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కావాల్సి ఉండగా.. 10:45 గంటలకు విద్యార్థులను సెంటర్లలోకి అనుమతించారు. నష్టపోయిన సమయాన్ని అదనంగా కేటాయించారు.

ఉద్యోగం పేరుతో.. సైబర్ క్రైమ్ ముఠాలోకి

మయన్మార్ ఆర్మీకి చిక్కిన మహాముత్తారం యువకులు

స్వదేశానికి రప్పించాలని కుటుంబసభ్యుల వేడుకోలు


కాటారం: ఉద్యోగాల వేటలో థాయ్‌లాండ్ వెళ్లిన ఇద్దరు యువకులు మయ న్మార్ ఆర్మీ చేతిలో బందీలయ్యారు. 2 నెలల తర్వాత బాధిత యువ కులు కుటుంబ సభ్యులకు ఫోన్ చేయగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహా ముత్తారం మండలం నిమ్మగూడెం గ్రామానికి చెందిన అజ్మీరా సంతోష్, దొబ్బలపాడుకు చెందిన లావుడ్యా విజయ్ డిగ్రీ వరకు చదువుకున్నారు. విదేశాలకు వెళ్లి ఉద్యోగాలు చేయాలనుకున్నారు. ఓ ఏజెంట్ టికెట్లు బుక్ చేయడంతో గత డిసెంబర్ 8న కరీంనగర్‌తోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన కొంతమంది యువకులతో కలిసి సంతోష్, విజయ్ బ్యాంకాక్ వెళ్లారు. తీరా అక్కడకు వెళ్లాక ఏజెంట్ పని ప్రదేశం మార్చి మయన్మార్‌కు తరలించాడు. సైబర్ క్రైం మోసాలకు పాల్పడే ఓ నెట్‌వర్క్ ముఠాకు వీరిని అప్పగించాడు. వారు పాస్‌పోర్టులు, మొబైల్‌ఫోన్లు లాక్కు న్నారు. ఈ క్రమంలోనే ఈ ఇద్దరు యువకులతో పాటు ఇండియాకు చెందిన మరో 31మంది చివరకు మయన్మార్ ఆర్మీ చేతికి చిక్కి అక్కడే ఉండిపో యారు. రెండు నెలల నుంచి ఇద్దరి నుంచి ఫోన్ రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. కాగా నాలుగు రోజుల క్రితం ఆ యువకులు కుటుంబసభ్యులకు ఫోన్ చేసి తమ పరిస్థితిని వివరించారు. ఆర్మీ రక్షణలో ఉన్నామని తమ ఆరోగ్యం బాగోలేదని కుటుంబ సభ్యులకు చెప్పారు. ఎలాగైనా తమను ఇండియాకు రప్పించాలని కన్నీరుపెట్టుకున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలి: బతుకుదెరువు కోసం వెళ్లిన తమ కొడుకులు కానరాని దేశంలో నరకయాతన పడుతున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వారిని తమ వద్దకు రప్పించాలని సంతోష్, విజయ్ కుటుంబ సభ్యులు వేడుకున్నారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో వారు విలేకరులతో తమ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబును కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నట్టు చెప్పారు.

రాజీవ్ యువ వికాసానికి 9 లక్షల దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నిరుద్యోగ యువత స్వయం ఉపాధికి తలపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి అనూహ్య స్పందన వస్తోంది. ఈ పథకం కింద ఇప్పటివరకు 9 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు సంక్షేమ శాఖల వర్గాలు చెబుతున్నాయి. ఈ పథకానికి అభ్యర్థులు కొత్త కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం మీసేవా కేంద్రాల్లో దర ఖాస్తులు చేసుకుంటున్నారు. 2016 తరువాత కుల ధ్రువపత్రం ఉంటే సరిపోతుందని, వాటిని అంగీకరిస్తున్నామని అధికారులు ప్రక టించారు. రేషన్ కార్డు లేదా ఫుడ్ సెక్యూరిటీ కార్డు ఉంటే సరిపోతుందని, ఈ రెండూ లేని వారు మాత్రమే ఆదాయ ధ్రువ పత్రం సమర్పించాలని సూచించారు. ఈ పథకానికి సంబంధించి మరింత సమాచారం కోసం మండల, మున్సిపల్ కార్యాలయాలు, ప్రజాపాలన సేవా కేంద్రాల్లోని హెల్ప్‌లైన్ కేంద్రాలను సంప్రదించాలి. యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారులు.. దర ఖాస్తుతో పాటు బ్యాంక్ ఖాతా నంబర్, బ్రాంచ్ వివరాలు కచ్చితంగా నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ పథకానికి బ్యాంకు అధికారులు కన్సెంట్ లెటర్ ఇస్తేనే అర్హులుగా పరిగణిస్తారని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

మద్యం బ్రాండ్లకు మస్తు గిరాకీ



604 బ్రాండ్లకు దరఖాస్తు చేసిన 92 కంపెనీలు

అందులో 273 ఫారిన్ లిక్కర్ బ్రాండ్లు.. 331 దేశీయ మద్యం బ్రాండ్లు..

ఈ నెలలోనే దరఖాస్తులను పరిశీలించి అనుమతి ఇవ్వనున్న ఎక్సైజ్ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్త బ్రాండ్ల మద్యం అమ్మేందుకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తులు ఆహ్వానించగా..604 బ్రాండ్లు సరఫరా చేస్తామంటూ 92 కంపెనీలు ముందుకొచ్చాయి. ఇందులో ఇప్పటికే బేవరేజెస్ కార్పొరేషన్‌కు (టీజీబీసీఎల్) మద్యం సరఫరా చేస్తున్న 45 కంపెనీలుండగా, మరో 47 కొత్త కంపెనీలు కూడా దరఖాస్తు చేశాయి. ఇప్పటికే సరఫరా చేస్తున్న కంపెనీలు 218 బ్రాండ్లు, కొత్త కంపెనీలు 386 బ్రాండ్లు సరఫరా చేసేందుకు దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. ఈ దరఖాస్తులను త్వరలోనే పరిశీలించి వీటిలో ఎన్ని బ్రాండ్లకు అనుమతివ్వాలన్న దానిపై ఈ నెలలోనే నిర్ణయం జరుగుతుందని ఎక్సైజ్ వర్గాలంటున్నాయి.

దేశీయ బ్రాండ్లకు పోటీగా ఫారిన్ లిక్కర్

రాష్ట్ర లిక్కర్ మార్కెట్‌లో ఇప్పటికే 2,500 వరకు మద్యం బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. వీటికి తోడు మరిన్ని బ్రాండ్లు అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశంతో ఎక్సైజ్ శాఖ ఈ ఏడాది ఫిబ్రవరి 23న కొత్త బ్రాండ్ల సరఫరా కోసం మద్యం కంపెనీల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. మొదటిసారి 20 రోజుల గడువిచ్చింది. మార్చి 15న గడువు ముగిసే నాటికి 25 పాత కంపెనీలు, 39 కొత్త కంపెనీలు కలిపి మొత్తం 64 కంపెనీలు 465 బ్రాండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. మరోమారు ఈ గడువును పొడిగించిన ఎక్సైజ్ శాఖ ఈనెల రెండో తేదీ వరకు అవకాశమిచ్చింది. దీంతో మొత్తం 92 కంపెనీలు 604 బ్రాండ్లకు దరఖాస్తు చేసుకున్నాయి. ఇందులో 331 దేశీయ బ్రాండ్ల కోసం దరఖాస్తులు రాగా, పోటాపోటీగా 273 బ్రాండ్ల ఫారిన్ లిక్కర్ సరఫరాకు కంపెనీలు ముందుకు రావడం గమనార్హం. మరి, ఈ బ్రాండ్లలో ఎన్నింటికి ఎక్సైజ్ శాఖ అనుమతిస్తుంది.. ఎన్ని కొత్త మద్యం బ్రాండ్లు తెలంగాణ మార్కెట్‌లో అందుబాటులోకి రానున్నాయనేది ఈ నెలలోనే తేలనుంది.

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు నడపలేం!

రెండేళ్లుగా నిధుల విడుదలలో జాప్యం .. రూ.130 కోట్లు పెండింగ్

అప్పులు చేసి.. నగలు తాకట్టు పెట్టి మరీ నిర్వహిస్తున్న యాజమాన్యాలు

నిధులివ్వండి లేదా మీరే నిర్వహించండి అంటూ ప్రభుత్వానికి వినతి

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్'లక్ష్యం నిధుల లేమితో నీరుగారుతోంది. రెండేళ్లుగా ప్రభుత్వం సరిగ్గా నిధులు విడుదల చేయకపోవడంతో వీటి యజమానులు వడ్డీలకు అప్పులు తెచ్చి, నగలు తాకట్టు పెట్టి నడుపుతున్నారు. అయినా ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో నిరసనలకు దిగుతున్నారు. ఇక స్కూళ్లు తాము నడపలేమని, ప్రభుత్వమే వీటి నిర్వహణ చేపట్టి తమ స్కూళ్లకు అద్దె చెల్లిస్తే చాలంటూ వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్నారు.

అసలేం జరిగింది?

బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం1990లో ప్రారంభించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 150 స్కూళ్లు ఉన్నాయి. వీటిని ప్రైవేట్ యాజమాన్యాలే నడుపుతాయి. ప్రతీ స్కూళ్లో 80 నుంచి 86 వరకు సీట్లు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేటాయిస్తారు. మొత్తం 25,000 మందికి ఈ స్కూళ్లలో విద్య అందుతోంది. ఇందులో 12,000 మంది ఎస్సీ విద్యార్థులు, 7,000 మంది ఎస్టీ విద్యార్థులు ఉన్నారు. వీరిలో ఎస్సీ విద్యార్థులకు రెసిడెన్షియల్‌తోపాటు, డే స్కాలర్స్‌గానూ అవకాశం ఉంది. ఇందుకోసం ప్రభుత్వం నుంచి ఒక్కో విద్యార్థికి రూ.42వేలు స్కూలు యాజమాన్యాలకు అందుతోంది. అదే డే స్కాలర్ విద్యార్థి కోసం రూ.28 వేలు చెల్లిస్తోంది. ఈ స్కూళ్ల నిర్వహణ కోసం ప్రభుత్వం ఏటా రూ.100 కోట్లు చొప్పున విడుదల చేస్తోంది. కానీ, రెండేళ్లుగా ఈ నిధులు విడుదల కావడం లేదు.



కరీంనగర్‌లోని బెస్ట్ అవైలబుల్ స్కూల్

బకాయిలు రూ.130 కోట్లు

రెండేళ్లుగా ఈ స్కూళ్లకు ఎలాంటి చెల్లింపులు లేవు. అయితే గద్వాల, నాగర్‌కర్నూల్, ఆదిలాబాద్, పెద్దపల్లి, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు మాత్రం ఇటీవల ప్రభుత్వం రూ.70 కోట్ల వరకు పలు దఫాలుగా విడుదల చేసింది. మిగిలిన 27 జిల్లాల్లో రూ.130 కోట్ల మేర బకాయిలు పెండింగ్‌లో పడిపోయాయి.

ఆత్మహత్యలే శరణ్యం



టీచర్లకు జీతాలివ్వలేక, బ్యాంకుల నోటీసులకు సమాధా నాలు చెప్పలేక నరకయాతన అనుభవిస్తున్నాం. కనీసం పిల్ల లకు భోజనం పెట్టేందుకు కూడా అప్పు పుట్టడం లేదు. ఈ నెలలో విడుదల చేయకపోతే మాకు ఆత్మహత్యలే శరణ్యం.

– యాదగిరి శేఖర్‌రావు, బెస్ట్‌అవైలబుల్ స్కూల్స్, రాష్ట్ర కార్యదర్శి



ఎవరికీ హానికారకం కానివిధంగా బహుమతులను ఇవ్వాలి – ఇంకోలా చెప్పాలంటే, పుచ్చుకునేవారికిగానీ, ఇచ్చేవారికిగానీ దానివల్ల చెడు కలగకూడదు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 9 ఏప్రిల్ 2025

గవర్నర్లు ఈసారైనా గ్రహిస్తారా?

ఎన్నికైన ప్రభుత్వాలను బేఖాతరు చేస్తూ తరచు ఇబ్బందులు సృష్టించే గవర్నర్లకిది శరాఘాతం. శాసనసభ ఆమోదించిన పది బిల్లులపై ఆమోదముద్ర వేయకుండా, రాష్ట్రపతి పరిశీలనకు పంపకుండా దీర్ఘకాలం పెండింగ్‌లో పెట్టిన తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి తీరును తప్పుబట్టడమేకాక ఆ బిల్లులన్నీ ఆమోదించినట్టుగా భావిస్తూ సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం వెలువరించిన తీర్పు అసాధారణమైనది. రాజ్యాంగంలోని 142వ అధికరణ కింద తనకు దఖలు పడిన విశేషాధికారాలను వినియోగించుకుని సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. తాము ఎన్నికైన ప్రభుత్వాల కన్నా అధికులమని భావించటం, వివాదాస్పద వ్యాఖ్యలు చేసి ప్రభుత్వాలను ఇరకాటంలో పెట్టడం చాన్నాళ్లుగా కొందరు గవర్నర్లలో కనిపిస్తున్న ధోరణి. తనముందుకొచ్చే ఈ మాదిరి కేసులపై విచారిస్తున్నప్పుడూ లేదా తీర్పు వెలువరించినప్పుడూ ఈ ప్రవర్తన సరికాదని సుప్రీంకోర్టు చెబుతూనే వచ్చింది. వేరే రాష్ట్రాలకు సంబంధించి తీర్పు వచ్చినప్పుడైనా తమ అధికారాలేమిటో, పరిమితులేమిటో తెలుసుకుని మెలగటం, ప్రవర్తనను సవరించుకోవటం విజ్ఞత అనిపించుకుంటుంది. కానీ అదెక్కడా కనబడటం లేదు. అలాగని గవర్నర్లంతా ఈమాదిరిగానే ఉంటున్నారని అనుకోనవసరం లేదు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకే పార్టీ అధికారంలో వున్నచోట ఎలాంటి సమస్యలూ కనబడవు. వ్యక్తులుగా హుందాతనాన్ని ప్రదర్శించే గవర్నర్లు విపక్ష ప్రభుత్వాల ఏలుబడిలోని రాష్ట్రాల్లో సాఫీగా పనిచేసుకుపోతున్నారు. ఎటొచ్చీ కొందరు గవర్నర్లు మాత్రం వింత పోకడలు పోతున్నారు.

తమిళనాడు శాసనసభ ఆమోదించి గవర్నర్ రవి వద్ద పెండింగ్‌లో వున్న పది బిల్లుల్లో జనవరి 2020 నాటిది కూడా ఉందంటే ఆశ్చర్యం కలుగుతుంది. అంతేకాదు... ఈ బిల్లుల్లో చాలాభాగం ఒకసారి అసెంబ్లీలో ఆమోదం పొంది గవర్నర్ తిరస్కారానికి గురై రెండోసారి అసెంబ్లీ ఆమోదం పొంది వచ్చినవి. రాజ్యాంగ నిబంధన ప్రకారం ఒక బిల్లు తన సంతకం కోసం వచ్చినప్పుడు గవర్నర్ దాన్ని ఆమోదించటమో, తిరస్కరించటమో, రాష్ట్రపతి పరిశీలనకు పంపడమో చేయాలి. అంతేతప్ప నెలల తరబడి తొక్కిపెట్టి వుంచ కూడదు. ఈ సంగతిని రెండేళ్లనాడు పంజాబ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు వెలువరిస్తూ సుప్రీంకోర్టు తెలియజేసింది. అక్కడి గవర్నర్ ఏకంగా 12 బిల్లుల్ని దీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచారు. తన ఆమోదముద్ర కోసం వచ్చిన బిల్లుపై 'సాధ్యమైనంత త్వరగా' గవర్నర్ నిర్ణయం తీసుకోవాలని, పునఃపరిశీలన అవసరమని భావిస్తే ఆ సంగతి తెలియజేయాలని అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని 200వ అధికరణ సైతం ఈ సంగతే చెబుతోంది. బిల్లు సక్రమంగా లేదని, స్పష్టత కొరవడిందని లేదా రాజ్యాంగ నిబంధనలను అతిక్రమిస్తోందని గవర్నర్ భావిస్తే దాన్ని తిప్పిపంపొచ్చు. గవర్నర్ ఇచ్చిన సలహాను అంగీకరించి బిల్లుకు సవరణలు చేయటమా లేక యథాతథంగా దాన్నే మరోసారి ఆమోదించి పంపటమా అనేది శాసనసభ ఇష్టమని ఆ అధికరణ తేటతెల్లం చేస్తోంది. రెండోసారి వచ్చిన బిల్లును గవర్నర్ ఆమోదించి తీరాలని లేదా రాష్ట్రపతి పరిశీలనకు పంపాలని చెబుతోంది. నిబంధనలు ఇంత స్పష్టంగా ఉన్నప్పుడు రవి ఇష్టానుసారం ప్రవర్తించటం అనుచితం.

పంజాబ్ కేసులో ఇచ్చిన తీర్పును గవర్నర్లు బేఖాతరు చేస్తున్నారని గమనించటం వల్లే... ఆమోదం కోరుతూ తమ వద్దకొచ్చిన బిల్లు విషయంలో గవర్నర్లు ఎలా మెలగాలో తాజా తీర్పులో సుప్రీంకోర్టు ధర్మాసనం నిర్దేశించాల్సి వచ్చింది. రాష్ట్రపతి పరిశీలనకు పంపదల్చుకున్న బిల్లుల్ని గరిష్ఠంగా మూడు నెలలు మించి తమవద్ద ఉంచుకోరాదని, పునఃపరిశీలనకొచ్చిన బిల్లునైతే వెంటనే ఆమోదించాలని లేదా గరిష్ఠంగా నెల రోజుల్లోపల సమ్మతి తెలపాలని ధర్మాసనం తెలిపింది. తొలిసారి వచ్చిన బిల్లుకూ, రెండోసారి పంపిన బిల్లుకూ వ్యత్యాసం ఉన్నపక్షంలో మాత్రమే ఇందుకు మినహాయింపు వుంటుంది. ప్రజాస్వామ్యంలో ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలకు అధికారాలుండాలి. కానీ ఆ ప్రభుత్వాలపట్ల ఏర్పర్చుకున్న అభిప్రాయంతో ఈ అధికారాలకు అవరోధాలు కల్పించాలని చూడటం రాజ్యాంగ ధిక్కరణ అవుతుందని గవర్నర్లు గ్రహించటం లేదు. అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ కేసులో 2016లో ఇచ్చిన తీర్పులో ఈ సంగతిని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

తన ఆమోదం కోసం వచ్చిన బిల్లులపై 'సాధ్యమైనంత త్వరగా' నిర్ణయం తీసుకోవాలని పంజాబ్ కేసు విషయంలో సుప్రీంకోర్టు చెప్పినప్పుడే రవి అప్రమత్తమై తన పరిమితులను గుర్తెరిగి వుంటే తాజా తీర్పులో నిర్దిష్ట గడువు నిర్దేశించాల్సిన అవసరం ఉండేది కాదు. తమ ప్రవర్తనవల్ల రాజ్యాంగ పదవికుండే ఔన్నత్యాన్ని పలచన చేస్తున్నామని గవర్నర్లు ఇకనైనా గుర్తెరగాలి. కేంద్రంలో రాష్ట్రపతి మాదిరే రాష్ట్రాల్లో గవర్నర్లు కూడా రాజ్యాంగానికి అనుగుణంగా కొన్ని అధికారాలు, బాధ్యతలు కలిగివుంటారు. కానీ రాష్ట్రపతి తరహాలో వారు ఎన్నిక కారు. కేంద్ర కేబినెట్ సలహా మేరకు రాష్ట్రపతి వారిని నియమిస్తారు. రాజకీయ నాయకులు గవర్నర్లు కావటంవల్లే సమస్యలొస్తున్నాయని సుప్రీంకోర్టు భావించి భిన్నరంగాల్లో నిపుణులైనవారిని ఈ పదవికి ఎంపిక చేయాలని గతంలో సూచించింది. కానీ కేంద్రంలోని పాలకులకు నచ్చినవారే ఈ కోటాలో ఎంపికవుతారు గనుక ఆ నిపుణులు రాజకీయాలకు అతీతంగా ఏమీవుండరు. రాజకీయంగా గవర్నర్లకు ఎలాంటి అభిప్రాయాలున్నా రాజ్యాంగ పదవిలో ఉంటున్నవారిగా అందుకు అనుగుణంగా మెలగటం నేర్చుకోవాలి. పదే పదే న్యాయస్థానాలతో చెప్పించుకోవటం మర్యాద కాదని తెలుసుకోవాలి.

వ్యవసాయ సుంకాల కాపట్యం

విశ్లేషణ



దేవీందర్ శర్మ

అధిక సబ్సిడీలతో కూడిన అమెరికన్ వ్యవసాయ ఉత్పత్తులకు భారతదేశం తన మార్కెట్‌ను తెరవాలని అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ చాలా ప్రత్యేకంగా కోరినట్లుగా నేను ఇటీవల చదివాను. అది చదివినప్పుడు, ప్రపంచ బ్యాంకు మాజీ ప్రధాన ఆర్థికవేత్త నికోలస్ స్టెర్న్, తన భారతదేశ పర్యటనల సమయంలో క్లుప్తంగా చెప్పింది గుర్తొచ్చింది. 'అమెరికా రైతులకు అలాంటి సబ్సిడీలను అందించడం తప్పేనని నేను అంగీకరిస్తున్నాను. కానీ అమెరికా ఉత్పత్తులకు భారతదేశం తన తలుపులు తెరవకపోతే అది విపత్తుకు దారితీస్తుంది.'

జార్జ్ బుష్ జూనియర్ హయాంలో 2001 నుండి 2005 వరకు పదవిలో ఉన్న యాన్ వెనెమన్ మొదలుకుని, అమెరికా వ్యవసాయ మంత్రులందరూ ఇదే విధమైన కపటత్వాన్ని పదే పదే ప్రదర్శించారు. కొంతకాలం తర్వాత వాషింగ్టన్ డీసీలోని 'ఇంటర్నేషనల్ ఫుడ్ పాలసీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' (ఐఎఫ్‌పీఆర్ఐ)లో మాట్లాడుతూ, భారత వ్యవసాయాన్ని బలవంతంగా తెరవాలన్న ప్రపంచ బ్యాంకు ప్రధాన ఆర్థికవేత్త వాదనను ఆమె ఎంత నిస్సిగ్గుగా సమర్థించిందో నాకు గుర్తుంది.

అమెరికాలోని కనీసం 14 వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి గ్రూపులు, భారతదేశ ఉత్పత్తి నిర్దిష్ట కనీస మద్దతు ధర్‌పై పరిమితిని కోరుతూ అమెరికన్ ట్రేడ్ రిప్రజెంటేటివ్‌కు లేఖలు రాశాయి. అప్పుడే ఇండియాకు అమెరికా ఎగుమతులు చేయడానికి వీలుంటుంది మరి.

చైనా నిలబడిన తీరు

అందువల్ల, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రారంభించిన అవాంఛనీయ వాణిజ్య యుద్ధం పట్ల నేను పెద్దగా ఆశ్చర్యపోలేదు. అభివృద్ధి చెందుతున్న దేశాలను లొంగదీసుకోవడానికి ట్రంప్ చుట్టూ ఉన్న బిలియనీర్లు ఆయనకు తప్పుడు సలహా ఇస్తున్నారు.

అనేక ప్రధాన ఆర్థిక వ్యవస్థలు అమెరికా పట్ల ధిక్కార వైఖరితో నిలబడటం ప్రారంభించాయి. కాబట్టి భారతదేశాన్ని కాస్త వంగమని మాత్రమే అడిగినప్పుడు, అది సాష్టాంగపడటానికి సిద్ధంగా ఉందనే సంకేతాన్ని ఇవ్వకూడదని నేను అనుకుంటున్నాను.

ఇక్కడ మరొక కథ చెబుతాను. కొన్నేళ్ల క్రితం, అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, 'చెడ్డ' మానవ హక్కుల రికార్డు కారణంగా చైనాతో అమెరికా వ్యాపారం చేయదని వ్యాఖ్యానించారు. మరుసటి రోజు, నేను 'బీబీసీ' టీవీ ఛానెల్‌ని చూస్తున్నాను. ఒక జర్నలిస్ట్ అప్పటి చైనా అధ్యక్షుడిని అడుగుతున్నారు: 'చైనాతో వాణిజ్యాన్ని నిలిపివేస్తామని అమెరికా అధ్యక్షుడు చేసిన బెదిరింపునకు మీరు ఎలా స్పందిస్తారు?' ఆయన సమాధానం కూడా అంతే చిన్నది: 'యూఎస్‌తో వ్యాపారం చేయడమా? మేము నాలుగు వేల ఏళ్లకు పైగా అమెరికాతో వ్యాపారం చేయలేదు. కాబట్టి అది అంత ముఖ్యమైనదా?'

ఈ ప్రకటన తర్వాత, చైనాతో వాణిజ్యాన్ని నిలిపివేయాలని తమ సొంత అధ్యక్షుడు ఇచ్చిన పిలుపును వ్యతిరేకిస్తూ అమెరికా వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు తిరగబడ్డాయి. బిల్ క్లింటన్ చివరికి దేశీయ పరిశ్రమ ముందు తల వంచి, మళ్ళీ ఎప్పుడూ ఆ సమస్యను లేవనెత్తలేదు.



- 2021లో అమెరికా పత్తి రైతుకు దక్కిన వార్షిక మద్దతు 1.17లక్షల డాలర్లయితే, భారత్‌లో అది 27 డాలర్లే.
- వ్యవసాయ దిగుమతులను నియంత్రించడానికి అమెరికా 9,000 కంటే ఎక్కువ పన్నేతర అడ్డంకులు (ఎన్టీబీలు) విధించింది. ఇండియా విధించినవి కేవలం 600.
- నిన్నటి దాకా వ్యవసాయ ఉత్పత్తులపై అమెరికా 5 శాతం సుంకాలను విధిస్తుంటే, భారత్ సగటున 39 శాతం విధిస్తోంది. అయితే, భారత సుంకాలు ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయి.
- 70 కోట్లపైగా ఆధారపడ్డ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకే వ్యవసాయ దిగుమతులపై భారత్ సుంకాలేస్తూ వచ్చింది.

సుంకాల వాణిజ్య సూత్రాలు

కొత్త సుంకాల యుద్ధానికి తిరిగి వస్తే, అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల ప్రవేశాన్ని పరిమితం చేసే విషయంలో ట్రంప్ భారత దేశాన్ని 'సుంకాల రాజు' అని విమర్శించవచ్చు. ఎందుకంటే, అమెరికా 5 శాతం సుంకాలను విధిస్తుంటే, భారత్ సగటున 39 శాతం సుంకాలను విధిస్తోంది. అయితే, భారత్ విధించే సుంకాలు ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయి. దేశ అభివృద్ధి స్థాయి, వాణిజ్య పుస్తకాలలో పేర్కొన్న 'ప్రత్యేక, భేదాత్మక వ్యవహారం' ఆధారంగా వీటిని విధించారు. భారత్ ఏ దశలోనూ ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలను ఉల్లంఘించలేదని తెలియజేయాలి. భారత్ సాపేక్షంగా విధిస్తున్న అధిక సుంకాలు, అప్పటికే రూపొందించి ఉన్న వాణిజ్య సూత్రాలపై ఆధారపడి ఉన్నాయి. పైగా ఒక వ్యక్తి ఇష్టానిష్టాల ద్వారా వాటిని నియంత్రించడం ఉండదు.

మరోవైపు, వ్యవసాయానికి అమెరికా అందించే భారీ సబ్సిడీలే వాస్తవానికి సమస్య. 'అభివృద్ధి చెందుతున్న దేశాలు తాము మరిన్ని అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి, కానీ అమెరికా వ్యవసాయ సబ్సిడీలను కాదు' అని అప్పటి యూరోపియన్ ట్రేడ్ కమిషనర్ పీటర్ మాండెల్సన్ పేర్కొన్న విషయాన్ని 'ఫైనాన్షియల్ టైమ్స్' (2006 జూలై 21) స్పష్టంగా రాసింది. 'అమెరికా రైతులతో పోటీ పడటానికి మాకు అభ్యంతరం లేదు, కానీ మేము అమెరికా ఖజానాను ఎదుర్కోలేము' అని అప్పటి భారత వాణిజ్య మంత్రి కమల్‌నాథ్ చెప్పింది ఆయన ఉటంకించారు.

రైతులకు ఎంత ఇస్తున్నారు?

గత కొన్ని సంవత్సరాలుగా, అమెరికా తన అధిక సబ్సిడీ వ్యవసాయం చుట్టూ నిర్మించిన రక్షణ కోటను మరింత బలోపేతం చేసుకుంది. అమెరికా వ్యవసాయ శాఖకు చెందిన ఆర్థిక పరిశోధన సేవ నివేదిక ప్రకారం, రైతులు, పశువుల పెంపకందారులకు ప్రత్యక్ష ప్రభుత్వ వ్యవసాయ కార్యక్రమం కింద చెల్లింపులు 2025 నాటికి 42.4 బిలియన్ డాలర్లకు పెరుగుతాయని అంచనా. నిజానికి 2024 నాటికి 9.3 బిలియన్ డాలర్లకు పెరుగుతాయని అంచనా వేశారు. అంటే ఒక్కో రైతుకు అమెరికా ప్రభుత్వం సాలీనా రూ. 26.8 లక్షలను చెల్లిస్తోంది. ప్రపంచ వాణిజ్య సంస్థ చర్చలలో వివాదాస్పద అంశంగా మిగిలిపోయిన పత్తిని ఉదాహరణగా తీసుకుందాం. 2021 నాటికి 624.7 హెక్టార్ల విస్తీర్ణంలో పత్తి సాగు చేస్తున్న కేవలం 8,103 మంది రైతులకు అమెరికా భారీ సబ్సిడీలను అందిస్తోంది (ఇండియాలో 98.01 లక్షల మంది రైతులు పత్తి సాగులో నిమగ్నమై ఉన్నారు). న్యూఢిల్లీకి చెందిన 'సెంటర్ ఫర్ డబ్ల్యూటీఓ స్టడీస్' లెక్కల ప్రకారం, 2021లో అమెరికా పత్తి రైతుకు లభించిన వార్షిక మద్దతు 1,17,494 డాలర్లు కాగా, భారత్ విషయంలో అది కేవలం 27 డాలర్లు.

2006లో యూరోపియన్ యూనియన్ పత్తికి 139 శాతం సబ్సిడీ మద్దతును అందించింది. 2001లో అభివృద్ధి చెందిన దేశాల పరిమితి కంటే అమెరికా పత్తికి 74 శాతం అధిక మద్దతును అందించింది.

వ్యవసాయ దిగుమతులకు తక్కువ సుంకాలు అని అమెరికా అనడం అంటే, తమ వ్యవసాయం బహిరంగ మార్కెట్ అని చూపించడం కోసమే! కానీ జాగ్రత్తగా పరిశీలిస్తే, దిగుమతులను నియంత్రించడానికి అమెరికా 9,000 కంటే ఎక్కువ పన్నేతర అడ్డంకులు (ఎన్టీబీలు) విధించింది. దీంతో పోలిస్తే ఇండియా విధించిన ఎన్టీబీలు కేవలం 600. సుంకాలతోనే సుంకాలను అమెరికా సమం చేస్తుందని ట్రంప్ చెబుతున్నారు. భారత్ కూడా తన సొంత వ్యవసాయాన్ని కాపాడుకోవడానికి సరిపోలే పన్నేతర అడ్డంకులని ఉపయోగించడానికి తగినంత అవకాశం ఉంది.

భారతపై ట్రంప్ వేసిన తాజా అదనపు 27 శాతం ప్రతిచర్య సుంకాలతో మన రొయ్యలు, బాస్మతేతర బియ్యం, గోధుమల ఎగుమతికి దెబ్బే. అమెరికాతో భారత వాణిజ్యంలో అవే దాదాపు 46 శాతం ఉంటాయి. ఏమైనా, భారత్ తన ఇంటిని క్రమబద్ధీకరించుకోవాలని అమెరికా కోరుకునే బదులు, అమెరికాయే వ్యవసాయరంగ ద్వారాలు తెరవాలని భారత్ అడగాల్సిన అవసరం ఉంది. అమెరికా వ్యవసాయం చుట్టూ ఉన్న అధిక సబ్సిడీ కోటను ముందుగా కూల్చివేయాలని అడిగితేనే ఇది సాధ్యమవుతుంది.

వ్యాసకర్త వ్యవసాయ, ఆహార నిపుణులు

సోషల్ మీడియా

డ్రాగన్ గాభరా



దశాబ్దాలలో తొలిసారి చైనాలో ఆందోళనా సంకేతాలు కనబడుతున్నాయి. చైనా కంపెనీలు ఆర్థిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయి. యువాన్ పడిపోతోంది. బహుశా యూఎస్ ట్యారిఫ్ ఒత్తిళ్లు, పెట్టుబడులు బయటికి తరలిపోతుండటం వల్ల కావొచ్చు. పకడ్బందీ నియంత్రిత చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికలో ఇది అరుదైన కార్యభంగం.

– జైనేబ్ రిబోవా, మొరాకో రచయిత్రి

మరింత చైనీయం



చైనా ఎగుమతులు భారత మార్కెట్‌ను ముంచెత్తాయి. చైనా ద్వైపాక్షిక వాణిజ్య మిగులు ఇండియా రక్షణ బడ్జెట్ కంటే ఎక్కువ. ఇప్పుడు ట్రంప్ సుంకాల వల్ల చైనా ఉత్పత్తులు ఇండియా, అమెరికాయేతర మార్కెట్లలోకి మరింత భారీగా తరలివస్తాయి. కనీసం అత్యవసరం కాని దిగుమతులనైనా మోదీ ఎందుకు అడ్డుకోలేకపోయారు?

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

వాళ్లదే రాజ్యం



గతంలో శాస్త్రవేత్తలు తమ పని గురించి ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా చెప్పడమే పాపులర్ సైన్సుగా ఉండేది. కానీ ఇప్పుడు మెడికల్, సైంటిఫిక్ పేపర్ల మీద వాస్తవాలతో నిమిత్తం లేకుండా పాపులర్ జనాలు (ఇన్‌ఫ్లుయెన్సర్లు) తమ అభిప్రాయాలు చెబుతున్నారు. ఇప్పుడు శాస్త్రసమ్మతి అనేది నైపుణ్యం వల్ల కాక ఫాలోయర్ల సంఖ్య వల్ల వస్తోంది.

– దేవీ శ్రీధర్, ప్రొఫెసర్

ఇదో ప్రతీకారం



గాజాకు ప్రతీకారంగా అమెరికా, ఇజ్రాయెల్‌లకు గుణపాఠం చెప్పాలనుకుంది బంగ్లాదేశ్. అందుకే వాళ్లు కేఎఫ్‌సీ స్టోర్ మీద దాడిచేసి ఫ్రైడ్ చికెన్ ఎత్తుకెళ్లారు.

– దీప్ హల్దర్, బంగ్లా రచయిత

జీవితం ఒక బహుమతి




జీవితం మొత్తం ఒక బహుమతే. మీకు ఇది అర్థమైతే, ఎప్పుడూ ప్రశంసించే స్థితిలోనే ఉంటారు.

– నీలే డోనాల్డ్ వాల్ష్, రచయిత

ఇన్ బాక్స్

ఊడల మర్రికి వేలాడిన వీరుడు

పాలకుల అకృత్యాలను ఎదిరించడంలో మొదటి నుంచీ గిరిజనులు ముందే ఉన్నారు. భారత దేశాన్ని మొదటగా ఏకం చేసిన మొఘల్ కాలంలోనే కాదు, ఆ తర్వాత వచ్చిన బ్రిటిష్‌వాళ్లపైనా ఆదివాసీలు తిరుగుబాటు బావుటా ఎగరవేశారు. అయితే వీళ్ల తిరుగుబాటుల గురించి అంతగా ప్రచారం జరగకపోవడం శోచనీయం. ముఖ్యంగా మన తెలంగాణలో రాంజీ గోండ్ చేసిన తిరుగుబాటు నిజాం నవాబుకు, ఆయన పాలనకు రక్షణగా నిలిచిన బ్రిటిష్ వాళ్లకూ పెద్ద గుణపాఠాన్ని నేర్పింది.



రాంజీ గోండ్


గోండ్వానా ప్రాంతాన్ని పాలించిన గోండు రాజులను మరాఠాలు జయించిన తర్వాత... ఆ ప్రాంతం నిజాంకు, ఆ తర్వాత బ్రిటిష్ వాళ్లకు వశమయ్యింది. వారి నిరంకుశత్వం గోండులను తిరుగుబాటుకు పురిగొల్పింది. ఆదిలాబాద్ జిల్లాలోని గోండుల్లో ధైర్యశాలిగా పేరున్న మార్సికోల్ల రాంజీగోండ్ 1838–1880 మధ్యకాలంలో నాటి జనగాం (ఆసిఫాబాద్) కేంద్రంగా బ్రిటిష్ సైన్యాలను దీటుగా ఎదుర్కొన్న తొలి గిరిజన పోరాట యోధుడు. తెలంగాణలో హైదరాబాద్ బ్రిటిష్ రెసిడెన్సీపై దాడి, తదితర కార్యక్రమాల్లో పాల్గొన్న రోహిల్లాల పోరాటం రాంజీ గోండ్ నాయకత్వంలో తీవ్రరూపం దాల్చింది. రోహిల్లా సిపాయిల తిరుగుబాటు ప్రధానంగా ఆసిఫాబాద్ తాలూకా నిర్మల్ కేంద్రంగా జరిగింది. అది ప్రధానంగా గోండులు, కోలాము, కోయ తెగల గిరిజనులుండే ప్రాంతం.

1880 మార్చి, ఏప్రిల్ నెలల్లో బ్రిటిష్‌వాళ్లకు వ్యతిరేకంగా తుదిపోరాటం చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం గోండుల తిరుగుబాటును అణచివేసే బాధ్యతను కల్నల్ రాబర్ట్‌కు అప్పజెప్పింది. తెల్లదొరల నిర్బంధాన్ని వ్యతిరేకించడం, వెట్టికి ప్రతిఫలం ఆశించడాన్ని తెల్లదొరలు సహించలేకపోయారు. సిర్పూర్, ఆసిఫాబాద్, చెన్నూర్, లక్సెట్టిపేట, ఉట్నూర్, జాద్ వంటి ఏజెన్సీ ప్రాంతాలు బ్రిటిష్ వారి దౌర్జన్యంతో అల్లకల్లోలంగా మారాయి. రాంజీ నాయకత్వంలో వెయ్యి మంది రోహిల్లాలు, గోండులు కలిసి నిర్మల్ సమీప కొండలను కేంద్రంగా చేసుకొని పోరాటం చేశారు. వారిపై నిర్మల్ కలెక్టర్ ఆధ్వర్యంలో నిజాం బలగాలు దాడులు చేశాయి. అడవంతా తుపాకుల మోతతో మారుమోగింది. సాంప్రదాయిక ఆయుధాలతో పోరాటానికి దిగిన ఆదివాసులు ఆధునిక ఆయుధాలు, తుపాకుల ముందు నిలువలేకపోయారు. తెగించి పోరాడుతున్న ఆదివాసులను కాల్చిచంపారు. కడదాకా పోరాడిన రాంజీ గోండు సహా 1000 మందిని పట్టుకొని నిర్మల్ నడిబొడ్డున ఉన్న 'ఊడల మర్రి' చెట్టుకు 1880 ఏప్రిల్ 9న ఉరితీశారు. ఆ మర్రిచెట్టు ఇప్పుడు 'వెయ్యి ఉరిల మర్రిచెట్టు'గా ప్రసిద్ధి!

– గుమ్మడి లక్ష్మీనారాయణ, ఆదివాసీ రచయితల వేదిక
(నేడు రాంజీ గోండ్ వర్ధంతి)

వారికి భారతరత్న ఎందుకివ్వాలంటే...

సందర్భం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

మహారాష్ట్ర అసెంబ్లీ మార్చి 22న పూలే దంపతులు: మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేలకు 'భారతరత్న' ఇవ్వాలని అన్ని పార్టీల అంగీకారంతో ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ గౌరవానికి పూలే దంపతులు తప్ప భారతదేశ చరిత్రలో మరో జంట దొరకదు. అసలు ప్రపంచంలోనే రెండు శరీరాలు ఒకే మనస్సుతో జీవితాంతమూ మానవ మార్పునకు కృషి చేసిన జంట మరోటి లేదు. అది ఒక్క పూలే జంట మాత్రమే. కేంద్రం వారికి భారతరత్న ఇచ్చి వారిపట్ల తమ గౌరవాన్ని చాటుకోవాలి.

మహాత్మా పూలే 1827 ఏప్రిల్ 11న పుడితే, 1831 జనవరి 3న సావిత్రి పుట్టింది. వారు జీవించి ఉన్న కాలానికి కాస్త ఇటు అటు ఈ దేశంలో సంఘ సంస్కర్తలు ఎదిగారు. వారిలో కొంతమంది స్త్రీల జీవితాలను మార్చాలని ప్రయత్నించారు. ఉదాహరణకు మహారాష్ట్రలోనే గోవింద రణడే, బెంగాల్‌లో ఈశ్వర చంద్ర విద్యాసాగర్, ఆంధ్రలో కందుకూరి వీరేశలింగం పంతులు వంటి వారిని తీసుకుందాం. వీరంతా బ్రాహ్మణ కులంలో పుట్టారు. బ్రాహ్మణ కుటుంబాల్లోని ఆడపిల్లలకు విద్య నేర్పించాలని, వితంతు వివాహాలు చేయించాలని మాట్లాడారు, రాశారు. కానీ వారి భార్యల స్థితి తమ కుటుంబాల్లోనే ఎలా ఉండేదో మనకు తెలియదు.

వారి గొప్పతనం గురించి ఎన్నో రచనలు వచ్చాయి. స్కూలు పాఠాల్లో సంఘ సంస్కర్తగా వారి గురించే పాఠాలు చెప్పేవారు. వారు అంటరానితనం గురించి, శూద్ర దళిత స్త్రీల గురించి మాట్లాడిన దాఖలాలే లేవు. కానీ పూలేల గురించి ఏ పాఠ్య పుస్తకాల్లో చెప్పేవారు కాదు. వారి గురించి తెలిసిన అగ్రకుల ఉపాధ్యాయులు వారి గురించి చెడుగా చెప్పేవారు. బెంగాల్‌లో కొద్దిపాటిగా ఉన్న భద్రలోక్ స్త్రీల సంస్కరణ కోసం కృషి చేసిన ఈశ్వరచంద్ర గురించి నేను స్కూల్లో ఉండగానే చదివాను. కందుకూరి గురించి సరేసరి. కానీ పూలే గురించి నాకు తెలిసింది 1986–87 ప్రాంతంలో! ఆయన గురించి కాస్తా వివరంగా చదవడానికి ఒక్క పుస్తకం కూడా లేదు. వెతగ్గా, వెతగ్గా కోఠి ఫుట్‌పాత్ పాత పుస్తకాల్లో ధనుంజయకర్ ఆయన మీద రాసిన బయోగ్రఫీ దొరికింది. అది చదివాక నా తల తిరిగి పోయింది. అందులో సావిత్రిబాయి గురించి కొద్దిగానే ఉంది. ఇంత గొప్ప సాంఘిక సంస్కరణకు పాటుపడిన జంటను ఈ దేశ మేధావులు ఎందుకు పక్కకు పెట్టారు? కులం వల్ల!

ఇప్పుడు ఒక ఆరెస్సెస్/బీజేపీ ప్రభుత్వం, అదీ ఒక బ్రాహ్మణ ముఖ్యమంత్రి నేతృత్వంలో ఆ జంటకు భారతరత్న ఇవ్వాలని రిజల్యూషన్ ఎందుకు పాస్ చేసింది? ఈ జంట అనుయాయుడైన అంబేడ్కర్ వాళ్ళు ప్రారంభించిన శూద్ర–దళిత విద్యా పోరాటం నుండి ఎదిగి ఒక రాజ్యాంగం రాశారు. దానివల్ల శూద్రులకు, దళితులకు ఓటుహక్కు వచ్చింది కనుక! వారి సంఖ్యా బలం, వారి ఆత్మగౌరవ చైతన్యం ఆరెస్సెస్ ప్రభుత్వాన్ని ఈ స్థితికి నెట్టింది. శూద్రుడైన శివాజీని దేశం ముందు పెట్టింది పూలేనే!



జ్యోతిబా పూలే, సావిత్రిబాయి

ఆరెస్సెస్ మాత్రమే కాదు, అగ్రకుల కమ్యూనిస్టు, ముఖ్యంగా బెంగాలీ కమ్యూనిస్టులు, దేశంలోని ఉదారవాదులు ఊహించని పరిణామం ఇది. బెంగాల్ మేధావులు ఈశ్వర చంద్ర విద్యాసాగర్, రాజా రామ్మోహన్ రాయ్, రవీంద్రనాథ్ ఠాగూర్‌లను దేశం మొత్తం విద్యా రంగంలోకి చొప్పించారు. కానీ మహాత్మా పూలేను, సావిత్రిబాయిని, అంబేడ్కర్‌ను తమ రాష్ట్ర పరిధిలోకి రానివ్వలేదు.

మండల్ కమిషన్ పోరాట చరిత్రను కూడా వాళ్ళు గుర్తించలేదు. ఈ సంవత్సరం పూలే దంపతులకు భారతరత్న వస్తే శూద్ర–దళిత ఆదివాసీ స్త్రీల చరిత్ర మార్చే చర్చ ఏ రాష్ట్రమూ పక్కకు పెట్టలేనంత ఎదుగుతుంది. పూలే జంట కేవలం భారత దేశానికే కాదు మొత్తం భూ ప్రపంచానికే ఏం పాఠం నేర్పారో తెలుసుకోవలసిన అవసరం ఉంది. ఈ భూమి మీద పెద్ద పెద్ద మతాలను స్థాపించిన బుద్ధుడు, జీసస్, మహమ్మద్ వంటి వారు నడిచారు. అందులో బుద్ధుడు, మహమ్మద్ పెళ్ళిళ్ళు చేసుకున్నారు. జీసెస్ శిలువేసి చంపబడ్డారు. కానీ ఎవరూ ఊహించని రీతిలో జ్యోతిరావు పూలే, సావిత్రిబాయిని పెళ్ళి చేసుకొని పెళ్ళి అర్థాన్నే మార్చారు. అందుకు దీటుగా ఆమె భార్య అనే అర్థాన్నే మార్చారు.

వాళ్ళు 19వ శతాబ్దంలో ఎటువంటి భార్యాభర్తలుగా ఈ భూమి మీద నడిచారో కొన్ని ఉదాహరణలతో చూద్దాం. సావిత్రీబాయికి 9వ ఏట, పూలేకు 13వ ఏట పెండ్లి అయింది. అది బాల్య వివాహమే. అయితే పూలే ఏం చేశారు? ఆమెతో పడక గదిలో భర్తగా జీవించలేదు. ఆమెకు టీచరై అక్కడ చదువు చెప్పారు. అంత గొప్ప పనిచేస్తే పూనా పండితులు తిలక్ నేతృత్వంలో ఆయన తండ్రిని బెదిరించి, బట్టలు బయట పడవేయించి ఇంటి నుండి తరిమేయించారు. ఆ యువ దంపతులు దళిత వాడల్లో మకాం పెట్టి అక్కడే ఒక దళిత మిత్రుడి ఇంట్లో ఆడవాళ్ళకు స్కూలు పెట్టారు. కొద్ది రోజుల్లోనే తన దగ్గర పాఠాలు నేర్చుకున్న సావిత్రిని ఒక టీచర్ని చేశారు పూలే.

అంతేగాక కుటుంబాల నుండి బయటికి నెట్టబడ్డ వితంతువుల కోసం ఒక నివాస కేంద్రాన్ని ప్రారంభించారు. ఒక బ్రాహ్మణ వితంతువు కొడుకు – యశ్వంతరావుని పెంచుకున్నారు. అంతకు ముందు వాళ్ళిద్దరూ 30 ఏండ్ల వయస్సులో ఉండగా సావిత్రి తండ్రి, ఖండోజీ పాటిల్ వచ్చి పూలేతో... 'నేను సావిత్రిని ఒప్పించాను, మీకు పిల్లలు కావాలి కనుక మరో పెళ్ళి చేసుకో' అని కోరాడు. దానికి పూలే... 'లోపం సావిత్రిలో లేదు, నాలో ఉంది. ఆమెకు మరో పెండ్లి చేద్దాం. ముగ్గురం కలిసి పిల్లల్ని పెంచుతాం' అని బదులు చెప్పారు. ఇటువంటి భర్త ప్రపంచంలో ఎక్కడైనా ఉన్నాడా!

పూలే 1890లో పక్షవాతంతో చనిపోయారు. ఆయన బంధువులు సాదుకున్న కొడుకు తలగోరు (తలకొరివి) పెట్టడానికి వీలులేదు అని గొడవ చేశారు. పూలే బంధువులలో ఒక పురుషుడు తలగోరు పెడతానని వాదించాడు. సావిత్రి వారిని ధిక్కరించి 'నేనే నా భర్తకు తలగోరు పెడతాన'ని చెప్పి ఆ కార్యం నిర్వర్తించారు. ఈ పని చేసిన మొదటి భారత స్త్రీ ఆమె. 1898లో బుబానిక్ ప్లేగు వ్యాపించిన సమయంలో సావిత్రీబాయి, డా॥ యశ్వంతరావు ప్రజలకు వైద్యం చేస్తూ అదే రోగానికి బలై చనిపోయారు.

ఈ జంటను మహారాష్ట్ర అగ్రకుల మేధావులు చాలా కాలం వెలుగులోకి రానివ్వలేదు. ఇప్పుడు ఆరెస్సెస్ ప్రభుత్వం వారికి భారతరత్నను ప్రతిపాదించింది. ఇది కాంగ్రెస్‌కు మరో సవాలు కానుంది. శూద్ర బీసీలను ఆకట్టుకోవడంలో ఇది ఆరెస్సెస్‌కు పెద్ద ఆయుధమౌతుంది. అంబేడ్కర్‌కు భారతరత్న వీపీ సింగ్ ప్రభుత్వం ఇచ్చినా ఆరెస్సెస్–బీజేపీలు దాన్ని తమ ఖాతాలో వేసుకున్నాయి. కాంగ్రెస్‌ను కుటుంబ పార్టీ అని పెద్ద ఎత్తున ప్రచారం చేశాయి. ఇప్పుడు పూలేలకు భారతరత్నను తమ ప్రభుత్వమే స్వయంగా ఇచ్చిందని పెద్ద ప్రచారం ప్రారంభిస్తాయి. ఈ స్థితిలో తెలంగాణ, కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు పూలేలను దీటుగా ఓన్ చేసుకోకపోతే జాతీయ స్థాయిలో ఆ పార్టీకి చాలా పెద్ద సమస్య అవుతుంది.

కనీసం ఈ రెండు ప్రభుత్వాల వాళ్ళు అటువంటి తీర్మానాలే అసెంబ్లీలలో పాస్ చేసి కేంద్రానికి పంపడం, పూలేలకు శూద్ర బీసీ జీవితాలను ప్రతిబింబించే మ్యూజియమ్‌లను కట్టించడం చెయ్యాలి.

ఈ రాష్ట్రాల్లో అగ్రకులాలు తమ చదువులకు పునాదులు వేసిన జంటగా పూలేలను చూడటం లేదు. వారి నుండి ఒక్క మేధావి కూడా వారి గురించి రాయడం, మాట్లాడటం చెయ్యడం మనకు కనిపించదు. వారిని గుర్తించి గౌరవించడం అన్ని కులాల ఆత్మగౌరవానికీ నిదర్శనం.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక విశ్లేషకుడు
(ఏప్రిల్ 11న మహాత్మా పూలే జయంతి)

గ్రహం అనుగ్రహం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.ద్వాదశి రా.11.55 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** మఖ ఉ.11.30 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** రా.7.57 నుండి 9.41 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.35 నుండి 12.24 వరకు, **అమృతఘడియలు:** ఉ.8.56 నుండి 10.37 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.52, **సూర్యాస్తమయం:** 6.10.

క్లుప్తంగా...

రమేశ్ కార్తీక్ నాయక్‌కు 'ది మ్యూస్ ఇండియా యంగ్ రైటర్ అవార్డ్'


తొలి ఆంగ్ల కవిత్వ సంపుటి 'చకమక్' ఎంపిక



సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక మ్యూస్ ఇండియా పత్రిక సంస్థ నెలకొల్పిన 'ది మ్యూస్ ఇండియా యంగ్ రైటర్ అవార్డ్'కు ఈసారి తెలుగు యువ రచయిత, సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత రమేశ్ కార్తీక్ నాయక్ ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో ఆంగ్లంలో ప్రచురించిన ఉత్తమ రచనలకు ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందిస్తారు. ఇందులో భాగంగా 2024వ సంవత్సరానికి ఈ అవార్డును పొయెట్రీ, ఫిక్షన్, నాన్ ఫిక్షన్ అనే మూడు విభాగాలుగా విభజించారు. ఇందులోని కవిత్వ విభాగంలో ఈసారి రమేశ్ కార్తీక్ నాయక్.. తన తొలి ఆంగ్ల కవిత్వ సంపుటి 'చకమక్'తో అంబికా అనంత్ పొయెట్రీ ప్రైజ్‌ను గెలుచుకున్నారు. రమేశ్ కార్తీక్ నాయక్ నిజామాబాద్ జిల్లా జక్రాన్ పల్లి తండాకు చెందిన యువ రచయిత. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. తన చకమక్ (చకుముకు రాయి అనే అర్థం) ఆంగ్ల కవిత్వానికి అవార్డు రావడం తెలుగు నేలకు కూడా గర్వకారణమని కార్తీక్ పేర్కొన్నారు.

బీఎన్ఎస్ఎస్ 35 నోటీసులిచ్చి దర్యాప్తు చేయండి

క్రిశాంక్ పిటిషన్లపై సర్కార్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌పై నమోదు చేసిన కేసుల్లో బీఎన్ఎస్ఎస్ 35 కింద నోటీసులిచ్చి దర్యాప్తు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు, ఫిర్యాదుదారుకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలి భూముల వివాదంలో అధికారులు ఓ జింకను చంపారంటూ సోషల్ మీడియాలో తప్పుడు పోస్టు పెట్టారంటూ క్రిశాంక్‌పై మూడు ఫిర్యాదులు అందాయి. మొయినాబాద్‌లోని చిలుకూరులోని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్, టీపీసీసీ సోషల్ మీడియా విభాగం చైర్మన్ మన్నె సతీశ్ కుమార్‌తో పాటు ఎన్ఎస్‌యూఐ నాయకుడు చేసిన ఫిర్యాదులపై గచ్చిబౌలి పీఎస్‌లో క్రిశాంక్‌పై మూడు ఎఫ్ఐఆర్ లు నమోదు చేశారు. ఒకే అంశంపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం చట్టవిరుద్ధమని, ఆ కేసులను కొట్టివేయాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ తుకారాంజీ.. చట్టప్రకారం నోటీసులు జారీ చేసి, విచారణ చేపట్టాలని ఆదేశించారు. కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని స్పష్టం చేస్తూ విచారణ వాయిదా వేశారు.

దాది రతన్ మోహినీ జీ మృతిపై గవర్నర్, సీఎం సంతాపం

సాక్షి, హైదరాబాద్: బ్రహ్మకుమారీస్ గ్లోబల్ సెంటర్ల చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ హెడ్‌గా సేవలందించిన రాజయోగిని దాది రతన్ మోహినీ జీ మృతి పట్ల గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 'దాదీ జీ జీవితం ఆదర్శాత్మకమైనది, ఆమె ఆధ్యాత్మిక బలానికి, నిర్మలత్వానికి, విశ్వ సోదరభావానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు' అని సీఎం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా 140కి పైగా దేశాల్లో విస్తరించి, సమాజానికి శాంతి, మానవతా విలువల సందేశాన్ని అందించారని కొనియాడారు. ఆమె మరణం రాష్ట్రానికి, దేశానికి తీరని లోటు అని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.



మళ్లీ 'బోరు'మనకుండా..

బేల మండలం శివారు గ్రామాల్లోని మహారాష్ట్ర సరిహద్దులో పెన్‌గంగా నదిని జీవనదిగా భావిస్తుంటారు. మూడు కాలాల పాటు నీటితో కళకళలాడే ఈ నది కూడా ఇసుకాసురుల పుణ్యమాని అడుగంటిపోయింది. అక్రమార్కులు నదిలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేపడుతుండటంతో.. ఎన్నడూ లేనివిధంగా ఎండిపోయింది. నదిపైనే ఆధారపడి యాసంగి పంటలను సాగు చేసిన బేల మండలం సాంగిడి గ్రామ రైతులు.. చేలకు నీరందే పరిస్థితి లేకపోవడంతో తల్లడిల్లుతున్నారు. నదిలో ఓ గుంటలా తవ్వకుని అందులో 12 బోర్లను వేశారు. నీళ్లు ఊరిన కొద్దీ పంటలకు అందిస్తున్నారు. నీరు అడుగంటితే బోరు చెడిపోకుండా.. మోటారు నడిచే వరకు రైతులు అక్కడే నిరీక్షించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

జిల్లాల్లో జల గండం..!

మండు వేసవికి ముందే అడుగంటుతున్న భూగర్భ జల మట్టాలు

- అన్ని జిల్లాల్లోనూ సురక్షిత స్థాయికి లోపే..
- గత ఫిబ్రవరిలో 8.68 మీటర్ల లోతులో నీళ్లు
- మార్చిలో 9.91 మీటర్ల లోతుకి పడిపోయిన వైనం
- అధిక శాతం జిల్లాల్లో ఆందోళనకర పరిస్థితి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూగర్భ జల మట్టాలు మరింత అడుగంటాయి. మండు వేసవికి ముందే బోర్లలో నీళ్లు ఇంకిపోయాయి. యాసంగిలో బోరుబావుల కింద సాగవుతున్న పంటలు నీటి కోసం కటకటలాడే పరిస్థితి ఉత్పన్నమైంది. గత డిసెంబర్‌లో 6.7 మీటర్ల లోతుగా ఉన్న రాష్ట్ర సగటు భూగర్భ జలమట్టం.. ఆ తర్వాత క్రమంగా జనవరిలో 7.46 మీటర్లు, ఫిబ్రవరిలో 8.68 మీటర్ల లోతుకు దిగజారింది. తాజాగా మార్చిలో 9.91 మీటర్ల లోతుకు తగ్గిపోయింది. డిసెంబర్‌తో పోల్చితే ఏకంగా 3.21 మీటర్ల మేర మేర జలమట్టం పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్ర భూగర్భ జలవనరుల శాఖ మార్చిలో రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో భూగర్భ జలాల స్థితిగతులను పరిశీలించి రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడించింది. భూగర్భ జలవనరుల శాఖ రాష్ట్రంలోని 33 జిల్లాల పరిధిలోని అన్ని మండలాల్లో ఏర్పాటు చేసిన 1,771 పీజోమీటర్ల ద్వారా భూగర్భ జలాల స్థితిగతులను ప్రతి నెలా సమీక్షించి, తర్వాతి నెలలో నివేదికలను విడుదల చేస్తూ ఉంటుంది. వేసవిలో వ్యవసాయం, తాగునీరు, ఇతర అవసరాలకు వినియోగం భారీగా పెరగడంతో.. సీజన్ ముగిసేలోగా భూగర్భ నీటిమట్టాలు మరింతగా అడుగంటిపోయే సూచనలు కనిపిస్తున్నాయి.



15 జిల్లాల్లో 10 మీటర్ల కంటే లోతున..

రాష్ట్రంలోనే అత్యధికంగా మెదక్ జిల్లాలో 15.72 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. అత్యల్పంగా జగిత్యాల జిల్లాలో 5.24 మీటర్ల లోతులోనే భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలోని జిల్లాలను సగటు భూగర్భ జలమట్టం 0–5 మీటర్లు, 5–10 మీటర్లు, 10 మీటర్లపైన లోతు.. అనే మూడు కేటగిరీలుగా వర్గీకరిస్తారు. భూగర్భ జలాలు 0– 5 మీటర్లలోపు లోతులో ఉంటే సురక్షిత స్థాయిలో ఉన్నట్టు భావిస్తారు. రాష్ట్రంలో మొత్తం 33 జిల్లాలుండగా, ఒక్క జిల్లాలో కూడా 0–5 మీటర్ల లోతులో భూగర్భ జలమట్టం లేదని గుర్తించారు. 18 జిల్లాల్లో 5–10 మీటర్ల లోతులో, 12 జిల్లాల్లో 10–15 మీటర్ల లోతులో, 3 జిల్లాల్లో 15 మీటర్లకి మించిన లోతులో భూగర్భ జలాలున్నట్టు తేలింది. 10 మీటర్లకన్నా లోతుకు భూగర్భ జలాలు పడిపోయిన జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టుగా భావిస్తారు.

19 జిల్లాల్లో భారీ క్షీణత

గత ఏడాది మార్చితో పోల్చితే ఈ ఏడాది మార్చిలో రాష్ట్రంలోని 19 జిల్లాల్లో భూగర్భ జలమట్టాల్లో భారీ క్షీణత నమోదైంది. గత ఏడాది మార్చిలో రాష్ట్ర సగటు భూగర్భ జలాల లోతు 9.69 మీటర్లుకాగా.. ఈ ఏడాది 9.91 మీటర్లకు పడిపోయింది. కొన్ని జిల్లాల్లో భూగర్భ జలాలు బాగా పడిపోయాయి. అత్యధికంగా భూపాలపల్లి జిల్లాలో 9.30 మీటర్ల నుంచి 15.54 మీటర్ల లోతుకు అంటే.. 6.24 మీటర్ల మేర పడిపోవడం గమనార్హం.

ఈ ప్రాంతాల్లో ప్రమాదకర స్థాయిలో..

రంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల ఉత్తర, పశ్చిమ ప్రాంతాలు, వికారాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోని దక్షిణ ప్రాంతాలు, సిద్దిపేట జిల్లాలోని పశ్చిమ, భూపాలపల్లి జిల్లాలోని ఉత్తరాది ప్రాంతాలు, భద్రాది జిల్లాలోని ఆగ్నేయ ప్రాంతాల్లో ప్రమాదకర స్థాయికి భూగర్భ జలమట్టాలు పడిపోయాయి. ఈ ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు 15–20 మీటర్ల మధ్య, కొన్నిచోట్ల 20 మీటర్లకన్నా లోతుకు వెళ్లిపోయినట్టు తేల్చారు. రాష్ట్ర భూభాగంలో ఈ ప్రాంతాల వాటా 13 శాతమని అధికారులు చెబుతున్నారు.

312 మండలాల్లో దశాబ్ద సగటుకన్నా తగ్గి..

గత దశాబ్ద కాల (2015–2024) సగటుతో పోల్చినప్పుడు.. రాష్ట్రంలోని మొత్తం 612 మండలాలకు గాను 300 మండలాల్లో భూగర్భ జల మట్టాలు కాస్త మెరుగ్గా ఉన్నాయి. మిగిలిన 312 మండలాల్లో గణనీయంగా క్షీణించాయి. 61 మండలాల్లో 0.5 మీటర్ల వరకు, 49 మండలాల్లో 0.5 మీటర్ల నుంచి మీటర్ వరకు, 104 మండలాల్లో 1–2 మీటర్ల మేర, 98 మండలాల్లో 2 మీటర్లకుపైగా పడిపోయాయి.

ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెరగాలి

- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- పైలట్ ప్రాజెక్టు కింద రంగారెడ్డి జిల్లాలోని మూడు గ్రామాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెరగాల్సిన అవసరం ఉందని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మూడు గ్రామాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశామని, ఆయా గ్రామాల్లో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెంచాలని సూచించారు. ఈ మేరకు రైతు కమిషన్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కోదండరెడ్డి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెంచడానికి యాచారం మండలంలోని గడ్డమల్లయ్యగూడెం, మొండి గౌరెల్లి, చౌదరిగూడ గ్రామాలను ఎంపిక చేసుకున్నట్లు అధికారులు వివరించారు. కోదండరెడ్డి మాట్లాడుతూ, ఆయా గ్రామాల్లో కూరగాయలు, ఆకుకూరలు పండించే రైతులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. రంగారెడ్డి జిల్లాలోని వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నీటి వినియోగం తక్కువగా ఉన్న పంటలు సాగుచేయాలని సూచించారు. దానికి తగ్గట్టుగా అధికారులు రైతులకు దిశానిర్దేశం చేయాలన్నారు. ఇదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా



కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పూలతోటలను ప్రోత్సహించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఉద్యానవన పంటలకు రాయితీలపై యంత్ర పరికరాలు, డ్రిప్‌లు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. రైతు కమిషన్ ఆధ్వర్యంలో ఒకటిరెండు రోజుల్లో అధికారుల కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేయనుందని, ఈ కమిటీలో వ్యవసాయ, ఉద్యానవన శాఖలతోపాటు మార్కెటింగ్, నాబార్డు, ఎన్జీవో ప్రతినిధులు ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు గోపాల్‌రెడ్డి, భవానీరెడ్డి, గడుగు గంగాధర్ తోపాటు మెంబర్ సెక్రటరీ గోవిందు, డీఏవో సంధ్యారాణి, అగ్రికల్చర్ అధికారి హరి వెంకట ప్రసాద్, ఎన్జీవోల ప్రతినిధులు హాజరయ్యారు.

రగిలిన రైతన్న..

తిప్పర్తి/మిర్యాలగూడ/కోదాడ రూరల్: ధాన్యం కొనుగోలుకు కొర్రీలు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ నల్లగొండ జిల్లా తిప్పర్తి, మిర్యాలగూడలో ఆందోళన చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో తాలు, చెత్త పేరుతో నిర్వాహకులు ఇబ్బంది పెడుతున్నారని రైతులు మంగళవారం నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై రాస్తారోకో చేశారు. ఉన్నతాధికారులతో చర్చిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మిర్యాలగూడలోని ఓ మిల్లు వద్దకు మంగళవారం సాయంత్రం సుమారు వంద ట్రాక్టర్లు హెచ్ఎంటీ, చింట్లూ రకం ధాన్యం తీసుకురాగా.. రెండు గంటలకు పైగా ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. పోలీసులు రైస్ మిల్లు యజమానితో మాట్లాడి.. కొనుగోలుకు ఒప్పించడంతో ఆందోళన విరమించారు.



సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తమ్మర శివారులో కోదాడ–ఖమ్మం రహదారిపై రాస్తారోకో చేస్తున్న అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు

ధాన్యం కాంటా వేయాలని కోరుతూ అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తమ్మర శివారులోని కోదాడ–ఖమ్మం రహదారిపై మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. కాంటాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

రోజుకు 48 స్లాట్లు... 5 వాకిన్స్


రిజిస్ట్రేషన్ల శాఖలో రేపటి నుంచి ప్రయోగాత్మకంగా స్లాట్ బుకింగ్ విధానం

- 22 కార్యాలయాల్లో పైలట్ ప్రాజెక్టు అమలు
- కుత్బుల్లాపూర్‌లో రద్దీ దృష్ట్యా 144 స్లాట్లు.. అదనంగా ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్ల నియామకం
- చంపాపేట–సరూర్‌నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధి విలీనం
- సేల్‌డీడ్ దస్తావేజులు క్రయవిక్రయదారులే తయారు చేసుకునేలా వెబ్‌సైట్‌లో ప్రత్యేక మాడ్యూల్
- డబుల్ రిజిస్ట్రేషన్లకు చట్ట సవరణతో చెక్ పెట్టాలని ప్రభుత్వ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో కీలక సంస్కరణకు సమయం ఆసన్నమైంది. ఈనెల 10 నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకునే కార్యక్రమం అమల్లోకి రానుంది. ఇప్పటివరకు స్లాట్ బుకింగ్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశమున్నప్పటికీ ఎక్కువ మంది మాన్యువల్‌గానే చేసుకునేవారు. అయితే, గురువారం నుంచి రాష్ట్రంలోని 22 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని పైలట్ ప్రాతిపదికన అమలు చేయనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఈనెల 10 నుంచి ఆజంపురా, చిక్కడపల్లి, సదాశివపేట, కుత్బుల్లాపూర్, వల్లభ్‌నగర్, శంషాబాద్, సరూర్‌నగర్, చంపాపేట, రామగుండం, కూసుమంచి, జగిత్యాల, నిర్మల్, వరంగల్ ఫోర్ట్, వరంగల్ రూరల్, కొత్తగూడెం, ఆర్మూర్, భువనగిరి, చౌటుప్పల్, నాగర్‌కర్నూల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల (ఎస్ఆర్‌వో)తోపాటు ఖమ్మం, మేడ్చల్, మహబూబ్‌నగర్ ఆర్‌వో కార్యాలయాల్లో ఈ విధానాన్ని ప్రారంభించనున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.

స్లాట్‌తో పాటు వాకిన్ కూడా..

పైలట్‌గా ప్రారంభించనున్న స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ల కోసం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. రిజిస్ట్రేషన్ లావాదేవీల రద్దీని తగ్గించేలా ఒక్క రోజులో పనివేళలను 48 స్లాట్లుగా విభజించారు. స్లాట్ బుకింగ్ కోసం registration.telangana.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా క్రయవిక్రయదారులు తమ అనుకూలమైన తేదీ, సమయంలో స్లాట్ బుక్ చేసుకునే అవకాశం కల్పించనున్నారు. ఆ మేరకు స్లాట్ సమయానికి సదరు




సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునేలా ఏర్పాట్లు చేశారు. ఒకవేళ స్లాట్ బుకింగ్ ద్వారా కాకుండా నేరుగా మాన్యువల్ పద్ధతిలోనూ రిజిస్ట్రేషన్లు చేసుకునే వెసులుబాటును పైలట్ పద్ధతిలోనూ కొనసాగించనున్నారు. అత్యవసర సందర్భాల్లో రిజిస్ట్రేషన్ల కోసం ప్రతి రోజూ సాయంత్రం 5–6 గంటల సమయంలో ఐదు వాకిన్ రిజిస్ట్రేషన్లు అనుమతించనున్నారు. ఇందులో మొదట కార్యాలయానికి వచ్చిన వారికి 'ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్' విధానంలో రిజిస్ట్రేషన్లు చేయనున్నారు.

కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ

స్లాట్ బుకింగ్ విధానం కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరించాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించింది. అందులో భాగంగా ఎక్కువ రద్దీ ఉండేవి, రద్దీ లేని వాటిని అనుసంధానం చేసి పనిభారాన్ని సమం చేయనున్నారు. ఈ క్రమంలోనే రంగారెడ్డి జిల్లాలోని చంపాపేట, సరూర్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని విలీనం చేయాలని నిర్ణయించారు. అదేవిధంగా కుత్బుల్లాపూర్ లాంటి రద్దీ ఎక్కువ ఉండే కార్యాలయాల్లో రోజుకు 48 స్లాట్లు సరిపోవనే ఉద్దేశంతో ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లను అదనంగా నియమించనున్నారు. తద్వారా ఈ కార్యాలయంలో రోజుకు 144 స్లాట్లు అందుబాటులోకి రానున్నాయి. దీనికి తోడు క్రయవిక్రయదారులు డాక్యుమెంట్ల తయారీ కోసం ఇతరులపై ఆధారపడకుండా సొంతంగానే దస్తావేజులను తయారు చేసుకునే వెసులుబాటును కూడా ఆ శాఖ కల్పించనుంది. ఇందుకోసం శాఖ వెబ్‌సైట్‌లో ఒక మాడ్యూల్‌ను పొందుపర్చాలని, దీని ద్వారా సేల్‌డీడ్ దస్తావేజులు తయారు చేసుకునే అవకాశం కల్పించాలని నిర్ణయించింది. దీనికి తోడు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు 'ఆధార్–ఈ సంతకం' విధానాన్ని ఈనెలాఖరులోగా అందుబాటులోకి తేవాలని యోచిస్తోంది. రిజిస్ట్రేషన్ సమయంలో అమ్మిన, కొన్న వారితో పాటు సాక్షులు, సబ్‌రిజిస్ట్రార్ స్వదస్తూరితో సంతకాలు చేయడం లేదా వేలిముద్రలు వేయడానికి చాలా సమయం పడుతోందని, ఈ విధానం అమల్లోకి వస్తే ఆధార్‌లో ఉన్న సంతకాన్ని నమోదు చేస్తామని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇక, డబుల్ రిజిస్ట్రేషన్లకు చెక్‌పెట్టే దిశలో కూడా ఆ శాఖ మరో అడుగు ముందుకు వేయనుంది. ఇందుకోసం ఇప్పటికే చాలా రాష్ట్రాలు సవరించుకున్నట్లుగానే తెలంగాణలో కూడా రిజిస్ట్రేషన్ల చట్టాన్ని సవరించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. చట్టంలోని సెక్షన్ 22కు సవరణ చేసి 22బీని తీసుకురానుంది.

10-15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్: మంత్రి పొంగులేటి



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తేవడం ద్వారా ప్రజలు గంటలకొద్దీ నిరీక్షించకుండా 10–15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి చేయనున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలోని 144 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు గాను 22 చోట్ల పైలట్ పద్ధతిలో ఈ విధానాన్ని అమల్లోకి తెస్తున్నామన్నారు. సమర్థవంతంగా, వేగవంతంగా, పారదర్శక పద్ధతిలో అవినీతిరహితంగా ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. అందులోభాగంగా సంస్కరణలను తెస్తున్నామని పొంగులేటి చెప్పారు.

కర్రిగుట్టపై బాంబులు అమర్చాం

- పోలీసు ఇన్‌ఫార్మర్లుగా మారి ఎవరూ రావొద్దు
- మావోయిస్టు పార్టీ వెంకటాపురం వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత

చర్ల/వెంకటాపురం(కె)/వాజేడు: కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న కగార్ దాడుల నుంచి రక్షించుకోవడానికి తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని బీజాపూర్ జిల్లాలో ఉన్న కర్రిగుట్టపై బాంబులు అమర్చామని.. ఈ విషయాన్ని ఇప్పటికే పలుమార్లు వెల్లడించామని మావోయిస్టు పార్టీ వెంకటాపురం –వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత తెలిపారు. అయితే, పోలీసులు కొందరిని ఇన్‌ఫార్మర్లుగా మార్చుకుని వేట పేరుతో కర్రిగుట్టకు పంపించి తమ నేతల కదలికలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారని, అలా వచ్చి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఆమె సూచించారు. ఈ మేరకు శాంత పేరిట మంగళవారం విడుదలైన లేఖలోని వివరాలిలా ఉన్నాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కగార్ పేరుతో దాడులు చేస్తుంటే, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహా దాడులు చేస్తోందని విమర్శించారు. ఈ దాడుల్లో మావోయిస్టు నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు అమరులవుతున్నారని, వీరిలో ఆదివాసీలే ఎక్కువగా ఉన్నారని పేర్కొన్నారు. కగార్ దాడుల నుంచి రక్షించుకోవడానికి కర్రిగుట్టపై బాంబులు అమర్చిన విషయాన్ని తెలియజేసినందున.. పోలీసుల మాయమాటలు, వారు ఇచ్చే డబ్బుకు ఆశపడి ఆదివాసీ, గిరిజనేతరులు ఇన్‌ఫార్మర్లుగా మారి ఇటువైపు రావొద్దని సూచించారు. అలా రావడం ద్వారా కొందరు చనిపోతుండగా, మరికొందరు గాయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రజలు పోలీసుల మాయమాటలు నమ్మి ఇన్‌ఫార్మర్లుగా మారొద్దని లేఖలో శాంత కోరారు.

సాగర్ డ్యాంపై తెలంగాణ సీఆర్పీఎఫ్ బలగాల ఉపసంహరణ



234 బెటాలియన్ కమాండెంట్‌కు చార్జి అప్పగిస్తున్న ములుగు 39 బెటాలియన్ కమాండెంట్

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టుపై తెలంగాణ వైపు విధులు నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్ దళాలు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం మధ్యాహ్నం నుంచి విధులు ఉపసంహరించుకున్నాయి. ప్రస్తుతం డ్యాంపై ఆంధ్రా వైపు ఉన్న సీఆర్పీఎఫ్ దళాలే తెలంగాణ వైపు కూడా పహారా కాస్తున్నాయి. ఈ బలగాలు జూన్ 23వ తేదీ వరకు ఉండనున్నట్లు సమాచారం. ఆ తర్వాత రాష్ట్రానికి చెందిన ఎస్పీఎఫ్ (స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) పోలీసుల అధీనంలో ఉంటుంది. 16 నెలలుగా సాగర్ డ్యాంపై సీఆర్పీఎఫ్ బలగాలు ఉంటున్నాయి. తెలంగాణ వైపు సీఆర్పీఎఫ్ ములుగు 39 బెటాలియన్ వారు, ఏపీ వైపు సీఆర్పీఎఫ్ విశాఖపట్టణం 234 బెటాలియన్ వారు కాపలా ఉంటున్నారు. ప్రస్తుతం పూర్తిస్థాయి ప్రాజెక్టు విశాఖపట్టణం బెటాలియన్ పహారాలోకి వెళ్లింది.

బాలుడిపై వీధి కుక్కల దాడి.. పరిస్థితి విషమం

నర్సాపూర్ రూరల్: తోటి పిల్లలతో ఆడుకుంటున్న పదేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. ఈ ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. మండల పరిధిలోని రుస్తుంపేట గ్రామానికి చెందిన సందిల వెంకటేశ్ కుమారుడు అభిలాష్ (10) తోటి పిల్లలతో కలిసి ఇంటిముందు ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో నాలుగు వీధి కుక్కలు ఒక్కసారిగా అతడిపై దాడి చేశాయి. గమనించిన కుటుంబ సభ్యులు కుక్కలను తరిమి వేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. వెంటనే బాలుడిని నర్సాపూర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స చేసిన అనంతరం వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

రెండున్నర ఫీట్ల జాగా కోసం... కత్తులతో విచక్షణారహితంగా దాడి

- బయటకొచ్చిన మూడేళ్ల బాలుడి పేగులు... గర్భిణి పొట్టపై కత్తిగాట్లు
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘటన



చికిత్స పొందుతున్న ఏంజెల్

సిరిసిల్లక్రైం: రెండున్నర ఫీట్ల జాగా కోసం కత్తులతో విచక్షణారహితంగా దాడి చేయగా, ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిలో మూడేళ్ల బాబు పరిస్థితి విషమంగా ఉంది. బాధితుడు వెంకటేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన కళికోట వెంకటేశ్‌కు తన ఇంటి పక్కనే ఉన్న భూమి విషయమై అన్నతో కొద్ది రోజులుగా వివాదం కొనసాగుతోంది. గతంలో ఒకసారి వెంకటేశ్ అన్న కుటుంబీకులు దాడి చేయడానికి ప్రయత్నించారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు మందలించి పంపించారు. మంగళవారం మధ్యాహ్నం వెంకటేశ్.. ఈ విషయమై జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసేందుకు వెళ్లాలనుకునే సమయంలోనే వెంకటేశ్ అన్న కొడుకు పృథ్వీ, అతని స్నేహితుడు సాయి కత్తులతో దాడి చేశారు. ఈ దాడిలో వెంకటేశ్‌కు స్వల్పంగా గాయాలుకాగా.. అతని కొడుకు మూడేళ్ల వయస్సు ఉన్న శివనేత్ర కడుపులోని పేగులు బయటకు వచ్చాయి. గర్భిణి అయిన ఏంజెల్ పొట్టపై కూడా కత్తితో దాడి చేశారు. ఇద్దరిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే శివనేత్ర పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. ఈ భూమి విషయంలో అన్న కుటుంబంతో ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని వెంకటేశ్ ఆరోపించారు.


వైట్‌హౌస్‌లో ట్రంప్

చైనాపై మరో 50%

అన్నంత పనీ చేసిన ట్రంప్ • డెడ్‌లైన్ ముగుస్తూనే బాదుడు

- మొత్తం సుంకాలు 104 శాతం
- నేటినుంచే అమల్లోకి: వైట్‌హౌస్
- అంతకంతా ప్రతీకారం: చైనా

బీజింగ్/వాషింగ్టన్: ట్రంప్ అన్నంత పనీ చేశారు. చైనాపై మరో 50 శాతం అదనపు సుంకాలు విధించారు. అమెరికాపై చైనా 34 శాతం ప్రతీకార సుంకాలపై సోమవారం ఆయన మండిపడటం, మంగళవారం మధ్యాహ్నం లోపు వాటిని వెనక్కు తీసుకోవాలని అల్టిమేటం జారీ చేయడం తెలిసిందే. ఆ హెచ్చరికలను డ్రాగన్ దేశం బేఖాతరు చేసింది. బెదిరింపులకు జడిసేది లేదని కుండబద్దలు కొట్టింది. ''మా విషయంలో అమెరికా తప్పులపై తప్పులు చేస్తోంది. ఈ బ్లాక్‌మెయిలింగ్‌కు లొంగే ప్రసక్తే లేదు. చివరిదాకా పోరాడి తీరతాం. మా ప్రయోజనాల పరిరక్షణకు ఎందాకైనా వెళ్తాం. 50 శాతం టారిఫ్‌లు విధిస్తే మావైపు నుంచీ అంతకంతా ప్రతీకార చర్యలుంటాయి'' అని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ మంగళవారం ప్రకటించారు. వాణిజ్య, టారిఫ్ యుద్ధాల్లో విజేతలంటూ ఎవరూ ఉండరని హితవు పలికారు. అయినా చైనా ఈ విషయమై తమతో చర్చలకు వస్తుందని ఎదురు చూస్తున్నట్టు ట్రంప్ చెప్పుకొచ్చారు. ''వాళ్లు ఏదో ఒక ఒప్పందానికి రావాలనే ఆశ పడుతున్నారు. కానీ ఎక్కణ్నుంచి మొదలు పెట్టాలా అని సతమతమవుతున్నారు'' అన్నారు. కానీ మంగళవారం డెడ్‌లైన్ ముగిసినా చైనా నుంచి అలాంటి సూచనలేవీ రాకపోవడంతో వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లెవిట్ మీడియా ముందుకొచ్చారు. ''చైనాపై 50 శాతం అదనపు సుంకాలు విధిస్తున్నాం. ఈ నిర్ణయం బుధవారం నుంచే అమల్లోకి వస్తుంది'' అని ప్రకటించారు! దాంతో అగ్ర రాజ్యాల టారిఫ్ పోరు ముదురు పాకాన పడింది. చైనాపై మార్చిలోనే అమెరికా 20 శాతం సుంకాలు విధించడం, గత వారమే ట్రంప్ మరో 34 శాతం బాదడం తెలిసిందే. తాజా 50 శాతంతో కలిపి చైనాపై అమెరికా మొత్తం సుంకాలు ఏకంగా 104 శాతానికి చేరాయి! టారిఫ్‌లపై చైనాతో చర్చలకు చాన్సే లేదని సోమవారమే ట్రంప్ బెదిరించిన నేపథ్యంలో రెండు దేశాల మధ్య పూర్తిస్థాయి వాణిజ్య యుద్ధం తప్పేలా లేదు.

ఈయూ ప్రతీకార సుంకాలు 25 శాతం

బెల్జియం: అమెరికా దిగుమతులపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్టు యూరోపియన్ కమిషన్ సోమవారం ప్రకటించింది. కొన్ని వస్తువులపై మే 16 నుంచి, మరికొన్నింటిపై డిసెంబర్ 1 నుంచి ఈ సుంకాలు అమల్లోకి వస్తాయని పేర్కొంది.

భారత్‌పైనా నేటినుంచే!

ప్రపంచ దేశాలపై ట్రంప్ ఇటీవల విధించిన టారిఫ్‌ల అమలులో ఆలస్యం, డెడ్‌లైన్ పొడిగింపు వంటివేమీ ఉండబోవని లెవిట్ కుండబద్దలు కొట్టారు. భారత్‌తో పాటు 70పై చిలుకు దేశాలపై ఏప్రిల్ 2న ట్రంప్ ఎడాపెడా అదనపు సుంకాలు విధించడం తెలిసిందే. అవి ఏప్రిల్ 9 నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించారు. దాంతో భారత్‌పై 26 శాతం సుంకాలతో పాటు ఆయా దేశాలపై విధించిన టారిఫ్‌లు కూడా బుధవారం (అమెరికా కాలమానం ప్రకారం) నుంచే అమల్లోకి రానున్నాయి. ''ట్రంప్ టారిఫ్‌లు పని చేస్తున్నాయి. ఈ విషయమై అమెరికాతో చర్చల కోసం 70కి పైగా దేశాలు ఇప్పటికే ముందుకొచ్చాయి'' అని లెవిట్ చెప్పుకొచ్చారు. అయితే అమెరికాకు లాభదాయకంగా ఉంటేనే ఏ చర్చలైనా ఫలిస్తాయని ఆమె స్పష్టం చేశారు.

గవర్నర్‌కు గడువు 3 నెలలే

అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులపై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిందే

- రెండోసారి పంపించిన బిల్లులకు నెల రోజుల్లోగా సమ్మతి తెలపాల్సిందే
- నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేయడం కచ్చితంగా రాజ్యాంగ విరుద్ధమే
- బిల్లులపై వీటో అధికారం గవర్నర్‌కు లేదు • తమిళనాడు గవర్నర్ తీరు చట్టవిరుద్ధం
- ఆయనకు అసెంబ్లీ రెండోసారి పంపిన 10 బిల్లులు ఆమోదం పొందినట్లు పరిగణిస్తున్నాం
- సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు • గవర్నర్ల పనితీరుపై కీలక వ్యాఖ్యలు


సీఎం స్టాలిన్




గవర్నర్ రవి

న్యూఢిల్లీ: తమిళనాడు ప్రభుత్వానికి ఎట్టకేలకు విజయం లభించింది. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లుల విషయంలో సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన తీర్పు వెలువరించింది. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులపై గవర్నర్ ఆమోద ముద్ర వేయకుండా సుదీర్ఘకాలం పెండింగ్‌లో కొనసాగించడం రాజ్యాంగ విరుద్ధమని తేల్చిచెప్పింది. తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి తీరును అత్యున్నత న్యాయస్థానం తప్పుపట్టింది. అసెంబ్లీలో ఆమోదం పొందిన తర్వాత గవర్నర్ ముందుకు వచ్చిన బిల్లులపై నిర్దేశిత గడువులోగా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిందేనని తేల్చిచెప్పింది. గవర్నర్ ఆర్.ఎన్.రవి 10 బిల్లులను పెండింగ్‌లో పెట్టడాన్ని సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. రాష్ట్రపతి పరిశీలన కోసం పంపించామన్న సాకుతో 10 బిల్లులను చాలాకాలం పెండింగ్‌లో కొనసాగించడం సమంజసం కాదని స్పష్టంచేసింది. బిల్లులను శాశ్వతంగా పెండింగ్‌లో పెట్టే అధికారం గవర్నర్‌కు లేదని తెలియజేసింది. తమిళనాడు గవర్నర్ నిర్ణయం చట్టవిరుద్ధం, నిర్హేతుకం, ఏకపక్షం అని విమర్శించింది. ఆయన నిర్ణయాన్ని తోసిపుచ్చుతున్నట్లు వెల్లడించింది. ''అసెంబ్లీలో ఆమోదించిన 10 బిల్లులను గవర్నర్ సమ్మతి కోసం పంపించగా ఆయన తిరస్కరించారు. దీంతో అసెంబ్లీలో మళ్లీ ఆమోదించి పంపించారు. వాటిపై గవర్నర్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రాష్ట్రపతికి నివేదించామంటూ కాలయాపన చేస్తున్నారు. ఇలా చేయడం చట్టవిరుద్ధమే. అందుకే రెండోసారి పంపిన తేదీ నుంచే అవి గవర్నర్ సమ్మతి పొందినట్లు పరిగణిస్తున్నాం'' అని ధర్మాసనం తీర్పు ప్రకటించింది.

విఫలమైతే జ్యుడీషియల్ రివ్యూ తప్పదు

రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం.. బిల్లులను గవర్నర్ ఎప్పటిలోగా ఆమోదించాలన్నదానిపై ఎలాంటి కాలపరిమితి లేదు. ఫలానా సమయంలోగా నిర్ణయం తీసుకోవాలంటూ రాజ్యాంగం నిర్దేశించలేదు. కానీ, బిల్లులపై గవర్నర్ ఎటూ తేల్చకుండా సుదీర్ఘకాలం పెండింగ్‌లో పెడితే ప్రభుత్వ పరిపాలనకు అవరోధాలకు ఎదురవుతాయని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. చట్టాలు చేసే శాసన వ్యవస్థకు అడ్డంకులు సృష్టించినట్లు అవుతుంది పేర్కొంది. అందుకే బిల్లులపై గవర్నర్లు ఎక్కువకాలం నాన్చకుండా మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని, ఈ మేరకు గడువు నిర్దేశిస్తున్నట్లు తేల్చిచెప్పింది. బిల్లుకు సమ్మతి తెలపడం లేదా రాష్ట్రపతికి నివేదించడం లేదా శాసనసభకు తిప్పిపంపడం మూడు నెలల్లో పూర్తి కావాలని వెల్లడించింది. గవర్నర్ వెనక్కి పంపిన బిల్లును అసెంబ్లీలో మళ్లీ ఆమోదించి గవర్నర్‌కు పంపిస్తే నెల రోజుల్లోగా కచ్చితంగా సమ్మతి తెలపాలని స్పష్టంచేసింది. ఈ టైమ్‌లైన్ పాటించే విషయంలో విఫలమైతే.. కోర్టుల జ్యుడీషియల్ రివ్యూకు గవర్నర్ సిద్ధపడాల్సి ఉంటుందని పేర్కొంది. తమిళనాడు అసెంబ్లీలో రెండోసారి ఆమోదం తర్వాత గవర్నర్‌కు పంపిన బిల్లులకు సమ్మతి తెలిపే విషయంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ద్వారా తమకు సంక్రమించిన అధికారాన్ని సుప్రీంకోర్టు ఉపయోగించుకుంది.

తమిళనాడులో గవర్నర్ ఆర్.ఎన్.రవి, డీఎంకే ప్రభుత్వం మధ్య చాలా ఏళ్లుగా ఘర్షణ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులకు సమ్మతి తెలపకుండా గవర్నర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని డీఎంకే సర్కారు మండిపడుతోంది. 12 బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ఆమోదించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ప్రభుత్వం 2023లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కానీ, తన వద్ద 10 బిల్లులే పెండింగ్‌లో ఉన్నాయని గవర్నర్ 2023 నవంబర్ 13న ప్రకటించారు. తర్వాత అసెంబ్లీ నవంబర్ 18న ప్రత్యేకంగా సమావేశమైంది. ఆ 10 బిల్లులను మళ్లీ ఆమోదించి గవర్నర్‌కు పంపించింది. తన వద్దకు వచ్చిన బిల్లును గవర్నర్ నవంబర్ 28న రాష్ట్రపతి పరిశీలన కోసం రిజర్వ్ చేశారు.

మిత్రుడిగా, మార్గదర్శిగా గవర్నర్ పనిచేయాలి

''గవర్నర్లు చాలా వేగంగా పనిచేయాలని, చురుగ్గా నిర్ణయాలు తీసుకోవాలని రాజ్యాంగం ఆశిస్తోంది. నిర్ణయాల్లో విపరీతమైన జాప్యం చేయడం ప్రజాస్వామ్య పరిపాలన స్ఫూర్తిని దెబ్బతీసినట్లే. ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయడం, నిర్ణయం తీసుకోకపోవడం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుంది. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులను గవర్నర్ వీటో చేయడం అనేది మన రాజ్యాంగంలో ఎక్కడా లేదు. అత్యంత అరుదైన సందర్భాల్లో మాత్రం గవర్నర్ తన విచక్షణ మేరకు వ్యవహరించవచ్చు. బిల్లు ప్రజలకు హాని కలిగిస్తుందని భావించినప్పుడు, రాష్ట్రపతి సమ్మతి కచ్చితంగా అవసరమని అనుకున్నప్పుడు కొంతకాలం జాప్యం చేయొచ్చు. గవర్నర్ విచక్షణాధికారానికి సైతం ఆర్టికల్ 200 కొన్ని పరిమితులు విధిస్తోంది. బిల్లుపై నిర్ణయం తీసుకోకుండా ఉండడం సరైంది కాదు. గవర్నర్ స్పందించకపోతే బిల్లు కేవలం ఒక కాగితం ముక్కగా, మాంసం లేని అస్థిపంజరంగానే ఉండిపోతుంది. శాసనసభలో ఆమోదించిన బిల్లును ఇష్టంవచ్చినట్లు తొక్కిపెడతామంటే కుదరదు. అసెంబ్లీలో రెండోసారి ఆమోదం పొంది వచ్చిన బిల్లుకు (మొదటి దాని కంటే వైవిధ్యమైనది అయితే తప్ప) తప్పనిసరిగా సమ్మతి తెలపాల్సిందే. రాష్ట్రపతికి నివేదించకూడదు. అలాంటి బిల్లుపై గవర్నర్‌కు వీటో పవర్ ఉండదు. ప్రజల బాగు కోసం పని చేస్తామంటూ గవర్నర్లు ప్రమాణ స్వీకారం చేస్తారు. రాష్ట్ర ప్రథమ పౌరుడిగా ప్రజలకు మంచి జరిగేలా చూడాల్సిన బాధ్యత గవర్నర్‌పై ఉంటుంది. ప్రజల చేత ఎన్నికైన శాసనసభ్యులకు అడ్డంకులు సృష్టించకూడదు. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు రాజ్యాంగ స్ఫూర్తితో పని చేయాలి. మంత్రివర్గం సూచనల మేరకు గవర్నర్ వ్యవహరించాలని ఆర్టికల్ 200 చెబుతోంది. గవర్నర్ ఒక మిత్రుడిగా, మార్గదర్శిగా వ్యవహరించాలి. రాజకీయపరమైన ఉద్దేశాలతో పనిచేయొద్దు. గవర్నర్ ఉత్ప్రేరకంగా ఉండాలి తప్ప నిరోధకంగా ఉండొద్దు. గవర్నర్ సైతం న్యాయ సమీక్షకు అర్హుడేనన్న సంగతి మర్చిపోవద్దు'' అని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టంచేసింది. గవర్నర్‌కు న్యాయస్థానం స్పష్టమైన గడువు నిర్దేశించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

చరిత్రాత్మకం: స్టాలిన్

చెన్నై: గవర్నర్ వద్ద పెండింగ్ ఉన్న బిల్లుల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ చెప్పారు. సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చిందని హర్షం వ్యక్తంచేశారు. ఇది తమిళనాడుతో పాటు దేశంలో అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు దక్కిన గొప్ప విజయమని పేర్కొన్నారు. స్టాలిన్ మంగళవారం అసెంబ్లీలో మాట్లాడారు. సభలో బల్లలు చరిచి సుప్రీంకోర్టు తీర్పుపై సంబరాలు జరుపుకోవాలని అధికారపక్ష సభ్యులకు సూచించారు. తమిళనాడు ప్రజలకు, తమ న్యాయ బృందానికి అభినందనలు తెలియజేస్తూ స్టాలిన్ సోషల్ మీడియాలో పోస్టుచేశారు. కేంద్ర–రాష్ట్ర సంబంధాల్లో సమతుల్యాన్ని పునరుద్ధరించే విషయంలో ఈ తీర్పు ఒక కీలకమైన ముందడుగు అని ఉద్ఘాటించారు. అసలైన సమాఖ్య భారత్‌లో ప్రవేశం కోసం ఎడతెగని పోరాటం చేస్తున్న తమిళనాడుకు విజయం దక్కిందన్నారు. తమిళనాడులో ఏఐఏడీఎంకే, బీజేపీ మినహా ఇతర పార్టీలన్నీ సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించాయి. అధికార డీఎంకే నాయకులు మిఠాయిలు పంచుకొని, బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో తమ గవర్నర్ ఆర్.ఎన్.రవి యూనివర్సిటీలకు చాన్స్‌లర్‌గా ఉండే అధికారం కోల్పోయారని డీఎంకే నేత ఒకరు చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సైతం హర్షం వ్యక్తంచేశారు.

ట్రాఫిక్ ఉల్లంఘనకూ వీసా రద్దు!

విదేశీ విద్యార్థులకు నరకం చూపుతున్న ట్రంప్ • గాజా మద్దతుదారులను ఇప్పటికే బహిష్కరిస్తున్న వైనం

వాషింగ్టన్: దేశం నుంచి బలవంతంగానైనా పంపేయాలని ప్రభుత్వం కంకణం కట్టుకున్నాక ఆపడం ఎవరితరం కాదనే వాస్తవం ఇప్పుడు అమెరికాలో ప్రత్యక్షంగా కనిపిస్తోంది. విదేశీ విద్యార్థులు ఏ చిన్న పొరపాటు అనుకోకుండా చేసినా ప్రభుత్వం వారిపై 'వీసా రద్దు' కత్తి దింపుతోంది. వెంటనే వీసా గడువును ముగించేసి స్వదేశానికి వెళ్లాలని ఆదేశాలిస్తోంది. చిన్నపాటి ట్రాఫిక్ ఉల్లంఘన ఉదంతాన్ని సైతం వీసా రద్దుకు సాకుగా చూపుతోందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఏ నిమిషంలో వీసా రద్దు ఈ–మెయిల్ వస్తుందోనన్న భయంతో అక్కడి విదేశీ విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. పారిపోయిన, జాడ దొరకని ఉగ్రవాదిని అత్యవసరంగా వెతికిన చందంగా ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ సర్కార్ వ్యవహరిస్తోంది. దీనిపై ఎంతటి విమర్శలు వెల్లువెత్తుతున్నా విదేశీ విద్యార్థుల బహిష్కరణ పర్వానికి ప్రభుత్వం తెరదించట్లేదు. దీంతో ఇప్పటికే గాజా అనుకూల ర్యాలీలు, ఆందోళనలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న వారు, ఆ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌చేసినా, షేర్ చేసిన, అనుకూలంగా స్పందించిన విదేశీ విద్యార్థుల కంటిపై కునుకులేకుండా పోయింది. ఏ నిమిషంలో వీసా రద్దవుతుందోనన్న ఆందోళన సంబంధిత విదేశీ విద్యార్థుల్లో ఎక్కువైంది. సంబంధిత వివరాలను అసోసియేటెడ్ ప్రెస్ వార్తాసంస్థ ఒక నివేదిక వెల్లడించింది.

మా విద్యార్థుల వీసాలు రద్దయ్యాయి

తమ కాలేజీల్లో విద్యనభ్యసిస్తున్న విదేశీ విద్యార్థుల్లో చాలా మంది వీసాలు హఠాత్తుగా రద్దయ్యాయని అమెరికాలోని పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలలు తాజాగా వెల్లడించాయి. ఇలా వీసా రద్దును ఎదుర్కొన్న వారిలో భారతీయ విద్యార్థులూ ఉన్నారు. అయితే పాలస్తీనా అనుకూల ఘటనలతో ఎలాంటి సంబంధం లేని విద్యార్థులకు సైతం వీసా రద్దు ఈ–మెయిల్స్ రావడం గమనార్హం. ఇలాంటి విద్యార్థులను అమెరికాలో గతంలో చిన్నపాటి ట్రాఫిక్ ఉల్లంఘన ఉదంతాలను సాకుగా చూపి దేశ బహిష్కరణ వేటు వేసినట్లు తెలుస్తోంది. ఇంకొంత మంది విద్యార్థులకు వీసా ఎందుకు రద్దు చేస్తున్నామని కనీస కారణాన్ని కూడా ఇమిగ్రేషన్ అధికారులు పేర్కొనకపోవడం దారుణమని కాలేజీల యాజమాన్యాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి.

డేటాబేస్ చూశాకే మాకూ తెలిసొచ్చింది

అసలు ఎవరెవరి వీసాలు రద్దయ్యాయని వివరాలు సైతం ఇమిగ్రేషన్ అధికారులు స్పష్టంగా పేర్కొనట్లేరు. దీనిపై హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, మిషిగన్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, లాస్‌ఏంజెలెస్, ఒహాయో స్టేట్ వర్సిటీల అధికారులు స్పందించారు. ''మా కాలేజీల్లోని కొందరు విద్యార్థుల వీసాలు సైతం రద్దయ్యాయి. అమెరికావ్యాప్తంగా స్టూడెంట్ వీసాల గడువును అకస్మాత్తుగా కుదిస్తున్న నేపథ్యంలో ఫెడరల్ ఇమిగ్రేషన్ డేటాబేస్‌ను యథాలాపంగా చెక్‌చేశాం. అందులో మా కాలేజీల విద్యార్థుల పేర్లు కూడా కనిపించడంతో ఆశ్చర్యపోయాం. ఎందుకు రద్దుచేశారని తెల్సుకునేందుకు ప్రయత్నిస్తే ఇమిగ్రేషన్ విభాగం నుంచి సరైన స్పందన కరువైంది'' అని ప్రముఖ వర్సిటీల అధికారులు వెల్లడించారు. భారతీయ విద్యార్థులు ఎలాంటి గాజా, పాలస్తీనా అనుకూల ప్రదర్శనల్లో పాల్గొనకపోయినా కొందరి వీసాల గడువును ప్రభుత్వం పూర్తిగా ముగించేసి స్వదేశానికి వెళ్లిపోవాలని సందేశాలు పంపించింది. అమెరికా వ్యతిరేక భావజాలమున్న విద్యార్థులను ఏరివేసేందుకు ప్రభుత్వం సామాజిక మాధ్యమాల ఖాతాలను జల్లెడ పడుతోందని యాక్సికోస్ అనే సంస్థ వెల్లడించింది. హమాస్ అనుకూల, ఇజ్రాయెల్ వ్యతిరేక పోస్టులు పెట్టినా, అలాంటి పోస్ట్‌లను లైక్‌చేసినా, షేర్ చేసినా అలాంటి వారిని గుర్తించే పనిలో ప్రభుత్వం మునిగిపోయిందని యాక్సికోస్ నివేదించింది.


మంగళవారం ముద్రా లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

పదేళ్లలో రూ.33.65 లక్షల కోట్లు

- పీఎం–ముద్రా యోజనకు దశాబ్దం పూర్తి
- పథకం లబ్ధిదారులతో ప్రధాని మోదీ సమావేశం
- ఏపీ మహిళ విజయగాథను తెలుగులోనే విన్న ప్రధాని
- అందరికీ అభినందనలు అంటూ తెలుగులో పోస్టు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ చేతులు మీదు ప్రారంభమైన ప్రధానమంత్రి–ముద్ర యోజన (పీఎం–ఎంవై) మంగళవారంతో పదేళ్లు పూర్తి చేసుకుంది. 2015 ఏప్రిల్ 8న ప్రారంభమైన నాటి నుంచి ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 52 కోట్ల మందికిపైగా లబ్ధిదారులకు రూ.33.65 లక్షల కోట్ల పూచీకత్తు లేని రుణాలు పంపిణీ చేసినట్లు కేంద్రం వెల్లడించింది. ప్రధాని మోదీ మంగళవారం ఢిల్లీలోని తన నివాసంలో ముద్ర యోజన లబ్ధిదారులతో ముచ్చటించారు. వారి విజయగాథలు అడిగి తెలుసుకున్నారు. నైపుణ్యాలు కలిగిన యువత ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా ఎదగడానికి ఈ పథకం తోడ్పడుతోందని అన్నారు. ఉద్యోగాలు కోరుకొనేవారుగా కాకుండా ఉద్యోగాలు ఇచ్చేవారుగా మారగలమన్న నమ్మకం వారిలో పెరుగుతోందని తెలిపారు. పథకంతో లబ్ధిపొందిన వారు మరో 10 మందిలో ప్రేరణ కలిగించాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళ తన సక్సెస్ స్టోరీని ప్రధానమంత్రితో పంచుకున్నారు. నరేంద్ర మోదీ, లబ్ధిదారు మధ్య జరిగిన సంభాషణ.

లబ్ధిదారు: సార్.. నేను ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చాను. నాకు హిందీ రాదు. తెలుగులోనే మాట్లాడుతా..

మోదీ: ఏం ఫర్వాలేదు.. మీరు తెలుగులోనే మాట్లాడండి.

లబ్ధిదారు: నాకు 2009లో వివాహం జరిగింది. 2019 వరకు గృహిణిగా ఉన్నాను. జ్యూట్ బ్యాగ్‌ల తయారీలో కెనరాబ్యాంక్ రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌లో 13 రోజులపాటు ట్రైనింగ్ తీసుకున్నాను. బ్యాంక్‌కు చెప్పి నాకు లోన్ ఇప్పించారు. ష్యూరిటీ ఏమీలేదు. ఎవరూ నాకు సపోర్ట్ లేరు. కెనరా బ్యాంక్ వారు నన్ను నమ్మి లోన్ ఇచ్చారు. రూ.2 లక్షలు ముద్ర లోన్ తీసుకుని 2019లో వ్యాపారం ప్రారంభించా. నా రీపేమెంట్స్ చూసి 2022లో రూ.9.5 లక్షలు రుణం మంజూరు చేశారు. వ్యాపారాన్ని మరింత విస్తరించా. ఇప్పుడు నా దగ్గర 15 మంది పనిచేస్తున్నారు.

మోదీ: అంటే.. రూ.2 లక్షలతో ప్రారంభించారు. రూ.9.5 లక్షలకు చేరుకున్నారు. మీతో ఎంతమంది పనిచేస్తున్నారు?

లబ్ధిదారు: 15 మంది సార్. అందరూ గృహిణిలు, గ్రామీణ ప్రజలే సార్. నాకు ఇంత అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు సార్.

మోదీ: కృతజ్ఞతలు.. మీకు ధన్యవాదాలు

వారి ప్రయాణం స్ఫూర్తిదాయకం: మోదీ

''పీఎం–ముద్రా యోజన పథకంతో జీవితాలు మారిపోయిన వారందరికీ నేను అభినందనలు తెలియజేస్తున్నా. ఈ దశాబ్ద కాలంలో ముద్ర యోజన అనేక కలలను సాకారం చేసింది. గతంలో నిర్లక్ష్యానికి గురైన వ్యక్తులకు ఆర్థిక సహాయం అందించి వారిని శక్తివంతంగా మార్చింది. వారి ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం. పథకం లబ్ధిదారుల్లో సగం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందినవారే ఉన్నారు. 70 శాతం కంటే ఎక్కువ మంది లబ్ధిదారులు మహిళలే కావడం చాలా సంతోషకరం. ముద్రా యోజనతో సామాజిక, ఆర్థిక స్వేచ్ఛ లభిస్తోంది. రాబోయే కాలంలో ప్రతి ఒక్కరికీ అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుంది'' అని మోదీ 'ఎక్స్'లో తెలుగులో పోస్టు చేశారు.

బ్రహ్మ కుమారీస్ చీఫ్ కన్నుమూత


దాది రతన్ మోహిని

జైపూర్: ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం అధిపతి రాజయోగిని దాది రతన్ మోహిని కన్నుమూశారు. రతన్ మోహిని 101 సంవత్సరాల వయస్సులో మంగళవారం అహ్మదాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారని రాజస్తాన్‌లోని మౌంట్ అబూ కేంద్రంగా పనిచేస్తున్న ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. శతాబ్ద కాలంపాటు ప్రేమ, శాంతిని వ్యాపింపజేసేందుకు ఆమె అచంచలమైన అంకిత భావంతో పనిచేశారని పేర్కొంది. దాది రతన్ మోహని అంత్యక్రియలు ఈ నెల 10న జరుగుతాయని పేర్కొంది. రతన్ మోహిని మరణంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విచారం వ్యక్తం చేశారు. ఆమె తన బోధనల ద్వారా లెక్కలేనంత మంది జీవితాలను తీర్చిదిద్దారని కొనియాడారు. విదేశీ పర్యటనలో ఉన్న రాష్ట్రపతి ముర్ము ఈ మేరకు 'ఎక్స్'లో సందేశం పంపారు. ప్రధాని మోదీ కూడా దాది రతన్ మోహినికి నివాళులర్పించారు. అత్యున్నత ఆధ్యాత్మిక విలువలు పాటించిన దాదీజీ వెలుగు, జ్ఞానం, కరుణలకు దీపస్తంభంగా గుర్తుండిపోతారని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఆమె జీవితం ఎందరికో ప్రేరణగా నిలుస్తుందన్నారు.

భారీ సంస్థాగత మార్పులు

భావి కార్యాచరణపై సీడబ్ల్యూసీ చర్చ • నేడు ఏఐసీసీ కీలక భేటీ


మంగళవారం సీడబ్ల్యూసీ భేటీలో రాహుల్, ఖర్గే, సోనియా

అహ్మదాబాద్: పార్టీలో భారీ సంస్థాగత మార్పులను లక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ మేధోమథనానికి సిద్ధమైంది. నేడు జరగబోయే ఏఐసీసీ సమావేశానికి సన్నాహక సమావేశంగా విస్తృతస్థాయి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) భేటీని పార్టీ మంగళవారం అహ్మదాబాద్‌లో నిర్వహించింది. ఈ ఏడాది అక్టోబర్ 31న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని 'జెండాపట్టుకుని స్వాతంత్ర్యోద్యమాన్ని నడిపించిన మన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్' పేరిట సీడబ్ల్యూసీ ఒక తీర్మానాన్ని చేసి ఆమోదించింది. తీర్మానం, సీడబ్ల్యూసీ భేటీ వివరాలను తర్వాత పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మీడియాకు వెల్లడించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీలకు అత్యధిక అధికారాలు కట్టబెట్టడం, పార్టీ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల వారికి 50 శాతానికి మించి ప్రాధాన్యత కల్పించడం వంటి నిర్ణయాలను అమలుచేయాలని భావిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. పార్టీ పదవుల్లో 50 శాతానికి పైగా పదవులను మహిళలు, యువతకు కట్టబెట్టాలని పార్టీ యోచిస్తోంది. నేడు అహ్మదాబాద్‌లో సబర్మతీ నదీ తీరంలో సబర్మతీ ఆశ్రమం, కోచ్‌రబ్ ఆశ్రమాల మధ్యలోని ప్రాంతంలో ఏఐసీసీ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ''న్యాయపథ్: సంకల్ప్, సమర్పణ్, సంఘర్ష్' ఇతివృత్తంతో సమావేశాన్ని చేపట్టనున్నారు.

బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌పై ఖర్గే ధ్వజం

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ మెమోరియల్ భవంతిలో జరిగిన సీడబ్ల్యూసీ భేటీలో పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రారంభోపన్యాసం చేస్తూ బీజేపీపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ''సర్దార్ పటేల్ వారసత్వ ఘనతను కాంగ్రెస్ కొనసాగిస్తోంది. ఆయన మన మనసుల్లో ఉన్నారు. మన ఆలోచనల్లో ఉన్నారు. మనం ఆయన ఘన వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం. అయితే పటేల్, నెహ్రూ వంటి జాతీయనేతలపై బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ పక్కా ప్రణాళికతో కుట్ర పన్నుతున్నాయి. నెహ్రూ, పటేల్‌కు మధ్య బేధాభిప్రాయాలు ఉండేవని తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. నిజానికి వీళ్లద్దరూ మంచి మిత్రులు. వీళ్లు ఒకే నాణేనికి రెండు పార్శ్వాలు. పటేల్, నెహ్రూ రోజూ మాట్లాడుకునేవారు. అన్ని అంశాల్లో పటేల్ నుంచి నెహ్రూ సలహాలు, సూచనలు తీసుకునేవారు. నేరుగా మాట్లాడాలనుకున్న ప్రతిసారీ పటేల్ ఇంటికే నెహ్రూ వెళ్లేవారు. పటేల్ సౌకర్యార్థం కొన్ని సార్లు సీడబ్ల్యూసీ భేటీలను పటేల్ వాళ్ల ఇంట్లోనే జరిపారు. పటేల్‌ను భారత ఐక్యతా పితామహుడిగా నెహ్రూ శ్లాఘించారు. ఇవన్నీ చరిత్ర రికార్డుల్లో ఉన్నాయి'' అని ఖర్గే గుర్తుచేశారు.


ఆ ఆరోపణల్లో వాస్తవం లేదు

''ఆర్‌ఎస్‌ఎస్ భావజాలానికి పటేల్ గొప్ప ఆదర్శాలకు పొంతనేలేదు. గతంలో ఆర్‌ఎస్‌ఎస్‌ను పటేల్ నిషేధించారు. అలాంటి సంస్థ ఇప్పుడు పటేల్ తమ వ్యక్తి అన్నట్లు చెప్పుకోవడం హాస్యాస్పదం. పటేల్‌కు కాంగ్రెస్ సముచిత గౌరవం ఇవ్వలేదని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న ఆరోపణల్లో వీసమెత్తయినా వాస్తవం లేదు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి, గత 140 ఏళ్లుగా దేశం కోసం పాటు పడుతున్న కాంగ్రెస్‌ను అంతమొందించాలని కుట్రచేస్తున్నారు'' అని ఖర్గే అన్నారు.

అమల్లోకి వక్ఫ్ చట్టం-2025

నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: దేశంలో వక్ఫ్(సవరణ) చట్టం–2025 అమల్లోకి వచ్చేసింది. ఈ మేరకు కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. వక్ఫ్(సవరణ) చట్టం–2025లోని సెక్షన్ 1కు సంబంధించిన సబ్ సెక్షన్(2) ప్రసాదించిన అధికారాలు ఏప్రిల్ 8వ తేదీ నుంచి అమల్లోకి వచ్చినట్లు స్పష్టంచేసింది. వక్ఫ్(సవరణ) బిల్లు ఈ నెల 3, 4 తేదీల్లో పార్లమెంట్ ఆమోదం పొందిన సంగతి తెలిసిందే. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ నెల 5వ తేదీన సంతకం చేయడంతో ఈ బిల్లు చట్టరూపం దాల్చింది. వక్ఫ్(సవరణ) చట్టాన్ని అధికార బీజేపీ, దాని మిత్రపక్షాలు సమర్థిస్తుండగా, విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టు ఇప్పటికే పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై ఈ నెల 15న అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం మంగళవారం సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు చేసింది. వక్ఫ్(సవరణ) చట్టంపై ఏవైనా ఉత్తర్వులు ఇచ్చేముందు తప్పనిసరిగా తమ వాదన వినాలని కోరింది.



సాక్షి హైదరాబాద్

బుధవారం, 9, ఏప్రిల్, 2025



ఇక స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు సులువు!
స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు సులువు కానున్నాయి. గంటల తరబడి నిరీక్షించే పని లేకుండా కేవలం 10 నుంచి 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కానుంది. -8లో



ఫ్రూట్స్.. బీకేర్ ఫుల్..
మార్కెట్‌లో మామిడితో పాటు అన్ని రకాల పండ్లు నోరూరిస్తున్నాయి. ప్రమాదకర రసాయనాలను ఇంట్లోకి మన ఒంట్లోకి తీసుకొస్తున్నాయి. - సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
37.0/24.0

వాతావరణం
నగరంలో బుధవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 37, కనిష్ఠంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

మియాపూర్‌లో లారీ బీభత్సం

హోంగార్డు మృతి
- మరో ఇద్దరికి గాయాలు


సింహాచలం (ఫైల్)

మియాపూర్: మద్యం మత్తులో వాహనం నడిపి ట్రాఫిక్ హోంగార్డు మృతికి కారణమయ్యాడు ఓ లారీ డ్రైవర్. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి. ఈ ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ క్రాంతి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలో ట్రాఫిక్ కానిస్టేబుళ్లు రాజవర్ధన్, వికేందర్, సింహాచలం (42) విధుల్లో ఉన్నారు. ఇదే సమయంలో ఎర్రగడ్డ నుంచి మియాపూర్ వైపు మద్యం మత్తులో లారీ నడుపుతూ వచ్చిన డ్రైవర్.. యూటర్న్ వద్ద ఉన్న ట్రాఫిక్ గొడుగును ఢీకొట్టాడు. పక్కన విధులు నిర్వర్తిస్తున్న సింహాచలంపై ట్రాఫిక్ గొడుగు పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతనితో పాటు మరో ఇద్దరు కానిస్టేబుళ్లు రాజవర్ధన్, వికేందర్‌లకు కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గచ్చిబౌలిలోని ఓ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరిశీలించి సింహాచలం అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. రాజవర్ధన్, వికేందర్‌లు చికిత్స పొందుతున్నారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం చింతల్‌కట్ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ శ్రీనివాస్‌ను మియాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా 321 యూనిట్లు వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు చెప్పారు. మృతుడు సింహాచలం స్వస్థలం ఏపీలోని శ్రీకాకుళం జిల్లా చిగురువలస గ్రామం. నగరంలోని బాచుపల్లి బొల్లారంలో భార్య కుమారి, ఇద్దరు కూతుళ్లతో కలిసి నివాసముంటున్నాడు. మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో రెండేళ్ల నుంచి హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు.

అచ్చం అలాగే!

2007 మాదిరిగానే 2013 నాటి పేలుళ్లు

మకాం నుంచి విధ్వంసం వరకు సారూప్యత


ఉగ్రవాదులు తలదాచుకున్న అబ్దుల్లాపూర్‌మెట్‌లోని రేకుల ఇల్లు (ఫైల్)



రెండు విధ్వంసాలకూ ఐఎం సంస్థదే బాధ్యత
- దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసు నేపథ్యం..
- ఐదుగురు నిందితులకు ఎన్‌ఐఏ కోర్టు ఉరిశిక్ష
- తీర్పును సమర్థించిన తెలంగాణ హైకోర్టు

సాక్షి, సిటీబ్యూరో:

నిషేధిత ఉగ్రవాద సంస్థ ఇండియన్ ముజాహిదీన్ (ఐఎం) ఐదున్నరేళ్ల వ్యవధిలో నగరంలో రెండు భారీ విధ్వంసాలను సృష్టించింది. 2007 ఆగస్టు 25న గోకుల్‌చాట్, లుంబినీపార్క్‌ల్లో బాంబుల్ని పేల్చి 47 ప్రాణాలు తీసి, మరో 300 మంది వరకు క్షతగాత్రుల్ని చేసింది. ఆ తర్వాత 2013 ఫిబ్రవరి 21న ముష్కరులు మరోసారి 18 మందిని చంపి, 131 మందిని క్షతగాత్రుల్ని చేశారు. ఈ రెండు ఆపరేషన్ల మధ్య అనేక సారూప్యతలు ఇలా ఉన్నాయి. దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసులో ఐదుగురు నిందితులకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) ఫాస్ట్ ట్రాక్ కోర్టు 2016లో ఉరిశిక్ష విధించగా.. దీనిని సమర్థిస్తూ తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం మంగళవారం తీర్పు వెలువరించింది.

అనుమానం రాని చోట మకాం..

సిటీని టార్గెట్‌గా చేసుకుని విధ్వంసం సృష్టించడానికి నిర్దేశిత సమయం ముందు వచ్చిన ఐఎం ఉగ్రవాదులు పోలీసుల దృష్టి పడని, వారికి అనుమానం రాని ప్రాంతాల్లోనే షెల్టర్లు ఏర్పాటు చేసుకున్నారు. 2007 నాటి జంట పేలుళ్ల కోసం నగరానికి వచ్చిన ఉగ్రవాదులు హబ్సిగూడలోని స్ట్రీట్ నెం.8లో ఉన్న బంజారా నిలయం అపార్ట్‌మెంట్‌లోని 302 ఫ్లాట్‌ను ఎంచుకుంటే.. 2013 ఫిబ్రవరి నాటి దిల్‌సుఖ్‌నగర్ ఆపరేషన్ పూర్తి చేయడం కోసం వచ్చిన వారు అబ్దుల్లాపూర్‌మెట్ సాయినగర్‌లో ఉన్న రేకుల ఇంటిలో ఆశ్రయం పొందారు. ఈ రెండు సందర్భాల్లోనూ విద్యార్థులం అంటూనే ఇళ్లు అద్దెకు తీసుకున్నారు. రెండు ఇళ్ల యజమానులూ వాటికి సమీపంలో లేకపోవడం వీరికి కలిసి వచ్చింది.


ముష్కరులు షెల్టర్ పొందిన బంజారా నిలయం (ఫైల్)

రెండుసార్లూ ముగ్గురే..

గోకుల్‌చాట్, లుంబినీ పార్క్ విధ్వంసాల కోసం ముష్కరులు 25 రోజుల ముందు నగరానికి చేరుకోగా.. దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల కోసం మాత్రం కేవలం 16 రోజుల ముందే వచ్చారు. 2007లో తొలుత అనీఖ్ షఫీఖ్ సయీద్ (లుంబినీ పార్క్‌లో బాంబు పెట్టాడు) అనే ఉగ్రవాది వచ్చాడు. షెల్టర్ ఏర్పాటు చేశాక అక్బర్ ఇస్మాయిల్ చౌదరి (ఇతడు పెట్టిన బాంబు పేలలేదు)ని పిలిపించాడు. ఇద్దరూ కలిసి ప్రాథమిక రెక్కీలు పూర్తి చేసిన తర్వాత పేలుడుకు రెండు రోజుల ముందు మాత్రమే ప్రధాన సూత్రధారి, పాత్రధారి అయిన రియాజ్ భత్కల్ (గోకుల్ చాట్‌లో పెట్టింది ఇతడే) చేరుకుని బాంబుల పని పూర్తి చేశాడు. ఆ తర్వాత ఒక రోజు తమ గదిలోనే ఉండి తిరిగి వెళ్లారు. దిల్‌సుఖ్‌నగర్ ఆపరేషన్ కోసం మొదట తెహసీన్ అక్తర్ అలియాస్ మోను (ఏ–1 మిర్చి సెంటర్ వద్ద బాంబు పెట్టిన వ్యక్తి) రాగా.. కొన్ని రోజులకు తబ్రేజ్, వఖాస్ (107 బస్టాప్‌లో పెట్టిన వ్యక్తి) వచ్చారు. ఈ ముగ్గురూ కలిసి రెండు పేలుళ్లు జరిపి వెళ్లారు.

మంగుళూరు నుంచే 'పార్శిల్స్'...

ఈ రెండు జంట పేలుళ్లకు అవసరమైన పేలుడు పదార్థం, డిటొనేటర్లు ఉగ్రవాదులు నగరానికి చేరుకున్న తర్వాతే వారికి అందాయి. 2007లో విధ్వంసం సృష్టించడానికి పదిహేను రోజుల ముందు మంగుళూరు నుంచి రియాజ్ భత్కల్ పేలుడు పదార్థంతో పాటు ఇతర ఉపకరణాలను ఓ బస్సు ద్వారా పంపాడు. వీటిని అనీఖ్, అక్బర్‌లు చాదర్‌ఘాట్‌లో రిసీవ్ చేసుకున్నారు. 2013లో మాత్రం తబ్రేజ్ నేరుగా మంగుళూరు నుంచి తీసుకువచ్చాడు. ఇతడిని మోను ఎల్బీనగర్ చౌరస్తాలో రిసీవ్ చేసుకుని తమ డెన్‌కు వెంటపెట్టుకు వెళ్లాడు. 2007లో చెక్కతో చేసిన షేప్డ్ బాంబుల్ని పేల్చగా.. 2013లో మాత్రం ప్రెషర్ కుక్కర్లతో తయారు చేసిన బాంబుల్ని పేల్చారు. రెండు సందర్భాల్లోనూ పేలుడు పదార్థంగా అమోనియం నైట్రేట్‌నే వినియోగించారు.

కామన్ 'పాయింట్' దిల్‌సుఖ్‌నగర్..

2007లో గోకుల్‌చాట్, లుంబినీ పార్క్ పేలుళ్ల ఆపరేషన్, 2013లో ఏ–1 మిర్చి సెంటర్, 107 బస్టాప్‌ల వద్ద జరిగిన విధ్వంసం.. ఈ రెండు అంశాల్లోనూ దిల్‌సుఖ్‌నగర్ కామన్ పాయింట్‌గా ఉంది. అప్పట్లో గోకుల్‌చాట్‌లో రియాజ్, లుంబినీ పార్క్‌లో అనీఖ్ బాంబులు పెట్టగా... అక్బర్ మరో బాంబును దిల్‌సుఖ్‌నగర్‌లోని వెంకటాద్రి థియేటర్ ఎదురుగా ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్ వద్ద వదిలి వెళ్లాడు. ఆ రెండూ పేలగా... ఇది పేలలేదు. దిల్‌సుఖ్‌నగర్ ఆపరేషన్‌లో మాత్రం ఉగ్రవాదులు నేరుగా దిల్‌సుఖ్‌నగర్‌నే టార్గెట్ చేసి రెండు బాంబుల్ని పేల్చారు. ఈ రెండు ఉదంతాలపై నమోదైన ఐదు కేసుల్లోనూ రియాజ్ భత్కల్ ప్రధాన నిందితుడిగా, మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నాడు. 2007లో నేరుగా వచ్చి హబ్సిగూడలోని గదిలో బాంబుల్ని అసెంబుల్ చేసి గోకుల్‌చాట్‌లో బాంబు పెట్టగా.. 2013లో మాత్రం పాకిస్థాన్ నుంచి నేతృత్వం వహించి చేయించాడు. బాంబుల అసెంబ్లింగ్ బాధ్యతల్ని వఖాస్‌కు అప్పగించాడు.

రెండుసార్లూ మారిన 'టార్గెట్స్'..



ఈ రెండు ఆపరేషన్లలోనూ ఉగ్రవాదులు ఆఖరి నిమిషంలో అనుకోని ప్రాంతాన్ని టార్గెట్‌గా చేసుకుని బాంబు పెట్టాల్సి వచ్చింది. 2007లో ఉగ్రవాదులు టార్గెట్ చేసిన ప్రాంతాల్లో గోకుల్‌చాట్, దిల్‌సుఖ్‌నగర్‌లతో పాటు హుస్సేన్‌సాగర్‌లో తిరిగే షికారు బోటు ఉంది. అయితే.. ఇందులో బాంబు పెట్టేందుకు ట్రిగ్గర్ ఆన్ చేసుకుని ఆటోలో వెళ్లిన అనీఖ్.. ఆటోవాలాకు చెల్లించేందుకు అవసరమైన చిల్లర లేకపోవడంతో బాంబు పేలే సమయం సమీపించి లుంబినీపార్క్ లేజేరియం వద్ద వదిలి వెళ్లాడు. 2013 ఫిబ్రవరి 21న సైతం దిల్‌సుఖ్‌నగర్‌లోని ఏ–1 మిర్చి సెంటర్‌తో పాటు దాని వెనుక ఉన్న ఓ మద్యం దుకాణాన్ని టార్గెట్ చేశారు. అయితే.. అక్కడికి బాంబుతో కూడిన సైకిల్‌ను తీసుకువెళ్తున్న వఖాస్ సమయం మించిపోతుండటంతో 107 బస్టాప్ వద్ద పార్క్ చేసి వెనక్కు వెళ్లిపోయాడు.

ఏసీబీకి చిక్కిన విద్యుత్ ఉద్యోగి

అబిడ్స్: పాత మీటర్‌కు బదులుగా కొత్తది ఇవ్వాలని, మీటర్‌లో ఎలాంటి బకాయిలు లేకుండా చూసేందుకు రూ.20 వేల లంచం డిమాండ్ చేసిన టీజీఎస్‌పీడీసీఎల్ మంగళ్‌హాట్ విద్యుత్ సెక్షన్ ఉద్యోగి (గ్రేడ్- 4 ఆర్టిజన్ అబ్దుల్ రహ్మాన్) ఏసీబీ అధికారులకు చిక్కాడు. సీతారామ్‌పేట్‌లోని మంగళ్‌హాట్ విద్యుత్ కార్యాలయంలో ఫిర్యాదుదారు ఉమర్ రూ.20 వేల లంచం ఇస్తుండగా హైదరాబాద్ జిల్లా ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి అతడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళ్‌హాట్ ప్రాంతంలో నివసించే ఉమర్ ఇంటి కరెంట్ మీటర్‌పై బకాయిలు ఉన్నాయి. బకాయిలు లేకుండా చూడాలని, ఎలాంటి పెనాల్టీ లేకుండా కొత్త మీటర్ ఇవ్వాలని ఉమర్ విద్యుత్ శాఖ ఉద్యోగి అబ్దుల్ రహ్మాన్‌ను సంప్రదించాడు. దీంతో తనకు రూ.20 వేలు ఇస్తేనే పాత బకాయిలు లేకుండా చూస్తానని రహ్మాన్ హామీ ఇచ్చాడు. మంగళవారం డబ్బులు ఇస్తానని చెప్పిన ఉమర్ నేరుగా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వారి సూచనల మేరకు తన కార్యాలయంలో డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రహ్మాన్‌ను పట్టుకుని కేసు నమోదు చేశారు.

లంచం డిమాండ్ చేస్తే 1064కు ఫిర్యాదు చేయండి..

నగరంలో ఏ ప్రభుత్వ శాఖలోనైనా అధికారులు, ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ సూచించారు. అదేవిధంగా వాట్సాప్ నెంబర్ 94404 46106కు కూడా ప్రజలు ఫిర్యాదు చేయొచ్చని ఆయన సూచించారు. ఫిర్యాదు దారుల పేర్లను ఏసీబీ రహస్యంగా ఉంచుతుందని, లంచగొండి అధికారులపై చర్యలు తీసుకుంటామని గంగసాని శ్రీధర్ వెల్లడించారు.


అబ్దుల్ రహ్మాన్‌ను విచారిస్తున్న ఏసీబీ రేంజ్ డీఎస్పీ గంగసాని శ్రీధర్

'హై సిటీ' ప్రాజెక్టుల భూసేకరణపై సమీక్ష



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పరిధిలో కేబీఆర్ పార్కు చుట్టూ, ఇతరత్రా ప్రాంతాల్లో ట్రాఫిక్ చిక్కుల పరిష్కారానికి, ఫ్లై ఓవర్లు తదితర నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.7032 కోట్లకు పరిపాలన అనుమతులు జారీ చేసి ఎంతో కాలమైంది. కానీ.. ఇప్పటి వరకు సదరు పనుల్లో పురోగతి కనిపించడం లేదు. ఇంకా టెండర్ల దశ కూడా పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో టెండర్లు పూర్తి కాగానే ఎంపికయ్యే కాంట్రాక్టర్లకు పనుల నిమిత్తం స్థలాల్ని అప్పగించాల్సి ఉంది. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను త్వరితంగా పూర్తి చేసేందుకు కసరత్తు ప్రారంభమైంది. జీహెచ్ఎంసీలోని భూసేకరణ విభాగం అడిషనల్ కమిషనర్ కె.శివకుమార్ నాయుడు సంబంధిత టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మూడు విభాగాల్లోని సిబ్బంది సమన్వయంతో పని చేసి భూసేకరణలు త్వరితంగా పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో ప్రాజెక్టుల విభాగం సీఈ భాస్కర్‌రెడ్డి, అడిషనల్ సీసీపీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. ఇకనుంచి ప్రతివారం సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో శిల్పా లేఔట్ ఫేజ్–2, నల్లగొండ క్రాస్‌రోడ్ ఫ్లై ఓవర్, ఆరాంఘర్ ఫ్లై ఓవర్ ర్యాంప్, శాస్త్రిపురం ఆర్‌యూబీల పనులపై కూడా సమీక్షించారు. వాటిని కూడా వీలైనంత త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఫ్యూచర్ సిటీ పేరిట నకి'లీలలు'

ఫేక్ వెబ్‌సైట్ సృష్టించిన కేటుగాళ్లు
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలంటూ ప్రచారం
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన ఫ్యూచర్ సిటీని సైతం కేటుగాళ్లు వదిలిపెట్టలేదు. ఫ్యూచర్‌సిటీటీజీ.ఇన్ పేరుతో నకిలీ వెబ్‌సైట్‌ను సృష్టించారు. ఇందులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫొటోతో పాటు ఫోర్త్ సిటీకి సంబంధించిన వివరాలను పొందుపరిచారు. ఫ్యూచర్ సిటీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామని సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ)ని ఏర్పాటు చేసింది. ఎఫ్‌సీడీఏ కోసం కొత్తగా 90 పోస్టులకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో 34 రెగ్యులర్ పోస్టులు కాగా.. 56 పోస్టులను ఔట్‌సోర్సింగ్/కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నారు. ఈ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలనే నియామకాలు చేపడుతున్నట్లు నిరుద్యోగులు, యువతకు వల వేస్తున్నారు. ఈ నకిలీ ప్రకటనలు, ఉద్యోగ భర్తీ ప్రక్రియలపై నిరుద్యోగులు, యువత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తర్వాత గ్రేటర్‌లో ఫోర్త్ సిటీ అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించిన సంగతి తెలిసిందే. 765.28 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఫోర్త్ సిటీని అభివృద్ధి చేయాలన్నది సర్కార్ లక్ష్యం. ఇప్పటికే ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ)ని ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. దీని పరిధిలోకి మహేశ్వరం, ఆమనగల్, కడ్తాల్, కందుకూరు, ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల ఏడు మండలాల్లోని 56 గ్రామాలను ఎఫ్‌సీడీఏ పరిధిలోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఫోర్త్ సిటీలో అంతర్గత రోడ్లు, మురుగు నీటి వ్యవస్థ, నీటి సరఫరా, సౌర విద్యుత్ పార్క్ అభివృద్ధి ఇలా పలు అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లను సైతం ఈ నకిలీ వెబ్‌సైట్‌లో ఆహ్వానించడం గమనార్హం.





ఇద్దరిని మింగిన ఈత సరదా

- శామీర్‌పేట చెరువు కాల్వలో దుర్ఘటన
- మృతులు కూకట్‌పల్లి ప్రాంత వాసులు


కృష్ణ, యశ్వంత్ (ఫైల్)

శామీర్‌పేట్: ఈత సరదా ఇద్దరిని బలిగొంది. శామీర్‌పేట పెద్దచెరువు కాల్వ నీటిలో మునిగి ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కూకట్‌పల్లి ఎల్లమ్మబండ ప్రాంతానికి చెందిన యశ్వంత్ (24), కృష్ణ (32)లతో పాటు మరో 8 మంది స్నేహితులు జెప్టోలో డెలివరీ బాయ్స్‌గా పని చేస్తున్నారు. సోమవారం జీతాలు రావడంతో మంగళవారం శామీర్‌పేట కట్టమైసమ్మ వద్ద పార్టీ చేసుకునేందుకు వచ్చారు. ముందుగా శామీర్‌పేట కట్టమైసమ్మను దర్శించుకొని అనంతరం పెద్దచెరువు కాల్వ సమీపంలో వంట చేసుకొని మద్యం తాగారు. అనంతరం యశ్వంత్, కృష్ణ చెరువు కాల్వ నీటిలోకి దిగారు. వీరికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందారు. సమాచారం అందుకున్న శామీర్‌పేట పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో మృతదేహాలను బయటకు తీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో సమగ్ర సర్వే

వరద నివారణ కోసం
- చెరువులు, నాలాలకు సంబంధించి..

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో వరద నివారణ చర్యల కోసం కిర్లోస్కర్, వాయెంట్స్ సొల్యూషన్స్, జేఎన్‌టీయూ, ఓయూల నిపుణులు వివిధ సర్వేలు చేసినా, వాటిని పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడంతో నగరంలో వానొస్తే.. సమస్యలు షరా మామూలుగానే కనిపి స్తున్నాయి. తాము చేపట్టిన చర్యలతో గతంలో కంటే తీవ్రత తగ్గిందని అధికారులు చెబుతున్నా.. ప్రజలు మాత్రం పెదవి విరుస్తున్నారు. రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్‌తోనూ ఆయా ప్రాంతాల్లో సమస్యలు తగ్గాయని అధికారులు అంటుండగా.. తగ్గలేదని ప్రజలు చెబుతున్నారు. శాటిలైట్ ఇమేజెస్‌తో నాలాల సర్వే జరపాలని కూడా భావించారు. తాజాగా గ్రేటర్ నగరంలోని నాలాలతోపాటు చెరువులకు సంబంధించి కూడా సమగ్ర సర్వే నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు.

వివిధ అంశాల వారీగా..

'ఇంటిగ్రేటెడ్ స్టార్మ్ వాటర్ మేనేజ్‌మెంట్' పేరిట నిర్వహించనున్న ఈ సర్వేలో వెల్లడయ్యే అంశాలతో శాశ్వత నివారణ చర్యలు చేపట్టనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. సర్వేలో భాగంగా నగర శివార్ల వరకు ఉన్న నాలాలు, దాదాపు 185 చెరువుల ప్రాంతాల్లోని పరిస్థితుల్ని పరిశీలిస్తారు. నగరంలో ఎంత మోస్తరు వర్షం వస్తే నాలాల్లో, చెరువుల్లో చేరే వరద నీరెంత.. ఎక్కడి నుంచి వాననీరు నాలాల నుంచి ఎక్కడి వరకు ప్రవహిస్తోంది.. నాలాల డిశ్చార్జి సామర్థ్యమెంత.. వరదల వల్ల సదరు నాలా, చెరువుల ప్రదేశాల్లో తరచూ ముంపు బారిన పడే ప్రాంతాలేవీ? ఇలా వివిధ అంశాల వారీగా క్షేత్రస్థాయిలో సర్వే చేయనున్నారు. సర్వే నివేదికకు అనుగుణంగా అవసరమైన పరిష్కార చర్యలు చేపడతారు. ఈ మేరకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించినట్లు పేర్కొన్నారు. అనుమతి వచ్చాక సర్వే చేయనున్నారు. సర్వేలో భాగంగా సమస్యల పరిష్కారానికి ఇప్పటికే చేసిన పనులెన్ని.. వాటివల్ల ఏ మేరకు సమస్య పరిష్కారమైంది.. ఇంకా చేయాల్సిందెంత..? వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది.





హైడ్రా, ట్రాఫిక్ విభాగాల సమన్వయంతో..

- మరోవైపు ప్రస్తుతం కురుస్తున్న, రాబోయే వర్షాకాలంలో వరద నీరు రోడ్లపై నిల్వకుండా చేసేందుకు హైడ్రా, ట్రాఫిక్ విభాగాల సమన్వయంతో పని చేసేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. నగరంలో రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలను ప్రధానంగా 141 ఉన్నట్లు గుర్తించారు. ఈ 141 ప్రాంతాల వద్ద వర్షాల సందర్భంగా ఎదురయ్యే నీటినిల్వ, ట్రాఫిక్ సమస్యల్ని సత్వరం పరిష్కరించేందుకు మూడు విభాగాలతో కమిటీలు ఏర్పాటు చేస్తారు.
- కమిటీలో జీహెచ్ఎంసీతోపాటు హైడ్రా, ట్రాఫిక్ విభాగాల నుంచి సిబ్బంది ఉంటారు. ప్రతి ప్రాంతం వద్ద జీహెచ్ఎంసీకి సంబంధించిన సిబ్బంది ఉంటారు. వారి నుంచి అందే సమాచారంతో మిగతా విభాగాల సిబ్బంది సమన్వయంతో పని చేసి నీటి నిల్వ, ట్రాఫిక్ ఇబ్బందులు వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకుంటారని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. ఇటీవల జీహెచ్ఎంసీ, హైడ్రా కమిషనర్లు సమావేశమైన సందర్భంగా తీసుకున్న నిర్ణయానికనుగుణంగా ఈ చర్యలు చేపట్టనున్నట్లు తెలిసింది. వర్షాకాలంలో చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నారు.

అతివేగానికి రెండు ప్రాణాలు బలి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం
- మరో ఏడుగురు వ్యక్తులకు గాయాలు
- డీసీఎం వ్యాన్‌ను ఢీకొన్న సఫారీ కారు
- ప్రమాద తీవ్రతకు నుజ్జునుజ్జయిన రెండు వాహనాలు


శ్రవణ్, రాజు (ఫైల్)


నుజ్జునుజ్జయిన సఫారీ కారు, డీసీఎం వ్యాన్



శామీర్‌పేట్: మితిమీరిన వేగం ఇద్దరు యువకులను బలిగొంది. స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు వెళ్లి కారులో వస్తున్న ఒకరు.. డీసీఎం వాహనంలో ప్రయాణిస్తున్న మరో యువకుడు ఈ ప్రమాదంలో అసువులు బాశారు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున నగర శివారులోని శామీర్‌పేట మండలం జినోమ్‌వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం మురహరిపల్లికి చెందిన శ్రవణ్ (23), గణేష్, వంశీ, ప్రశాంత్‌రెడ్డి, విజయ్, ప్రవీణ్‌లు తూంకుంట మున్సిపాలిటీ బొమ్మరాశిపేటకు చెందిన స్నేహితుడు విజయ్ యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం రాత్రి సఫారీ కారులో వెళ్లారు. బర్త్ డే పార్టీ అనంతరం మంగళవారం తెల్లవారుజామున 2:30 గంటలకు కరీంనగర్ – హైదరాబాద్ రాజీవ్ రహదారిపై తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో లాల్‌గడి మలక్‌పేట గ్రామపరిధిలోని ఫారెస్ట్ గెస్ట్ హౌజ్ వద్దకు రాగానే అతివేగంతో కారు డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డు దాటి.. అదే సమయంలో ఎదురుగా వస్తున్న డీసీఎం వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం వాహనం డ్రైవర్ పక్కన కూర్చున్న సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మజీద్‌పల్లి గ్రామానికి చెందిన రాజు (18) మృతి చెందాడు. డీసీఎం డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. సఫారీ కారులో ప్రయాణిస్తున్న మురహరిపల్లికి చెందిన శ్రవణ్ దుర్మరణం పాలయ్యాడు. కారులోని ఐదుగురికి గాయాలయ్యాయి. జినోమ్ వ్యాలీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

రాత్రి వేళ పనికి.. పగటి పూట చదువుకు..

డీసీఎం వాహనంలో వస్తూ ప్రమాదానికి గురై మృతి చెందిన రాజు ఆర్థిక పరిస్థితి దయనీయం. ఇతను ఇంటర్ మొదటి రెండవ సంవత్సరం చదువుతున్నాడు. పేద కుటుంబం కావడంతో చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యేవి. దీంతో రాత్రి వేళల్లో పశుగ్రాసం (గడ్డి) కోత పనికి వెళ్తూ.. పగటిపూట చదువుకుంటూ కుటుంబానికి ఆసరాగా నిలిచేవాడు. మంగళవారం అర్ధరాత్రి కూడా పశుగ్రాసం నగరంలో ఖాళీ చేసి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

వీర హనుమాన్ విజయ యాత్రపై పోలీసుల దృష్టి

సాక్షి, సిటీబ్యూరో: వీర హనుమాన్ విజయ యాత్ర పేరుతో శనివారం భారీ ఊరేగింపులు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన బందోబస్తు, భద్రత చర్యలపై సిటీ కొత్వాల్ సీవీ ఆనంద్ దృష్టి పెట్టారు. ఈ మేరకు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేయడానికి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చిన్న ఊరేగింపులా వచ్చి ప్రధాన ఊరేగింపుతో అనుసంధానమయ్యే కూడళ్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. మతపరమైన ప్రదేశాల వద్ద, సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించాలని ఆదేశించారు. ఈ విజయ యాత్ర గౌలిగూడ నుంచి ప్రారంభమై తాడ్ బండ్ వరకు జరుగనుంది. ఈ మార్గాన్ని ఇన్‌స్పెక్టర్లు పరిశీలించాలని, ఏవైనా అవాంతరాలు ఉన్నట్లు దృష్టికి వస్తే వెంటనే సంబంధిత శాఖలకు సమాచారం ఇవ్వాలని ఆనంద్ స్పష్టం చేశారు. ఈ ఊరేగింపుల్లో ఎక్కడా డీజేలు వినియోగించకుండా నిర్వాహకులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని విజయ యాత్ర ముగిసిన తర్వాత తిరిగి వెళ్లే వాళ్లు సంయమనం పాటించాలని ఆనంద్ పేర్కొన్నారు. రెచ్చగొట్టే అంశాలతో కూడిన బ్యానర్‌లను ప్రదర్శించడం నిషేధమని స్పష్టం చేశారు. ఈ యాత్రలో పరిమిత సంఖ్యలో వాహనాలను ఉపయోగించాలని, ఇతర వర్గాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీసు శాఖ ముందస్తు అనుమతి లేనిదే డ్రోన్ కెమెరాలు వాడద్దని ఆనంద్ స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మ వద్దని, రెచ్చగొట్టే పోస్ట్‌లను ప్రచారం చేయవద్దని నగరవాసులకు సూచించారు.

స్నేహితుల దాడిలో యువకుడి మృతి


ప్రణీత్ (ఫైల్)

జవహర్‌నగర్: గంజాయి అమ్ముతున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నాడని ఓ యువకుడిని అతని స్నేహితులు దారుణంగా కొట్టడంతో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాప్రాల్ భగత్‌సింగ్ కాలనీలో నివసించే పుల్లూరి వెంకటనర్సయ్య రెండవ కుమారుడు ప్రణీత్ (21) డ్రైవింగ్ పనిచేస్తుంటాడు. అదే కాలనీకి చెందిన అతని స్నేహితుడు గోవర్ధన్ గంజాయి అమ్ముతున్నాడని ఇటీవల కాలనీలో కొందరికి చెప్పాడు. దీంతో కోపగించిన గోవర్ధన్ ఈ నెల 5వ తేదీన రాత్రి తన స్నేహితులు జశ్వంత్, విన్సెంట్‌లతో కలిసి ప్రణీత్‌తో మాట్లాడాలని పిలిపించి స్థానికంగా ఉండే మైదానానికి తీసుకెళ్లారు. అక్కడ ప్రణీత్‌ను కర్రలు, చేతులతో దారుణంగా కొట్టడంతో మెడపై తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో వారు అక్కడి నుండి పరారయ్యారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ప్రణీత్‌ను స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమించడంతో అనంతరం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రణీత్ మంగళవారం ఉదయం మృతిచెందాడని వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఇక స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు సులువు!

- 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి
- సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్ విధానం
- గ్రేటర్‌లోని 8 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో రేపటి నుంచి అమలు

సాక్షి, సిటీబ్యూరో: స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు మరింత సులువు కానున్నాయి. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో దస్తావేజుల నమోదు కోసం గంటల తరబడి నిరీక్షించే పనిలేకుండా కేవలం 10 నుంచి 15 నిమిషాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కానుంది. రిజిస్ట్రేషన్‌ల శాఖ సరికొత్త సంస్కరణలో భాగంగా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్ విధానం అమలుకు సిద్ధమైంది. మొదటి దశలో ప్రయోగాత్మకంగా మహా హైదరాబాద్ పరిధిలోని ఎనిమిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నెల 10వ తేదీ(గురువారం) నుంచి స్లాట్ బుకింగ్ విధానం అమలు కానుంది. గ్రేటర్ పరిధిలోని ఆజంపుర, చిక్కడపల్లి, మేడ్చల్ ఆర్వో, కుత్బుల్లాపూర్, వల్లభ్ నగర్, శంషాబాద్, సరూర్ నగర్, చంపాపేట్ సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్ విధానం అమలుకు రిజిస్ట్రేషన్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

రోజుకు కనీసం 48 స్లాట్లు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒకేరోజు ఒకే సమయంలో ఎక్కువ దస్తావేజులు రిజిస్ట్రేషన్ కోసం సమర్పించడం వలన జరిగే జాప్యాన్ని నివారించడానికి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయానికి కనీసం రోజు వారి పని వేళలను కనీ సం 48 స్లాట్లుగా కేటాయిస్తారు. దస్తావేజుదారులు నేరుగా 'https://registration.telangana.gov.in' వెబ్-సైట్ ద్వారా తమకు అనుకూలమైన తేదీ, సమయానికి స్లాట్ బుక్ చేసుకోవచ్చు. ఆ రోజు నిర్దేశించిన సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవచ్చు. స్లాట్ బుక్ చేసుకోని వారి కోసం ఏదైనా అత్యవసర సందర్భాలలో ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు, ఐదు వాక్ ఇన్ రిజిస్ట్రేషన్లను అనుమతిస్తారు. నేరుగా కార్యాలయానికి వచ్చిన వారికి ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో దస్తావేజులు స్వీకరిస్తారు.

144 స్లాట్ల వరకు..

గ్రేటర్ పరిధిలో స్థిరాస్తి దస్తావేజుల తాకిడి అధికంగా గల సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో అత్యధికంగా స్లాట్స్ అందుబాటులో ఉంటాయి. 48 స్లాట్స్ కన్నా ఎక్కువ స్లాట్స్ అవసరం ఉన్న కార్యాలయాలలో ఇప్పుడున్న సబ్ రిజిస్ట్రార్లకు తోడుగా అదనపు సబ్ రిజిస్ట్రార్లను నియమిస్తారు. ప్రయోగాత్మకంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ ఆఫీసుల్లో అదనంగా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు, సిబ్బందిని నియమించారు. ఈ కార్యాలయంలో 144 స్లాట్స్ అందుబాటులో ఉంటాయి. మరోవైపు స్లాట్ బుకింగ్ విధానాన్ని దష్టిలో పెట్టుకొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను రీ ఆర్గనైజేషన్ చేశారు. అధిక రద్దీ, తక్కువ రద్దీ ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని అనుసంధానం చేసి పనిభారాన్ని సమానం చేయడానికి చర్యలు చేపట్టారు. రంగారెడ్డి జిల్లాలోని చంపాపేట-సరూర్‌నగర్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల అధికార పరిధిని విలీనం చేశారు.

సొంతంగానే..

స్థిరాస్తి దస్తావేజులు నమోదు చేసుకునే వారు డ్యాకుమెంట్ రైటర్లపై ఆధారపడకుండా స్వయంగా దస్తావేజులను తయారు చేసుకోవడానికి వెబ్‌సైట్‌లో ఒక మాడ్యూల్‌ని ప్రవేశపెట్టారు. మొదటగా సేల్ డీడ్ దస్తావేజుల కోసం వెసులుబాటు ఉంది. రిజిస్ట్రేషన్ సమయంలో దస్తావేజుపైన అమ్మినవాళ్లు, కొన్నవాళ్లు, సాక్షులు సబ్ రిజిస్ట్రార్ సంతకాలు చేయడానికి చాలా సమయం పట్టడం వలన దస్తావేజు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చాలా ఆలస్యమవుతుంది. దీనిని నివారించడానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయడంలో భాగంగా ఆధార్ ఇ-సిగ్నేచర్ సిస్టంను ప్రవేశపెట్టనున్నారు. ఇది ఈనెల చివరిలోగా అందుబాటులోకి రానుంది.

జిమ్ నిర్వాహకుడిపై డంబెల్‌తో దాడి

చికిత్స పొందుతూ మృతి, నిందితుడి అరెస్టు

మేడిపల్లి : జిమ్ నిర్వాహకుడిపై డంబెల్‌తో దాడిచేసిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ కళానగర్ కానీలో నివాసం ఉంటున్న ఏర్పుల సాయికిషోర్ (34)స్థానికంగా ఉన్న వీరారెడ్డి కాలనీలో 'జస్ట్ ఫిట్ ' పేరుతో జిమ్ నిర్వహిస్తున్నాడు. అదే కాలనీలో చంటి అనే వ్యక్తి స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. వీరిద్దరి మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. పాత కక్ష్యతో సోమవారం రాత్రి 8.00 గంటల సమయంలో చంటి మరో ఇద్దరితో కలిసి జిమ్ వద్దకు వెళ్లి డంబెల్‌తో కిషోర్ తలపై విచక్షణాహితంగా దాడి చేసి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ.. మంగళవారం కిషోర్ మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు చంటిని అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు సమాచారం. కేసు దర్యాప్తులో ఉంది.

మహిళపై అర్ధరాత్రి కత్తులతో దాడి

నాగోలు: అర్ధరాత్రి మహిళపై గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నం చేసిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం.. బడంగ్‌పేట్‌కు చెందిన వరోధ్య లక్ష్మి సోమవారం రాత్రి 11.45 గంటలకు ఎల్‌బీనగర్ చౌరస్తాలోని సరూర్‌నగర్ వెళ్లే రహదారిలో వేచిఉండగా..గుర్తు తెలియని వ్యక్తులు బైకుపై వచ్చి అకస్మాత్తుగా కత్తులతో ఆమెపై దాడి చేశారు. అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. రక్తపు మడుగులో పడి ఉన్న లక్ష్మిని ఆటో డ్రైవర్ రవి గమనించి దిల్‌సుఖ్‌నగర్‌లోని కృతిక హాస్పిటల్‌లో పనిచేస్తున్న ఆమె అల్లుడు పానుగోతు బాబుకు సమాచారం ఇచ్చాడు. వెంటనే చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలించి వివరాలు సేకరించారు. దాడికి పాల్పడిన వారికోసం గాలిస్తున్నట్లు తెలిపారు. కాగా లక్ష్మి 2023లో ఆగస్టు 15న పోలీస్ స్టేషన్‌లో దాడికి గురైంది. విచారణ పేరుతో పోలీసులు లక్ష్మిని స్టేషన్‌కు పిలిపించి థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, బంగారం నగదు దోచుకున్నారని ఆమె కూతురు ఫిర్యాదు చేయడంతో సబంధిత పోలీసు అధికారులపై చర్యలు తీసుకున్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలి

ప్రజా ధర్నాలో పలువురు వక్తల డిమాండ్



కవాడిగూడ: ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కొనసాగుతున్న ఆదివాసీల హత్యా కాండను వెంటనే నిలిపివేసి గిరిజనుల జీవించే హక్కును పరిరక్షించాలని, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం వెంటనే శాంతి చర్చలను ప్రారంభించాలని పలువురు వక్తలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో సీపీఐఎం ఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఛత్తీస్‌గడ్‌లో ఆదివాసీ జాతి హననాన్ని నిలిపివేయాలని కోరుతూ ప్రజాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండ రాం, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి , సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు జె.చలపతిరావు, గోవర్ధన్, సాధినేని వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర నాయకులు పద్మ , ప్రొఫెసర్ కాశీం, విమలక్క తదితరులు పాల్గొని ప్రసగించారు. బస్తర్ ప్రాంతంలో కొనసాగుతున్న నరమేధం ఆదివాసీల అంతానికే తప్ప వారి సంక్షేమానికి ఏమాత్రం కాదని వారు పేర్కొన్నారు. సమాజ మనుగడలో ఆదివాసీల పాత్ర ఎంతో ముఖ్యమనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించాలని వారు కోరారు. మావోయిస్టులు అభివృద్ధికి నిరోధకంగా వ్యవహరిస్తున్నారని కేంద్ర మంత్రులు మాట్లాడటం సరి కాదని అన్నారు. మావోయిస్టులు ప్రాతిపాదించిన శాంతి చర్చలకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకొని చర్చలు ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరిట వందలాది మంది ఆదివాసీలను, మావోయిస్టులను ఇష్టారాజ్యాంగా కాల్చి చంపుతున్నారని, ఈ పరిణామం దేశానికి, ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని అన్నారు. కేంద్ర ప్రభుత్వంపై పోరుకు ప్రాంతీయ పార్టీలన్నీ కలిసి రావాలని పిలుపునిచ్చారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ జోనల్ మేనేజర్‌గా సునీల్‌కుమార్ ఛుగ్



సాక్షి, సిటీబ్యూరో: పంజాబ్ నేషనల్ బ్యాంకు హైదరాబాద్ జోనల్ మేనేజర్‌గా సునీల్‌కుమార్ ఛుగ్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ నుంచి పదోన్నతిపై జోనల్ మేనేజర్‌గా నియమితులయ్యారు. సీఏ పూర్తి చేసిన సునీల్‌కుమార్ ఛుగ్ గత 30 ఏళ్లుగా బ్యాంకింగ్ రంగంలో అనుభవం కలిగి ఉన్నారు. అనేక బ్యాంకులకు చెందిన కార్పొరేట్ బ్రాంచ్‌లలో పనిచేసిన అనుభవం ఉంది. ఆయన నేతృత్వంలో పీఎన్‌బీ హైదరాబాద్ జోన్‌కు ఆయన నియమితులు కావడం వల్ల బ్యాంకు కార్యకలాపాలు మరింత విస్తృతమవుతాయని పీఎన్‌బీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆకాంక్షించారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌పై మరో కేసు నమోదు

అబిడ్స్: శ్రీరామనవమి శోభాయాత్ర సందర్భంగా దూల్‌పేట జాలి హనుమాన్ వద్ద పోలీసుల విధులకు ఆటంకం కల్పించడం, పోలీసులను బెదిరించడం, హెచ్చరించడం వంటి చర్యలకు పాల్పడ్డారన్న అభియోగంపై ఎమ్మెల్యే రాజాసింగ్‌పై మరో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ మహేష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం శోభాయాత్ర రోజు రాజాసింగ్ పోలీసులను బెదిరించడంతో వారు ఇచ్చిన ఫిర్యాదుపై మంగళవారం బీఎన్‌ఎస్ సెక్షన్ 221, 352, 351(2) కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శోభాయాత్రలో పోలీస్ నిబంధనల ప్రకారం నడుచుకోలేదని సోమవారం మంగళ్‌హాట్ పోలీసులు ఇప్పటికే ఓ కేసు నమోదు చేయగా, మంగళవారం మరో కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తిపై కేసు


ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-2లోని సర్వే నెంబర్ 403/పీ షేక్‌పేట విలేజ్ డీపంక్ జూబ్లీహిల్స్ హైదరాబాద్ మున్సిపాలిటీ ప్లాట్ నెంబర్ 85, 86లలో ఉన్న 286 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తిపై షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివీ..బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-2లో ఖరీదైన 286 గజాల ప్రభుత్వ స్థలాన్ని గుంటి శ్రీధర్‌రావు అనే వ్యక్తి ఆక్రమించి మెటీరియల్ డంప్ చేయడమే కాకుండా ఇనుపరాడ్లు, జేసీబీలను ఇందులో దింపాడు. సమాచారం అందుకున్న షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి, సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాం, మండల సిబ్బంది కబ్జా స్థలాన్ని చేరుకుని నిర్మాణాలను నిలిపివేశాడు. సామగ్రితో పాటు జేసీబీని సీజ్ చేశారు. ఈ మేరకు పోలీసులకు కబ్జా చేసిన గుంటి శ్రీధర్‌రావుతో పాటు కాంట్రాక్టర్ నర్సింగరావుపై ఫిర్యాదు చేయగా పోలీసులు వీరిపై బీఎన్ఎస్ 329 (3), 324 (3), 3 (5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తన ప్లాట్‌ను ఆనుకుని శ్రీధర్‌రావు ప్రభుత్వ స్థలంలోకి చొచ్చుకువచ్చి బండరాళ్లను పగులగొట్టడమే కాకుండా ఇందులో నిబంధనలకు విరుద్ధంగా షెడ్లు నిర్మించేందుకు ప్రయత్నించారన్నారు. సుమారు రూ.9 కోట్ల విలువైన ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. సిబ్బందితో కలిసి అక్రమ నిర్మాణాలను కూల్చివేయించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఆపరేషన్ ధూల్‌పేట' సక్సెస్

- గంజాయి నియంత్రణకు పకడ్బందీ చర్యలు
- 250 రోజుల్లో 102 కేసులు
- 401 కిలోల గంజాయి స్వాధీనం
- 425 మందిపైన కేసులు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: గంజాయి, డ్రగ్స్ నియంత్రణలో భాగంగా ఎక్సైజ్ అధికారులు చేపట్టిన 'ఆపరేషన్ ధూల్‌పేట్' కొనసాగుతోంది. ఇప్పటి వరకు గడిచిన 250 రోజుల్లో 102 కేసుల్లో 425 మందిని నిందితులుగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వారిలో 327 మందిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. 13 మందిని బైండోవర్ చేశారు. మరో 85 మంది నిందితులు పరారీలో ఉన్నారు. మొత్తం 401 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అలాగే 147 సెల్‌ఫోన్‌లు, 58 బైక్‌లు, 2 కార్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా, ఏపీ, తదితర రాష్ట్రాల నుంచి నగరానికి గంజాయి సరఫరా చేసే ముఠాలపైన నిఘాను కఠినతరం చేశారు. అలాగే పీడీ యాక్టులతో పాటు, పలు సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశారు. ఎక్సైజ్ అధికారులకు చిక్కకుండా తప్పించుకొంటున్న లేడీ డాన్‌ల ఆటకట్టించినట్లు చెప్పారు. గత సంవత్సరం జూలై 17వ తేదీన ఎక్సైజ్‌శాఖ ఆపరేషన్ ధూల్‌పేట్‌ను ప్రారంభించింది. ఇప్పటి వరకు సాధించిన ఫలితాలను దృష్టిలో ఉంచుకొని నగరమంతటా ఇదే తరహాలో దాడులు, తనిఖీలను ఉధృతం చేసేందుకు ఎక్సైజ్‌శాఖ ప్రణాళికలను రూపొందించింది. ప్రస్తుతం ధూల్‌పేట్‌లో 90 శాతం గంజాయి అమ్మకాలు తగ్గాయని, పూర్తిగా నిర్మూలించే వరకు దాడులను కొనసాగిస్తామని ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి తెలిపారు.

సైబర్ నేరగాళ్ల 'డబుల్ టోకరా'!

- వెటర్నరీ డాక్టర్‌ను టార్గెట్ చేసిన కేటుగాళ్లు
- ఆర్మీ జాగిలాలకు వ్యాక్సినేషన్ పేరుతో ఎర
- పే టెస్టింగ్, రిఫండ్ పేర్లతో నగదు స్వాహా
- సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో బాధితుడి ఫిర్యాదు



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ పశువైద్యుడిని టార్గెట్ చేసిన సైబర్ నేరగాళ్లు ఆర్మీ జాగిలాలకు వ్యాక్సినేషన్ పేరుతో ఎర వేశారు. పే టెస్టింగ్ అని, ఆ మొత్తం రిఫండ్ అంటూ రెండుసార్లు టోకరా వేశారు. మొత్తమ్మీద రూ.1.79 లక్షలు కోల్పోయిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. సదరు పశువైద్యుడికి (27) రెండు రోజుల క్రితం ఓ ఫోన్ కాల్ వచ్చింది. ఆర్మీ అధికారులుగా చెప్పుకున్న వ్యక్తులు బాధితుడితో మాట్లాడారు. తమ యూనిట్‌లో ఉన్న 90 జాగిలాలకు వ్యాక్సినేషన్ చేయాలని చెప్పారు. ఈ పశువైద్యుడు గతంలో కొన్ని ఆర్మీ జాగిలాలకు వ్యాక్సిన్లు వేసి ఉండటంతో ఈ పని చేయడానికి అంగీకరించారు. ఇతడిని పూర్తిగా నమ్మించడానికి సైబర్ నేరగాళ్లు ఆర్మీ అధికారుల మాదిరి తయారు చేసిన నకిలీ గుర్తింపుకార్డుల్నీ పంపారు. చెల్లింపుల విషయం ఖరారు చేయడానికి తమ ఉన్నతాధికారులు సంప్రదిస్తారంటూ సైబర్ నేరగాళ్లు చెప్పారు. ఆపై కాల్ చేసిన మరికొందరు ఆర్మీ ఉన్నతాధికారులుగా పరిచయం చేసుకున్నారు. ఇది ఆర్మీకి సంబంధించిన వ్యవహారం కావడంతో వీడియో కాల్‌లో మాట్లాడుకుందామని చెప్పారు. ఆర్మీ అధికారుల యూనిఫాంలోనే ఉండి మాట్లాడిన సైబర్ నేరగాడు మొత్తం బిల్లులో సగం వ్యాక్సినేషన్ ప్రారంభించడానికి ముందు, మిగిలిన మొత్తం తర్వాత ఇస్తామని చెప్పాడు. పే చేసిన మొత్తం మీకు చేరుతుందో లేదో పరీక్షించాలంటూ వైద్యుడి ఫోన్‌లో ఫేన్ పే తెరిపించారు. అందులోని క్రెడిట్ కార్డు బిల్లు పేమెంట్ సెక్షన్‌లోకి వెళ్లమని చెప్పారు. తమ క్రెడిట్‌కార్డుకు సంబంధించిన వివరాలు, ఫోన్ నెంబర్ చెప్పిన సైబర్ నేరగాళ్లు ఆ మొత్తం చెల్లించమని చెప్పారు. తనకు నగదు కావాల్సి ఉండగా తాను చెల్లించడం ఏమిటంటూ బాధితుడు ప్రశ్నించాడు. తమ క్రెడిట్ కార్డుకు టూ స్టెప్ వెరిఫికేషన్ విధానం అమలో ఉందని, మీరు పే బటన్ నొక్కినా చెల్లింపు పూర్తి కాదని నమ్మించారు. ఇది నమ్మిన వైద్యుడు అలా చేయడంతో కొంత మొత్తం నష్టపోయారు. దీనిపై సైబర్ నేరగాళ్లను ప్రశ్నించగా..ఆ మొత్తం రిఫండ్ వస్తుందంటూ మరోసారి అలానే చేయించారు. రెండోసారి చేయడానికి బాధితుడు సంశయించగా.. అలా చేయకపోతే రిఫండ్ రాదని భయపెట్టారు. దీంతో రెండోసారీ సైబర్ నేరగాళ్ల క్రెడిట్‌కార్డు బిల్లు చెల్లించిన వైద్యుడు రూ.1,79,998 నష్టపోయారు. ఐదు నిమిషాల్లో మొత్తం రిఫండ్ వస్తుందని చెప్పిన నేరగాళ్లు ఆపై స్పందించకపోవడంతో తాను మోసపోయినట్లు బాధితుడు గుర్తించాడు. ఈ మేరకు మంగళవారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. నిందితుల ఫోన్ నెంబర్లతో పాటు క్రెడిట్‌కార్డు వివరాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి భవానీమాత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని కమాన్ మిథిలానగర్ రోడ్డులో కొలువుదీరిన శ్రీభవానీ శంకర గణపతి భక్త ఆంజనేయస్వామి సహిత నవగ్రహ ఆలయంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు మూడు రోజుల పాటు శ్రీ భవానీ (పార్వతి) అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 11న శివపార్వతి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. రోజూ అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: ప్లేగ్రౌండ్, డి.కె.రోడ్డు, శాంతిబాగ్ 11కేవీ ఫీడర్లు, బేగంపేట సబ్‌స్టేషన్ పరిధిల్లో విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారనంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శేషమహల్, ప్లేగ్రౌండ్, దివ్యశక్తి లైన్, డి.కె.రోడ్డు, రోశయ్యలైన్, శివబాగ్, శాంతిబాగ్, కేకే జోన్ హోటల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని వివరించారు.

అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



దీక్షలో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేపట్టిన పూలే విగ్రహ సాధన దీక్షకు జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌తో పాటు కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. అసెంబ్లీలో మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఆయన స్ఫూర్తిని రగిల్చిన వారవుతారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వెంటనే ఆ మహనీయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

హిమాయత్‌నగర్: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీష్ పేర్కొన్నారు. పెండింగ్ బకాయిలు, డీఏల వల్ల ఉద్యోగుల్లో అసహనం పెరిగి పోయిందన్నారు. మంగళవారం హైదర్‌గూడలోని మున్సిపల్ చైర్మన్ చాంబర్ కార్యాలయంలో జరిగిన తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్ సెంట్రల్ ఫోరమ్ రాష్ట్ర స్థాయి సమావేశంలో మారం జగదీష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ... ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకమాట, అధికార పక్షంలో ఉన్నప్పుడు ఒక మాట మాట్లాడుతూ ఉద్యోగులను స్వార్థ రాజకీయాలు కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత వల్లే ఓటర్లలో 2 శాతం ఉన్న ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించారన్నారు. మున్సిపల్ ఉద్యోగుల ప్రమోషన్లలో అన్యాయం జరుగుతోందన్నారు. సీనియర్ అసిస్టెంట్ నుంచి సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ ఇవ్వకుండా మేనేజర్ గ్రేడ్ అంటూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగుల జేఏసీ పక్షాన మున్సిపల్ ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో హైదరాబాద్ సిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్ సెంట్రల్ ఫోరమ్ అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి వెంకట్ గోపాల్, కోశాధికారి శ్రీధర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



రహమత్‌నగర్: ఎన్ఆర్ఐ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బోరబండలో నిర్వహించిన ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. డల్లాస్‌లో నివాసముండే ఫౌండేషన్ నిర్వాహకులు అవ్యయ్ కొడాలి, దన్వీ కొడాలి చికిత్స శిబిరంలో పాల్గొని వైద్య సేవలను పరిశీలించారు. అధునాతన వైద్య పరికారాలతో అందిస్తున్న సేవల పట్ల రోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొడాలి అవ్యయ్, ధన్వి మాట్లాడుతూ... పేద ప్రజలకు కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో ఫిజియోథెరపి వైద్యం అందించాలనే లక్ష్యంతో తాము ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. మెడ్విన్, ఆధ్యాన్ సాఫ్ట్, విజన్‌టెక్, నెక్స్ సంస్థల సహకారంతో ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు.

మహిళా సమాఖ్యలకే... విద్యార్థుల యూనిఫాంలు

మరోసారి మహిళా సమాఖ్యలకు అవకాశం

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫాంలు కుట్టే చాన్స్	బడులు తెరిచేనాటికి పూర్తయ్యేలా ప్రణాళికలు	ఒక్కో యూనిఫాంకు రూ. 75 చెల్లించనున్న ప్రభుత్వం	సర్కిల్–18లో లబ్ధి పొందనున్న 34 సమాఖ్యలు


గతి ప్రభుత్వ పాఠశాలలో మహిళా సమాఖ్యల ప్రతినిధులకు అవగాహన కల్పిస్తున్న డీపీవో ఆశా విరానిక

బంజారాహిల్స్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల యూనిఫాంలు కుట్టే అవకాశం మరోసారి మహిళా సమాఖ్యల సభ్యులకు దక్కింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల యూనిఫాంల కాంట్రాక్ట్‌ను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వడం కన్నా మహిళా సమాఖ్యల ప్రతినిధులకు ఇస్తే వారికి స్వయం ఉపాధితో పాటు ఆర్థికంగా ఎంతో కొంత అవకాశం కల్పించినట్లు అవుతుందని ప్రభుత్వం భావించి మరోసారి అవకాశం ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలోని మహిళా సమాఖ్యల ప్రతినిధులతో డీపీవో ఆశా విరానికా బంజారాహిల్స్‌లోని గతి స్కూల్‌లో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల దుస్తులను ఎలా కుట్టాలి, ఎటువంటి సైజుల్లో కుట్టాలి వంటి పలు మార్గదర్శకాలను వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశం వల్ల జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలోని 34 మహిళా సమాఖ్యల మహిళలు లబ్ధిపొందనున్నారు. 767 గ్రూపులుండగా ఈ గ్రూపుల్లో 7670 మంది సభ్యులు ఉన్నారు. ఇప్పటి వరకు 80 మందికిపైగా మహిళలు విద్యార్థుల యూనిఫాంలు కుట్టేందుకు ముందుకు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఏజెన్సీతో నిర్ధయించే సైజులతోనే...

ఒక్కో విద్యార్థి ఒక్కో సైజులో ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం నియమించిన ఏజెన్సీ వారు ప్రతి తరగతికి రెండు, మూడు సైజుల్లో క్లాత్‌ను కట్ చేయించి మహిళా సమాఖ్యలకు ఇస్తారు. దీని వల్ల సైజుల గురించి కొలతల గురించి మహిళా సమాఖ్యల సభ్యులు కుట్టే విషయంలో ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. ఒక్కో విద్యార్థికి 2 జతల యూనిఫాంను భిన్న రకాల రంగుల్లో ఇస్తారని అధికారులు తెలిపారు. షేక్‌పేట మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు 4837 మంది విద్యార్థులు, 9, 10 తరగతుల విద్యార్థులు 1075 మంది ఉన్నట్లు అధికారులు ఇప్పటికే గుర్తించారు. వీరికి సరిపోయే దుస్తుల సైజులను కూడా ఇప్పటికే ఏజెన్సీ వారు గుర్తించారు.

ప్రస్తుతానికి రెండు సెంటర్లు

ఈ దుస్తులు కుట్టేందుకు మహిళా సమాఖ్యల సభ్యులకు బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని గౌరీ శంకర్ కాలనీలో ఒకటి, బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని భోలానగర్ బస్తీలో మరో సెంటర్ అందుబాటులో ఉన్నాయి. గతేడాది ఎన్బీటీ నగర్‌లో ఉన్న సెంటర్‌ను ఈసారి తొలగించినట్లు అధికారులు తెలిపారు. కొంత మంది మహిళలు వారి ఇంటివద్దే బట్టలు కుట్టుకొని వస్తానన్న వారికి కూడా అవకాశం ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఒక్కో యూనిఫాంకు రూ. 75 ప్రభుత్వం చెల్లిస్తుందని వారు తెలిపారు. పాఠశాలలు తెరిచేనాటికి లక్ష్యాన్ని ఛేదించి విద్యార్థులకు దుస్తులు అందించేలా ప్రణాళికలు రూపొందించినట్లు జూబ్లీహిల్స్ సర్కిల్–18 డీపీవో ఆశా విరానికా వివరించారు.

బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం అణగారిన వర్గాలకే అంకితం


కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ఘంటా చక్రపాణి, కొండ నాగేశ్వరరావు తదితరులు

బంజారాహిల్స్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో భారత్ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఈ నేపథ్యంలో మంగళవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 'బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం –అణగారిన వర్గాల అభివృద్ధికి ఆయన కృషి' అనే అంశంపై ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాబూ జగ్జీవన్‌రామ్ సామాజిక న్యాయం, అణగారిన వర్గాల హక్కులు, గౌరవం కోసం పోరాటానికే తన జీవితాన్ని అంకితం చేసిన నాయకుడిగా చిరస్మరణీయుడని కొనియాడారు. సమ సమాజ స్థాపనకు కృషి చేశారన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం భవిష్యత్తు తరాలకు మార్గదర్శనంగా నిలిచిందన్నారు. ప్రధాన వక్తగా ఉస్మానియా విశ్వవిద్యాలయ సివిల్ సర్వీసెస్ అకాడమీ డైరెక్టర్ కొండ నాగేశ్వరరావు మాట్లాడుతూ... భారతీయ సమాజంలోని అణగారిన వర్గాలకు, ముఖ్యంగా దళితులకు, గొప్ప నాయకుడు జగ్జీవన్‌రామ్ అన్నారు. విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, పరీక్షల నియంత్రణ అధికారి శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌ఛార్జి బానోత్ ధర్మా తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను ప్రారంభించిన వీసీ చక్రపాణి...

భారతరత్న బాబా సాహెబ్ అంబేడ్కర్ 134వ జయంతి ఉత్సవాల్లో భాగంగా అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ బోధనేతర ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సాంస్కృతిక, క్రీడా వేడుకలను వీసీ ఘంటా చక్రపాణి ప్రారంభించారు. ఉద్యోగుల్లో మానసిక ప్రశాంతత, శారీరక దారుఢ్యం చాలా అవసరమన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని త్వరలోనే విశ్వవిద్యాలయ ప్రాంగణంలో క్రీడా మైదానాలను ఏర్పాటు చేయనున్నట్లు చక్రపాణి ప్రకటించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఎల్.విజయకృష్ణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, క్రీడా కమిటీ చైర్మన్ దయాకర్, నాన్ టీచింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎం.డి.హబీబుద్దీన్, నాన్ టీచింగ్ అసోసియేషన్ సభ్యుడు వెంకట పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

వెంగళరావునగర్: గ్యాస్ స్టౌ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... మెదక్ ప్రాంతానికి చెందిన అశోక్, అనూరాధ దంపతులు కొన్నేళ్లుగా ఎస్‌పీఆర్‌హిల్స్ బ్రహ్మశంకర్‌నగర్‌లో ఉంటున్నారు. గత నెల 30న అనూరాధ తన అత్తగారింటికి వెళ్లింది. 31వ తేదీ మరిది ఫోన్ చేసి తన సోదరుడు అశోక్ వంట చేస్తుండగా గ్యాస్ లీకైందని, ఒళ్లు కాలిపోయిందని చెప్పాడు. ఆమె వచ్చేలోపు అశోక్‌ను మధురానగర్ పోలీసుల సహకారంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అశోక్ సోమవారం రాత్రి మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్న యువకుడి అరెస్టు

వెంగళరావునగర్: ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్న ఓ యువకుడిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... మధురానగర్ పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాల్లో క్రికెట్ ఆన్‌లైన్ బెట్టింగ్ జోరుగా సాగుతున్నదని సమాచారం అందింది. దాంతో ఎస్ఐ అవినాష్ తదితర సిబ్బంది ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఈ నెల 7వ తేదీ రాత్రి వెంగళరావునగర్‌లో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిని గుర్తించి అదుపులోనికి తీసుకున్నారు. నిందితుడు పెద్దపల్లి ప్రాంతానికి చెందిన ఎస్.ఉదయ్‌గా గుర్తించారు. ప్రైవేట్ జాబ్ చేస్తూ గత కొంతకాలంగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నట్టుగా పోలీసుల విచారణలో తెలియజేశాడు. దాంతో అతనిని అదుపులోనికి తీసుకుని అతని వద్ద ఉన్న ఫోన్, రూ. 2708ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ల్యాప్‌టాప్‌ల చోరీ

వెంగళరావునగర్: హాస్టల్స్‌లో ఉంచిన ల్యాప్‌టాప్‌లు చోరీకి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... మహబూబ్‌నగర్‌కు చెందిన కె.సింధు మధురానగర్‌కాలనీలో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తుంది. ఈ నెల 7న రాత్రి తన ల్యాప్‌టాప్ గదిలో ఉంచి నిద్రపోయి ఉదయం లేచి చూసేసరికి కనిపించలేదు. అలాగే గుంటూరు ప్రాంతానికి చెందిన కె.మనస్వి మధురానగర్‌కాలనీలోని హాస్టల్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంది. ఈ నెల 7వ తేదీరాత్రి తన ల్యాప్‌టాప్ రూంలో పెట్టి నిద్రపోయింది. ఉదయం లేచి చూసేసరికి తన ల్యాప్‌టాప్ కనిపించలేదు. బాధితులు తమ ల్యాప్‌టాప్‌ల కోసం పరిసర ప్రాంతాల్లో వెదికినా ప్రయోజనం లేకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరువురి కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌కు మిత్రపక్షమైనా ప్రజాపక్షమే..

సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం


ఎమ్మెల్సీ సత్యంను సన్మానిస్తున్న ఏఐటీయూసీ నేతలు

హిమాయత్‌నగర్: అధికార కాంగ్రెస్ పార్టీకి మిత్రపక్షమైనా సీపీఐ ప్రజాపక్షమే అని, ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం వెల్లడించారు. మంగళవారం ఏఐటీయూసీ భవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన నెల్లికంటి సత్యంను ఏఐటీయూసీ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ... సీపీఐ పేద ప్రజల పక్షాన, కార్మికవర్గానికి నిత్యం అందుబాటులో ఉండి కార్మికుల సమస్యలను పరిష్కరించటంలో ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు ఏకగ్రీవంగా ఎన్నిక చేసి ఎమ్మెల్సీగా చేసినందుకు పార్టీకి, కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సభకు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్ అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, ఉపాధ్యక్షులు బి.చంద్రయ్య, కె.ఏసురత్నం, కార్యదర్శులు ఎస్.విలాస్, వై.ఓమయ్య, బి.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో మోసం: యువకుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: పెళ్లి పేరుతో సహజీవనం చేసి వివాహం చేసుకోకుండా ముఖం చాటేసిన యువకుడిపై జూబ్లీహిల్స్ పోలీస్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... విశాఖపట్నంకు చెందిన ఓ యువతి గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ జూబ్లీహిల్స్ రోడ్ నెంబ 10లో తన స్నేహితులతో కలిసి నివాసం ఉంటున్నది. 2023 జూలైలో అదే కంపెనీలో పని చేసే కర్నూలుకు చెందిన సాకేత్‌రెడ్డితో పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ కలిసి మరి కొంత మంది స్నేహితులతో కలిసి పబ్‌కు వెళ్లారు. అక్కడి వారి పరిచయం కాస్తా స్నేహంగా మారింది. అప్పటి నుంచి ఆ యువతిని ప్రేమిస్తున్నానని చెప్పిన సాకేత్‌రెడ్డి ఒకే ఫ్లాట్‌లో సహజీవనం చేయడం మొదలు పెట్టాడు. యువతి వద్దని వారించినా వినకుండా పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరక వాంఛలు తీర్చుకున్నాడు. 2024 ఫిబ్రవరిలో సాకేత్ స్నేహితులు మహేందర్, జయంత్ వచ్చి మద్యం మత్తులో యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. ఇదే విషయాన్ని సదరు యువతి సాకేత్‌కు చెప్పగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆ ఏడాది జనవరిలో ఆఫీస్‌కు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటుండటంతో సాకేత్‌ను నిలదీయగా దీనికి అతను ఇంటి నుంచి వెళ్లిపోయాడు. పది రోజుల తర్వాత తన ఇంట్లో కుటుంబ సభ్యులను ఒప్పించి పెళ్లి చేసుకుంటానని చెప్పి కనిపించకుండా పోయాడు. ఆ యువతి సాకేత్ కుటుంబ సభ్యులను ఆరా తీయగా తమకు తెలియదని చెప్పడంతో తాను మోసపోయానని తెలుసుకున్న యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సాకేత్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు బీఎన్ఎస్ 69, 74, 79ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాల్మీకుల అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

లిబర్టీ: అత్యంత వెనుకబడి దయనీయ జీవితాలు వెల్లదీస్తున్న వాల్మీకి కులస్తుల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి వాల్మీకి సేవా సమాజ్ సంఘ్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డి.ప్రీతంసింగ్ విజ్ఞప్తి చేశారు. అన్ని రంగాల్లో వెనుబడి వాల్మీకుల జీవితాలు ఛిదిరిపోయాయన్నారు. సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో వాల్మీకులు సంప్రదాయ కులవృత్తి నమ్ముకొని జీవనం సాగిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకొని వాల్మీకుల ఆర్థిక సంస్థను ఏర్పాటు చేసి రూ. 500 కోట్లు కేటాయించాలని విన్నవించారు. త్వరలో ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించి వాల్మీకులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తామన్నారు.

కొనసాగుతున్న మైనర్ డ్రైవింగ్ స్పెషల్ డ్రైవ్


వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

బంజారాహిల్స్: మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ తెలిపారు. మైనర్ డ్రైవింగ్ స్పెషల్ డ్రైవ్ రెండో రోజైన మంగళవారం కూడా కొనసాగింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్సార్‌నగర్, పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్ పోలీసులు వేర్వేరు చోట్ల తనిఖీలు చేపట్టారు. మైనర్లు వాహనం నడుపుతూ చిక్కితే వాహన యజమానిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామన్నారు. న్యాయస్థానంలో జరిమానా, జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుందని, సదరు వాహన రిజిస్ట్రేషన్‌ను కూడా ఏడాది పాటు సస్పెండ్ చేస్తారన్నారు. అంతేకాకుండా సదరు మైనర్‌కు పాతికేళ్ల వయస్సు వచ్చేదాకా డ్రైవింగ్ లైసెన్స్ పొందే అర్హత ఉండదన్నారు. ఈ కఠిన నిబంధన నేపథ్యంలో మైనర్లకు వాహనం ఇచ్చే ముందు తల్లిదండ్రులు, బంధుమిత్రులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రత్యేక తనిఖీల్లో రోజూ తమ పోలీసులు తనిఖీలు చేపడుతున్నారన్నారు. మైనర్లు వాహనం నడిపితే వాహనాలను అదుపులోకి తీసుకుంటున్నామన్నారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్‌తో కలిసి ఆయన మంగళవారం శ్రీనగర్‌కాలనీ టి-జంక్షన్‌లో తనిఖీల్లో పాల్గొన్నారు.

నీటి కోసం ఖాళీ బిందెలతో మహిళల నిరసన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

రహమత్‌నగర్: తమ వీధిలోని నల్లాల్లో లోప్రెషర్‌తో వస్తున్న తాగునీటితో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పలుమార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపానపోలేదని కార్మికనగర్ బస్తీ ఏసు జలమందిరం వీధివాసులు వాపోయారు. ఈ మేరకు తమ వీధిలో మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు, దళిత రత్న అవార్డు గ్రహీత ఎం.రాములు మాట్లాడుతూ... కార్మికనగర్ బస్తీలోని తమ వీధిలో గత కొంత కాలంగా మంచినీరు మూడు రోజులకు ఓమారు, అది లోప్రెషర్‌తో రావడం వల్ల తామంత ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమస్యలపై గతంలో పలుమార్లు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశామని ఆయన గుర్తు చేశారు. పేదలు, కూలీలు అత్యధికంగా నివాసముండే తమ వీధిలో మంచి నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి లోప్రెషర్ నీటి సరఫరా సమస్యను పరిష్కరించి, నీరు సరఫరా చేసే సమయాన్ని పెంచాలని ఆయన కోరారు. మహిళలు షాబమ్మ, రేణుక, రెడ్డమ్మ పాల్గొన్నారు.

వ్యర్థాలతో నిండిన ఎంజీనగర్ నాలా


చెత్తతో నిండిన ఫిలింనగర్‌లోని ఎంజీనగర్ నాలా

బంజారాహిల్స్: ఫిలింనగర్‌లోని మహాత్మాగాంధీ నగర్ నాలా చెత్తాచెదారంతో పాటు వ్యర్థాలు, బురదతో పూర్తిగా నిండిపోయింది. జీహెచ్ఎంసీ సర్కిల్–18 పరిధి కిందికి వచ్చే ఈ బస్తీలో భారీ నాలా ఉండగా గత కొన్ని నెలలుగా ఇవి పూర్తిగా నిండిపోయి స్థానికులకు నరకాన్ని చూపిస్తున్నది. డీసిల్టింగ్ చేయాల్సిన ఇంజనీరింగ్ విభాగం ఆ దిశలో ఇంకా చర్యలు చేపట్టలేదు. ఫలితంగా బస్తీ వాసులు దుర్వాసనతో నరకాన్ని చవిచూస్తున్నారు. దీని ప్రభావం బీజేఆర్‌నగర్, అంబేడ్కర్‌నగర్, మహాత్మాగాంధీనగర్, బసవతారకనగర్, హకీంపేట కుంట ప్రాంత నివాసితులపై తీవ్రంగా చూపుతున్నది. దోమల స్వైర విహారం చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి డీసిల్టింగ్ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మహిళా భవన్ పనులను పరిశీలించిన మేయర్


పరిశీలిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ డివిజన్‌లోని ఎన్బీటీనగర్‌లో మహిళల కోసం నిర్మిస్తున్న మహిళా భవన్ నిర్మాణ పనులను మంగళవారం గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పరిశీలించారు. ఈ భవన నిర్మాణాన్ని నెల రోజుల్లో పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకురావాలని ఈ సందర్భంగా ఆమె కాంట్రాక్టర్‌కు సూచించారు. మహిళా భవనం ప్రారంభమైతే మహిళలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వారి జీవితాలను సుసంపన్నం చేసే ఒక అద్భుతమైన వేదికగా నిలుస్తుందన్నారు.

రహమత్‌నగర్‌లో బీజేపీ 'స్వచ్ఛ భారత్'

రహమత్‌నగర్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా ఆ పార్టీ నాయకులు రహమత్‌నగర్ డివిజన్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీఆర్‌హిల్స్‌లోని సంతోషిగిరి, బ్రహ్మశంకర్‌నగర్ బస్తీలో చీపర్లు చేతబట్టి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు తంగలపెల్లి లక్ష్మణ్, నేతలు రామకృష్ణ, షేర్‌ఆలం, రాకేశ్, లావణ్య, అహ్మద్, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.


స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న బీజేపీ నాయకులు

సమష్టిగా అభివృద్ధి భేష్


స్వాగత ద్వారాన్ని ప్రారంభిస్తున్న కృష్ణశర్మ

శ్రీనగర్‌కాలనీ: ప్రతి ఒక్కరూ చేయి చేయి కలిపి కాలనీ అభివృద్ధికి సహకరించడం అభినందనీయమని రాజీవ్‌నగర్‌కాలనీ నేతలు పేర్కొన్నారు. ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్‌నగర్‌కాలనీ స్వాగత ద్వారం పునర్నిర్మాణ కార్యక్రమం మంగళవారం కాలనీలో అట్టహాసంగా జరిగింది. స్వాగత ద్వారాన్ని కాలనీ గౌరవాధ్యక్షుడు పి.ఎస్.జి.కృష్ణశర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ నేతలు మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే రాజీవ్‌నగర్‌కాలనీ మాత్రమే తొలిసారిగా స్వాగత ద్వారాన్ని నిర్మించినట్టు తెలిపారు. గతంలో నిర్మించిన స్వాగతద్వారం పాడైనందున దాని స్థానంలోనే కొత్తదాన్ని కాలనీవాసుల సహకారంతో తిరిగి నిర్మించుకున్నట్టు తెలిపారు. ఈ స్వాగత ద్వారానికి సహకరించిన దాతలలకు ధన్యవాదాలు తెలిపారు. రాజీవ్‌నగర్ సంక్షేమ సంఘం గౌరవ సలహాదారు పి.ఎ.ఎస్.మూర్తి, డాక్టర్ అగస్టీన్, మాజీ అధ్యక్షుడు ఎన్.ఎస్.రెడ్డి, కార్యవర్గ సభ్యుడు భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

'పెట్రో' ధరలను వెంటనే తగ్గించాలి

హిమాయత్‌నగర్: పెంచిన డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించి ప్రజలకు ఊరట కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజలు ఏమైనా పర్వాలేదు నా ఆకలి మాత్రం తీరాలని కోరుకునే పన్నుల బకాసురుడు మోదీ అని ఆరోపించారు. వంటగ్యాస్‌పై సిలిండర్‌కు రూ. 50 పెంచిన మోదీ అనాలోచిత చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. వంట గ్యాస్‌తో పాటు పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ. 2 చొప్పున పెంచటం మరో దుర్మార్గమైన చర్య అన్నారు.

ఫుట్‌పాత్‌పై ఫ్లెక్సీల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద ఫుట్‌పాత్‌పై అడ్డదిడ్డంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మంగళవారం జీహెచ్ఎంసీ అధికారులు తొలగించారు. అడ్డదిడ్డంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి వాకర్లు, సందర్శకులు ఇబ్బందులు పడుతున్న వైనాన్ని 'సాక్షి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి అధికారులు స్పందించారు. ఇక్కడ ఫుట్‌పాత్‌పై, రోడ్లపై ఏర్పాటు చేసిన నాలుగు ఫ్లెక్సీలను తొలగించారు. దీంతో పాదచారులు, కేబీఆర్ పార్కు వాకర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.






- ఐస్‌క్రీమ్ టేస్టింగ్ చాలెంజ్‌కు సిద్ధమైన నగరం
- విజేతలకు రూ.లక్ష వరకు బహుమతులు


కళ్లకు గంతలు కట్టి..
ఫ్లేవర్ గుర్తుపట్టి..



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఐస్‌క్రీమ్ లవర్స్‌ను ప్రతిసారి అలరించే హైబిజ్ ది గ్రేట్ ఇండియన్ ఐస్‌క్రీమ్ టేస్టింగ్ చాలెంజ్ మళ్లీ సిద్ధమైంది. ఈ వినూత్న టేస్టింగ్ చాలెంజ్‌ను 27వ తేదీన నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి కార్యక్రమాన్ని నగరంలోని ఎర్రమంజిల్ మెట్రో స్టేషన్ ప్రీమియా మాల్ వేదికగా మంగళవారం నిర్వహించగా హీరోయిన్ కావ్య కల్యాణ్ రామ్, బిగ్‌బాస్ ఫేమ్ శ్వేతవర్మ, సినీనటులు సమీర్ సందడి చేశారు. ఈ తారలు కళ్లకు గంతలు కట్టుకుని విభిన్న రుచుల ఐస్‌క్రీమ్‌లను గుర్తిస్తూ ఆకట్టుకున్నారు. కళ్లకు గంతలు కట్టుకుని ఐస్‌క్రీమ్ టేస్ట్ చేసి, దాని ఫ్లేవర్ చెప్పాల్సి ఉంటుంది. ఈ పోటీలో ఎవరు ఎక్కువగా ఐస్‌క్రీం ఫ్లేవర్‌ను గుర్తిస్తే వారే విజేతలుగా నిలుస్తారు. విజేతకు రూ.లక్ష నగదు బహుమతి అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రూ.50 వేలు, రూ.25 వేల బహుమతులు కూడా ఉన్నాయన్నారు. 25 మంది లక్కీ డ్రా విన్నర్లను కూడా ఎంపిక చేస్తామని వివరించారు. ఐస్‌బర్గ్ ఐస్ క్రీమ్స్ ఆధ్వర్యంలోని ఆర్గానిక్ క్రీమరీ సహకారంతో జరుగుతున్న ఈ చాలెంజ్‌లో పాల్గొనాలనుకునే వారు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గానిక్ క్రీమరీ బై ఐస్‌బర్గ్ ఐస్ క్రీమ్స్ వ్యవస్థాపకులు సుహాస్, ఎల్అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ అడ్వర్టయిజింగ్ బిజినెస్ హెడ్ కేవీ నాగేంద్ర ప్రసాద్, హైబిజ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రాజ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.







వేసవి సీజన్ వచ్చిందో లేదో అప్పుడే మార్కెట్‌లో మామిడి పండ్లు నోరూరిస్తున్నాయి. మామిడి పండ్లేనా.. సీజనల్ స్పెషల్ వాటర్‌మెలన్, మరోవైపు ద్రాక్ష, ఆల్ సీజనల్ ఫేవరెట్ అరటి ఇలా అన్నిరకాల పండ్లు మార్కెట్‌లో సిద్ధంగా ఉన్నాయి. అయితే ఆరోగ్యం కోసం ఇష్టంగా కొనుగోలు చేసే పండ్లు ప్రమాదకర రసాయనాలను ఇంట్లోకి.. మన ఒంట్లోకి తీసుకొస్తున్నాయి. ఈ సీజన్‌లో మాత్రమే దొరికే మామిడి పండ్లు.. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను తీసుకొచ్చే ప్రమాదం ఉంది. ఈ తరుణంలో ఏ దారి ఎంచుకోవాలో అర్థం కాని అయోమయ పరిస్థితి నగరవాసులది. ఈ సమస్య ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ ప్రతి ఏడాది మరింత పెరుగుతూనే ఉండటం నగర జీవన శైలిని ఆందోళనకు గురిచేస్తోంది. సహజసిద్ధంగా విటమిన్లు, ప్రోటీన్లు తదితర పోషకాలను అందించే ఫలాలే ప్రజల అనారోగ్యానికి కారకాలుగా మారుతున్న నేపథ్యంలో అసలు మంచి పండ్లను ఎలా గుర్తించాలి అనే అంశంపై ఆరా తీస్తున్నారు నగరవాసులు.

- సాక్షి, సిటీబ్యూరో

ఫ్రూట్స్.. బీకేర్ ఫుల్..

పండ్ల సీజన్‌గా వేసవికి డిమాండ్

- ఇదే అదనుగా ఫ్రూట్ రిప్పెనింగ్‌కు రసాయనాల వాడకం
- తీవ్ర అనారోగ్య సమస్యలకు కారణం అవుతున్న వైనం
- ఈతరం చిన్నారులు, యువతపై అధిక ప్రభావం
- సహజంగా పండిన పండ్లను గుర్తించే టెక్నిక్స్‌పై ఆరా





వేసవిలో పండ్లను ఎక్కువ ఆస్వాదించడానికి చాలా కారణాలున్నాయి. ఈ సీజన్‌లో మాత్రమే లభించే పండ్లు ఎక్కువగా అందుబాటులో ఉండటం, వేసవి తాపానికి డీహైడ్రేషన్ నుంచి సంరక్షించుకోవడానికి పళ్ల రసాలను తాగుతుంటారు. దీన్ని అదనుగా భావించి, మార్కెట్ డిమాండ్‌కు సరిపడా సరఫరా అందించడమే లక్ష్యంగా కొందరు వ్యాపారులు ప్రమాదకర పంథాను ఎంచుకుంటున్నారు. సహజసిద్ధంగా పండ్లను మగ్గించడానికి బదులు కృత్రిమ పద్ధతిలో రసాయనాలను వినియోగిస్తున్నారు. ఇందులో భాగంగా కాల్షియం కార్బైడ్ వంటి విషపూరిత రసాయనాలను పండ్లు మగ్గించడానికి వాడుతున్నారు. ఈ పదార్థం అనారోగ్యాలకు కారణమని, దీంతో పండ్లను మగ్గించవద్దని గతంలోనే హైకోర్టు నిషేధించింది. అయినప్పటికీ మార్కెట్ అవసరాల కోసం కొందరు వ్యాపారులు ఈ రసాయనాలను వాడుతూనే ఉన్నారు. ఓ వైపు నగరంలో పరిశుభ్రత లేకుండా కలుషిత ఆహారాన్ని అందిస్తున్న రెస్టారెంట్లతోనే భయపడుతున్న సిటీజనులను ఈ పండ్ల పరిస్థితి మరింత భయపెడుతోంది. దీన్ని నివారించడానికే నగరాల్లో ఫుడ్ సేఫ్టీ విభాగం పలు నిబంధనలు అమలు చేస్తోంది. అనుమతి మేరకు ఇథిలిన్ ఛాంబర్స్ వినియోగించేలా సూచనలిచ్చింది. ఈ ఛాంబర్స్‌లో 72 గంటల్లో కాయలు పండ్లుగా మారే విధానంలో హార్మోన్లు సమపాళ్లలో ఉంటాయి. వీటితో పాటు ఇథోపాన్ అనే షాచెట్స్‌తో పండ్లను మగ్గించడానికి అనుమతి ఉంది.

నగర కాలుష్యం, ఒత్తిడి తదితర కారణాలతో సతమతమవుతున్న నగరవాసులకు కృత్రిమంగా పండ్లను మగ్గించడానికి వినియోగించే కాల్షియం కార్బైడ్ వంటి ప్రమాదక రసాయనాలు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల్లో అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. యువతకు కూడా ఇబ్బందులు తప్పవని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా హృదయం, కాలేయం, కిడ్నీలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. కొన్ని సందర్భాల్లో ఈ రిప్పెనింగ్ రసాయనాలు ఫలాలపై తొక్క మాత్రమే పండేలా చేస్తాయి. ఫలితంగా పండ్ల లోపలి గుజ్జు పూర్తిగా పండకుండానే మార్కెట్లోకి అమ్మకానికి వస్తుంటాయి. వీటిని తినడం వల్ల వాంతులు, నీరసం, చర్మ సమస్యలు, విపరీతమైన దాహం, నోటిలో నొప్పి వంటి సమస్యలతో ఇబ్బంది పడుతుంటారు. చిన్నపిల్లలు, గర్భిణులకు ఈ పండ్లు మరింత ప్రమాదకరం. కాల్షియం కార్బైడ్ ఉత్పత్తి చేసే ఎసిటలీన్ మానవ నాడీ వ్యవస్థను దెబ్బతీసి జ్ఞాపకశక్తి కోల్పోయేలా చేస్తుందని పరిశోధనలు స్పష్టం చేశాయి.

తీవ్ర అనారోగ్య సమస్యలు

- ఈ మధ్య కాలంలో సహజసిద్ధంగా పండించిన పండ్లను ఎలా గుర్తు పట్టాలనే అంశాలపై నగరవాసులు ఆరా తీస్తున్నారు. కొందరైతే గూగుల్, యూట్యూబ్‌లో ఏఐని అడుగుతున్నారు. మరికొందరు సోషల్ మీడియాలో రీల్స్, వీడియోలు చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. సహజపద్ధతిలో పండిన ఫలాలు కమ్మని, తియ్యటి వాసనతో ఉంటాయని నిపుణులు, ఆర్గానిక్ రైతులు పేర్కొంటున్నారు.

- ముఖ్యంగా ఈ పండ్లపై నల్లటి మచ్చలు కనిపిస్తాయని, అన్నిసార్లు అందంగా ఉన్న పండ్లే ఆరోగ్యకరమైనవని అనుకోవద్దని సూచిస్తున్నారు. ఫలాలను తెంపిన కాడ తాజాగా కాకుండా వాడిపోయనట్లు, సహజసిద్ధంగా పండించడం వల్ల ఈ పండ్లపై కాసింత గడ్డిపొట్టు, సన్నని బూజు కనిపిస్తాయి.

- సహజంగా మగ్గించిన పండ్లను గుర్తుపట్టాలంటే.. ఒక బకెట్‌లో నీరు నింపి అందులో మార్కెట్‌లో కొన్న పండ్లను వేస్తే.. సహజంగా పండించిన ఫలాలు నీటి అడుగు భాగానికి చేరుకుంటాయి. ప్రమాదక రసాయనాలతో మగ్గించినవి మాత్రం నీటిపైకి తేలుతాయని నిపుణులు సూచిస్తున్నారు.





- కొందరు వ్యాపారులు వేడి చేసిన కాల్షియం కార్బైడ్ నీళ్లలో పండ్లను ఉడక బెట్టి కృత్రిమంగా మగ్గిస్తుంటారు. ఇలాంటి విధానాల్లో పండ్లు వాటి ఆకారాన్ని కోల్పోయి గుండ్రంగా మారుతాయి. అంతేకాకుండా రసాయనాలతో పండించినవి తాజాగా, చర్మం నిగనిగలాడుతూ కనిపిస్తాయి. ఈ ఫలాలు వాటి సహజమైన రుచిని చాలా వరకు కోల్పోతాయి.

- ఈ ఫలాలపై ఆకుపచ్చ, బ్రౌన్ కలర్‌లో మచ్చలను గుర్తించవచ్చు. ఈ మధ్య కాలంలో పలువురు రైతులు సహజసిద్ధంగా పండ్లను పండించి, వాటిని పెద్ద పెద్ద వాహనాల్లో భారీ స్థాయిలో నగరానికి తరలించి అమ్ముతున్నారు.



పెట్స్.. బెస్ట్ ఫ్రెండ్స్

సాక్షి, సిటీబ్యూరో: నిస్వార్థంగా ప్రేమను పంచే శునకాలు మన నిజమైన నేస్తాలు అన్నారు ప్రముఖ సినీ గీత రచయిత చంద్రబోస్. బంజారాహిల్స్‌లో నెలకొల్పిన అత్యాధునిక పెట్ కేర్ సెంటర్ డాగీ విల్లెని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన దగ్గర మూడు పెట్స్ ఉండేవి అంటూ వయోభారంతో అవి దూరమైనా అవి పంచిన ప్రేమను మర్చిపోలేనన్నారు. పెట్స్ ప్రేమ పొందడంతో పాటు వాటి బాగోగులూ చూడాల్సిన బాధ్యత మనదే అన్నారు. వారు అందించే సేవల గురించి డాగీవిల్లె నిర్వాహకులు అమృత వర్షిణి వివరించారు.







కుంచెతో చిత్రాలకు ప్రాణం

- చిత్రకళకు వన్నె తెస్తున్న కళాకారుడు శివకుమార్
- ఆకట్టుకునే చిత్రాలు గీయడం, రంగులు అద్దడంలో దిట్ట
- కేంద్రీయ విద్యాలయంలో బొమ్మలన్నీ ఆయన చొరవతోనే..

చిత్రకారుడవ్వాలని, గొప్పగొప్ప చిత్రాలతో అందరినీ మెప్పించాలని చిన్నప్పటి నుంచీ ఆయనకు ఒక కోరిక ఉండేది. తండ్రి వేసే చిత్రాలను చూస్తూ నేర్చుకున్నారు. 12 ఏళ్ల వయసులోనే పోట్రెయిట్ చిత్రాలతో అలరించి చిత్రకళపై ఉన్న మక్కువ వ్యక్తం చేశారు. దాదాపు 30 ఏళ్లుగా ఆకట్టుకునేలా ఎన్నెన్నో బొమ్మలు గీస్తూ ఎంతో మంది నుంచి ప్రశంసలు అందుకున్నారు. గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయంలో ఆర్ట్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తూనే ఎంతో మంది విద్యార్థులకు చిత్రకళలో మెలకువలను నేర్పిస్తున్నారు ఎస్.శివకుమార్.

- రాయదుర్గం

ముఖ్యంగా పోట్రెయిట్, గ్రాఫిక్ ఆర్ట్, పాత కళాఖండాలు 50 పునరుత్పత్తులతో 500 వాస్తవిక పోట్రెయిట్‌లను సృష్టించారు. గులక రాళ్లపై పెయింటింగ్ వేసి వాటిని పేపర్ వెయిట్లుగా మార్చడం, చెట్ల కొమ్మలపై 3డీ కళ, సహజ ఉపరితలాలను అద్భుత దృశ్య కూర్పులుగా మార్చడం, చెట్లు, భారీ బండరాళ్లపై పెయింటింగ్స్ తదితర ఎన్నో రకాల పెయింటింగ్స్‌తో మైమరపిస్తున్నారు. 30 ఏళ్లుగా విద్యార్థులకు శిక్షణ ఇస్తూ చదువుతో పాటు చిత్రకళ పట్ల ఆసక్తి పెంచుతున్నారు. జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని గచ్చిబౌలి కేంద్రీయ విద్యాలయంలో ప్రధాన ద్వారం నుంచి లోపలికి వెళ్తే కనిపించే గోడలు, నేలపై ఉండే చిత్రాలు ఆయన, ఆయన విద్యార్థులు వేసినవే.. మహనీయుల చిత్రాలు, జంతువుల చిత్రాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.



జగిత్యాలకు చెందిన ఆయన అక్కడే పాఠశాల చదువు తర్వాత ఫైన్ ఆర్ట్స్ ప్రవేశ పరీక్ష రాసి 1983లో నగరంలోని జేఎన్‌టీయూహెచ్‌లో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్(బీఎఫ్ఏ) కోర్సు చేశారు.

- 1988లో హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో కరువు అనే స్కెచ్‌తో అవార్డు గెలిచి జాతీయ స్థాయి గుర్తింపు పొందారు.
- అదే ఏడాది సిద్దిపేట లలిత కళా అకాడమీ అవార్డు అందుకున్నారు.
- 1997లో కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌లో ఆర్ట్ టీచర్‌గా చేరారు. ఆదిలాబాద్, రామగుండం, కేవీ నంబర్–2 హైదరాబాద్, ప్రస్తుతం గచ్చిబౌలిలో విధులను నిర్వర్తిస్తున్నారు.
- 2009లో స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో వేసిన చిత్రానికి అవార్డు లభించింది.
- 2016లో కేవీఎస్ రీజనల్ ఇన్సెంటివ్ అవార్డు.
- 2017లో కేవీఎస్ జాతీయ అవార్డు లభించింది.





అలరించిన నృత్యం

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్న సాహిత్య సాంస్కృతిక కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందని ప్రముఖ నాట్య గురువు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి అన్నారు. రవీంద్రభారతిలో ఆత్మకల్ప కూచిపూడి నృత్యాగారం సంస్థ ఆధ్వర్యంలో అర్జునహా దాస నమీయం పేరిట మంగళవారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహాభారతంలో అర్జునుడి పాత్ర, రామావతారం వంటి పలు అంశాలపై సాగిన నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయ కళలను నేటి వారసత్వానికి పరిచయం చేయడంతో పాటు భవిష్యత్ తరాలకు అందించేందుకు సంస్థల కృషి ఎంతో అభినందనీయం అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతగానో ఉందని అభిప్రాయపడ్డారు. అనంతరం కళాకారులను అభినందించారు. విశ్రాంత ఆచార్యులు డాక్టర్ జ్యోతిరెడ్డి, నిర్వాహకులు గిరీష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఆలోచింపజేసిన నాటకం





గన్‌ఫౌండ్రీ: అంతర్జాతీయ చిల్డ్రన్స్ థియేటర్ ఫెస్టివల్ అలరిస్తోంది. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిశుంభిత స్కూల్ ఆఫ్ డ్రామా ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో కొనసాగుతున్న ఈ ఫెస్టివల్‌లో 2వ రోజు మంగళవారం వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారుల నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రసూల్‌పురా ప్రభుత్వ పాఠశాలకు చెందిన చిన్నారులు ప్రదర్శించిన మైమ్, మొబైల్ మానియా నాటక ప్రదర్శన, నల్లకుంటకు చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల చిన్నారుల నాటకం ఆలోచింపజేసింది. రంగస్థల కళాకారులు వినయ్‌వర్మ, ఆకేళ్ల శివప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులను అభినందించారు. చివరి రోజైన బుధవారం నేపాల్, కేరళ, కోల్‌కత్తా ప్రాంతాలకు చెందిన చిన్నారుల నాటక ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు డాక్టర్ రామ్ తెలిపారు.

ఫలక్‌నుమాకు తప్పిన పెను ప్రమాదం

- బోగీల మధ్య తెగిపోయిన లింకు..
- రెండుగా విడిపోయిన రైలు
- కొన్ని బోగీలతోనే పది కిలోమీటర్ల దూరం వెళ్లిన ఇంజిన్
- ప్రాణహాని జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు, అధికారులు



రైలు పట్టాలపై నిలిచిపోయిన ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్

కాశీబుగ్గ: ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు మంగళవారం శ్రీకాకుళం జిల్లా పలాస సమీపంలో పెను ప్రమాదం తప్పింది. వివరా లు.. సికింద్రాబాద్ నుంచి హౌరా వెళ్తున్న ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 7 గంటల సమయంలో పలాసకు చేరుకుంది. అక్కడి నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సున్నాదేవి రైల్వేస్టేషన్ సమీపానికి వచ్చే సరికి ఉదయం 7.10 గంటల సమయంలో రెండు బోగీల మధ్య లింకు తెగిపోయింది. దీంతో రైలు రెండుగా విడిపోయింది. రైలులో ఉండే గార్డు ఈ విషయాన్ని గుర్తించి లోకో పైలెట్‌కు సమాచారం ఇచ్చే సమయానికి కొన్ని బోగీలతో ఉన్న ఇంజిన్ 10 కిలోమీటర్ల దూరం వెళ్లిపోయింది. దీంతో దానిని మందస రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. మిగిలిన బోగీలు నెమ్మదిగా వెళుతూ రైలు పట్టాలపై నిలిచిపో యాయి. ఎలాంటి ప్రాణహాని జరగకపోవడంతో ప్రయాణికులు, రైల్వే అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. బోగీల మధ్య లింకును సరి చేసిన రైల్వే అధికారులు, సిబ్బంది సుమారు 10.20 గంటల సమయంలో రైలును భువనేశ్వర్ వైపు పంపించారు. దాదాపు 3 గంటల పాటు ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. అలాగే ఆ మార్గంలో వచ్చే పలు రైళ్లను కూడా మూడు గంటల పాటు ఆలస్యంగా నడిపారు. కాగా, ఈ ఘటనపై రైల్వే అధికారులు విచారణ జరుపుతున్నారు.

'విద్యాప్రమాణాలు పెంచేందుకు కృషి'

సాక్షి, హైదరాబాద్: అన్ని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టుల్లో 50 శాతం ఖాళీల భర్తీకి సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారని ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు చెప్పారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు పలు రకాల చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బిహార్‌ను మించి భయోత్పాతం



శ్రీసత్యసాయి జిల్లా పాపిరెడ్డిపల్లిలో లింగమయ్య కుటుంబసభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ జగన్

- సీఎం చంద్రబాబు హింసను ప్రోత్సహిస్తున్నారు
- వైఎస్ జగన్ ధ్వజం
- పాపిరెడ్డిపల్లిలో టీడీపీ గూండాల దాడిలో మృతి చెందిన లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించిన వైఎస్ జగన్

"చంద్రబాబు మెప్పు కోసం కొందరు పోలీసులు తమ టోపీపై ఉన్న మూడు సింహాలకు సెల్యూట్ చేయకుండా ఆయనకు వాచ్‌మెన్‌ల మాదిరిగా పని చేస్తున్నారు. వారికి ఒకటే చెబుతున్నా..! ఎల్లకాలం చంద్రబాబు నాయుడు పరిపాలనే ఉండదు. అలా వ్యవహరించిన పోలీసుల బట్టలూడదీసి ప్రజల ముందు, చట్టం ముందు దోషులుగా నిలబెడతామని హెచ్చరిస్తున్నా. మీ యూనిఫామ్ తీయించి ఉద్యోగాలు ఊడగొడతామని చెబుతున్నా. మీరు చేసిన ప్రతి పనికీ వడ్డీతో సహా లెక్కేసి మిమ్మల్ని దోషులుగా నిలబెడతాం" – వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'రాష్ట్రం మొత్తం రెడ్‌బుక్ పాలన సాగిస్తున్నారు..!. మంచి పాలన సాగించి మంచిపేరు తెచ్చుకోవచ్చు కదా! సూపర్ సిక్స్ హామీలు ఎందుకు అమలు చేయలేకపోతున్నారు? దీనిపై ప్రజలు ప్రశ్నిస్తుండటంతో.. ఆ ప్రశ్నలు వినిపించకూడదన్న దురుద్దేశంతో రెడ్‌బుక్ పాలనతో దాడులు కొనసాగిస్తున్నారు. పోలీసులను ఉపయోగించుకుని రాష్ట్రవ్యాప్తంగా తెగబడుతున్న దౌర్జన్య కాండను ప్రజలంతా చూస్తున్నారు. కచ్చితంగా దీనికి బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే వస్తాయి..' అని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెచ్చరించారు. శ్రీసత్యసాయి జిల్లాలో గత నెల 30వతేదీన టీడీపీ గూండాల పాశవిక దాడిలో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కురుబ లింగమయ్య కుటుంబాన్ని మంగళవారం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో పరామర్శించిన అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే..

గతంలో బిహార్.. ఇప్పుడు ఏపీ!!

రాప్తాడు నియోజకవర్గంలో ఈ ఘటన ఎందుకు జరిగింది? రాష్ట్రంలో పరిస్థితులు ఇలా ఎందుకు ఉన్నాయి..? అనేది ఇవాళ ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. భర్తను కోల్పోయిన లింగమయ్య భార్య దిక్కు తోచక తల్లడిల్లిపోతోంది. గతంలో బిహార్ గురించి మాట్లాడుకునేవారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ పరువును చంద్రబాబు రోడ్డున పడేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు దారుణంగా దిగజారాయి. రెడ్‌బుక్ పరిపాలన ఎందుకు కొనసాగనిస్తున్నారని ఈ పెద్దమనిషి చంద్రబాబును అడుగుతున్నా..! రాష్ట్రంలో ఇటీవల 57 చోట్ల స్థానిక సంస్థలకు ఉప ఎన్నికలు జరిగాయి. ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కోఆప్షన్ సభ్యులు, ఉప సర్పంచ్‌లు తదితర ఎన్నికలు 57 చోట్ల జరిగితే ఏడు చోట్ల చంద్రబాబు పార్టీ గెలిచే పరిస్థితి లేదని గ్రహించడంతో పోస్ట్‌పోన్ చేయించారు. ప్రలోభ పెట్టేందుకు ఇంకా సమయం కావాలని వాయిదా వేయించారు. అనివార్యం కావడంతో 50 చోట్ల మాత్రం ఎన్నికలు జరిగాయి. చంద్రబాబు ఎంత భయపెట్టినా, ప్రలోభ పెట్టినా, లొంగదీసుకోవాలని చూసినా.. 39 చోట్ల వైఎస్సార్‌సీపీ గెలిచింది. అసలు ఆ 57 చోట్ల చంద్రబాబుకు సంఖ్యా బలమే లేదు. అక్కడ గెలిచిన వారంతా వైఎస్సార్‌సీపీ సభ్యులే. మా పార్టీ గుర్తు మీద గెలుపొందిన వారే. చంద్రబాబుకు తమకు ఏమాత్రం సంఖ్యా బలం లేదని తెలిసి కూడా ప్రలోభాలను ప్రోత్సహిస్తూ, భయపెడుతూ, పోలీసులను తన దగ్గర పనిచేసే వాచ్‌మెన్‌ల కంటే కూడా హీనంగా వాడుకుంటూ దిగజారిన రాజకీయాలు చేస్తున్నారు.

మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలి

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఆకాంక్ష

సాక్షి, అమరావతి: సింగపూర్‌లోని పాఠశాలలో జరిగిన అగ్ని ప్రమాదంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ గాయపడ్డారని తెలిసి దిగ్భ్రాంతికి గురైనట్లు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో ఆ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు వైఎస్ జగన్ మంగళవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

వైఎస్ జగన్ పర్యటనలో భద్రతా వైఫల్యం

హెలికాప్టర్ విండ్ షీల్డ్ ధ్వంసంపై అనుమానాలు



వైఎస్ జగన్ ప్రయాణించాల్సిన హెలికాప్టర్‌ను చుట్టుముట్టిన భారీ జనసందోహం

సాక్షి, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రామగిరి పర్యటనలో పోలీసుల భద్రతా వైఫల్యం ప్రస్ఫుటమైందని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఇన్‌చార్జి లేళ్ల అప్పిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రామగిరిలో హెలికాప్టర్ విండ్‌షీల్డ్ ధ్వంసంపై పలు అనుమానాలు కలుగుతున్నాయని చెప్పారు. పాపిరెడ్డిపల్లిలో హెలిప్యాడ్‌లో నిలిచి ఉన్న హెలికాప్టర్ విండ్ షీల్డ్ పగిలి పోయిందంటే పోలీసులు ఏ మేరకు భద్రత కల్పించారో అర్థం చేసుకోవచ్చని మండిపడ్డారు. రెండు రోజుల ముందే ఈ పర్యటన ఉంటుందని అన్ని ప్రభుత్వ విభాగాలకు సమాచారం ఇచ్చి, అనుమతులు తీసుకున్న తర్వాతే హెలికాప్టర్‌లో అక్కడికి వెళ్లారని చెప్పారు. మాజీ సీఎం, అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడుగా వైఎస్ జగన్ పర్యటనకు ఏ మేరకు భద్రత కల్పించాలనే అంచనా పోలీస్ యంత్రాంగానికి లేదా? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడికి కూటమి ప్రభుత్వం కల్పించే భద్రత ఇదేనా? అని నిలదీశారు. ఒక మాజీ సీఎంకే రక్షణ కల్పించలేకపోతే రాష్ట్రంలో సామాన్యులకు ఏం రక్షణ కల్పించగలరని నిప్పులు చెరిగారు. భద్రత లోపం వల్ల అభిమానుల ముసుగులో ప్రత్యర్థి పార్టీలకు చెందిన వారు దాడులకు తెగబడే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కూడా రెండు పర్యాయాలు వైఎస్ జగన్‌పై దాడి జరిగిందని గుర్తు చేశారు.

మా అబ్బాయికి ప్రాణాపాయం లేదు

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వెల్లడి



సాక్షి, అమరావతి : సింగపూర్‌లో వేసవి శిక్షణ తరగతులకు వెళ్లిన తన రెండవ కుమారుడు మార్క్ శంకర్.. అక్కడ తరగతి గదిలో మంగళవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడ్డాడని, ప్రాణాపాయమైతే లేదని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. హైదరాబాద్‌లోని తన నివాసం వద్ద సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రమాదం చిన్నదే అని తొలుత భావించానని, అయితే ఒక చిన్నారి మృతి చెందడంతో పాటు 30 మంది గాయాల పాలవ్వడం తీవ్రంగా కలచి వేసిందన్నారు. ప్రమాదంలో చిన్నారి మార్క్ శంకర్ చేతులు, కాళ్లపై గాయాలయ్యాయని, ఆ సమయంలో దట్టమైన పొగ పీల్చడంతో అది ఊపిరితిత్తుల్లోకి చేరినట్టు వైద్యులు తెలిపారన్నారు. దాని నుంచి ఉపశమనం కలిగించేందుకు బ్రాంకోస్కోపీ జరుగుతోందని, ప్రాణానికి ఎలాంటి ప్రమాదం లేదని డాక్టర్లు స్పష్టం చేశారని చెప్పారు. "ప్రధాని మోదీకి, ఏపీ సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు. ఆపద సమయంలో వెంటనే స్పందించి నిండు మనసుతో మార్క్ శంకర్ బాగుండాలని అభిలషించిన ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, సహచర సినీ ప్రముఖులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జనసేన శ్రేణులు, ఇతరులందరికీ కృతజ్ఞతలు. ఈ రాత్రి (మంగళవారం)కి కుమారుడి వద్దకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నాను' అని చెప్పారు.

నా కారును దొంగిలించారు...

- అది మంచు విష్ణు కార్యాలయంలో దొరికింది
- మంచు మనోజ్ ఆరోపణ





మీడియాతో మాట్లాడుతున్న మంచు మనోజ్, చోరీకి గురైన కారు (ఫైల్)

మణికొండ: నటుడు మోహన్‌బాబు కుమారులు మంచు మనోజ్, మంచు విష్ణుల మధ్య కొంతకాలంగా వివాదాలు నడుస్తున్న విషయం తెలిసిందే. తాజాగా తన కారును దొంగిలించారని మనోజ్ నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాను ఈ నెల 1వ తేదీన రాజస్తాన్‌కు వెళ్లగా జల్‌పల్లిలోని ఫామ్‌హౌస్‌లోకి 150 మంది చొరబడి విధ్వంసం చేశారన్నారు. తన విల్లా ముందు నిలిపిన మహీంద్రా మరాజో కారును అర్ధరాత్రి దొంగిలించారని చెప్పారు. వెంటనే తన డ్రైవర్ నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశాడని, పోలీసుల విచారణలో కారు మంచు విష్ణు కార్యాలయంలో లభ్యమైందన్నారు. దుండగులు తన విల్లా గోడలు దూకి వచ్చి ఇంట్లోని విలువైన వస్తువులను పగులగొట్టారని మనోజ్ ఆరోపించారు.

దర్యాప్తు చేస్తున్నాం..

మంచు మనోజ్‌కు చెందిన కారును ఈ నెల 1వ తేదీ అర్ధరాత్రి దొంగిలించినట్టు అతని డ్రైవర్ సాంబశివరావు ఫిర్యాదు చేశాడని నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు. 2వ తేదీన కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామని, గుర్తు తెలియని వ్యక్తులు కారును దొంగిలించినట్టు గుర్తించి దాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. కారును దొంగిలించిన వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు.

మీనాక్షి నటరాజన్ షాడో సీఎంగా వ్యవహరించడమేంటి?

- బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ప్రభుత్వ హోదా లేని వ్యక్తిగా సచివాలయంలో మంత్రులు, అధికారులు పాల్గొన్న అధికారిక సమీక్షలు నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమని బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ విమర్శించారు. గాంధీభవన్‌కు పరిమితం కావాల్సిన పార్టీ పరిశీలకురాలు సచివాలయంలో షాడో సీఎంగా అధికార వ్యవస్థను ఒత్తిడికి గురిచేయడం ఏంటని ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కాంగ్రెస్ పరిశీలకురాలే 'షాడో సీఎం'గా వ్యవహరించడం దేనికి సంకేతమని నిలదీశారు. రాష్ట్రానికి నామమాత్ర సీఎంగా రేవంత్ రెడ్డి కనపడుతున్నారని, ప్రభుత్వాన్ని గాంధీ భవన్ నుంచి నడిపిస్తున్నట్టుగా ఉందన్నారు. 15 నెలలు గడిచినా రేవంత్‌కు పాలనపై ఇంకా పట్టు రాలేదని సుభాష్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాసమస్యల పరిష్కారం విషయంలో ఎవరిని అడగాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందన్నారు.

నగర వార్తలు

నగరంలో నేడు

- నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాహితీప్రియులకు పుస్తక ప్రదర్శన అందుబాటులో ఉంటుంది. ఈ సందర్భంగా పుస్తకాలపై 60 శాతం వరకు ప్రత్యేక రాయితీ సదుపాయం ఉంది.
- కొత్తగూడలోని హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఉదయం 10 నుంచి నుంచి సాయంత్రం వరకు ఫుడ్ ఇండియా ఎక్స్‌పో–2025 ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

రేపు మాంసం దుకాణాలు బంద్

సాక్షి,సిటీబ్యూరో: మహావీర్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 10వ తేదీన జీహెచ్‌ఎంసీ పరిధిలోని మటన్, గొడ్డు మాంసం దుకాణాల్ని బంద్ చేయనున్నట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని యూట్యూబర్‌పై కేసు

బంజారాహిల్స్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని వచ్చిన ఫిర్యాదు మేరకు ఓ యూట్యూబర్‌పై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–2లోని కేబీఆర్ పార్కు సమీపంలో బీఎన్‌రెడ్డి కాలనీ సమీపంలో'న్యూస్ లైన్ తెలుగు'అనే యూట్యూబ్ చానల్‌ను శంకర్ నడుపుతున్నారు. ఇటీవల ఈ యూట్యూబ్‌లో సీఎంపై శంకర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–14లోని శ్రీవెంకటేశ్వరనగర్‌కు చెందిన ముప్పు పరమేష్ యాదవ్ అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

స్పీకర్‌కు ఓయూ వీసీ ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో జరిగే మహనీయుల జయంతి ఉత్సవాలకు హాజరుకావాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మంగళవారం ఆహ్వానించారు. ఈ నెల 10 నుంచి 14 వరకు క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జరగనున్న పూలే, అంబేద్కర్ వంటి మహనీయుల జయంతి ఉత్సవాలకు స్పీకర్‌ను ఆహ్వానించగా అందుకు అంగీకరించినట్లు అధికారులు తెలిపారు.

నూతన విత్తన చట్టం తీసుకురావాలి

పర్యావరణ వేత్తలు, పబ్లిక్ పాలసీ నిపుణులు



విత్తన పండగలో రూపొందించిన నివేదికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం నూతన విత్తన చట్టం, విత్తన విధానం తీసుకురావాలని, నకిలీ విత్తనాలు అరికట్టి దేశీయ విత్తనాలను ప్రోత్సహించాలని పలువురు పర్యావరణ వేత్తలు, పబ్లిక్ పాలసీ నిపుణులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లా కడ్తాల్ ఎర్త్ సెంటర్‌లో నిర్వహించిన తొలి తెలంగాణ విత్తన పండుగలో చేసిన తీర్మానాల ప్రతిని మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, పబ్లిక్ పాలసీ నిపుణులు దొంతి నరసింహారెడ్డి, మాజీ ఆర్టీఐ కమిషనర్ దిలీప్‌రెడ్డి, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ అధ్యక్షులు కె.లీలా లక్ష్మారెడ్డి, జాకబ్ వెల్లీధానం ఆవిష్కరించారు. వచ్చే సంవత్సరం నుంచి ప్రతీ జిల్లాలో విత్తన పండగ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పండులో భాగంగా పర్యావరణ, వ్యవసాయ, విధాన పరమైన అంశాలను చర్చించినట్లు తెలిపారు. విత్తన పండగలో 14 అంశాలతో నివేదికను రూపొందించామని, దాన్ని త్వరలోనే ముఖ్యమంత్రికి, వ్యవసాయశాఖ మంత్రికి ఇవ్వనున్నట్లు తెలిపారు.

వేములపల్లి శ్రీకృష్ణకు నివాళి

చందానగర్: మాజీ ఎమ్మెల్యే, 'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా, గతమెంతో ఘనకీర్తి గలవోడా' గేయ రచయిత వేములపల్లి శ్రీకృష్ణ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం సీఆర్ ఫౌండేషన్‌లో ఆయన చిత్రపటానికి సీనియర్ పాత్రికేయుడు ఏబీకే ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములపల్లి శ్రీకృష్ణ ప్రతిపక్ష నాయకుడిగా, శాసన సభ సభ్యుడిగా అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి వి.చెన్నకేశవరావు, ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ కె.రజిని, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోస్యభట్ల కల్పన, సభ్యులు కనపర్తి జ్యోత్స్న, లలిత, వృద్ధాశ్రమం సలహా కమిటీ సభ్యులు డాక్టర్ మండవ గోపీచంద్, తమ్మారెడ్డి తాన్యా, డాక్టర్ సరస్వతి, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

11న పూలే జయంతి ఉత్సవాలు

హిమాయత్‌నగర్: ఈనెల 11న ఫిలింనగర్‌లో నిర్వహించే మహాత్మా జ్యోతిబా పూలే 198వ జయంతి ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు తరలిరావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పూలే జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్‌గా బీసీ కుల సంఘాల కో చైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్‌ను ప్రకటించారు. ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు, అన్ని పార్టీల నాయకులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం లేదని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం నాయకులు కులకచర్ల శ్రీనివాస్, శ్యామ్ కుర్మా, తాటికొండ విక్రమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఓయూలో కాంట్రాక్టు అధ్యాపకుల ధర్నా



ఓయూలో ధర్నా చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో 12 వర్సిటీల్లో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్టు అధ్యాపకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బోధనను బహిష్కరించిన కాంట్రాక్టు అధ్యాపకులు ఓయూ పాలన భవనం ఎదుట ధర్నా చేపట్టారు. వర్సిటీల్లో పర్మనెంట్ అధ్యాపకుల నియామకం కోసం విడుదల చేసిన జీవో నంబర్ 21ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు అధ్యాపకులకు బెసిక్, డీఏ, హెచ్‌ఆర్‌ఏతోపాటు 3 శాతం ఇంక్రిమెంట్‌తో కూడిన స్కేలు అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సీమర్ల విజేందర్‌రెడ్డి, ధర్మతేజ, రేష్మారెడ్డి, మోడం రవి, కృష్ణయ్య, వెంకటేష్, మహేందర్, అరుణ్, కిరణ్, అశోక్, వాణి, హరీశ్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 21ను రద్దు చేయాలని ఆందోళన

సుల్తాన్‌బజార్: వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలోని కాంట్రాక్ట్ అధ్యాపకులు మంగళవారం తరగతులు బహిష్కరించి వర్సిటీ ప్రాంగణంలో బ్రిటీష్ రెసిడెన్సీ వద్ద ఆందోళనకు దిగారు. కొత్తగా అసిసెంట్ ప్రొఫెసర్ల నియామకాల కోసం ఇచ్చిన జీఓ 21ను రద్దు చేసి రాష్ట్ర వ్యాప్తంగా 12 విశ్వవిద్యాలయాలలో పని చేస్తున్న 1,270 మంది అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని ఐలమ్మ విశ్వవిద్యాలయం కాంట్రాక్ట్ అధ్యాపకుల జేఏసీ కన్వీనర్ ఉపేందర్‌రావు డిమాండ్ చేశారు. ధర్నాలో డాక్టర్ వినీత పాండే, డాక్టర్ రజిని, డాక్టర్ సనత్, డాక్టర్ రవి, డాక్టర్ సునీత, జ్యోతి, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ కృష్ణాజీ, డాక్టర్ శేఖర్‌రెడ్డి, డాక్టర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గోర్‌బోలిని 8వ షెడ్యూల్‌లో చేర్చాలి

రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డాక్టర్ డి.టి.నాయక్

పంజగుట్ట: కేంద్ర ప్రభుత్వం బంజారాల గోర్‌బోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, గోర్ జీవన్ పరిరక్షణ సమితి ట్రస్టీ సభ్యులు డాక్టర్ డి.టి.నాయక్ కోరారు. తెలంగాణ ప్రభుత్వం గోర్ భాషను అధికార భాషగా గుర్తించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గోర్ జీవన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి మేనేజింగ్ ట్రస్టీ ఎస్.కె.రామ్‌చందర్ నాయక్, ఇన్‌కంట్యాక్స్ కమిషనర్ జీవన్ లాల్ లావుద్యాలతో కలిసి ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 12 కోట్ల మంది ఉన్న బంజారాలను వివిధ పేర్లతో పిలిచినప్పటికీ అందరూ ఒకే భాష మాట్లాడతారని అన్నారు. కార్యక్రమంలో గిరిజన శక్తి వ్యవస్థాపకుడు డాక్టర్ వెంకటేష్ చౌహాన్, నాయకులు జాటోత్ హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

నందిని సిధారెడ్డికి సాహితీ పురస్కారం



నందిని సిధారెడ్డికి పురస్కారాన్ని అందజేస్తున్న అనుమాండ్ల భూమయ్య

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ ఉద్యమం, సాహిత్య లోకంలో ప్రముఖ కవి నందిని సిధారెడ్డి ముద్ర చిరస్మరణీయమని తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య అనుమాండ్ల భూమయ్య అన్నారు. సిధారెడ్డి తన రచనలతో సమాజహితం కోసం పాటుపడ్డారని పేర్కొన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు ఆచార్య జి.చెన్నకేశవరెడ్డి 81వ జన్మదినం సందర్భంగా సిధారెడ్డికి పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, కాళోజీ నారాయణరావు పురస్కార గ్రహీత అమ్మంగి వేణుగోపాల్, కేంద్ర సాహిత్య అకాడమి సలహామండలి సభ్యులు నాళేశ్వరం శంకరం, జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక సభ్యులు సూర్య ప్రకాష్‌రావు, ప్రొఫెసర్ శంకర్‌రెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం

తెలంగాణ జమాతే ఇస్లామిక్ హింద్



మాట్లాడుతున్న అబ్దుల్ మజీద్ షోయబ్

పంజగుట్ట: లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లు–2025 ఆమోదం పొందడం మత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని తెలంగాణ జమాతే ఇస్లామిక్ హింద్(జేఐహెచ్) ఉపాధ్యక్షుడు అబ్దుల్ మజీద్ షోయబ్ అన్నారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా సెక్యులర్ హిందువులు, క్రిస్టియన్లు, సిక్కులను కూడా కలుపుకుపోయి దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తామని పేర్కొన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఐహెచ్ కార్యదర్శి డాక్టర్ ఉస్మాన్, ఫక్రుద్దీన్, జయీముద్దీన్, అహ్మద్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తాత, ముత్తాతలు ఇచ్చిన ఆస్తులపై ఇతరుల పెత్తనం తీసుకువచ్చేందుకు ఉద్దేశించిన బిల్లును వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ బిల్లు ముస్లింల మతపరమైన ఆస్తులను సంరక్షించడంలో స్వయంప్రతిపత్తిని హరింపజేస్తుందని, వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో ప్రభుత్వ జోక్యాన్ని పెంచేలా ఉందని పేర్కొన్నారు. లౌకికవాదాన్ని సమర్థిస్తున్నామని చెప్పుకుంటూనే రాజ్యాంగ విరుద్ధమైన చట్టానికి మద్దత్తు ఇస్తున్న ఏపీ, బిహార్ సీఎంలు చంద్రబాబు, నితీష్ కుమార్ తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

బార్లకు రెండేళ్ల టెండర్ అమలు చేయాలి

తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు



మాట్లాడుతున్న వెంకటేశ్వర రావు

పంజగుట్ట: వైన్స్ షాపుల మాదిరిగా బార్లకు కూడా రెండేళ్లకోసారి టెండర్ ప్రక్రియ అమలు చేయాలని తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి వి.రామచంద్రారెడ్డి, కోశాధికారి సుభాష్‌లతో కలిసి మాట్లాడుతూ చాలామంది బార్ నిర్వాహకులు రెస్టారెంట్ ఉన్నట్లు చూపించి పర్మిషన్ రాగానే దాన్ని తీసేసి బార్ మాత్రమే నడిపిస్తున్నారని, వారు కూడా ఎంఆర్‌పీ రేట్లకు మద్యం అమ్మడంతో తమ వ్యాపారంపై దెబ్బపడుతోందని అన్నారు. ఈ నేపథ్యంలో బార్లకు కూడా రెండు సంవత్సరాలకు ఒకసారి లైసెన్స్ విధానం పెడితే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందన్నారు. బార్లల్లో మద్యం బయటకు అమ్మరాదన్న నిబంధనలు ఉల్లంఘించడం వల్ల తమ సేల్స్ 20 శాతం తగ్గాయని ఆరోపించారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు విక్రమ్, ప్రభాకర్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీలో పుస్తక ప్రదర్శన ప్రారంభం

నాంపల్లి: పుస్తకం అక్షర సమాహారం మాత్రమే కాదని, గురువుగా, మిత్రుడిగా, మార్గదర్శిగా నిలుస్తూ మనలోని జిజ్ఞాసను, ఊహాశక్తిని, చర్చా సామర్థ్యాన్ని పెంపొందిస్తుందని, అది పరిశోధన నుంచి ప్రయోగశాల వరకు ఆధారంగా నిలుస్తుందని తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు పేర్కొన్నారు. మంగళవారం నాంపల్లిలోని తెలుగు వర్సిటీ ప్రాంగణంలోని ప్రచురణ విభాగం ద్వారా ప్రచురించిన గ్రంథాలను విక్రయించేందుకు ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిత్యానందరావు మాట్లాడుతూ పుస్తక పఠనం బుద్ధి వికాసానికి, విజ్ఞానాభివృద్ధికి దారి దీపికలుగా పనిచేస్తూ కొత్త ఆలోచనలను ప్రపంచానికి పరిచయం చేస్తాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ ఎ.ఎస్.జగదీష్, సహాయ సంచాలకులు బి.శ్రీనివాస్ గౌడ్, ప్రచురణల విభాగం సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను ప్రదర్శిస్తున్న ఆచార్య నిత్యానందరావు తదితరులు

క్లుప్తంగా...

సిలిండర్ల ధరల పెంపుపై నేడు రాష్ట్రవ్యాప్త ఆందోళన

- సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్లపై రూ.50 అదనంగా పెంచడం వల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో ఖాళీ సిలిండర్లతో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మేలు చేసేందుకు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తుంటే కేంద్రం తన ఇష్టానుసారంగా ధరలు పెంచుకుంటూ పోతోందని విమర్శించారు. కేంద్రం కార్పొరేట్ కంపెనీలకు, బడా పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ ప్రజల మీద మాత్రం భారాలు మోపుతోందని కూనంనేని ఆరోపించారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపు



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ మార్కెట్లో తగ్గిన క్రూడాయిల్ ధరలకు అనుగుణంగా వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించి ఇవ్వాల్సిన కేంద్ర ప్రభుత్వం రూ.50 పెంచడం దారుణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మండిపడ్డారు. పెంచిన వంటగ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధ, గురువారాల్లో రాష్ట్రవ్యాప్త నిరసనలు చేపట్టాలని పార్టీ శాఖలకు, ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వ నిర్ణయం వల్ల ఉజ్వల పథకం లబ్ధిదారులు, సాధారణ వినియోగదారులతో పాటు మహాలక్ష్మి స్కీం అమలు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వంపై కూడా పెద్ద భారం పడుతుందని ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తంచేశారు. మోదీ ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరలను ఉపసంహరించుకోవాలని, ఇందుకోసం కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలను నియంత్రిస్తామని చెప్పిన కేంద్రం అన్ని రకాల సరుకులు, వస్తువుల ధరలను పెంచిందని, అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్యాస్ సిలిండర్ ధరలు 130.57 శాతం పెంచడంతో పాటు, సబ్సిడీని కూడా తగ్గించుకుంటూ వచ్చిందని జాన్‌వెస్లీ విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు రాయితీలిస్తూ, రాష్ట్రంలోని వినియోగదారులపై సంవత్సరానికి రూ.400 కోట్ల భారం మోపుతోందని ఆరోపించారు.

సీబీఐ కాదు సీబీఎన్ విచారణ చేయించండి

- హెచ్‌సీయూ భూములపై ఎంపీ చామల కిరణ్ ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలంగాణకు రాగానే కార్పొరేటర్ అయిపోతారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హెచ్‌సీయూ భూముల గురించి సీబీఐ విచారణ జరిపిస్తామంటున్నారని, కానీ జరపాల్సింది సీబీఐ విచారణ కాదు సీబీఎన్ (చంద్రబాబు నాయుడు) విచారణ అని ఎద్దేవా చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్‌తో కలిసి చామల మాట్లాడారు. ఆ భూములను బిల్లీరావు అనే వ్యక్తికి చెందిన ఐఎంజీ కంపెనీకి కేటాయించినప్పుడు నాడు ప్రధానిగా వాజ్‌పేయి, రాష్ట్ర సీఎంగా చంద్రబాబు ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. ప్రైవేటు వ్యక్తికి కేటాయించిన భూములను పోరాడి ప్రభుత్వానికి దక్కేలా చేసింది సీఎం రేవంత్‌రెడ్డి కాదా? అని చామల ప్రశ్నించారు. తిహార్ జైలు నుంచి వచ్చాక ఏదో విధంగా బయట కనిపించాలనే ఆలోచనతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత ఏదో ఒకటి మాట్లాడుతున్నారని, అందులో భాగంగానే జ్యోతిబా పూలే అంశాన్ని ఎత్తుకున్నారని చామల ఎద్దేవా చేశారు.

భూ స్కాంలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- బీజేపీ నేతలు కాసం, ప్రకాశ్‌రెడ్డి డిమాండ్

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన భూ కుంభకోణాలపై సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐ ద్వారా విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎస్.ప్రకాశ్‌రెడ్డి డిమాండ్‌చేశారు. కంచ గచ్చిబౌలి భూములపై సీబీఐ విచారణ జరపాలన్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తోడుదొంగలు. రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి, తెలంగాణ భూములను అమ్మి రియల్ ఎస్టేట్ కేంద్రంగా మార్చేందుకు కుట్ర చేస్తున్నారు'అని ఆరోపించారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ కంచ గచ్చిబౌలి 400 ఎకరాల భూమిని తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్ల రుణం తేవడంపై రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'హైదరాబాద్ చుట్టున్న భూములను కేసీఆర్, కేటీఆర్ దోచుకుంటున్నారని పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఇప్పుడు సీఎంగా ఆ భూముల నుంచి ఒక్క ఎకరమైనా స్వాధీనం చేసుకుని ప్రజాప్రయోజనాల కోసం ఉపయోగించారా?'అని ప్రశ్నించారు.





అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐసీసీ సెషన్‌కు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రి దామోదర, కాంగ్రెస్ నేతలు రఘువీరారెడ్డి, రుద్రరాజు, కొప్పుల రాజు.

సబర్మతి ఆశ్రమంలో రాట్నం తిప్పుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నదీ జలాలు లేకుంటే పుష్కర స్నానాలెలా?

కాళేశ్వరంలో వేగంగా ఎండుతున్న గోదారి • వచ్చే నెల 15 నుంచి సరస్వతీ పుష్కరాలు

దేవాదాయ-నీటిపారుదల శాఖ అధికారుల మల్లగుల్లాలు • నదిలో బోర్లు వేసి తాత్కాలిక కుంటలో నీళ్లు నింపే యోచన

సాక్షి, హైదరాబాద్: గోదావరి–ప్రాణహిత నదులు సంగమించే చోట అంతర్వాహినిగా ఉందని భక్తులు విశ్వసించే సరస్వతీ నదికి వచ్చే నెలలో పుష్కరాలు ఉన్నాయి.. సరిగ్గా మండే ఎండల్లో పుష్కరాలు నిర్వహించాల్సి రావటంతో కొత్త చిక్కు ముంచుకొస్తోంది.. భక్తులు పుణ్యస్నానాలాచరించాల్సిన గోదావరి నది వేగంగా అడుగంటుతోంది. పుష్కరాలకు మరో 37 రోజులున్నందున.. అప్పటికి నీళ్లు దాదాపు ఇంకిపోనున్నాయి. నదిలో నీళ్లే లేకుంటే భక్తులు స్నానాలు ఎలా చేస్తారు?

ఇప్పుడు ఇదే ప్రభుత్వాన్ని వేధిస్తున్న సమస్య

సరస్వతీ పుష్కరాలను ఘనంగా నిర్వహించాలని ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత జరుగుతున్న తొలి పుష్కరాలు కావటంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయంతో, దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్ ఆధ్వర్యంలో అన్ని విభాగాల అధికారుల బృందం ప్రయాగ్‌రాజ్ వెళ్లి మహాకుంభమేళా నిర్వహణ తీరును అధ్యయనం చేసి వచ్చింది. కోట్ల మంది భక్తులు వచ్చినా ఇబ్బందులు ఎదురుకాకుండా ఏర్పాట్లు చేసిన విధానాన్ని పరిశీలించింది. వచ్చే ఏడాది, ఆపై సంవత్సరం గోదావరి, కృష్ణా పుష్కరాలు నిర్వహించాల్సి ఉంది. వచ్చే నెల 15 నుంచి 26 వరకు సరస్వతీ పుష్కరాలు ఉన్నాయి. గోదావరి, కృష్ణా పుష్కరాలకు ముందు ప్రారంభంకానున్న సరస్వతీ పుష్కరాలను ఘనంగా నిర్వహించాలన్న ఉద్దేశంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. కానీ, పుష్కరాలకు అతి ముఖ్యమైన నదీ జలాలే లేకుంటే ఎలా అని అధికారులు తర్జనభర్జనలో మునిగిపోయారు. తాజాగా దేవాదాయశాఖ ఉన్నతాధికారులు నీటిపారుదల శాఖ అధికారులతో భేటీ అయి దీనిపై చర్చించారు.



తాత్కాలిక అడ్డుకట్టతో నీటి నిల్వ

ప్రస్తుతం గోదావరి దాదాపు అడుగంటింది. ప్రాణహిత నదిలో కొంత నీటి ప్రవాహం ఉంది. కాళేశ్వరం దేవాలయం సమీపంలో నదీగర్భంలో తాత్కాలిక అడ్డుకట్ట నిర్మించి నీటిని నిల్వ చేసి పుష్కర స్నానాలకు వాడాలన్న ప్రతిపాదన వచ్చింది. కానీ, మండే ఎండల్లో నిల్వ నీటిలో బ్లూగ్రీన్ ఆల్గే బ్యాక్టీరియా ఏర్పడే ప్రమాదం ఉంటుందని, ఆ నీటిలో స్నానం చేస్తే చర్మ సంబంధిత సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉండనున్నందున అది ఆచరణీయం కాదని భావిస్తున్నారు.

ఎల్లంపల్లి నుంచి నీటి విడుదల

కాళేశ్వరం దేవాలయానికి ఎగువన ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసి నదిలో స్నానాలకు నీళ్లు ఉండేలా చూడాలన్నది మరో ఆలోచన. కానీ, ఎల్లంపల్లి ప్రాజెక్టు కాళేశ్వరం దేవాలయానికి దాదాపు 80 కి.మీ. దూరంలో ఉంది. ప్రస్తుతం గోదావరిలో భారీ గుంతలున్నాయి. ఆ గుంతలు నిండితేనే ప్రవాహం ముందుకు సాగుతుంది. ఇసుక తేలిన నదిలో చాలా నీళ్లు ప్రవాహంలోనే ఇంకుతాయి. పుష్కరాల నాటికి ప్రచండ ఎండలుండనున్నందున ప్రవాహంలో నీళ్లు ఆవిరయ్యే పరిస్థితి ఉంటుంది. వీటిని తట్టుకుని నీళ్లు దేవాలయం వరకు చేరాలంటే నిత్యం 5 వేల క్యూసెక్కుల వరకు విడుదల చేయాల్సి ఉంటుందని అధికారులంటున్నారు. అది అంత సులభం కాదనే అభిప్రాయమూ ఉంది.

బోర్లు వేయటం ద్వారా

నదిలో శక్తివంతమైన బోర్లు తవ్వించటం ద్వారా నీటిని పైకి లాగి తాత్కాలిక కొలనులు ఏర్పాటు చేసి నీటిని నింపాలన్నది ఒక ఆలోచన. ఇక ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకొచ్చి పుష్కర ఘాట్లపై షవర్లు ఏర్పాటు చేసి జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేయాలన్నది మరో ఆలోచన. త్వరలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

ఏఐతో కాదు.. ఎనుముల ఇంటెలిజెన్స్‌తోనే ప్రమాదం

ప్రజలను మోసం చేయడమే రేవంత్ పని: ఎమ్మెల్సీ కవిత

ఈ నెల 11లోగా అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటుపై ప్రకటన చేయాలి

ఎస్సీ, ఎస్టీ, బీసీలపై వ్యతిరేకత బీజేపీ డీఎన్‌ఏలో ఉంది

ఇందిరాపార్కు వద్ద పూలే విగ్రహ సాధన దీక్ష



తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్కు వద్ద జరిగిన పూలే విగ్రహ సాధన దీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

కవాడిగూడ (హైదరాబాద్): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో చాలా ప్రమాదమని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని, కానీ ఏఐ అంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాదని, ఏఐ అంటే ఎనుముల ఇంటెలిజెన్స్ అని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎద్దేవా చేశారు. ఎనుముల ఇంటెలిజెన్స్ రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తోందని, దీన్ని పక్కకు జరిపితే తప్ప రాష్ట్రం బాగుపడే పరిస్థితి కనిపించడం లేదని మండిపడ్డారు. ప్రజలను మోసం చేయడమే ఎనుముల ఇంటెలిజెన్స్ అని, దాంతోనే కులగణను తప్పుదోవ పట్టించి బీసీలకు అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీసీల ఆరాధ్యుడు మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఈ నెల 11న ఆయన జయంతి సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేస్తామని ప్రకటన చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద పూలే విగ్రహ సాధన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో న్యాయవాదులు, డాక్టర్లు, మేధావులు, కార్మికులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ దీక్షలో కవిత ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

అవసరమైతే ఢిల్లీలో నిరవధిక దీక్ష

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టామని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు ఆ ధైర్యం లేదని ప్రశ్నించారు. 2011లో యూపీఏ హయాంలో దేశంలో కులగణన చేసినా ఇప్పటికీ ఆ వివరాలు వెల్లడించలేదని ఆరోపించారు. బీసీ కులగణన చేయబోమని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ చెప్పిందని, ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తెస్తే తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కేంద్రంపై ఒత్తిడి తేకుండా కాంగ్రెస్ మాదిరి ఢిల్లీలో దొంగ దీక్షలు చేయమని, అవసరమైతే ఢిల్లీకి వెళ్లి నిరవధిక దీక్షకు కూర్చుంటామని ఆమె చెప్పారు.

ఆ బిల్లులు ఏమయ్యాయి?

కులగణన బిల్లును చట్టసభలు ఆమోదించి నాలుగు వారాలైందని, ప్రస్తుతం ఆ బిల్లుల స్థితి ఏమిటో ప్రభుత్వం ప్రకటించాలని కవిత డిమాండ్ చేశారు. గవర్నర్ వద్దనే పెండింగ్‌లో ఉందా? లేదా రాష్ట్రపతికి పంపించారా అనే విషయం చెప్పాలన్నారు. బిల్లులు ఆమోదం పొందిన తర్వాత అన్ని పార్టీలను ప్రధాని వద్దకు తీసుకెళ్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని, కానీ ఇప్పటివరకు ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లలేదని చెప్పారు. బీజేపీతో రేవంత్‌రెడ్డి లాలూచీ లేకుంటే ప్రధాని అపాయింట్‌మెంట్ ఎందుకు లభించలేదని, బీజేపీని కాపాడేందుకే ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లడం లేదని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలపై వ్యతిరేకత బీజేపీ డీఎన్‌ఏలోనే ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వం అయోధ్యలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రామమందిర ప్రారంభానికి రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడం ముమ్మాటికీ కుల వివక్షే అన్నారు. ఈ దీక్షలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, గట్టు రాంచందర్‌రావు, తెలంగాణ హౌస్‌ఫెడ్ డైరెక్టర్ కిషన్ రావు, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరి శంకర్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

లిక్కర్ మరకలను తుడుచుకునేందుకే కవిత విన్యాసాలు

పూలే పేరెత్తే అర్హత కూడా ఆమెకు లేదు: ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు జ్యోతిరావ్ పూలే విగ్రహం పెట్టాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఎందుకు గుర్తుకు రాలేదని, అప్పుడు తన తండ్రికి ఆమె ఎందుకు చెప్పలేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. 'బీసీలపై అంత ప్రేమ ఉంటే తెలంగాణ జాగృతి అధ్యక్ష పదవి నుంచి కవిత తప్పుకుని బీసీ నేతకు ఇవ్వాలి. బీఆర్‌ఎస్ అధ్యక్ష పదవి నుంచి కేసీఆర్‌ను, వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి నుంచి కేటీఆర్‌ను దింపి ఒక దళితుడికి, ఒక బీసీకి ఆ పదవులు ఇవ్వాలి. అసలు బీసీలకు, కవితకు ఏం సంబంధం ఉందని పూలే గురించి ఆమె మాట్లాడుతున్నారు. అసలు ఆయన పేరు ఎత్తే అర్హత కూడా ఆమెకు లేదు' అని ఆయన వ్యాఖ్యానించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ నేతలు కల్వ సుజాత, చరణ్‌కౌశిక్ యాదవ్, విజయభాస్కర్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. లిక్కర్ కేసులో ఆరునెలల పాటు తిహార్ జైల్లో ఉండి వచ్చిన కవిత తన లిక్కర్ మరకలు తుడుచుకునేందుకు విన్యాసాలు చేస్తున్నారని విమర్శించారు. పూలే విగ్రహం పెట్టాలని కవిత చెపితే ప్రభుత్వం, అసెంబ్లీ స్పీకర్ తెలుసుకునే పరిస్థితులు లేవని ఎద్దేవా చేశారు. పదేళ్ల పాటు దొర నియంతృత్వానికి, అహంకారానికి సాక్ష్యంగా నిలిచిన ప్రగతిభవన్‌ను జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌గా మార్చి కల్వకుంట్ల కుటుంబం చేసిన పాపాలను కడిగేశామని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ధర్నా చౌక్ ఎత్తేసి.. ఇప్పుడు అక్కడ ధర్నాలు చేయడానికి సిగ్గుండాలని ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు.


పెండింగ్ బిల్లులు చెల్లించండి

సర్పంచుల సంఘం జేఏసీ నిరసన

సాక్షి, హైదరాబాద్: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులను చెల్లించాలంటూ సర్పంచుల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సంఘ నేతలు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట మంగళవారం నల్ల బ్యాడ్జీలు, ఫ్ల కార్డులతో మోకాళ్లపై కూర్చుని నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కార్యాలయ అధికారికి సంఘ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విధంగా ఉద్యమ కార్యాచరణ చేపడతామన్నారు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కాకుల బోర్డు తండా మాజీ సర్పంచ్ భర్త గుగులోతు కిషన్ నాయక్‌కు గన్‌పార్క్ వద్ద సంఘ నేతలు నివాళులర్పించారు.

హెచ్‌సీయూ భూముల వెనుక భారీ కుంభకోణం

- ఓ బీజేపీ ఎంపీ హస్తం కూడా ఉంది.. త్వరలో వివరాలు వెల్లడిస్తా
- కాంగ్రెస్, బీజేపీ పొత్తుల సద్ది రేవంత్.. బండి సంజయ్ ఆయన రక్షకుడు
- ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ రాతలు సుప్రీంకోర్టు ఉల్లంఘన కిందకే వస్తాయి
- వరంగల్ రజతోత్సవ సభకు పోలీసులు అనుమతి ఇవ్వకుంటే కోర్టుకు..
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని 400 ఎకరాల భూముల వెనుక భారీ కుంభకోణం దాగి ఉందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఒకటి రెండు రోజుల్లో వెల్లడిస్తానని చెప్పారు. డబ్బులు దోచుకునే ప్రయత్నం వెనుక ఓ బీజేపీ ఎంపీ హస్తం కూడా ఉందన్నారు. హెచ్‌సీయూ భూముల అంశం, బీఆర్‌ఎస్ రజతోత్సవ సభతోపాటు పలు వర్తమాన అంశాలపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. నందినగర్ నివాసంలో మంగళవారం మీడియా ప్రతినిధులతో కేటీఆర్ ఇష్టాగోష్ఠి నిర్వహించారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే...

ఏఐ అంటే ఎనుముల ఇంటెలిజెన్స్

'హెచ్‌సీయూ భూముల అంశంలో విద్యార్థులు, ప్రజలు, ప్రముఖులు స్పందించిన తర్వాత ప్రధాన ప్రతిపక్షంగా అండగా నిలబడ్డాం. ఏఐ ఆధారిత వీడియోలు అంటూ వక్రభాష్యం చెప్పి ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. ఏఐ అంటే ఎనుముల రేవంత్‌రెడ్డి ఇంటెలిజెన్స్ అనుకోవాలా. పర్యావరణ పరిరక్షణ కోరుతున్న ప్రముఖులపైనా కేసులు పెట్టే దుర్మార్గపు ప్రయత్నాలు సాగుతున్నాయి. తనకు దక్కనిది ఎవరికీ దక్కకూడదనే రీతిలో హెచ్‌సీయూ తరలింపు అంటూ రేవంత్ లీకులు ఇస్తున్నాడు.

రెండు పార్టీల బతుకు ఢిల్లీ చేతుల్లో

కాంగ్రెస్, బీజేపీ నేతల బతుకు ఢిల్లీ బాస్‌ల చేతిలో ఉంది. ఏఐసీసీ ఇన్‌చార్జ్ హెచ్‌సీయూ భూముల అంశంలో జోక్యం చేసుకోవడం సీఎం రేవంత్ అట్టర్ ఫ్లాప్ అయ్యారని అర్థం. ఒకరు ఢిల్లీ నేతల చెప్పులు మోస్తే, మరొకరు ఢిల్లీకి బ్యాగులు మోస్తారు. దేశంలో బహుశా రెండు జాతీయ పార్టీలను కాపాడుతున్న ఏకైక సీఎం రేవంత్. ఆయన రెండు పార్టీల పొత్తుల సద్ది లాంటివాడు. రేవంత్‌కు బీజేపీ, కేంద్రమంత్రి బండి సంజయ్ రక్షణ కవచంలా పనిచేస్తున్నాడు.

ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ రాతలు 'సుప్రీం'కు విరుద్ధం

ఆంధ్రప్రదేశ్‌లో రిషికొండపై జరిగింది విధ్వంసమంటున్న ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ కంచ గచ్చిబౌలిలో జరిగింది మాత్రం పర్యావరణ విధ్వంసం కాదంటున్నాడు. గతంలో నారా లోకేశ్ రెడ్‌బుక్ రాస్తే ప్రజాస్వామికం అన్నవారు.. ఇక్కడ కేసులు పెడుతున్న ప్రభుత్వ వైఖరిని మాత్రం నిందించరు. హెచ్‌సీయూ భూముల విషయంలో సుప్రీంకోర్టు తీర్పును రాధాకృష్ణ తన రాతలతో తప్పు పట్టడం ఉల్లంఘన కిందకే వస్తుంది. బహుశా సుప్రీంకోర్టుతో ఎక్కువసార్లు మొట్టికాయలు తిన్న సీఎం రేవంత్.

గ్యాస్ ధరల పెంపుతో అతలాకుతలం

కేంద్ర ప్రభుత్వం గ్యాస్, పెట్రోలు ధరలు పెంచి సామాన్యుల జీవితాలను అతలాకుతలం చేస్తోంది. ట్రంప్ పన్నుల విధానంతో తెలంగాణకు ఫార్మా, ఐటీ రంగాల్లో పెద్దదెబ్బ తగలబోతోంది. కాంగ్రెస్ ప్రతికూల విధానాలతో జీఎస్టీ, రిజిస్ట్రేషన్ ఆదాయం తగ్గింది. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీ విచ్చలవిడి జలదోపిడీకి పాల్పడుతోంది.

అనుమతి ఇవ్వకుంటే కోర్టుకు వెళతాం

తెలుగు రాష్ట్రాల్లో 25 ఏళ్లు పూర్తి చేసుకున్నది టీడీపీ, ఆ తర్వాత బీఆర్‌ఎస్ మాత్రమే. ఉద్యమం, అధికారం, ప్రతిపక్ష పాత్ర నిర్వహిస్తున్నది కూడా బీఆర్‌ఎస్ పార్టీయే. ఈ నేపథ్యంలో వరంగల్‌లో 1200 ఎకరాల్లో రజతోత్సవ సభ ఏర్పాట్లు జరుగుతున్నాయి. పోలీసులు అనుమతి ఇవ్వకుంటే కోర్టును ఆశ్రయిస్తాం. 3వేల బస్సుల కోసం ఆర్టీసీకి దరఖాస్తు చేసి రూ.8 కోట్లు చెల్లించాం. ఈ ఏడాది అంతా బిజీగా ఉండేలా పార్టీ కార్యక్రమాలు ఉంటాయి'అని కేటీఆర్ చెప్పారు.

సీబీఐ విచారణకు లేఖ రాయండి

హెచ్‌సీయూ భూములపై సీఎంకు బండి సంజయ్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే హెచ్‌సీయూ భూముల వ్యవహారంపై సీబీఐ విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. సీబీఐ విచారణకు సిద్ధమైతే హెచ్‌సీయూ భూ కుట్రదారుల బాగోతాన్ని బట్టబయలు చేస్తామని సవాల్ విసిరారు. ఈ విచారణకు సిద్ధపడితే హెచ్‌సీయూ భూములను దోచుకునేందుకు ఎవరు కుట్రలు చేస్తున్నారో, వారికి ఎవరు సహకరిస్తున్నారనే విషయాలన్నీ బయటకు వస్తాయన్నారు. మరి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆ దమ్ముందా? ఈ భూముల వ్యవహారంపై సీబీఐ విచారణకు డిమాండ్ చేసే దమ్ము బీఆర్‌ఎస్‌కు ఉందా? తేల్చుకోవాలన్నారు. ఈ భూముల అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ ఆందోళన చేస్తుంటే రేవంత్‌రెడ్డి, కేటీఆర్ కలిసి బురదచల్లేందుకు కుట్రలు చేస్తున్నారని మంగళవారం ఆయన ఓ ప్రకటనలో మండిపడ్డారు.

రేవంత్, కేటీఆర్ జాన్ జబ్బలు...

'రేవంత్ రెడ్డి, కేటీఆర్ జాన్ జబ్బలు (ప్రాణ మిత్రులు)గా మారారు. ఇద్దరూ కలిసే రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు. కేటీఆర్ జైలుకు వెళ్లకుండా కాపాడుతున్నది రేవంత్‌రెడ్డే. ఆ ఇద్దరూ కలిసే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఎంపీలతో ఓటేయించారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇద్దరూ కలిసే మజ్లిస్‌ను గెలిపించేందుకు సిద్ధమయ్యారు. గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ రేవంత్‌ను కాపాడేందుకు కేటీఆర్ బీఆర్‌ఎస్‌ను బరిలో దింపలేదు' అని బండి ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి, అక్రమాల కేసుల్లో కేసీఆర్ కుటుంబం అరెస్ట్ కాకుండా రేవంత్ ప్రభుత్వమే ఆ కేసులను నీరుగారుస్తోందని సంజయ్ పేర్కొన్నారు.

ప్రభుత్వ వైఫల్యం వల్లే జీఎస్టీ వృద్ధిరేటు తగ్గుముఖం

మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శ



సాక్షి, హైదరాబాద్: రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యంతోనే జీఎస్టీ వృద్ధి రేటు తగ్గుముఖం పట్టిందని, ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ప్రజల చేతిలో డబ్బు లేకపోతే వినియోగం ఎలా పెరుగుతుందని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో ప్రశ్నించారు. మోసపూరిత అంకెల గారడీతో మోసం చేయకుండా, వాస్తవాల ఆధారంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన అందించాలని కోరారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 5.1 శాతం వృద్ధి మాత్రమే సాధించినట్లు అధికారిక గణాంకాల ఆధారంగా తెలిపారు. దేశవ్యాప్తంగా సగటు జీఎస్టీ వృద్ధి రేటు 10 శాతం ఉండగా.. తెలంగాణ దేశీయ వృద్ధి రేటు చాలా వెనకబడి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర జీఎస్టీ వృద్ధి 12.3 శాతం ఉందని ఇటీవల అసెంబ్లీలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చెప్పడం శోచనీయమన్నారు. అధికారిక గణాంకాలను పరిశీలిస్తే అవి అవాస్తవాలుగా తేలిపోయాయని హరీశ్ వెల్లడించారు. రాష్ట్ర వృద్ధి రేటు క్రమంగా తగ్గడానికి గత 15 నెలలుగా ఈ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలే కారణమని పేర్కొన్నారు.

ప్రసూతి కోసం వస్తే శిశువు ప్రాణం తీశారు

- గర్భిణి కుటుంబ సభ్యుల ఆరోపణ
- శిశువు మృతిచెందడంతో తల, మొండెం వేరుచేసిన వైద్యుడు
- గర్భిణికి ప్రాణాపాయం ఉంటే ఇలా చేసే అవకాశముందన్న డీఎంహెచ్‌వో



బాధితురాలు అనితతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ


అమరచింత: పురిటి నొప్పులతో కాన్పు కోసం వస్తే.. వైద్యులు సిజేరియన్ పేరిట శిశువు తల, మొండెం వేరు చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ సంఘటన వనపర్తి జిల్లా ఆత్మకూర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. అమరచింత మండలం చంద్రగఢ్ గ్రామానికి చెందిన గర్భిణి అనిత సోమవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో తన తల్లితో కలిసి మండల కేంద్రంలోని డీఎంఆర్‌ఎం పీహెచ్‌సీకి వచ్చింది. డ్యూటీలో ఉన్న స్టాఫ్ నర్సు సాధారణ కాన్పు కోసం ప్రయత్నించగా.. ముందుగా బిడ్డ కాళ్లు బయటకు వచ్చాయి. దీంతో బిడ్డ అడ్డం తిరిగిందని, ఆత్మకూర్ సీహెచ్‌సీకి వెళ్లమని చెప్పి అక్కడే ఉన్న అంబులెన్స్‌లో గర్భిణిని తరలించారు. అయితే సీహెచ్‌సీ సిబ్బంది అంబులెన్స్‌లో ఉన్న మహిళను చూసి వనపర్తి జిల్లా కేంద్రానికి వెళ్లమని చెప్పి వదిలేశారు. దీంతో ఆందోళన చెందిన అనిత వెంటనే ఆత్మకూర్‌లోని సుబ్బారెడ్డి ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. రూ.40 వేలు ఇస్తే ఆపరేషన్ చేస్తామని డాక్టర్ సుబ్బారెడ్డి చెప్పడంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉండాలని ఒప్పుకున్నారు. తీరా బిడ్డ ఎప్పుడో చనిపోయిందని, ప్రస్తుతం వాటిని తొలగించకపోతే తల్లి ప్రాణానికి ప్రమాదమని చెప్పిన వైద్యుడు బిడ్డ తల, మొండెం భాగాలను కోసి బయటకు తీశారు. దీంతో వారు భోరున విలపించారు.

డీఎంహెచ్‌వో విచారణ..

ఆత్మకూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో శిశువు తల, మొండెం వేరు చేసిన ఘటనపై డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాసులు మంగళవారం ఆస్పత్రిని సందర్శించి విచారణ చేపట్టారు. ఆస్పత్రిలోని సీసీ పుటేజీలను పరిశీలించారు. ఆస్పత్రి నిర్వాహకుడు డాక్టర్ సుబ్బారెడ్డి, సిబ్బందిని వేర్వేరుగా విచారించారు. అనంతరం బాధితురాలు అనితతో పాటు తల్లి లక్ష్మమ్మ, భర్త రామాంజనేయులుతో మాట్లాడి ఘటనపై పూర్తి స్థాయిలో సమాచారం సేకరించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ 'గర్భంలోనే శిశువు చనిపోయినట్లు నిర్ధారణ అయితే... గర్భిణికి ప్రాణాపాయం జరగకుండా తల, మొండెంను కోసి తీసేయవచ్చు. అయితే ఇది అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో జరగాలి' అని తెలిపారు.

తాజా మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్య

అప్పులు తీర్చే దారి లేక..



కిషన్‌నాయక్

కురవి: అప్పులు చెల్లించలేక తాజా మాజీ సర్పంచ్ భర్త ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కురవి ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నేరడ శివారు కాకులబోడుతండాకు చెందిన గుగులోతు కిషన్‌నాయక్(60) తన అవసరాల కోసం నాలుగేళ్ల క్రితం అదే తండాలో ఉంటున్న సొంతబావ బానోతు హర్యా వద్ద అప్పు తీసుకున్నాడు. ఆ సమయంలోనే తనకున్న 6 ఎకరాల భూమి నుంచి రూ.15 లక్షల కింద 30 గుంటల భూమిని బావకు ఇచ్చాడు. ఇప్పుడు తన రెండో కూతురి పెళ్లి కోసం 3 ఎకరాల భూమిని అమ్మేందుకు కిషన్‌నాయక్ సిద్ధపడ్డాడు. విషయం తెలుసుకున్న బావ హర్యా, మేనల్లుడు సుమన్ ఇటీవల కిషన్‌నాయక్‌తో గొడవకు దిగారు. మాకు ఇచ్చిన 30 గుంటల భూమిని కలిపి అమ్మాలని, లేకపోతే మా డబ్బులు చెల్లించి ఆ తర్వాతే భూమిని అమ్ముకోవాలంటూ గొడవ పడ్డారు. పంచాయితీ పెద్ద మనుషుల వద్దకు వెళ్లింది. మేనల్లుడు సుమన్ చెప్పు తీసుకొని కిషన్‌నాయక్‌ను కొట్టాడు. అంతటితో ఆగకుండా కిషన్‌నాయక్ ఇంటికి తాళం వేసి, ముళ్లకంప పెట్టారు. పెద్దమనుషులు జోక్యం చేసుకొని తాళం తీయించారు. దీంతో అవమానానికి గురైన కిషన్‌నాయక్ మనస్తాపంతో మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకున్నాడు. మృతుడి భార్య కౌసల్య ఫిర్యాదు మేరకు హర్యా, సుమన్, హచ్చిలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చేసిన పనులకు బిల్లులు రాలేదని చర్చ

గుగులోతు కిషన్‌నాయక్ భార్య కౌసల్య కాకులబోడుతండాకు సర్పంచ్‌గా పనిచేసింది. దీంతో కిషన్‌నాయక్ గ్రామాభివృద్ధికి ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులతో పనులు చేశాడు. శ్మశానవాటిక నిర్మాణం, పల్లెప్రకృతివనం పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయంటూ పలువురు సర్పంచ్‌లతో కిషన్‌నాయక్ పలుమార్లు మాట్లాడినట్లు తెలిసింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మరికొన్ని పనులు చేయగా, ఆ బిల్లులు సైతం రావాల్సి ఉన్నట్లు సమాచారం.

✻ ఆఫ్టర్ టెన్త్ క్లాస్

టెన్త్ క్లాస్ పూర్తయ్యి కాలేజీ లోకి అడుగుపెట్టబోయే పిల్లల మానసిక స్థితి అప్పుడే కొత్తగా రెక్కలు వచ్చిన సీతాకోక చిలుకల్లా ఉంటుంది. కాలేజీ చదువులతో మరో ప్రపంచం లోకి అడుగు పెట్టడానికి సిద్ధపడుతున్న పిల్లలకు ఈ వేసవి సమయాన్ని తల్లిదండ్రులు ఎప్పటికీ ఓ మధురమైన జ్ఞాపకంగా మిగిలేలా ఏం ఇవ్వాలి..? ఎలా ఇవ్వాలి.. ?! విలువైన కానుకలు మన వద్దనే ఉన్నాయి...

చదువులు, ఒత్తిడుల నుంచి ఒక్కసారిగా రిలాక్స్ అయిన అనుభూతి. 'ఈ విశ్రాంతి సమయాన్ని నాణ్యంగా, భవిష్యత్తుకు ఉపయోగపడేలా మార్చుకో వడం కూడా మన చేతుల్లోనే ఉంది..' అని వివరించారు లైఫ్‌స్కిల్స్ ఎక్స్‌పర్ట్ పి.జ్యోతిరాజ. మళ్లీ కాలేజీలు తెరిచేవరకు రెండు నెలల సమయం అయినా ఉంటుంది. దానిని సరిగ్గా ఉపయోగిస్తే పిల్లల భవిష్యత్తుకు మేలైన ఎన్నో విషయాలను పెద్దలు పంచవచ్చు అంటున్నారు.



సీతాకోక చిలుకలకు వేసవి పాఠాలు

ఇప్పటివరకు అదే స్కూల్, అదే టీచర్లు, ఇల్లు.. పిల్లలు ఓ సౌకర్యవంతమైన జీవనంలో ఉండి ఉంటారు. ఇప్పుడు మొదటిసారి మరో ప్రపంచంలోకి వెళ్లబోతున్నారు. కాలేజీలో ఏ గ్రూప్‌లో చేరాలో నిర్ణయాలు ఎలాగూ చేసి ఉంటారు. అది చదువుకు సంబంధించింది అయితే, ఈ సమయంలో పిల్లలు నేర్చుకోవాల్సిన జీవననైపుణ్యాలు చాలానే ఉన్నాయి. ఈ రోజుల్లో ఫోన్లతోనే పిల్లలు తమ సమయాన్ని గడిపేస్తున్నారు. సోషల్ మీడియాలోనే కాకుండా సోషల్‌గా తమ చుట్టూ ఉన్నవారితో ఎలా కలిసిపోవాలో తెలిసేలా చేయాలి. పెద్దలు వృత్తి ఉద్యోగాలు అంటూ తీరికలేకుండా ఉంటారు. కానీ, ఈ వేసవిలో కొన్ని రోజులు సెలవులు పెట్టుకొని పిల్లలకు సమయం కేటాయించడం తప్పనిసరి.

ముందు వరసలో ట్రావెల్...

మీరనుకున్న బడ్జెట్‌లో ఒక చిన్న ట్రిప్‌కి ప్లానింగ్ ప్రిపేర్ చేయమని పిల్లలకే చెప్పవచ్చు. అందరూ కూర్చొని ప్లాన్ చేయవచ్చు. దీనివల్ల ట్రావెలింగ్ పట్ల పిల్లలకు సరైన అవగాహన కలుగుతుంది. ట్రావెల్ వల్ల పెద్దవాళ్లు పిల్లలతో క్వాలిటీ టైమ్ గడిపినట్టు ఉంటుంది. థీమ్ పార్కులు, వాటర్ పార్కులు, మ్యూజియంల సందర్శన పట్టణ ప్రాంతాల వారికి అనుకూలంగా ఉంటుంది. మరికొన్ని చదువుకు సంబంధించిన చారిత్రక ప్రదేశాలు, వన్యప్రాణుల సంరక్షణ కేంద్రాల జాబితానూ రూపొందించుకోవచ్చు. ఇది పిల్లల్లో ట్రావెలింగ్ పట్ల అవగాహన కలిగేలా, వారి భవిష్యత్తు ప్రణాళికకు పునాదులు వేసేలా ఉంటుంది. ప్రయాణానికి ఏమేం తీసుకువెళ్లాలో... ఎలా సిద్ధపడాలో, ఫొటో ఆల్బమ్స్ తయారీ.. ఇలా ప్రతిదీ పెద్దలు కూడా కలిసి సొంతంగా తయారు చేసేది ఉంటుంది కాబట్టి ప్రతిదీ మరచిపోలేని జ్ఞాపకంగా మిగిలిపోతుంది.



- దూర ప్రాంతాలకు వెళ్లాలనుకుంటూ బీచ్‌సైడ్ రిసార్ట్‌లు, గ్రామీణ ప్రాంతాల ఆకర్షణను తక్కువ అంచనా వేయవద్దు. ఇక్కడ తల్లిదండ్రులు, పిల్లలు ఇద్దరూ విశ్రాంతి తీసుకోవచ్చు. సైక్లింగ్, ఈత లేదా పెడల్ బోర్డింగ్ వంటి కార్యకలాపాలనూ ఆస్వాదించవచ్చు. ట్రావెల్ డిస్కౌంట్‌లను పొందడానికి ముందుగానే బుకింగ్ చేసుకోవచ్చు. తక్కువ బడ్జెట్‌లో వెళ్లదగిన ట్రెక్కింగ్ ప్లేస్‌లు, కొత్త క్రీడలు, ఫిట్‌నెస్ కోసం సాధన చేయడం, సైక్లింగ్.. కుటుంబ ఐక్యతను సాధిస్తాయి.
- ఎక్కడకు వెళ్లినా ఆరోగ్య భద్రతా చర్యలు తప్పనిసరి అవసరం. వీటితోపాటు వైద్య అత్యవసర పరిస్థితులు, వెంట తీసుకెళ్లిన వస్తువులు మిస్ అయితే, ప్రయాణ ప్రణాళికలో మార్పులను కవర్ చేసే సమగ్ర ప్రయాణ బీమా.. ప్రతిదీ జీవన నైపుణ్యాలలో భాగమే. ఇవన్నీ టెక్స్ట్‌బుక్స్‌లో లభించేవి కావు. పెద్దలే పిల్లలకు పరిచయం చేయాల్సినవి. టీనేజ్‌లో చేసిన పరిచయాలు వారి జీవితాంతం గుర్తుండిపోయేంతగానూ ఉంటాయి.

హ్యాండిల్ విత్ కేర్

టెన్త్‌క్లాస్ పూర్తయిన పిల్లలది టీనేజ్ దశ. కాలేజీకి వెళుతున్నామనే ఉత్సాహం, కొత్త ప్రపంచం చూస్తామనే ఆత్రుత ఉంటాయి. గాజుబొమ్మల్లా పెరిగిన పిల్లలను రూల్స్‌తో కాకుండా పెద్దవాళ్లు గైడ్‌గా ఉండాలి. తాము చెప్పిందే కరెక్ట్ అని కాకుండా ఈ వయసు పిల్లల ఆలోచనలు ఎలా ఉన్నాయో వాళ్లతో సంభాషించడం ద్వారా ఒక స్నేహ వాతావరణం నెలకొంటుంది. పిల్లలు కూడా తమ ఆలోచనలను ఓపెన్‌గా పేరెంట్స్‌తో పంచుకుంటారు. ఇప్పుడు చాలావరకు చిన్న కుటుంబాలు కాబట్టి ఎవరికి వారే అన్నట్టు ఉంటుంటారు. ఈ వేసవిలో అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు.. బంధువులను కలవడం లేదా అపార్ట్‌మెంట్లలో కూడా కొన్ని కుటుంబాలు కలిసి ఏదైనా గ్యాదరింగ్ అయ్యే ఈవెంట్స్ ఏర్పాటు చేయడం ఈ వయసు పిల్లలకు మేలు చేస్తుంది. ఒక మంచి జ్ఞాపకంగానూ మిగిలిపోతుంది.

– పి.జ్యోతిరాజ,
లైఫ్ స్కిల్ ట్రైనర్, సైకాలజిస్ట్

కలిసి చేసే వంట..

వంటిల్లు ఎక్కువ సమయం గడపడానికి సరైన అవకాశం. కొత్త ప్రయోగాల వంటి ప్రత్యేకతలను వంటపట్టేలా చేయవచ్చు. సెలవులను ఎంజాయ్ చేయాలనుకుంటే వంట ఏంటి అని ముందే పిల్లలు ముఖం ముడుచుకునే అవకాశాలు లేకపోలేదు. అందుకని, ఫన్ వంటను క్రియేటివ్‌గా రకరకాల కలినరీ, బేకింగ్, ఇటాలియన్ ఫుడ్ అంటూ పిల్లలు ఆసక్తిగా పాల్గొనేలా చేయవచ్చు. ఇందుకు, ఆన్‌లైన్ వేదికల సాయమూ తీసుకోవచ్చు. ప్రతిరోజూ కాకుండా వారంలో రెండు–మూడు రోజులు పిల్లల ఆసక్తిని బట్టి ప్లాన్ చేయవచ్చు. ఈ వేసవిలో నేర్చుకున్న, నేర్పిన వంట రేపు పిల్లలు సొంతంగా చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. పెద్దలకూ ఓ మంచి జ్ఞాపకంగా, పిల్లలకు వంట కూడా నేర్పించామన్న ధీమా ఉంటుంది.

పచ్చం'ధనం'

ఇంటి చుట్టూ ఖాళీ ప్లేస్ ఉంటేనే గార్డెనింగ్ అనుకునే రోజులు కావు. టాయ్ గార్డెన్, బాల్కనీ, ఇండోర్ గార్డెన్ థీమ్స్... ఎన్నో అందుబాటులో ఉన్నాయి. వాటిని కుటుంబం అంతా కలిసి కొత్త థీమ్‌తో రూపొందించుకోవచ్చు. తక్కువ పెట్టుబడితోనే ఇంటికి పచ్చదనం, మనసుకు ఆహ్లాదం వీటి ద్వారా పొందవచ్చు.

ఆధ్యాత్మిక, సంగీత వికాసం

అన్నీ ఫన్నీగా ఉంటేనే పిల్లలు ఇష్టపడతారు అనేదేమీ ఉండదు. కొన్ని కథలు, భగవద్గీత, రామాయణ పురాణేతిహాస గ్రంథాలు, మ్యూజిక్ క్లాసులు .. ఇంట్లో ఉంటూనే ఆన్‌లైన్‌లో షార్ట్ టర్మ్ క్లాసులలో చేరి, నేర్చుకోవచ్చు. పిల్లల కాలేజీ సబ్జెక్ట్ మినహా వారిలో ఆసక్తిని పెంచే ఏ విషయాన్నైనా తెలియజెప్పడానికి వెనకంజ వేయకూడదు.

ఫిట్‌నెస్ కోసమూ టైమ్

తల్లిదండ్రులు, పిల్లలు కలిసి మార్నింగ్ వాక్, పార్క్‌లను చుట్టేయడం వల్ల ఆరోగ్యమూ మెరుగుపడుతుంది. ఫిట్‌నెస్ క్లాసులో చేరడం, స్విమ్మింగ్ నేర్చుకోవడం, జుంబా డ్యాన్స్‌లలో పాల్గొనడం.. ఇవన్నీ మానసిక ఆరోగ్యాన్నీ మెరుగుపరుస్తాయి.

ఏ పనిచేసినా అందులో మనసుకు ఆహ్లాదాన్ని కలిగించడంతో పాటు అవి వారి భవిష్యత్తుకు కూడా ఉపయోగ పడతాయనుకుంటే వెనకంజ వేయనక్కర్లేదు. లేదంటే ప్రతిరోజూ బద్ధకంగానే గడిచిపోతే చూస్తుండగానే వేసవిరోజులు వెళ్లిపోతాయి. కాలేజీ చదువుల్లోని కొత్తదనాన్ని, అవగాహనను మరింత ఆనందంగా స్వీకరించడానికి ఈ రెండు నెలల వేసవి సమయం ఎంతగానో ఉపయోగపడుతుంది.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

వితంతువులు

కాలం మారుతోంది... కాలం మారితే కొత్త ప్రశ్నలు వస్తాయి.
భర్త మరణించిన తర్వాత స్త్రీల పట్ల వివక్షాపూరితమైన వ్యవహారశైలి మన దేశంలో అన్ని మతాలలో ఉంది.
అయితే ఆ ఎడబాటును మానసికంగా ఉంచుకుంటే చాలదా...
భౌతిక ఆనవాళ్లతో వివక్షకు గురవ్వాలా అనే చర్చ ఇప్పుడు మహారాష్ట్రలో నడుస్తోంది.
అక్కడి 7000 గ్రామాలు వితంతువులు తాము వితంతువులుగా వెలిబుచ్చే చిహ్నాలతో ఉండాల్సిన పనిలేదని నిర్ణయం తీసుకున్నాయి.
ఈ గ్రామాల సంఖ్య ఇంకా పెరగనుంది.

ఎడబాటు మానసికమా? భౌతికమా?

'నేను చాలా ఇబ్బందులు పడ్డాను. చదువుకుంటుంటే అందరూ అభ్యంతర పెట్టారు... వితంతువుకు చదువు ఏంటని. నా వయసు 42. ఇద్దరు పిల్లలు. భర్త చనిపోయాడు. చదువుకుని టీచర్ అయి నా పిల్లలను చూసుకోవాలని నా ప్రయత్నం. అందుకోసం సల్వార్ కమీజ్ వేసుకుని బయటకు వచ్చినా తప్పే. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది' అంది సోనాలి పొట్‌దర్. ఈమెది కొల్హాపూర్‌లోని అంబప్ అనే గ్రామం. ఈమే కాదు పశ్చిమ మహారాష్ట్రలోని సుగర్ బెల్ట్‌గా చెప్పుకునే ప్రాంతంలో ఒక విప్లవంలా ఉద్యమం రేగి వితంతువులు వివక్ష లేకుండా జీవించే మార్పులు జరుగుతున్నాయి.

గ్రామాలే మారాలి... మారాయి

మన దేశంలో గ్రామాల్లోనే పట్టింపు ఎక్కువ. ముఖ్యంగా వితంతువులకు గ్రామాల్లో ఎక్కడా లేని అనాదరణ ఉంటుంది. వాళ్లు బొట్టు, గాజులు, పూలు పెట్టుకోకూడదు. మంగళసూత్రం వేసుకోకూడదు. శుభకార్యాలకు రాకూడదు. కొన్నిచోట్లయితే గణేశ్ ఉత్సవాలకు వచ్చినా ఊరుకోరు. వీరిని పనిలో కూడా పెట్టుకోరు. కొన్ని ఇళ్లల్లో వీరు రావాల్సిన ఆస్తి రాక అవస్థలు పడుతుంటారు. వితంతువులు కావడం వారి తప్పా? భర్త చనిపోయిన బాధ ఒకవైపు... బయట సమాజం నుంచి వచ్చే బాధలు మరోవైపు. తమ బాధ మానసికంగా ఉంచుకుని బయట మామూలు జీవితం గడిపే హక్కు తమకు లేదా అని వారు ప్రశ్నిస్తున్నారు.

2022లో మొదలైన ఉద్యమం

మహారాష్ట్రలో పేరుపొందిన ప్రమోద్ జింజడే అనే సామాజిక కార్యకర్త పల్లెల్లో వితంతు స్త్రీలకు జరిగే అన్యాయాన్ని ఒకరోజు గమనించాడు. 'భర్త చనిపోయాక ఒక స్త్రీ అతని గుర్తుగా బొట్టూ గాజులు ఉంచుకుంటానని బతిమిలాడుతుంటే సాటి స్త్రీలు వాటిని తొలగించడం చూశాను' అన్నాడాయన. 2022లో ఒక అర్ధరాత్రి ఆయనకు సుస్తీ చేసింది. ప్రాణం పోయే స్థితి. కాని బయటపడ్డాడు. ఆయన 'కర్మలా' అనే ఊరిలో ఉంటాడు. వెంటనే ఆయన కర్మలా తాసిల్దార్ దగ్గరకు వెళ్లి ఒక అఫిడవిట్ సబ్మిట్ చేశాడు. 'నేను చనిపోతే నా భార్య వొంటి మీద బొట్టు గాజులు మంగళసూత్రం తీసే హక్కు ఎవరికీ ఉండకూడదు. అలా చేసినవారిని చట్టపరంగా శిక్షించాలి' అని ఆ అఫిడవిట్ సారాంశం. అక్కడున్న వారు ప్రమోద్‌కు పిచ్చెక్కిందనుకున్నా క్రమంగా ఈ సంగతి ప్రచారం పొందింది. మే 2022లో ఈ ఘటన జరిగితే వెంటనే 'హెర్వాడ్' అనే పల్లె నుంచి ఈ ఉద్యమం మొదలైంది.



మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లాలో ఆలయంలో పూజలు చేస్తున్న వితంతువులు

78 శాతం గురించి ఆలోచించాలి

మన దేశంలో జీవిత భాగస్వామిని కోల్పోయిన వారి సంఖ్య సుమారు ఐదున్నర కోట్లు ఉంది. వీరిలో 78 శాతం స్త్రీలు. వీరిలో 32 శాతం సగటున 40 ఏళ్ల వయసున్న వారు. ఈ వయసు స్త్రీలు ఇందరు వివక్షను ఎదుర్కొంటూ జీవితంలో ముందుకు వెళ్లలేకపోతే ఎలా అనే ప్రశ్న ఇప్పుడు సర్వత్రా వినబడుతోంది. బహుశా ఈ స్త్రీలే తమ ఆకాంక్షలను సమాజానికి మరింత గట్టిగా తెలియచేస్తారు.

ముక్తి పొందిన 7,683 గ్రామాలు

మహారాష్ట్రలో ఇప్పటికి 7,683 గ్రామాలు, 1,182 మునిసిపల్ వార్డులు తాము వితంతువుల పట్ల వివక్ష చూపం అని తీర్మానాలు చేశాయి. వితంతువులు తమకు నచ్చిన ఆహార్యంతో ఉండవచ్చని, అన్ని చోట్లకు రాకపోకలు సాగించవచ్చని, ఉద్యోగాలు చేసుకోవచ్చని అవి వారిని ప్రోత్సహించడానికి ముందుకొచ్చాయి. కొన్నిచోట్ల ఆగస్టు పదిహేనున వితంతువులతో జెండా వందనం కూడా చేయిస్తూ ఉన్నారు. 'ఈ ఉద్యమం ఇరుగు పొరుగు రాష్ట్రాలకు కూడా పాకుతోంది. ముందుగా గోవా అందుకుంది' అని ఉద్యమకారులు అంటున్నారు. భర్త చనిపోయాక నిరాశ నిస్పృహల్లో ఉన్న స్త్రీలకు సమాజమే బాసట. దాని నుంచి వందల ఏళ్లుగా ఎదుర్కొంటున్న వివక్షతో ఎంత మంది స్త్రీలు కుమిలిపోయి ఉంటారో అర్థం చేసుకుంటే ఈ ఉద్యమం అవసరం తెలిసి వస్తుందని ఈ ఉద్యమకారుల వాదన. మహారాష్ట్ర ప్రభుత్వం ఈ ఉద్యమానికి పూర్తి మద్దతు ప్రకటించింది.

లీగల్

బ్యాంకువారిని సెటిల్‌మెంట్ కోరవచ్చు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక పథకం కింద 2019 లో దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వం వారే రాయితీ కలిగించి బ్యాంకు నుంచి హామీరహిత రుణం ఇప్పించగా, ఒక వ్యాపారాన్ని మొదలుపెట్టాను. కొన్ని నెలల పాటు వ్యాపారం బాగానే సాగింది. కానీ కోవిడ్ సమయంలో వ్యాపారం మూతపడింది. భారీ అద్దె, జీతాలు, పైగా బ్యాంకు నెలసరి వాయిదా చెల్లింపుల వలన వ్యాపారం మూతపడాల్సి వచ్చింది. అద్దె భరించలేక వ్యాపారం ఆపేసి సామాగ్రి మొత్తం అమ్మేశాము. అలా అమ్మగా వచ్చిన మొత్తాన్ని – మా వద్ద ఉన్న నగదును కలిపి బ్యాంకు వారికి చెల్లించాము. ప్రస్తుతం పొరుగు రాష్ట్రంలో చిన్న ఉద్యోగం చేసుకుంటున్నాను. మూడు సంవత్సరాల తర్వాత బ్యాంకు వారు కోర్టు నోటీసులు పంపడమే కాకుండా '30 లక్షలు ఉద్దేశపూర్వకంగా చెల్లించలేదు' అంటూ పోలీసు స్టేషన్లో చీటింగ్ కేసు కూడా నమోదు చేశారు. పోలీసులు అరెస్ట్ చేస్తారు అని అంటున్నారు. ఇవన్నీ ఎదుర్కొనే శక్తి ప్రస్తుతానికి నా దగ్గర లేదు. పరిష్కారం చూపగలరు.

– సంతోష్, నిజామాబాద్

ఈ సమస్య మీ ఒక్కరిది మాత్రమే కాదు. కోవిడ్ కి ముందు బ్యాంకు రుణాలు తీసుకున్న చాలా మంది ఇలాగే దివాలా తీయడమే కాక పలు రకాల కేసులు కూడా ఎదుర్కొంటున్నారు. బ్యాంకు వారు సాధారణంగా డి.ఆర్.టి. (డెట్ రికవరీ ట్రిబ్యునల్)లో కేసు వేసి బకాయిలను వసూలు చేసుకుంటూ ఉంటారు. మీరు పొందినది హామీ రహిత రుణం అన్నారు కాబట్టి పెద్దగా ఆందోళన పడవలసిన అవసరం లేదు. అదే విషయాన్ని మీరు డి.ఆర్.టీ.కి తెలియజేసి, ఎలాంటి పరిస్థితులలో మీ వ్యాపారం మూతపడవలసి వచ్చినదో చెప్పండి. అలాగే మీకు సహకారం అందించిన ప్రభుత్వ విభాగానికి కూడా ఒక దరఖాస్తు పెట్టుకుంటూ ఈ విషయాలను వివరించండి.

చీటింగ్ కేసులు పెట్టడం కూడా ఈ మధ్య బ్యాంకు వారు సర్వసాధారణంగా చేస్తున్నారు. బహుశా సివిల్ కేసులలో రికవరీ కష్టం అనుకున్న సందర్భాల్లో రుణగ్రస్తులను ఒత్తిడికి గురి చేయడానికి ఇలా చేస్తున్నట్టు గమనిస్తున్నాము. ఎందుకంటే రుణం చెల్లించనంతమాత్రాన ప్రతి కేసూ చీటింగ్ పరిధిలోకి రాదు. మీ కేసులో మీరు అసలు బ్యాంకు వారిని సంప్రదించలేదు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక పథకం కింద ప్రభుత్వం వారే మిమ్మల్ని ఎంచుకొని రుణం ఇప్పించారు. మీరు ఆ వ్యాపారాన్ని కూడా మీ శక్తిమేరకు నడిపారు. వ్యాపారం మూతపడటంలో కూడా మీ పాత్ర లేదు. కోవిడ్ లో కొన్ని వేల వ్యాపారాలు మూతపడ్డాయి. కాబట్టి చీటింగ్ కేసు మీ మీద రుజువు కావడం దాదాపు సాధ్యపడదు. చీటింగ్ కేసులో సాధారణంగా అరెస్టు చేయరు. స్టేషన్ బెయిలు ఇస్తారు. పోలీసువారికి అన్ని విషయాలను ఆధారంతో సహా సమర్పిస్తే, వారు ఫైనల్ రిపోర్టు వేసి మరీ క్లోజ్ చేసిన కేసులు నా దృష్టిలో ఉన్నాయి. కాబట్టి మీరు కూడా మీ వద్ద ఉన్న అన్ని రుజువులు పోలీసువారికి అందజేయండి. ఒకవేళ కోర్టు దాకా వెళ్లినా, 'మొదటినుంచి వీరు మోసపూరిత భావన కలిగి ఉన్నారు' అని (బ్యాంకు) ప్రాసిక్యూషన్ ద్వారా ఋజువు చేయవలసి ఉంటుంది. మీరు చెప్పిన దాన్ని బట్టి చూస్తే, అలా ఋజువు చేయటం బ్యాంకువారికి కష్టమే కావచ్చు. మీ లోను విషయంలో మీరు బ్యాంకు వారిని సంప్రదించి సెటిల్మెంట్ కూడా కోరవచ్చు. మిగిలిన మొత్తంలో కొంత మాఫీ చేసి, సెటిల్ చేసేందుకు బ్యాంకు వారు కూడా ముందుకు వస్తారు. కుదరని పక్షంలో కేసులను ఎదుర్కొనేందుకు దగ్గర్లోని లాయర్‌ను సంప్రదించండి.



– శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాల కోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

అమ్మ చెక్కిన బొమ్మ సమాజానికి కనువిప్పు

రంగస్థలం... నాటకం చూడడానికి వచ్చిన ప్రేక్షకులు ప్రసన్నవదనాలతో చూస్తున్నారు.
తెర తొలగింది. తొలి సన్నివేశం... జిల్లా కలెక్టర్ అభినందన సభ.
సన్మానం అందుకున్న మహిళ ప్రసంగం మొదలైంది. ప్రసంగంలో ఆమె తల్లి కనిపిస్తోంది.
తాను కలెక్టర్ కావడానికి తల్లి పడిన శ్రమ, అవమానాలు, ఆవేదనలను వివరించారు కలెక్టర్.
తనను తాను 'అమ్మ చెక్కిన బొమ్మ' అని సగర్వంగా ప్రకటించుకున్నారు కలెక్టర్.



'అమ్మ చెక్కిన బొమ్మ' నాటికలో ఓ సన్నివేశం

'కూతురిని కలెక్టర్‌ని చేయడానికి తల్లికి ఎదురైన అవమానాలేం ఉంటాయి'? ఆ సందేహానికి సమాధానంగా కలెక్టర్ బయటపెట్టిన వాస్తవం ప్రేక్షకులను నిశ్చేష్టులను చేసింది. ''అబ్బాయిగా పుట్టిన నేను అమ్మాయిగా మారాలనే కోరిక బయటపెట్టినప్పుడు మా అమ్మ పడిన ఆవేదనను వర్ణించ గలిగిన పదాలను ప్రపంచంలో ఏ భాషా కనిపెట్టలేదు. తదనంతరం ఇంట్లో ఎదురైన పరిణామాలూ తీవ్రమైనవే. నాన్న మమ్మల్ని వదిలేసి వెళ్లిపోతే అమ్మ తానే నాకు అమ్మానాన్నగా మారి చదివించింది. సమాజం సంధించే ప్రశ్నల బాణాలకు దీటుగా సమాధానం ఇస్తూ ఆ శరపరంపర నుంచి నన్ను కాచుకుంది. నన్ను కలెక్టర్‌గా మీ ముందు నిలబెట్టిన గొప్ప వ్యక్తి మా అమ్మ''. ఎంతటి కఠినాత్ములనైనా కంటతడి పెట్టించిన సన్నివేశం అది.

నాటక కర్త... పాత్ర పోషక కర్త!

అవును, ఇది ఒక నాటిక. ఈ నాటికను రాసి, కలెక్టర్ తల్లి పాత్రలో జీవించిన నటి జ్యోతి రాజ్ భీశెట్టి. మార్చి 28న తొలి ప్రదర్శనతో ప్రేక్షకుల ముందుకు వచ్చారామె. నాటక రంగంలో రాణిస్తూ ఉత్తమనటిగా జ్యోతిరాజ్ అందుకున్న 36 అవార్డులలో మహానటి సావిత్రి పురస్కారం, అక్కినేని పురస్కారాలు కూడా ఉన్నాయి. సావిత్రి పురస్కారం కూడా ఆమె తండ్రికి సంతృప్తినివ్వలేదు. నువ్వు నటనలో ఇంకా చాలా నేర్చుకోవాలన్నారు. బహుశా 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటికలో జ్యోతిరాజ్‌ను చూసి ఉంటే 'శిఖరాన్ని చేరావు బంగారు తల్లీ' అని ఆశీర్వదించేవారేమో!

నాన్న వారసత్వం!

''మా నాన్న ఆళ్ల రామకృష్ణ గొప్ప కళాకారులు. ఆయన నట వారసుడిగా మా తమ్ముడిని చూడాలనుకున్నారు. కానీ ఊహించని విధంగా ఈ రంగంలోకి వచ్చాను. పదకొండేళ్ల వయసులో 'రేపేంది' నాటికలో అబ్బాయి పాత్ర పోషించాల్సిన కుర్రాడు ఏదో అంతరాయం వల్ల రాలేదు. ఆ పాత్ర కోసం నన్ను రంగస్థలం మీదకు తీసుకువచ్చారు. అయితే ఆ నాటిక తర్వాత నేను కొనసాగలేదు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ నుంచి తెలుగులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసేటప్పుడు ప్రముఖ నటులు రాళ్లపల్లి, వైజాగ్ ప్రసాద్ ప్రోత్సాహంతో 2017లో 'బావా ఎప్పుడు వచ్చితీవు' నాటికతో మళ్లీ రంగస్థలం మీద అడుగుపెట్టాను. అత్తవారింట్లో కూడా ప్రోత్సాహం ఉండడంతో నా కళా ప్రస్థానంలో వెనక్కి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. ఇప్పుడు శిష్టా చంద్రశేఖర్ గారి రచనల మీద నాటక సాహిత్యంలో పరిశోధన చేస్తున్నాను. వృత్తి–ప్రవృత్తి రెండూ నాటకరంగమే అయ్యాయి. ఈ ప్రయాణం నాకు సంతృప్తినిస్తోంది. రంగస్థలానికి ఔన్నత్యం తగ్గదు. రాబడి విషయంలో వెనుకబడుతుందేమో కానీ కళకు దక్కే గౌరవం మాత్రం చాలా గొప్పది'' అన్నారు జ్యోతి రాజ్. రంగస్థల కళాకారులు నాటికలో డైలాగ్స్‌ను కంఠతా పట్టాలి, ఉచ్చారణ దోషాలు లేకుండా భావయుక్తంగా పలకాలి, పాత్రకు అవసరమైతే ఉచ్చారణ దోషాలతోనూ పాత్రను రక్తి కట్టించాలి. ఏకబిగిన గంటల సేపు పాత్రలో జీవించాలి. ఇన్ని నైపుణ్యాలను ఒంటపట్టించుకున్న కళాకారులకు గౌరవం దక్కకుండా ఎలా ఉంటుంది?!

చప్పట్లతో వీనుల విందు



మా పుట్టిల్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం సమీపంలోని పాలకోడేరు. కొణితివాడ అత్తగారిల్లు. రెండువైపులా సహకారం ఉండడం అదృష్టమనే చెప్పాలి. అలాగే నటిగా నన్ను నేను నిరూపించుకునే పాత్రలు వచ్చాయి. అది ఇంకా పెద్ద అదృష్టం. డబ్బు బాగా సంపాదించాలనే ఆలోచనతో ఎవరూ రంగస్థలాన్ని ఎంచుకోరు. కళతో జీవించాలనుకునే వాళ్లే ఇందులో కొనసాగుతారు. ప్రదర్శన తర్వాత ప్రేక్షకుల చప్పట్లు వీనులవిందు చేస్తుంటే ఆ మాటల్లో వర్ణించలేని ఆ గొప్ప సంతోషాన్ని స్వయంగా ఆస్వాదించే అదృష్టం రంగస్థలం ఇచ్చే బహుమతి. ఆ చప్పట్లే మాకు శక్తి. కళాకారులుగా గర్వపడే క్షణాలవి.

– జ్యోతిరాజ్ భీశెట్టి, రచయిత,
రంగస్థల కళాకారిణి

పరిషత్తులు... ప్రదర్శనలు!

హాబీగా కవిత్వం రాసే జ్యోతిరాజ్ సామాజికాంశాలను, మహిళల స్థితిగతులను హృద్యంగా అల్లుతారు. నాటికల పోటీల కోసం రాసిన 'ఉడుత రాల్చిన ఇసుక'కు బెస్ట్ స్టోరీ అవార్డు, 'అమ్మ చెక్కిన బొమ్మ'కు రెండవ బహుమతి అందుకున్నారు. అదే స్క్రిప్టుతో ప్రదర్శనలిస్తున్నారు. ''నేను నటించిన నాటికల్లో అత్యంత ఎక్కువగా 35, 40 ప్రదర్శనలిచ్చిన నాటికలు 'అందిన ఆకాశం, మూల్యం'. కొత్త తరానికి నాటకం అనే ప్రక్రియను పరిచయం చేయడం కోసం నాటక ప్రదర్శనలను వీడియో షూటింగ్ చేసి యూ ట్యూబ్‌లో పెట్టాం'' అని నాటకరంగం పట్ల తన ఇష్టాన్ని, భావితరాలకు కొనసాగించడానికి తన వంతు ప్రయత్నాలను వివరించారు జ్యోతిరాజ్ భీశెట్టి.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

కూల్ సమ్మర్

కూల్‌గా... హాయిగా స్మార్ట్‌ఫోన్ ఇలా...



- స్మార్ట్‌ఫోన్‌లో బ్యాటరీ 30 శాతం కంటే తక్కువ పడిపోరాదు. తక్కువ స్థాయి నుండి ఛార్జింగ్ చేయడానికి ఛార్జర్ నుండి ఎక్కువ శక్తి అవసరం అవుతుంది. ఇది అదనపు వేడిని ఉత్పత్తి చేస్తుంది. ఫాస్ట్ చార్జింగ్ ఫోన్‌లతో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది.
- ఫోన్ కవర్‌లు ఫిజికల్ డ్యామేజ్ జరగకుండా ఉపయోగపడినా ఎంతోకొంత వేడికి కారణం అవుతాయి. మీ ఫోన్ వేడిగా ఉందని అనిపిస్తే కవర్ తొలగించండి. బెటర్ వెంటిలేషన్‌ను దృష్టిలో పెట్టుకొని డిజైన్ చేసిన కవర్‌లను వాడండి.
- ఒకేసారి మల్టిపుల్ యాప్స్‌ను రన్ చేయడం వల్ల ఫోన్ ప్రాసెసర్ దెబ్బతింటుంది. అదనపు వేడి ఉత్పత్తి అవుతుంది. ఉపయోగించని యాప్స్‌ను ఎప్పటికప్పుడు క్లోజ్ చేయండి. సి.పి.యు.పై లోడ్ తగ్గించడానికి, చల్లగా ఉండటానికి బ్యాక్‌గ్రౌండ్ ప్రాసెస్‌లను నిలిపివేయాలి.
- ఫోన్‌ను యాక్టివ్‌గా ఉపయోగించకపోతే ఎయిర్ ప్లేన్ మోడ్ లేదా పవర్ సేవర్ మోడ్‌లో ఉండేలా చూసుకోవాలి. ఈ సెట్టింగ్‌లు ఫోన్ విద్యుత్ వినియోగాన్ని, వేడి ఉత్పత్తిని తగ్గిస్తాయి.
- కూలింగ్ ప్యాడ్స్, ఫ్యాన్స్‌లాంటి స్మార్ట్‌ఫోన్ యాక్సెసరీలను ఉపయోగించండి.

పూరన్ రంగం

పరుగుల వరద పారిన పోరులో లక్నో సూపర్ జెయింట్స్‌దే పైచేయి అయింది. మార్క్‌రమ్, మిచెల్ మార్ష్ మెరుపులు మెరిపిస్తే... పూరన్ పూనకం వచ్చినట్లు రెచ్చిపోయాడు. ఫలితంగా లక్నో భారీ స్కోరు చేయగా... కొండంత లక్ష్యఛేదనలో రహానే కెప్టెన్ ఇన్నింగ్స్‌తో పోరాడినా కోల్‌కతా నైట్ రైడర్స్ విజయానికి 4 పరుగుల దూరంలో నిలిచిపోయింది. ఇరు జట్లు కలిసి 45 ఫోర్లు... 25 సిక్స్‌లతో రెచ్చిపోవడంతో ఓవరాల్‌గా మ్యాచ్‌లో 472 పరుగులు నమోదయ్యాయి. తాజా సీజన్‌లో లక్నోకు ఇది మూడో విజయం కాగా... కోల్‌కతాకు మూడో పరాజయం!


పూరన్

36 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్స్‌లతో 87 నాటౌట్

- హడలెత్తించిన లక్నో బ్యాటర్
- మిచెల్ మార్ష్ మెరుపులు
- భారీ స్కోర్ల పోరులో కోల్‌కతాపై లక్నోదే పైచేయి

కోల్‌కతా: ఐపీఎల్ టి20 టోర్నమెంట్ 18వ సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ ఖాతాలో మూడో విజయం చేరింది. భారీ స్కోర్లు నమోదైన పోరులో లక్నో జట్టు 4 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై గెలిచింది. మొదట లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నికోలస్ పూరన్ (36 బంతుల్లో 87 నాటౌట్; 7 ఫోర్లు, 8 సిక్స్‌లు), మిచెల్ మార్ష్ (48 బంతుల్లో 81; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధ శతకాలతో చెలరేగగా... మార్క్‌రమ్ (28 బంతుల్లో 47; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం లక్ష్యఛేదనలో కోల్‌కతా 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 234 పరుగులు చేసింది. కెప్టెన్ అజింక్య రహానే (35 బంతుల్లో 61; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో మెరవగా... వెంకటేశ్ అయ్యర్ (29 బంతుల్లో 45; 6 ఫోర్లు, 1 సిక్స్), సునీల్ నరైన్ (13 బంతుల్లో 30; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), రింకూ సింగ్ (15 బంతుల్లో 38 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాడారు.

ఈసారి పచ్చికపై సంతకం...

గత రెండు మ్యాచ్‌ల్లో వికెట్ తీసిన అనంతరం 'నోట్ బుక్' సంబరాలతో జరిమానా ఎదుర్కొన్న లక్నో స్పిన్నర్ దిగ్వేశ్ రాఠీ ఈసారి పంథా మార్చాడు. ఈ మ్యాచ్‌లో తన ఆరాధ్య ప్లేయర్ సునీల్ నరైన్ వికెట్ తీసిన అనంతరం దిగ్వేశ్ కాస్త భిన్నమైన సంబరాలు జరుపుకున్నాడు. ఏడో ఓవర్ రెండో బంతికి నరైన్‌ను అవుట్ చేసిన అనంతరం నేల మీద కూర్చొని పచ్చిక మీద సంతకం పెట్టాడు.


స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (బి) హర్షిత్ రాణా 47; మార్ష్ (సి) రింకూ (బి) రసెల్ 81; పూరన్ (నాటౌట్) 87; సమద్ (బి) హర్షిత్ రాణా 6; మిల్లర్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 238. వికెట్ల పతనం: 1–99, 2–170, 3–221. బౌలింగ్:** వైభవ్ 4–0–35–0; స్పెన్సర్ జాన్సన్ 3–0–46–0; వరుణ్ చక్రవర్తి 4–0–31–0; హర్షిత్ రాణా 4–0–51–2; సునీల్ నరైన్ 3–0–38–0; రసెల్ 2–0–32–1.

కోల్‌కతా నైట్ రైడర్స్ ఇన్నింగ్స్: డికాక్ (ఎల్బీ) (బి) ఆకాశ్‌దీప్ 15; నరైన్ (సి) మార్క్‌రమ్ (బి) దిగ్వేశ్ 30; రహానే (సి) పూరన్ (బి) శార్దుల్ 61; వెంకటేశ్ (సి) మార్క్‌రమ్ (బి) ఆకాశ్‌దీప్ 45; రమణ్‌దీప్ (సి) మార్క్‌రమ్ (బి) రవి బిష్ణోయ్ 1; రఘువంశీ (సి) పంత్ (బి) అవేశ్ 5; రసెల్ (సి) మిల్లర్ (బి) శార్దుల్ 7; రింకూ (నాటౌట్) 38; హర్షిత్ రాణా (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 22; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 234. వికెట్ల పతనం:** 1–37, 2–91, 3–162, 4–166, 5–173, 6–177, 7–185. **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ సింగ్ 4–0–55–2; శార్దుల్ ఠాకూర్ 4–0–52–2; అవేశ్ ఖాన్ 4–0–45–1; దిగ్వేశ్ రాఠీ 4–0–33–1; రవి బిష్ణోయ్ 4–0–47–1.

ప్రియాంశ పటాకా

'కింగ్స్' పోరులో చెన్నైపై పంజాబ్‌దే పైచేయి అయింది. యువ ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య మెరుపులకు శశాంక్ సింగ్, యాన్సెన్ ఫినిషింగ్ టచ్ తోడవడంతో పంజాబ్ భారీ స్కోరు చేయగా... ఛేదనలో చెన్నై చతికిలబడింది. కాన్వే, దూబే రాణించినా... మధ్య ఓవర్లలో పంజాబ్ బౌలర్లు పుంజుకోవడంతో చెన్నైకి వరుసగా నాలుగో పరాజయం తప్పలేదు. 'ఫినిషర్' ధోని దూకుడు ఓటమి అంతరాన్ని తగ్గించేందుకే పరిమితమైంది!


ప్రియాంశ్ ఆర్య

39 బంతుల్లోనే సెంచరీ చేసిన పంజాబ్ యువ బ్యాటర్

- 7 ఫోర్లు, 9 సిక్స్‌లతో 103 పరుగులు
- చెన్నై సూపర్ కింగ్స్‌పై పంజాబ్ కింగ్స్ గెలుపు

ముల్లాన్‌పూర్: యువ ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య (42 బంతుల్లో 103; 7 ఫోర్లు, 9 సిక్స్‌లు) రికార్డు సెంచరీతో చెలరేగడంతో ఐపీఎల్ 18వ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ నాలుగో విజయం నమోదు చేసుకుంది. మంగళవారం జరిగిన పోరులో పంజాబ్ 18 పరుగుల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్‌పై విజయం సాధించింది. ఈ సీజన్‌లో చెన్నైకిది వరుసగా నాలుగో పరాజయం కావడం గమనార్హం. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ప్రియాంశ్ ఆర్య సెంచరీతో కదంతొక్కగా... శశాంక్ సింగ్ (36 బంతుల్లో 52 నాటౌట్, 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), మార్కో యాన్సెన్ (19 బంతుల్లో 34 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (9)తో పాటు ప్రభ్‌సిమ్రన్ సింగ్ (0), స్టొయినిస్ (4), నేహల్ వధేరా (9), మ్యాక్స్‌వెల్ (1) విఫలమయ్యారు. లక్ష్యఛేదనలో చెన్నై సూపర్ కింగ్స్ 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 201 పరుగులు చేసింది. కాన్వే (49 బంతుల్లో 69; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకం సాధించగా... రచిన్ (37; 6 ఫోర్లు), శివమ్ దూబే (27 బంతుల్లో 42; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ధోని (12 బంతుల్లో 27; 1 ఫోర్, 3 సిక్స్‌లు) పోరాడారు.

ఫటాఫట్...

ఖలీల్ అహ్మద్ వేసిన తొలి బంతికే పాయింట్ మీదుగా సిక్స్ కొట్టిన ప్రియాంశ్ ఆర్య... రెండో బంతికి క్యాచ్ మిస్ కావడంతో బతికిపోయాడు. ఇక అక్కడి నుంచి వెనుదిరిగి చూసుకోని ఈ 24 ఏళ్ల కుర్రాడు అదే ఓవర్‌లో మరో సిక్స్ బాదాడు. రెండో ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్ డకౌట్ కాగా... ఆర్య ఇంకో సిక్స్ ఖాతాలో వేసుకున్నాడు. ఖలీల్ తదుపరి ఓవర్‌లో శ్రేయస్‌ను క్లీన్‌బౌల్డ్ చేయగా... నాలుగో ఓవర్‌లో ఆర్య 'హ్యాట్రిక్' ఫోర్లతో విరుచుకుపడ్డాడు. స్టొయినిస్ క్రీజులోకి వచ్చినంతసేపు కూడా నిలవలేకపోగా... అశ్విన్ ఓవర్‌లో 4, 6తో ఆర్య 19 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. అశ్విన్ ఒకే ఓవర్‌లో నేహల్, మ్యాక్స్‌వెల్‌ను ఔట్ చేశాడు. వికెట్లు పడుతున్నా దూకుడు తగ్గించని ఆర్య... అశ్విన్ ఓవర్‌లో మూడు సిక్స్‌లతో చెలరేగిపోయాడు. పతిరణ ఓవర్‌లో వరుసగా 6, 6, 6, 4 కొట్టిన ప్రియాంశ్ 13వ ఓవర్‌లోనే 39 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. తదుపరి ఓవర్‌లో ఆర్య ఔట్ కాగా... చివర్లో యాన్సెన్, శశాంక్ చక్కటి షాట్‌లతో పంజాబ్‌కు భారీ స్కోరు అందించారు.

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాంశ్ ఆర్య (సి) శంకర్ (బి) నూర్ 103; ప్రభ్‌సిమ్రన్ (బి) ముకేశ్ 0; శ్రేయస్ (బి) ఖలీల్ 9; స్టొయినిస్ (సి) కాన్వే (బి) ఖలీల్ 4; నేహల్ (సి) ధోని (బి) అశ్విన్ 9; మ్యాక్స్‌వెల్ (సి అండ్ బి) అశ్విన్ 1; శశాంక్ (నాటౌట్) 52; యాన్సెన్ (నాటౌట్) 34; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 219. వికెట్ల పతనం:** 1–17, 2–32, 3–54, 4–81, 5–83, 6–154. **బౌలింగ్:** ఖలీల్ 4–0–45–2; ముకేశ్ 2–0–21–1; అశ్విన్ 4–0–48–2; జడేజా 3–0–18–0; నూర్ 3–0–32–1; పతిరణ 4–0–52–0. **చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్:** రచిన్ (స్టంప్డ్) ప్రభ్‌సిమ్రన్ (బి) మ్యాక్స్‌వెల్ 37; కాన్వే (రిటైర్డ్ అవుట్) 69; రుతురాజ్ (సి) శశాంక్ (బి) ఫెర్గూసన్ 1; దూబే (బి) ఫెర్గూసన్ 42; ధోని (సి) చహల్ (బి) యశ్ 27; జడేజా (నాటౌట్) 9; శంకర్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 201. వికెట్ల పతనం:** 1–61, 2–62, 3–151, 4–171, 5–192. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4–0–39–0; యశ్ 4–0–39–1; మ్యాక్స్‌వెల్ 2–0–11–1; యాన్సెన్ 4–0–48–0; ఫెర్గూసన్ 4–0–40–2; స్టొయినిస్ 1–0–10–0; చహల్ 1–0–9–0.

39 ప్రియాంశ్ ఆర్య సెంచరీకి తీసుకున్న బంతులు. ఐపీఎల్‌లో ఇది నాలుగో వేగవంతమైన శతకం. గేల్ (30 బంతుల్లో), యూసుఫ్ పఠాన్ (37 బంతుల్లో), మిల్లర్ (38 బంతుల్లో) ట్రావిస్ హెడ్ (39 బంతుల్లో) ముందున్నారు.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
ఢిల్లీ	3	3	0	6	1.257
గుజరాత్	4	3	1	6	1.031
బెంగళూరు	4	3	1	6	1.015
పంజాబ్	4	3	1	6	0.289
లక్నో	5	3	2	6	0.078
కోల్‌కతా	5	2	3	4	-0.056
రాజస్తాన్	4	2	2	4	-0.158
ముంబై	5	1	4	2	-0.010
చెన్నై	5	1	4	2	-0.889
హైదరాబాద్	5	1	4	2	-1.629

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ X రాజస్తాన్
వేదిక: అహ్మదాబాద్
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భారత జట్టులో శ్రీ చరణి

మహిళల ముక్కోణపు వన్డే టోర్నీ కోసం భారత జట్టు ప్రకటన



న్యూఢిల్లీ: ఈనెలలో శ్రీలంక ఆతిథ్యమివ్వనున్న మహిళల ముక్కోణపు వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా, స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నల్లపురెడ్డి శ్రీ చరణి, శుచి ఉపాధ్యాయ్ (మధ్య ప్రదేశ్), కాశ్వీ గౌతమ్ (పంజాబ్)లకు తొలిసారి జాతీయ జట్టులో చోటు లభించింది. గాయం కారణంగా పేస్ బౌలర్లు రేణుక సింగ్, టిటాస్ సాధు, పూజ వస్త్రకర్‌లను ఎంపిక చేయలేదని బీసీసీఐ ప్రకటించింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో విశేషంగా రాణించినప్పటికీ ఓపెనర్ షఫాలీ వర్మను సెలెక్టర్లు మరోసారి పట్టించుకోకపోవడం గమనార్హం.

వైఎస్‌ఆర్ కడప జిల్లా యర్రగుంట్ల మండలం యర్రంపల్లె గ్రామానికి చెందిన 20 ఏళ్ల శ్రీ చరణి గత నెలలో ముగిసిన డబ్ల్యూపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. ఎడంచేతి వాటం స్పిన్నర్ అయిన శ్రీ చరణి రెండు మ్యాచ్‌లు ఆడి నాలుగు వికెట్లు పడగొట్టింది. భారత జట్టులో చోటు దక్కించుకున్న శ్రీ చరణికి వైఎస్‌ఆర్ జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు భరత్ రెడ్డి, కార్యదర్శి రెడ్డి ప్రసాద్, మహిళల విభాగం కో ఆర్డినేటర్ విష్ణుమోహన్ రావు అభినందనలు తెలిపారు.

భారత్, శ్రీలంక, దక్షిణాఫ్రికా జట్లు పాల్గొనే ముక్కోణపు వన్డే టోర్నీ ఏప్రిల్ 27 నుంచి మే 11వ తేదీ వరకు కొలంబోలో జరుగుతుంది. డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో మూడు జట్లు నాలుగు మ్యాచ్‌ల చొప్పున ఆడతాయి. టాప్-2లో నిలిచిన రెండు జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఈ టోర్నీలోని అన్ని మ్యాచ్‌లు కొలంబోలోని ఆర్.ప్రేమదాస స్టేడియంలో జరుగుతాయి.

భారత వన్డే జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతిక రావల్, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, యస్తిక భాటియా, దీప్తి శర్మ, అమన్‌జ్యోత్ కౌర్, స్నేహ్ రాణా, అరుంధతి రెడ్డి, తేజల్ హసబ్నిస్, నల్లపురెడ్డి శ్రీ చరణి, కాశ్వీ గౌతమ్, శుచి ఉపాధ్యాయ్.

సాక్షి సినిమా

ఆ పేరు ఎట్టా నిలబడాలంటే...


అఖిల్

అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమాకు 'లెనిన్' అనే టైటిల్ ఖరారైంది. 'ప్రేమ కన్నా ఏ యుద్ధం హింసాత్మకమైనది' కాదు అనేది ఉపశీర్షిక. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో శ్రీలీల హీరోయిన్. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్మెంట్స్‌పై నాగార్జున, నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా మంగళవారం (ఏప్రిల్ 8) అఖిల్ బర్త్ డే. ఈ సందర్భంగా 'లెనిన్' టైటిల్ గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''గతాన్ని తరమడానికి పోతా... మా నాయన నాకో మాట సెప్పినాడు.. పుట్టేటప్పుడు ఊపిరి ఉంటాది రా.. పేరు ఉండదు, అట్నే పోయేటప్పుడు ఊపిరుండదు.. పేరు మాత్రమే ఉంటాది. ఆ పేరు ఎట్టా నిలబడాలంటే...'' అంటూ రాయలసీమ యాసలో అఖిల్ చెప్పిన ఇంటెన్స్ డైలాగ్స్ 'లెనిన్' గ్లింప్స్‌లో ఉన్నాయి. ఈ సినిమాకు సంగీతం: తమన్, కెమెరా: నవీన్ కుమార్.

కాస్త ఓపిక పట్టండి!


ప్రభాస్

ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ది రాజాసాబ్'. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మాళవికా మోహనన్, నిధీ అగర్వాల్ హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈ నెల 10న విడుదల కావాల్సి ఉంది. అయితే మూవీ రిలీజ్ వాయిదా, అలాగే కొత్త తేదీపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఎలాంటి అప్‌డేట్ లేదు. దీంతో 'ది రాజాసాబ్' రిలీజ్ ఎప్పుడు? షూటింగ్ ఎంత బ్యాలెన్స్ ఉంది? స్పష్టంగా చెప్పండి అంటూ డైరెక్టర్ మారుతిని 'ఎక్స్' వేదికగా అడిగారు ప్రభాస్ అభిమానులు. ఇందుకు మారుతి స్పందిస్తూ-''ది రాజా సాబ్' కొంచెం టాకీ పార్ట్, కొన్ని పాటల చిత్రీకరణ మిగిలి ఉంది. ఈ చిత్రంలోని సీజీ వర్క్ కోసం పలు కంపెనీలు పని చేస్తున్నాయి. ఇప్పటి వరకూ వచ్చిన ఔట్‌పుట్ బాగుంది. సీజీ వర్క్ పూర్తయిన తర్వాత నిర్మాతలు విడుదల తేదీ ప్రకటిస్తారు. సినిమా విడుదల నా ఒక్కడి చేతుల్లో ఉండదు. ఎన్నో అంశాలు ఇన్వాల్వ్ అయి ఉంటాయి. అందుకే కొంచెం సమయం పడుతుంది.. కాస్త ఓపిక పట్టండి. మీ అంచనాలు అందుకునేందుకు కష్టపడుతున్నాం. మా హార్డ్‌వర్క్‌ని, ప్యాషన్‌ని మీకు వీలైనంత త్వరగా చూపించేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం '' అని పోస్ట్ చేశారు.

ఊహలకు అందని ప్రపంచం


అల్లు అర్జున్, అట్లీ

హీరో అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబోలో కొత్త సినిమా ప్రకటన వచ్చింది. కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ ఈ సినిమాను నిర్మించనుంది. కాగా మంగళవారం (ఏప్రిల్ 8) అల్లు అర్జున్ బర్త్ డే. ఈ సందర్భంగా ఓ వీడియోతో ఈ మూవీని ప్రకటించారు. అల్లు అర్జున్ కెరీర్‌లో ఇది 22వ సినిమా కాగా, అట్లీ కెరీర్‌లో 6వ చిత్రం. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించనున్నామని, నటీనటులు- సాంకేతిక నిపుణులు, విడుదల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మేకర్స్ వెల్లడించారు. ''మ్యాజిక్ విత్ మాస్. ఊహలకు అందని ప్రపంచం. సన్ పిక్చర్స్ సపోర్ట్‌తో అట్లీ గారితో సినిమా చేయనుండటం నిజంగా అద్భుతం'' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు అల్లు అర్జున్. ''అల్లుఅర్జున్ సార్‌కి జన్మదిన శుభాకాంక్షలు. నా కలను నిజం చేస్తున్న కళానిధిమారన్ సార్‌కి, సన్‌పిక్చర్స్‌కు థ్యాంక్స్'' అని అట్లీ పేర్కొన్నారు. మరోవైపు అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ మైథలాజికల్ ఫిల్మ్ రానుంది. అల్లు రామలింగయ్య, మమత సమర్పణలో హారిక అండ్ హాసినీ క్రియేషన్స్, గీతా ఆర్ట్స్ పతాకాలపై ఎస్. రాధాకృష్ణ ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ మూవీ చిత్రీకరణను త్వరలోనే ప్రారంభించనున్నట్లు పేర్కొని, అల్లు అర్జున్‌కు బర్త్ డే శుభాకాంక్షలు తెలుపుతూ ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశారు.

సవాల్ వద్దురా సైతాన్


తమన్నా


'భరతఖండాన.. దక్షిణగంగా తీరాన ఆ పరమాత్ముని పుట్టిల్లు అయిన ఓదెలలో ఓ ప్రేతాత్మ పురుడు పోసుకుంటోంది' అంటూ 'ఓదెల 2' సినిమా తెలుగు ట్రైలర్ మొదలవుతుంది. తమన్నా భాటియా ప్రధాన పాత్రలో, హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్. సింహా, యువ, నాగ మహేష్, వంశీ ఇతర పాత్రల్లో నటించిన చిత్రం 'ఓదెల 2'. 'ఓదెల రైల్వేస్టేషన్' సినిమాకు సీక్వెల్‌గా 'ఓదెల 2' తెరకెక్కింది. దర్శకుడు సంపత్ నంది నేతృత్వంలో అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్ పతాకాలపై డి. మధు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న రిలీజ్ కానుంది. మంగళవారం ముంబైలో జరిగిన కార్యక్రమంలో ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 'తిరుపతిగాడు చచ్చిండు కానీ.. వాడి ఆత్మ బతికే ఉంది', 'అయోధ్య, మధుర, మాయ, కాశీ, కాంచీ, అవంతిక వంటి సప్త మోక్షపురులలో సాధన చేసిన దాంతో సవాల్ వద్దురా సైతాన్', 'ఇక నువ్వు, నీ జనం శివనామస్మరణ కాదే.. శవనామ స్మరణే' వంటి డైలాగ్స్ 'ఓదెల 2' తెలుగు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి అజనీష్ లోకనాథ్ సంగీతం అందించగా, ఎస్. సౌందర్ రాజన్ కెమెరామేన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

క్రైమ్ థ్రిల్లర్


అజయ్ దేవగన్


బాలీవుడ్ హీరో అజయ్ దేవగన్ నటించిన తాజా చిత్రం 'రైడ్ 2'. రాజ్ కుమార్ గుప్తా దర్శకత్వం వహించిన ఈ మూవీలో వాణీ కపూర్ హీరోయిన్‌గా నటించగా, రితేశ్ దేశ్ ముఖ్ ప్రధాన పాత్ర పోషించారు. పనోరమా స్టూడియోస్ బ్యానర్‌పై భూషణ్ కుమార్, అభిషేక్ పాఠక్, క్రిషణ్ కుమార్, గౌరవ్ నందా నిర్మించిన ఈ చిత్రం మే 1న గ్రాండ్‌గా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'ఓ వైపు అధికారం.. మరోవైపు నిజం.. ఈ ప్రయాణం ఇప్పుడు మరింత పెద్దదిగా మారింది' అంటూ అజయ్ దేవ్‌గన్ సోషల్ మీడియాలో ట్రైలర్‌ని షేర్ చేశారు. ''క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'రైడ్ 2'. 2018లో విడుదలైన 'రైడ్' మూవీ హిట్ అయింది. ఆ మూవీకి సీక్వెల్‌గా రూపొందిన 'రైడ్ 2'లో మొదటి భాగాన్ని మించిన యాక్షన్, థ్రిల్, సస్పెన్స్ ఉంటాయి. ప్రేక్షకులు మరింతగా ఎంజాయ్ చేస్తారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

వినోదం.. భావోద్వేగం!


రమ్య, రామ్ ప్రకాష్, నిష్కల, శ్రీజిత్

రామ్ ప్రకాష్ గున్నం హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'చెరసాల'. శ్రీజిత్, నిష్కల, రమ్య ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. ఎస్‌రాయ్ క్రియేషన్స్‌పై కత్రి అంజమ్మ, షికార నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న రిలీజ్ కానుంది. రామ్ ప్రకాష్ గున్నం మాట్లాడుతూ– ''రిలేషన్‌షిప్‌లో ఎలా ఉండాలి? ఎలా ఉండకూడదు? అనే అంశాలతో ఈ మూవీ తీశాం. ఇందులో మంచి భావోద్వేగాలతో పాటుగా, చక్కని వినోదం ఉంది '' అని అన్నారు. ''ఈ చిత్రంపై దర్శకుడు నాలుగు సంవత్సరాలు దృష్టి పెట్టాడు. ఇలాంటి మంచి సినిమాలు రావాలి'' అని పేర్కొన్నారు శ్రీజిత్. ''ఓ అమ్మాయి తన భర్త కోసం, మాంగళ్యాన్ని కాపాడుకునేందుకు పడే తపనే ఈ కథ'' అని తెలిపారు కథా రచయిత ఫణీంద్ర భరద్వాజ్.

తత్వం ఏంటి?


దినేష్ తేజ్

పెళ్లి చూపుల కోసం ఓ గ్రామానికి వెళ్లిన ఓ యువకుడు, ఆ ఊరిలో జరిగిన హత్యల కేసులో ఇరుక్కుంటాడు? ఆ కేసుల నుంచి ఎలా బయట పడ్డాడు? అతను తెలుసుకున్న తత్వం ఏమిటి? అనే కథాంశంతో రూపొందుతున్న చిత్రం 'తత్వం'. దినేష్ తేజ్, దష్విక .కె హీరో హీరోయిన్లుగా రూపొందుతున్న చిత్రం ఇది. అర్జున్ కోల దర్శకత్వంలో త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె. ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో వంశీ సీమకుర్తి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ''ఆద్యంతం ఉత్కంఠగా సాగే ఈ మర్డర్ మిస్టరీ మూవీలో స్క్రీన్‌ప్లే హైలైట్‌గా ఉంటుంది'' అని వంశీ సీమకుర్తి అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్, కెమేరా: భరత్ పట్టి.

నవ్వులే నవ్వులు


మిత్రా శర్మ

గీతానంద్, మిత్రా శర్మ జంటగా దయానంద్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వర్జిన్ బాయ్స్'. రాజ్‌గురు ఫిల్మ్స్ పతాకంపై రాజా దరపునేని నిర్మించిన ఈ మూవీ త్వరలో విడుదల కానుంది. ''రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'వర్జిన్ బాయ్స్'. ఈ వేసవిలో థియేటర్లలో ప్రేక్షకులపై నవ్వుల జల్లులు కురిపించేలా మా మూవీ ఉంటుంది. భావోద్వేగాలు కూడా ఆకట్టుకుంటాయి. మా చిత్రం మంచి హిట్ సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: స్మరణ్ సాయి, కెమేరా: వెంకట ప్రసాద్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,089	374
74,227	22,536

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

నాస్‌డాక్	15,617	▲	13
డోజోన్స్	38,180	▲	214
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,911	▲	208
డాక్స్	20,286	▲	491
షాంఘై	3,146	▲	49
నికాయ్	33,013	▲	1,876

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం		
88,550	▼	535
బంగారం		
88,195	▼	533
వెండి		
90,363	▼	29

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	84.05	87.68
£	బ్రిటన్ పౌండ్	107.73	112.68
€	యూరో	91.93	95.50
¥	జపాన్ ఎన్ (100)	47.00	69.00
AUS$	ఆస్ట్రేలియా డాలర్	49.69	54.63
S$	సింగపూర్ డాలర్	61.39	66.12
SAR	సౌదీ రియాల్	21.99	23.55
UAE D	యూఏఈ దిర్హామ్	22.48	24.26
¥	చైనా యువాన్	10.87	12.69

బుల్ బౌన్స్‌బ్యాక్



- ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల దన్ను
- సెన్సెక్స్ 1,089 పాయింట్లు ప్లస్
- 22,500 స్థాయిపైకి నిఫ్టీ
- రూ.7.32 లక్షల కోట్లు పెరిగిన సంపద

ముంబై: ఆసియా, యూరప్ మార్కెట్ల ర్యాలీతో దేశీయ స్టాక్ మార్కెట్ మంగళవారం బౌన్స్‌బ్యాక్ అయ్యింది. దిగువ స్థాయిలో షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సెన్సెక్స్ 1,089 పాయింట్లు పెరిగి 74,227 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 374 పాయింట్లు బలపడి 22,536 వద్ద నిలిచింది. ప్రతీకార సుంకాల విధింపు విషయంలో ప్రపంచ దేశాలతో అమెరికా చర్చలకు సిద్ధంగా ఉందంటూ ట్రంప్‌సంకేతాలు ఇచ్చారు. ఆర్‌బీఐ ఈసారి మరో 25 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ రేట్లు తగ్గించవచ్చనే అంచనాలు నెలకొన్నాయి. డాలర్ బలహీనత, అమెరికా బాండ్లపై రాబడులు దిగివచ్చాయి ఇతర దేశాలతో పోల్చితే ప్రతీకార సుంకాల వల్ల భారత్ పై పడే ప్రభావం తక్కువేనని అంచనాలూ ఇన్వెస్టర్లకు ఊరటనిచ్చాయి. ఉదయమే సానుకూలంగా మొదలైన సూచీలు రోజంతా లాభాల్లో ట్రేడయ్యాయి. అన్ని రంగాల షేర్లకు డిమాండ్ నెలకొంది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,721 పాయింట్లు ఎగసి 74,859 వద్ద, నిఫ్టీ 536 పాయింట్లు దూసుకెళ్లి 22,697 వద్ద గరిష్టాన్ని తాకాయి. బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ సూచీ, మిడ్‌క్యాప్ ఇండెక్స్ రెండు శాతం చొప్పున పెరిగాయి.

- ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ మంగళవారం ఒక్కరోజే రూ.7.32 లక్షల కోట్లు పెరిగి రూ.396.57 లక్షల కోట్లు (4.62 ట్రిలియన్ డాలర్లు)కు చేరింది. ఇన్వెస్టర్లు సోమవారం ఒక్కరోజే రూ.14.09 లక్షల కోట్లు నష్టపోయిన సంగతి తెలిసిందే.
- సెన్సెక్స్ సూచీలో ఒక్క పవర్‌గ్రిడ్ తప్ప (0.19%) మిగిలిన 29 షేర్లు లాభపడ్డాయి. రంగాల వారీగా సూచీల్లో అయిల్‌అండ్‌గ్యాస్ 2.58%, కన్జూమర్ డ్యూరబుల్స్ 2.38%, టెలికం 2.32%, ఇండస్ట్రియల్స్ 2.04%, ఇంధన 2.%, కన్జూమర్ డిస్క్రెషనరీ 2.02% లాభపడ్డాయి. టెక్, హెల్త్‌కేర్, ఐటీ రెండుశాతం చొప్పున పెరిగాయి.
- మార్కెట్ బౌన్స్‌బ్యాక్‌లో భాగంగా అదానీ షేర్లు సైతం కోలుకున్నాయి. ఈ గ్రూప్‌లో మొత్తం 11 షేర్లూ లాభపడ్డాయి. బీఎస్‌ఈలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ టోటల్ గ్యాస్ 3.27%, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 3.23%, అంబుజా సిమెంట్స్ 2.53% లాభపడ్డాయి. ఏసీసీ 2.32%, అదానీ విల్మార్ 2.24%, అదానీ పోర్ట్స్ 1.72%, సంఘీ ఇండస్ట్రీస్ 1.62%, ఎన్‌డీటీవీ 1.06%, అదానీ పవర్ 0.54%, అదానీ గ్రీన్ ఎనర్జీ 0.30 శాతం చొప్పున పెరిగాయి. గ్రూప్‌లో సంస్థల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.12.18 లక్షల కోట్లుగా నమోదైంది.

ప్రపంచ మార్కెట్లు రయ్

వాణిజ్య సుంకాల చర్చలు కాస్త ఉపశమనాన్ని కలిగిస్తాయనే ఆశలతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు ర్యాలీ చేస్తున్నాయి. జపాన్ నికాయ్ 6%, చైనా షాంఘై 2%, హాంగ్‌కాంగ్ హాంగ్‌సెంగ్ 1.50%, దక్షిణ కొరియా కోస్పీ అరశాతం పెరిగాయి. యూరప్‌లో జర్మనీ డాక్స్, ఫ్రాన్స్ సీఏసీ, బ్రిటన్ ఎఫ్‌టీఎస్‌ఈ మూడుశాతం లాభపడ్డాయి. భారత వర్తమాన కాలం ప్రకారం రాత్రి 8:30 గంటలకు నాస్‌డాక్ మూడు శాతం లాభంతో 16,063 వద్ద, డోజోన్స్ రెండున్నర శాతం పెరిగి 38,895 వద్ద, ఎస్‌అండ్‌పీ 2.50% లాభంతో 5,192 వద్ద ట్రేడవుతున్నాయి.

రూపాయికి ట్రేడ్ వార్ సెగ

- డాలర్ మారకంలో 50 పైసలు డౌన్; 86.26 వద్ద క్లోజ్
- మూడు నెలల్లో అతిపెద్ద పతనం



డాలర్ మారకంలో రూపాయి విలువ మరో 50 పైసలు బలహీనపడి 86.26 వద్ద ముగిసింది. వాణిజ్య యుద్ధాలతో మాంద్యం పరిస్థితులు తలెత్తవచ్చనే భయాలు దేశీయ కరెన్సీ కోతకు ప్రధాన కారణమయ్యాయి. యువాన్ క్షీణత, క్రూడాయిల్ రికవరీ, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు మరింత ఒత్తిడి పెంచాయి. జనవరి 13 (66 పైసలు క్షీణత) తర్వాత భారత కరెన్సీకిదే అతిపెద్ద పతనం. ఫారెక్స్ మార్కెట్లో ఉదయం 85.89 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 85.82 వద్ద గరిష్టాన్ని, 86.29 వద్ద కనిష్టాన్ని తాకింది. 'అమెరికా ప్రతీకార సుంకాల ప్రభావం ఫారెక్స్ మార్కెట్‌కు ప్రతికూలంగా మారింది. ఆర్‌బీఐ పాలసీ వెల్లడి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. రానున్న రోజుల్లో 85.90 – 86.50 శ్రేణిలో ట్రేడవొచ్చు' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రీసెర్చ్ నిపుణులు దిలీప్ పార్మర్ తెలిపారు.

షేర్లపై జియో ఫైనాన్స్ రుణాలు



- రూ. 1 కోటి వరకు రుణం
- 9.99 శాతం నుంచి వడ్డీ రేటు

న్యూఢిల్లీ: జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో భాగమైన నాన్–బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థ జియో ఫైనాన్స్ (జేఎఫ్ఎల్) తాజాగా డిజిటల్ విధానంలో సెక్యూరిటీస్‌పై రుణాల (ఎల్ఏఎస్) విభాగంలోకి ప్రవేశించింది. షేర్లు, మ్యూచువల్ ఫండ్లపై తక్కువ వడ్డీ రేట్లకు రుణాలను పొందడానికి ఈ సాధనం ఉపయోగపడుతుందని కంపెనీ తెలిపింది. ఈ ప్రక్రియంతా పూర్తి డిజిటల్ రూపంలో పది నిమిషాల్లోనే పూర్తవుతుందని వివరించింది. జియోఫైనాన్స్ యాప్ ద్వారా ఇది అందుబాటులో ఉంటుందని తెలిపింది. దీని ద్వారా రూ. 1 కోటి వరకు, గరిష్ఠంగా మూడేళ్ల కాలపరిమితికి రుణాలు పొందవచ్చు. వ్యక్తిగత రిస్క్ సామర్థ్యాలను బట్టి వడ్డీ రేటు 9.99 శాతం నుంచి ప్రారంభమవుతుంది. ఫోర్‌క్లోజర్ చార్జీలు ఉండవు.

షేర్లను విక్రయించాల్సిన అవసరం లేకుండా తనఖా పెట్టి, అవసరమైన నిధులను పొందేందుకు ఈ విధానం ఉపయోగకరంగా ఉంటుందని జియో ఫైనాన్స్ ఎండీ కుశల్ రాయ్ తెలిపారు. యూపీఐ చెల్లింపులు, నగదు బదిలీ సర్వీసులు, డిజిటల్ గోల్డ్ మొదలైన వాటిల్లో పెట్టుబడులు తదితర సేవలను కూడా జియోఫైనాన్స్ యాప్‌తో పొందవచ్చు.

బీవైడీకి కేంద్రం 'నో'

స్పష్టం చేసిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



న్యూఢిల్లీ: చైనా అసమంజస వాణిజ్య విధానాలపై విమర్శల నేపథ్యంలో చైనీస్ ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం బీవైడీ భారత్‌లో పెట్టుబడులు పెట్టే ప్రతిపాదనలకు ప్రస్తుతం ఆమోదముద్ర లభించే అవకాశాలు కనిపించడం లేదు. 'దేశ వ్యూహాత్మక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎవరి పెట్టుబడులను అనుమతించాలనే దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ప్రస్తుతానికి బీవైడీ ప్రతిపాదనకు నో (చెప్పినట్లే)' అని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. స్థానిక భాగస్వామితో కలిసి 1 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేస్తామంటూ బీవైడీ చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం గతేడాది తిరస్కరించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ విషయం మళ్లీ ముందుకు కదిలినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో గోయల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు, వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడంలో ప్రభుత్వం ప్రధానంగా దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తుందని దుబాయ్ ఇండియా బిజినెస్ ఫోరం కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా గోయల్ చెప్పారు. వివిధ దేశాలతో ప్రస్తుతం సంప్రదింపులు జరుగుతున్నాయని తెలిపిన గోయల్.. అమెరికాతో చర్చలు సానుకూల దిశలోనే సాగుతున్నాయని చెప్పారు. యూఏఈలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ విద్యా సంస్థలను ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు ఆయన వివరించారు.

సెమీకండక్టర్ల తయారీలోకి సైయెంట్

- కొత్త కంపెనీ ఏర్పాటు
- 100 మిలియన్ డాలర్ల పెట్టుబడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీ టెక్నాలజీ దిగ్గజం సైయెంట్ తాజాగా సెమీకండక్టర్ల తయారీ విభాగంలోకి ప్రవేశించింది. ఇందుకోసం 'సైయెంట్ సెమీకండక్టర్స్' పేరిట ప్రత్యేక కంపెనీని ప్రారంభించింది. దీనిపై 100 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ కృష్ణ బోదనపు వెల్లడించారు. దీనికి సుమన్ నారాయణ్ సీఈవోగా వ్యవహరిస్తారని తెలిపారు. దేశవిదేశాల్లో ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీలు, డిస్కంలు సహా వివిధ పరిశ్రమలకు అవసరమైన సిలికాన్ చిప్ సొల్యూషన్స్‌ను అందించడంపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు కృష్ణ వివరించారు. కంపెనీ విస్తరణ కోసం సెప్టెంబర్ నాటికి ఇన్వెస్టర్ల నుంచి మరిన్ని నిధులు సమీకరించే యోచనలో ఉన్నట్లు కృష్ణ వివరించారు. ఇందుకోసం మర్చంట్ బ్యాంకర్లను నియమించుకునే ప్రక్రియపై కొనసాగుతోందన్నారు. ఇలా సమీకరించిన నిధుల్లో సింహభాగం వాటా పరిశోధన–అభివృద్ధి కార్యకలాపాలు, నిపుణుల నియామకాలపై వెచ్చించనున్నట్లు కృష్ణ

చెప్పారు. ప్రస్తుతం సెమీకండక్టర్ల సంబంధ విధులు నిర్వర్తిస్తున్న సుమారు 400 మంది సిబ్బందిని, కొత్త కంపెనీకి బదలాయించనున్నట్లు తెలిపారు. కొత్త సంస్థను స్టాక్ మార్కెట్లలో లిస్ట్ చేసే యోచన ఉన్నట్లు కృష్ణ పేర్కొన్నారు. సెమీకండక్టర్ వ్యవస్థలో భారత్ స్వావలంబన సాధించడంలో తమ వంతు తోడ్పాటు అందించేందుకు కట్టుబడి ఉన్నామని ఆయన పేర్కొన్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
సీఈవోల సగటు వేతనం @ రూ. 10 కోట్లు..
మే 1 నుంచి ఒక రాష్ట్రం ఒకే ఆర్‌ఆర్‌బీ అమల్లోకి

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య



ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో 89 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ).. జూనియర్ అసిస్టెంట్(ఫైర్ సర్వీస్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 89.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి.
» వయసు: 01.11.2024 నాటికి 18 నుంచి 30 ఏళ్ల లోపు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» వేతనం: నెలకు రూ.31,000 నుంచి 92,000.
» ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 11.04.2025.
» వెబ్‌సైట్: https://www.aai.aero

సీఎస్ఐఆర్-ఎన్ఎంఎల్, జార్ఖండ్‌లో 14 సైంటిస్ట్ పోస్టులు

జార్ఖండ్‌లోని సీఎస్ఐఆర్–నేషనల్ మెటలర్జికల్ ల్యాబొరేటరీ జార్ఖండ్‌లో సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 14.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఈ,ఎంటెక్,పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 08.05.2025 నాటికి 32 ఏళ్లలోపు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.67,700 నుంచి 2,08,700
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 08.04.2025.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 08.05.2025
» వెబ్‌సైట్: https://nml.res.in

ఐజీఐడీఆర్, ముంబైలో 17 ఫ్యాకల్టీ పోస్టులు

ముంబైలోని ఇందిరా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్(ఐజీఐడీఆర్).. ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 17.
» పోస్టుల వివరాలు: ప్రొఫెసర్-03, అసోసియేట్ ప్రొఫెసర్-02, అసిస్టెంట్ ప్రొఫెసర్(రెగ్యులర్/కాంట్రాక్ట్/విజిటింగ్)–12.
» విభాగాలు: బిహేవియరల్ ఎకనామిక్స్, క్లైమేట్ ఛేంజ్ ఎకనామిక్స్, డేటా సైన్స్ అండ్ స్టాటిస్టిక్స్, ఎకనామెట్రిక్ థియరీ, ఎకనామిక్స్ ఆఫ్ ఎడ్యుకేషన్, పొలిటికల్ ఎకానమీ, టైమ్ సిరీస్ ఎకనామెట్రిక్స్ తదితరాలు.
» అర్హత: పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» వేతనం: ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,59,100, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.39,600, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,01,500.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులకు చివరితేది: 05.05.2025.
» వెబ్‌సైట్: http://www.igidr.ac.in

ఈడీసీఐఎల్ ఇండియా లిమిటెడ్, న్యూఢిల్లీలో 103 హెల్త్ కౌన్సిలర్ పోస్టులు

ఈడీసీఐఎల్ ఇండియా లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని మండలాల్లో ఒప్పంద ప్రాతిపదికన కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 103.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, ఎంఏ, ఎంఎస్సీ(సైకాలజీ), డిప్లొమా(కెరీర్ గైడెన్స్)లో ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 31.03.2025 నాటికి 45 ఏళ్లలోపు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.30,000.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 20.04.2025
» వెబ్‌సైట్: https://edcilindia.co.in

పదితో.. కొలువులు ఇదిగో!

పదో తరగతి ఉత్తీర్ణులకు వివిధ ప్రభుత్వ ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ పరిధిలో గ్రూప్-డి ఉద్యోగాలు, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరిధిలో మల్టీ టాస్కింగ్ స్టాఫ్, రక్షణ రంగంలో త్రివిధ దళాల్లో అగ్నివీర్ పోస్టులకు నిర్వహించే పరీక్షలకు టెన్త్ అర్హతతో పోటీ పడొచ్చు. ఈ నేపథ్యంలో.. ఇటీవల పదో తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులకు ఉపయోగపడేలా.. పదితో అందుబాటులో ఉన్న కొలువులు, ఎంపిక విధానం తదితర వివరాలు..

త్రివిధ దళాల్లో ఉద్యోగాలు

పదో తరగతి అర్హతగా త్రివిధ దళాలైన ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌ల్లో అగ్నివీర్ (మెట్రిక్ రిక్రూట్) పేరుతో పలు ఉద్యోగాలకు ఎంపిక ప్రక్రియ చేపడుతున్నారు.

- ఆర్మీలో.. పదో తరగతి అర్హతతో అగ్నివీర్ (జనరల్ డ్యూటీ), అగ్నివీర్ (ట్రేడ్స్‌మెన్), ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారు. నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగున్న వారికి రెండు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. తొలి దశలో కామన్ కాంపిటీటివ్ ఎగ్జామ్ పేరుతో ఆన్‌లైన్ టెస్ట్ ఉంటుంది. ఈ ఆన్‌లైన్ టెస్ట్‌లో భాగంగా జనరల్, నాన్–టెక్నికల్ విభాగాల వారికి 50 ప్రశ్నలు–100 మార్కులతో పరీక్ష జరుగుతుంది. జనరల్ నాలెడ్జ్ (15 ప్రశ్నలు–30 మార్కులు), జనరల్ సైన్స్ (15 ప్రశ్నలు–30 మార్కులు), మ్యాథమెటిక్స్(15 ప్రశ్నలు–30 మార్కులు), లాజికల్ రీజనింగ్ (5 ప్రశ్నలు–10 మార్కులు) నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- టెక్నికల్ బ్రాంచ్‌ల అభ్యర్థులకు 200మార్కులకు పరీక్ష ఉంటుంది. జనరల్ నాలెడ్జ్ (10 ప్రశ్నలు), మ్యాథమెటిక్స్ (15 ప్రశ్నలు), ఫిజిక్స్ (15 ప్రశ్నలు), కెమిస్ట్రీ (10 ప్రశ్నలు) నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు 4మార్కులు కేటాయిస్తారు.
- అన్ని విభాగాలకు సంబంధించి రాత పరీక్ష ముగిసిన తర్వాత అందులో ప్రతిభ ఆధారంగా.. తదుపరి దశలో రిక్రూట్‌మెంట్ ర్యాలీ పేరుతో ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా 1.6 కి.మీ పరుగు పందెం, పుల్‌అప్స్ పరీక్షలు ఉంటాయి. ఇది కూడా పూర్తయిన తర్వాత ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహించి నియామకాలు ఖరారు చేస్తారు.
- అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా నాలుగేళ్ల కాలానికి అగ్నివీర్‌లను ఎంపిక చేస్తారు. తొలి ఏడాది నెలకు రూ.30 వేలు, రెండో ఏడాది నెలకు రూ. 33 వేలు, మూడో ఏడాది నెలకు రూ.36,500 వేలు, నాలుగో ఏడాది నెలకు రూ.40 వేలు చొప్పున వేతనం లభిస్తుంది. నాలుగేళ్లు పూర్తి చేసుకున్న తర్వాత స్కిల్ సర్టిఫికెట్ కూడా అందిస్తారు.
- నేవీలో పదో తరగతి అర్హతతో.. నిర్వహించే అగ్నివీర్–మెట్రిక్ రిక్రూట్ పేరుతో చెఫ్, స్టీవార్డ్, శానిటరీ హైజీనిస్ట్, మ్యూజిషియన్, సెయిలర్, ప్యూన్, సఫాయివాలా, వాచ్‌మెన్, డేటాఎంట్రీ ఆపరేటర్స్, టెలిఫోన్ ఆపరేటర్స్, ఎల్‌డీసీ, చార్జ్‌మెన్ తదితర పోస్టులకు నియామకం చేపడుతున్నారు. ఈ ఎంపిక ప్రక్రియలోనూ తొలిదశలో రాత పరీక్ష ఉంటుంది. సైన్స్, మ్యాథమెటిక్స్, జనరల్ అవేర్‌నెస్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. జనరల్ అవేర్‌నెస్ నుంచి 25 ప్రశ్నలు, సైన్స్ అండ్ మ్యాథ్స్ నుంచి 25ప్రశ్నలు చొప్పున మొత్తం 50 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- రాత పరీక్ష తర్వాత దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ ఉంటుంది. అగ్నివీర్ (ఎస్ఎస్ఆర్) మాదిరిగా ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌ను నిర్వహిస్తారు. ఇందులోనూ విజయం సాధిస్తే కొలువులు ఖరారు చేస్తారు.
- ఎయిర్ ఫోర్స్ విభాగంలో.. పదో తరగతి అర్హతతో.. అగ్నివీర్–వాయు 'నాన్–కంబాటెంట్' పేరుతో హౌస్ కీపింగ్, హాస్పిటాలిటీ స్ట్రీమ్స్‌లోనూ నియామకాలు చేపడతారు.

ఆర్‌ఆర్‌బీ-గ్రూప్-డి ఉద్యోగాలు

- ఇండియన్ రైల్వేలో పదో తరగతి అర్హతతో ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉన్నాయి. ఇందుకోసం రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ గ్రూప్–డి ఉద్యోగాల పేరుతో నియామక ప్రక్రియ నిర్వహిస్తుంది.
- గ్రూప్–డి పరిధిలో.. పాయింట్స్‌మెన్–బి, అసిస్టెంట్(ట్రాక్ మెషీన్), అసిస్టెంట్ (బ్రిడ్జ్), ట్రాక్ మెయింటెనర్ గ్రేడ్–4 ఇంజనీరింగ్, అసిస్టెంట్ పి–వే, అసిస్టెంట్ (సీఅండ్ డబ్ల్యూ), అసిస్టెంట్ టీఆర్‌డీ ఎలక్ట్రికల్, అసిస్టెంట్(ఎస్ అండ్ టీ), అసిస్టెంట్ లోకోషెడ్ (డీజిల్), అసిస్టెంట్ లోకోషెడ్ (ఎలక్ట్రికల్), అసిస్టెంట్ ఆపరేషన్స్ (ఎలక్ట్రికల్), అసిస్టెంట్ టీఎల్ అండ్ ఏసీ, అసిస్టెంట్ టీఎల్ అండ్ ఏసీ (వర్క్ షాప్), అసిస్టెంట్(వర్క్‌షాప్) (మెషీన్) తదితర పోస్టులు అందుబాటులో ఉంటాయి.
- ఎంపిక ప్రక్రియలో భాగంగా తొలుత కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో నాలుగు విభాగాల నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు. జనరల్ సైన్స్ (25 ప్రశ్నలు), మ్యాథమెటిక్స్ (25 ప్రశ్నలు), జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్(30 ప్రశ్నలు), జనరల్ అవేర్‌నెస్ అండ్ కరెంట్ అఫైర్స్(20 ప్రశ్నలు) విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.
- రాత పరీక్షలో నిర్దేశిత కటాఫ్ మార్కులు సాధించిన వారికి తదుపరి దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్(పీఈటీ) నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పురుష అభ్యర్థులు 35 కిలోల బరువు కలిగిన వస్తువును పట్టుకుని రెండు నిమిషాల్లో 100 మీటర్లు దూరం చేరుకోవాలి. అదే విధంగా 4 నిమిషాల 15 సెకన్ల వ్యవధిలో 1,000 మీటర్లు (ఒక కిలోమీటరు) దూరం చేరుకోవాలి. మహిళా అభ్యర్థులు 20 కిలోల బరువు కలిగిన వస్తువును పట్టుకుని రెండు నిమిషాల్లో 100 మీటర్లు దూరం చేరుకోవాలి.

అదే విధంగా 5 నిమిషాల 40 సెకన్ల వ్యవధిలో 1,000 మీటర్లు (ఒక కిలోమీటరు) దూరం చేరుకోవాలి. ఈ రెండు దశల్లోనూ విజయం సాధించిన వారికి డాక్యుమెంట్ వెరిఫికేషన్ చేసి నియామకాలు ఖరారు చేస్తారు.

భద్రత దళాల్లో కానిస్టేబుల్ కొలువులు

పోలీస్ ఉద్యోగం కోరుకునే వారికి పదో తరగతి అర్హతతో అందుబాటులో ఉన్న మరో చక్కటి అవకాశం.. భద్రత దళాల్లో కానిస్టేబుల్ (జీడీ) ఉద్యోగాలు. పదితోనే సీఏపీఎఫ్, ఎస్ఎస్ఎఫ్, రైఫిల్‌మెంట్, అస్సాం రైఫిల్స్, ఎన్‌సీబీలలోని కానిస్టేబుల్ పోస్టులను సొంతం చేసుకోవచ్చు. ఇందుకోసం స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే ఎంపిక ప్రక్రియలో విజయం సాధించాల్సి ఉంటుంది.

- ఈ ఎంపిక ప్రక్రియ మూడు దశల్లో ఉంటుంది. అవి.. రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్. తొలిదశ రాత పరీక్ష.. నాలుగు విభాగాల్లో 160 మార్కులకు జరుగుతుంది. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జీకే అండ్ జనరల్ అవేర్‌నెస్, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్/హిందీ విభాగాల నుంచి 20 ప్రశ్నలు చొప్పున అడుగుతారు.
- రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. రెండో దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తారు. ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో పురుష అభ్యర్థులు అయిదు కిలోమీటర్లను 24 నిమిషాల్లో, మహిళా అభ్యర్థులు 1.6 కిలోమీటర్ల దూరాన్ని ఎనిమిదిన్నర నిమిషాల్లో చేరుకునే విధంగా పరుగు పందెం నిర్వహిస్తారు.
- ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లోనూ ప్రతిభ చూపిన వారికి తదుపరి దశలో ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ నిర్వహిస్తారు. పురుష, మహిళా అభ్యర్థులకు వేర్వేరు భౌతిక ప్రామాణికాలు ఉంటాయి.
- మూడు దశల్లోనూ చూపిన ప్రతిభ, పొందిన మార్కులు, ఇతర రిజర్వేషన్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని తుది విజేతలను ప్రకటిస్తారు.



కేంద్ర ప్రభుత్వ శాఖల్లో.. మల్టీ టాస్కింగ్ స్టాఫ్

- పదో తరగతి అర్హతతో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ఉద్యోగాలకు నియామక ప్రక్రియ నిర్వహిస్తుంది.
- కేంద్ర ప్రభుత్వ శాఖల్లో మల్టీ టాస్కింగ్(నాన్–టెక్నికల్) పోస్టులను.. అదే విధంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్(సీబీఐసీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్ విభాగాల్లో హవాల్దార్ పోస్టులను భర్తీ చేస్తారు.
- ఎస్ఎస్‌సీ ఎంటీఎస్, హవాల్దార్ పోస్టుల ఎంపిక ప్రక్రియలో మూడు దశల్లో అభ్యర్థుల ప్రతిభను పరిశీలిస్తారు. అవి.. రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్. ఎంటీఎస్ పోస్టులకు రాత పరీక్ష మాత్రమే ఉంటుంది. హవాల్దార్ పోస్టులకు ఫిజికల్ టెస్టులు నిర్వహిస్తారు.
- తొలిదశ రాత పరీక్ష రెండు సెషన్లలో 270 మార్కులకు జరుగుతుంది. సెషన్–1లో న్యూమరికల్ ఎబిలిటీ అండ్ మ్యాథమెటిక్స్(20 ప్రశ్నలు–60మార్కులు),రీజనింగ్ ఎబిలిటీ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్(20 ప్రశ్నలు– 60 మార్కులు), సెషన్–2లో జనరల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు–75 మార్కులు), ఇంగ్లిష్ లాంగ్వేజ్(25 ప్రశ్నలు–75 మార్కులు) నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. హవాల్దార్ పోస్టుల అభ్యర్థులకు మలి దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్‌లను నిర్వహిస్తారు.
- ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో భాగంగా నడక పరీక్ష ఉంటుంది. ఇందులో పురుష అభ్యర్థులు 1,600 మీటర్లను 15 నిమిషాల్లో, మహిళా అభ్యర్థులు ఒక కిలో మీటర్ దూరాన్ని 20 నిమిషాల్లో చేరుకోవాల్సి ఉంటుంది.
- సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్‌లో హవాల్దార్ పోస్టులకు ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగుండాలి.
- మూడు దశల్లోనూ విజయం సాధించిన వారికి కొలువులు ఖరారు చేస్తారు.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఎకానమీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–కంప్యూటర్ అవేర్‌నెస్



సమీక్షలో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్. చిత్రంలో శిఖాగోయల్

డ్రగ్స్‌పై ఉక్కుపాదం

- అర్ధవార్షిక నేర సమీక్ష ముగింపులో డీజీపీ జితేందర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్న నేపథ్యంలో మత్తు ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను డీజీపీ జితేందర్ ఆదేశించారు. స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులతో కలిసి మాదకద్రవ్య వ్యతిరేక ప్రచారాలను బలోపేతం చేయాలని యూనిట్ అధికారులకు సూచించారు. విద్యాసంస్థల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అర్ధవార్షిక నేర సమీక్ష ముగింపు సందర్భంగా మంగళవారం డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో డీజీపీ జితేందర్, సీఐడీ డీజీ శిఖాగోయల్, శాంతి భద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ ఇతర అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ ఏడాదిలో నేరాలను మరింత తగ్గించేలా అన్ని స్థాయిల్లో పోలీసు అధికారులు నిబద్ధతతో పని చేయాలని శిఖాగోయల్ సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా శాంతిభద్రతల సమస్యలు, నకిలీ విత్తనాల విక్రయాల నియంత్రణ వ్యూహాలపై మహేశ్ భగవత్ మాట్లాడారు. పలు అంశాలపై సీనియర్ ఐపీఎస్ అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. యంగ్ ఇండియా పోలీస్ పాఠశాల ప్రాముఖ్యతను పీఅండ్ ఎల్ ఐజీ రమేశ్ వివరించారు. ఐజీపీలు వి.వి.సత్యనారాయణ, ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి పోలీసు సిబ్బంది సంక్షేమంపై మాట్లాడారు. జిల్లాల ఎస్పీలు, పోలీసు కమిషనర్లు సమీక్షలో పాల్గొన్నారు.

ఖమ్మంలో కుల వివక్ష కలకలం?

- శ్రీరామనవమి సందర్భంగా ఘటన

ఖమ్మం అర్బన్: సీతారాముల కల్యాణ వేడుకల్లో కుల వివక్ష ఎదురైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఖమ్మం గోపాలపురంలో ఆదివారం స్వామి వారి కల్యాణానికి ఏర్పాట్లు చేయగా పీటలపై గిరిజన దంపతులు కూర్చున్నారు. అయితే క్రతువు నిర్వహించడానికి వచ్చిన అర్చకుడు.. వారు తక్కువ కులం వారే కాక జంధ్యం లేదని, తద్వారా తాను పూజ చేయలేనంటూ స్టేజీ దిగినట్లు సమాచారం. ఈ విషయమై ఘర్షణ మొదలవడంతో అర్చకుడు తానలా అనలేదని ఓసారి, అంటే కనక తనది తప్పేనంటూ క్షమాపణ చెప్పినట్లు తెలిసింది. ఇది సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో మంగళవారం వెలుగుచూసింది. కాగా, ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు రాలేదని తెలిపారు.

ఆన్‌లైన్ మోసం కేసులో ఒకరి అరెస్టు

సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ పెట్టుబడి మోసం కేసులో ఏ–3గా ఉన్న తోకల మధుసూదన్‌ను సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. ఎఫ్ఏఎన్‌యూసీ ఇండియా అనే సాఫ్ట్‌వేర్ రోబోటిక్ కంపెనీ, 'ఇండియా గేట్ రైస్'అనే మరో కంపెనీ పేరుతో నడిచిన ఈ మోసంలో బాధితులు రూ.లక్షలు పోగొట్టుకున్నట్టు సీఐడీ డీజీ శిఖా గోయల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఫ్యానుక్ ఇండియా–బి1012', 'ఫ్యానుక్ ఇండియా–బి1088'అనే వాట్సాప్ గ్రూపులలో గ్రూప్ అడ్మిన్ వందిత షేర్ చేసిన ఫ్యానుక్ ఇండియా రోబోటిక్ ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్ లింక్ ద్వారా పెట్టుబడులు పెట్టమని ప్రేరేపించారు. దీనికి ఆకర్షితుడైన ఘట్‌కేసర్‌కు చెందిన తోకల మధుసూదన్ (ఈ కేసులో–3) పెట్టుబడి పెట్టి, కొంత రాబడిని పొందాడు. తర్వాత, కొత్త పెట్టుబడిదారులను చేర్చితే 11శాతం 'రిఫెరల్ కమిషన్'ఆఫర్ ఉందని తెలుసుకుని, గ్రూప్ అడ్మిన్ వందిత ఆదేశాల మేరకు సమావేశాలు నిర్వహించాడు. నేరెడ్‌మెట్‌లోని ఓహోటల్‌లో జరిగిన ఒక సమావేశంలో 300 నుంచి 400 శాతం లాభాలు వస్తాయని ఆకర్షణీయమైన హామీలు ఇచ్చాడు. ఈ మాటలను నమ్మిన రాబిన్ వినయ్‌కుమార్ జాకియస్ (ఈ కేసులో ఫిర్యాదుదారుడు) సహా ఇతర బాధితులు అనేక మంది రూ. 22,69,262 మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టారు. తర్వాత మోసపోయినట్టు తెలియడంతో పోలీసులను ఆశ్రయించారు. సీఐడీ డీజీ ఆదేశాలతో డీఎస్పీ జి.వెంకటేశ్వర్లు బృందం మధుసూదన్‌ను మంగళవారం అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.

కార్నియా.. త్రీడీ ప్రింటింగ్




- కంటి సమస్యలను అధిగమించడమే లక్ష్యంగా సీసీఎంబీ, ఎల్‌వీపీఐలతో కలిసి ఐఐటీహెచ్‌లో పరిశోధనలు
- కుందేళ్లు, ఇతర జంతువులపై ప్రయోగాలు
- మంచి ఫలితాలనిచ్చాయంటున్న పరిశోధకులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : కంటిలో కీలకభాగమైన కార్నియా లోపంతో చూపును కోల్పోతున్న వారిసంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఎవరైనా కళ్లు దానమిస్తే.. ఆ కంటిని అవయవ మార్పిడి చేసి కార్నియాతో చూపు కోల్పోయిన వారికి వైద్యులు చూపును ప్రసాదిస్తారు. ఇప్పుడు కళ్లను దానం చేసే వారిసంఖ్య పరిమితంగా ఉండగా, కార్నియా అవసరమున్న రోగుల సంఖ్య ఎక్కువగా పెరుగుతోంది. ఈ సమస్యలను అధిగమించడమే లక్ష్యంగా ఐఐటీ హెచ్‌లో (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్)లో ప్రత్యేక పరిశోధన ప్రాజెక్టు కొనసాగుతోంది. త్రీడీ ప్రింటింగ్ సాంకేతికతతో ఈ కార్నియాను బయోప్రింటింగ్ చేయడంపై పరిశోధనలు చేస్తున్నారు. ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, సీసీఎంబీ (ది సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మోలిక్యులర్ బయోలజీ)లతో కలిసి ఐఐటీహెచ్‌లోని బయోమెడికల్ ఇంజనీరింగ్ విభాగం ఈ పరిశోధన ప్రాజెక్టును చేపట్టింది. ఇది సత్ఫలితాలిస్తుందని ఐఐటీహెచ్ బయోమెడికల్ ఇంజనీరింగ్ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ ఫాల్గుణి పతి 'సాక్షి'కి తెలిపారు. ఈ పరిశోధనల్లో రూపుదిద్దుకున్న త్రీడీ బయో ప్రింటింగ్ కార్నియాను ముందుగా జంతువులపై ప్రయోగిస్తున్నారు. ఇప్పటికే కుందేళ్లపై చేసిన ప్రయోగం మంచి ఫలితాలిచ్చింది. రానున్న రోజుల్లో ఈ త్రీడీ బయో ప్రింటెడ్ కార్నియాను మనుషులపై ప్రయోగించనున్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి అనుమతులు పొందనున్నారు.

బయోఇంక్‌తో త్రీడీ ప్రింటింగ్

రోగుల కళ్ల నుంచి బయోఇంక్ (జెల్ లాంటి పదార్థం)ను సేకరిస్తారు. దీనికి కొన్ని రకాల సెల్‌లను యాడ్ చేసి త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీని ఉపయోగించి కార్నియాను ప్రింట్ చేస్తున్నారు. సాధారణంగా కార్నియా అనేది 10.8 మిల్లీమీటర్ల నుంచి 12.8 మిల్లీ మీటర్ల సైజులో ఉంటుంది. ఇటీవల కాలంలో 3డి ప్రింటింగ్ టెక్నాలజీ ప్రాధాన్యం పెరుగుతోంది. భవనాలతోపాటు, జ్యువెలరీ, మానవులు, ఇతర జీవుల అవయవాలు.. ఇలా అనేక రకాల వస్తువులను త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీతో రూపొందిస్తున్నారు. ఈ క్రమంలోనే సూక్ష్మ స్థాయిలో 10 మి.మీల నుంచి 12 మిల్లీమీటర్ల సైజులో ఉండే ఈ అతి చిన్న మానవ అవయవాన్ని ఇదే త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ ద్వారా రూపొందించడం గమనార్హం.



4.9 బిలియన్ మందికి అంధత్వం

ప్రపంచంలో సుమారు 4.9 బిలియన్ మంది అంధత్వంతో బాధపడుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో నాలుగో వంతు కంటిలోని కార్నియాలోపంతోనే అంధత్వం వస్తున్నట్టు తేలింది. ఈ సమస్యకు కంటి దానమే ఇప్పటి వరకు ఉన్న పరిష్కారం. అయితే కళ్లను దానం చేసేవారు తక్కువగా ఉంటున్నారు. అవసరమున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. దీంతో చాలా మంది చూపు లేకుండానే జీవితాన్ని వెళ్లదీస్తున్నారు. ఈ సమస్యలను అధిగమించడమే లక్ష్యంగా ఈ పరిశోధనలు చేస్తున్నట్టు పరిశోధకులు చెబుతున్నారు.

కళ్ల సేకరణలో ఇబ్బందులు

కళ్లు దానమిచ్చిన వారినుంచి కంటి సేకరణ ప్రస్తుతం క్లిష్టతరంగా ఉంది. చనిపోయిన వ్యక్తి శరీరం నుంచి నిర్ణీత సమయంలో కళ్లను సేకరించాలి. సేకరించిన కళ్లను భద్రపరచడం వంటి ప్రక్రియ కొంత వ్యయ ప్రయాసలతో కూడుకున్నది. తగిన వైద్య నిపుణుల అవసరం ఉంటుంది. ఈ క్రమంలో వివిధ కారణాలతో ఒక్కోసారి సేకరించిన కళ్లు పాడైపోయి.. వృథాగా పోతున్న ఘటనలు కూడా ఉంటున్నాయి. ఇలాంటి సవాళ్లకు ఈ పరిశోధనలు కొంత మేరకు పరిష్కారం లభిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కార్నియా దెబ్బతినడానికి ఇవీ కారణాలు..

ప్రధానంగా ఏమైనా ప్రమాదాలు జరిగి కంటికి గాయాలైతే ఈ కార్నియా దెబ్బతింటుంది.

- కంటి ఇన్‌ఫెక్షన్‌తో కూడా కార్నియా చెడిపోతుంది.
- షుగర్ వ్యాధిగ్రస్తులతోపాటు, బీపీ ఉన్న వారికి కూడా క్రమంగా కార్నియాపై ప్రభావం పడుతుంది. దీంతో చూపు మందగించడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతుంటాయని డాక్టర్లు చెబుతున్నారు.

డిగ్రీ లేకున్నా.. స్కిల్స్ ఉంటే ఓకే

- భారత్‌లో పెరుగుతున్న స్కిల్స్ బేస్డ్ హైరింగ్ ట్రెండ్
- స్కిల్స్ ఉంటే 40 లక్షల ప్యాకేజీ ఇస్తామని ఓ స్టార్టప్ ప్రకటన



సాక్షి, హైదరాబాద్: 'ఏ డిగ్రీ చదివారో అవసరం లేదు.. ఏ కాలేజీనో అవసరం లేదు.. రెజ్యూమ్ ముఖ్యం కాదు.. స్కిల్స్ ఉంటే మంచి ప్యాకేజీతో ఉద్యోగం ఇస్తాం'అంటూ ఇటీవల 'స్మాలెస్ట్.ఏఐ'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్ వ్యవస్థాపకుడు సుదర్శన్ కామత్ ఎక్స్ వేదికగా పెట్టిన పోస్ట్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ ప్రకటనకు కొనసాగింపుగా... తమ కంపెనీ ఫుల్‌స్టాక్ ఇంజనీర్‌ను అన్వేషిస్తోందని, తాము కోరుకున్న నైపుణ్యాలున్న వారు దొరికితే ఏడాదికి రూ.40 లక్షల ప్యాకేజీ ఇచ్చేందుకూ సిద్ధమని ఈ పోస్ట్‌లో పేర్కొన్నారు. బెంగళూరుకు చెందిన ఈ సంస్థ ఇచ్చిన ప్రకటనకు ఏడువేలకు పైగా దరఖాస్తులు వచ్చాయంటే అది ఏ స్థాయిలో ఆకట్టుకుందో స్పష్టమవుతోంది. ఈ కంపెనీలో 14 మంది టీమ్ పనిచేస్తుండగా, వారిలో డేటా సైన్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ బృందంలో పనిచేస్తున్న నలుగురు అసలు కాలేజీకి వెళ్లకపోవడమో లేదా మధ్యలో మానేసినవారో కావడం గమనార్హం. వారు ఈ సంస్థలోని ఐఐటీ, వీఐటీ, ఐఐఐటీల్లో పట్టాలు పొందినవారితో తమ తమ రంగాల్లో పోటీపడుతుండటం విశేషం. ఈ స్టార్టప్ స్థాపకులు కామత్, అక్షత్ మాండ్లోయి ఐఐటీ–గువాహటి పట్టభద్రులైనప్పటికీ, డిగ్రీలు కాదు ఆయా రంగాల్లో నైపుణ్యాలు, సాధించాలనుకున్న లక్ష్యాలు ముఖ్యమని.. తాము కోరుకున్న రంగాల్లో నైపుణ్యాలు సమృద్ధిగా ఉంటే వారిని మంచి ప్యాకేజీలతో ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నారు.

అదే బాటలో పలు కంపెనీలు

ఈ సంస్థే కాకుండా భారత్‌లోని వివిధ కంపెనీలు డిగ్రీలకు ప్రాధాన్యం ఇవ్వకుండా ఆయా విషయాల్లో, రంగాల్లో నైపుణ్యాలకు పెద్దపీట వేస్తూ 'స్కిల్స్–ఫస్ట్'అంటూ ముందుకు సాగుతున్నాయి. దీంతో దేశంలో స్కిల్స్ బేస్డ్ హైరింగ్ ట్రెండ్ ఊపందుకుంటున్నట్టు కనిపిస్తోంది. కాలేజీలు, యూనివర్సిటీల్లో చదివే మొక్కుబడి చదువులకన్నా తమ అభిరుచులకు తగ్గట్టుగా నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటే ఆయా రంగాల్లో మంచి ఉద్యోగాలు పొందొచ్చనే సందేశం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. టెక్ దిగ్గజం ఐబీఎం కూడా ఈ హైరింగ్ ట్రెండ్‌కే మొగ్గు చూపుతోంది. ఐబీఎం ఇండియా... ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలకు వచ్చే వారి టాలెంట్‌ను డిగ్రీ సర్టిఫికెట్ల ద్వారా అంచనా వేయకుండా.. ఆయా రంగాల్లో వారి నైపుణ్యాలను బట్టి విధులకు సరిపోతారా లేదా అని అంచనా వేస్తోంది. 'ప్రోగ్రామింగ్, జనరేటివ్ ఏఐ అనే వాటి విస్తరణతో మరీ లోతైన కోడింగ్ నైపుణ్యాలు తప్పనిసరి కాకపోవడంతో 'నో కోడ్'లేదా 'లో కోడ్'ప్రోగ్రామ్‌లకు ప్రాధాన్యత ఏర్పడింది. దీంతో ఉద్యోగార్థి డిగ్రీలు, సర్టిఫికెట్ల కంటే నైపుణ్యాలు, యోగ్యత, అభిరుచులు అనే వాటికి ప్రాధాన్యత పెరిగింది'అని ఐబీఎం హెచ్‌ఆర్ మేనేజర్లు చెబుతున్నారు. ఐబీఎం ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహిస్తున్న హ్యాకథాన్‌లలో సంప్రదాయ రెజ్యూమ్‌ల కంటే ఏదైనా సమస్య–పరిష్కారంపై చూపే చొరవ, నైపుణ్యాలకు పెద్దపీట వేస్తోంది. అదేవిధంగా, ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్ మొబైల్ ప్రీమియర్ లీగ్ (ఎంపీఎల్), కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ జెట్‌వర్క్ కూడా స్కిల్క్ ఫస్ట్ విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఇదిలాఉంటే, డిగ్రీ లేకపోతే నైపుణ్యాలను అంచనా వేయడానికి స్పష్టమైన విధానం లేదన్న ధోరణితో పలు కంపెనీలు ఇప్పటికీ సంప్రదాయ పద్ధతినే అవలంబిస్తున్నాయి.

ఎనిమిది మందే 'వెరీగుడ్డు'!

- రాష్ట్రంలో రిప్లికా ధ్రువీకరణ ఉన్నది ఎనిమిది మందికి మాత్రమే
- స్పష్టం చేసిన డైరెక్టరేట్ ఆఫ్ మార్కెటింగ్ అండ్ ఇన్‌స్పెక్షన్

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లోని లబ్ధిదారులకు పంపిణీ చేసే కోడిగుడ్ల సరఫరాకు కాంట్రాక్టర్ల ఎంపిక గడువు గురువారంతో ముగియనుంది. ఈదఫా టెండర్ ప్రక్రియలో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సరికొత్త నిబంధనలు ప్రవేశపెట్టింది. రెండేళ్లకు ముందు అగ్‌మార్క్ ధ్రువీకరణ ఉండాలని, అగ్‌మార్క్ రిప్లికా సీరియల్ నంబర్‌తో కూడిన మార్కింగ్ అర్హత ఉన్నవారికే అవకాశం కల్పిస్తామనే నిబంధన విధించింది. అగ్‌మార్క్, రిప్లికా ధ్రువీకరణ జారీ చేసే అధికారం కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని మార్కెటింగ్ అండ్ ఇన్‌స్పెక్షన్ డైరెక్టరేట్ పరిధిలో ఉంటుంది. రాష్ట్రంలో అగ్‌మార్క్, రిప్లికా సీరియల్ నంబర్ పొందిన పౌల్ట్రీ రైతులు రంగారెడ్డి జిల్లాలో ముగ్గురు మహబూబ్‌నగర్, భువనగిరి, హనుమకొండ, సిద్దిపేట, మెదక్ జిల్లాల నుంచి ఒక్కొక్కరు మాత్రమే ఉన్నా రు. ఈ టెండర్ ప్రక్రియకు సంబంధించి ఆన్‌లైన్ బిడ్డింగ్ ఈనెల 10వ తేదీ సాయంత్రం 4గంటలకు ముగియనుండగా... టెండరు ఫారాలు, ధ్రువీకరణ పత్రాలు, ఈఎండీని మాన్యువల్ పద్ధతిలో సంబంధిత అధికారులకు సమర్పించేందుకు ఈనెల 10వ తేదీ సాయంత్రం 5గంటల వరకు అవకాశముంది.



అప్పుడు అలా... ఇప్పుడు ఇలా...

కోడిగుడ్ల సరఫరాకు సంబంధించిన టెండర్ ప్రక్రియలోని నిబంధనలు కేవలం కొందరికి మాత్రమే అనుకూలంగా ఉన్న అంశాలపై ఈనెల 6వ తేదీ సాక్షి దినపత్రికలో 'నిబంధనలకే టెండర్' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంచాలకులు ఏ.కాంతివెస్లీ స్పందించారు. ఈ పథకం కింద కేవలం నిరుపేదలు మాత్రమే లబ్ధి పొందుతారని, వారికి మెరుగైన, అత్యంత నాణ్యతతో కూడిన పోషకాహారాన్ని అందించాలనేది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ నేపథ్యంలోని కాంట్రాక్టర్ల ఎంపికలో అగ్‌మార్క్, రిప్లికా నంబర్ నిబంధన ప్రవేశపె ట్టామన్నారు.

కొరమీను.. కేరాఫ్ కరీంనగర్

- రూ.6 కోట్ల వ్యయంతో ఈ చేపలు పెంచేందుకు నాలుగు జిల్లాల ఎంపిక
- ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతికి చెక్ పెట్టనున్న మత్స్యశాఖ



సాక్షి, హైదరాబాద్: చేప ప్రియులు లొట్టలేసుకొని తినే కొరమీనుకు కరీంనగర్ కేంద్రం కాబోతోంది. కొరమీను చేపలతో రాష్ట్రం కళకళలాడేలా మత్స్యశాఖ ప్రణాళికలు రచిస్తోంది. ఇతర రాష్ట్రాలను నుంచి దిగుమతి చేసుకునే బదులు మన దగ్గరే వాటిని ఎక్కువగా పెంచేలా చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం నాలుగు జిల్లాలను ఎంపిక చేసింది. కరీంనగర్ కేంద్రంగా జగిత్యాల, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలను కలిపి క్లస్టర్ ఏర్పాటు చేయాలని, ఇక్కడే కొరమీను చేపలను పెంచాలని భావిస్తోంది. మత్స్య శాఖ ప్రణాళికలను ప్రభుత్వం ఆమోదిస్తే కొరమీనుకు మన దగ్గర కొదువే ఉండదు.

ధరల భారం లేకుండా


వాస్తవానికి తెలంగాణలో డిమాండ్‌కు సరిపోను కొరమీను చేపలు అందుబాటులో లేవు. ఏపీతోపాటు ఒడిశా, ఇతర రాష్ట్రాల నుంచి వీటిని తెచ్చి మన మార్కెట్లలో అమ్ముతుంటారు. ట్రాన్స్‌పోర్ట్, ప్యాకింగ్, లోడింగ్, అన్‌లోడింగ్, సరిహద్దు ట్యాక్స్‌లతో పాటు కమీషన్లు కలిపి ఎక్కువ ధరకు వీటి విక్రయాలు జరుగుతుంటాయి. ప్రస్తుతం చేపల మార్కెట్‌లో కొరమీను కిలో రూ.300–500 వరకు ఉంది. ఈ నేపథ్యంలో తక్కువ ధరకు కొరమీనులను చేప ప్రియులకు అందుబాటులోకి తెచ్చేలా మత్స్యశాఖ చర్యలు తీసుకుంటోంది.

నీటి వనరులే కీలకం

కొరమీను చేపల పెంపకానికి నీటి వనరులు ఎక్కువ అవసరం. ముఖ్యంగా నీటి చలన, ప్రవాహం ఉన్న వనరుల్లో ఇవి త్వరగా, బలిష్టంగా పెరుగుతాయి. నీటి వనరులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను మత్స్యశాఖ కొరమీను చేపల పెంపకానికి ఎంపిక చేసింది. దీంతోపాటు ఉంగ్రుమట్టి ఎక్కువగా ఉంటే, అందులో ఉన్న నాచు కారణంగా కొరమీనుచేపలు మరింత బలంగా పెరిగే అవకాశముంటుంది. అందుకే ఒంగ్రుమట్టి లభ్యత ఉన్న ఆ నాలుగు జిల్లాల్లో కొరమీను పెంచాలని నిర్ణయించింది.

మీది కడుపుకోతా?.. మరి అసలైన తల్లిదండ్రులది?

- పిల్లలను కొన్నారు కాబట్టి సానుభూతి చూపిస్తాం
- 2 రోజుల పసికందులను కొన్నారు.. ఇదెక్కడి మానవత్వం?
- న్యాయపరంగా అయితే మేం అంగీకరించలేం
- హైదరాబాద్‌లో పిల్లలను దత్తత తీసుకున్న కేసులో సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు



సాక్షి, న్యూఢిల్లీ: 'మీరు పిల్లలను కొన్నారు.. వారు మీ పిల్లలే అనే ఆలోచనతో మీకు ఆ బాధ ఉంటుంది. అందుకే మీపై మేము కేవలం సానుభూతి చూపించగలం. అంతకుమించి మీకు న్యాయమైతే చేయలేం కదా?'అంటూ.. 2024లో హైదరాబాద్‌లో పసికందులను దత్తతకు తీసుకున్న తల్లిదండ్రులను ఉద్దేశించి దేశ సర్వోన్నత న్యాయస్థానం ఘాటుగా స్పందించింది. మీరు చెప్పినదానిని బట్టి చూస్తే మీదేనా కడుపు కోతా? మీది కడుపుకోత అయినప్పుడు అసలైన తల్లిదండ్రులది ఏమనాలి? అంటూ ప్రశ్నలు సంధించింది. ఢిల్లీ, పుణే నగరాల్లోని ఆసుపత్రుల్లో ఒకరోజు, రెండు రోజుల పసికందులను దొంగలించి హైదరాబాద్‌కు తీసుకొచ్చి.. పిల్లలు లేని వారికి దత్తత పేరుతో అమ్మకాలు చేపట్టారు. మే 22న ఫీర్జాదిగూడలో ఓ పసికందును విక్రయిస్తుండగా మేడిపల్లి పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేయడంతో.. అసలు విషయాలు బయటకు వచ్చాయి. తమ పిల్లల్ని తమకు ఇవ్వాలని కొనుగోలు చేసిన తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించగా.. కొనుగోలు చేసిన వారికి అనుకూలంగా సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. శిశు సంక్షేమ కమిటీ ఈ తీర్పును ద్విసభ్య ధర్మాసనం వద్ద సవాల్ చేయగా.. ప్రభుత్వానికి సానుకూలంగా ఉత్తర్వులు వచ్చాయి. ఈ డివిజన్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ గత ఫిబ్రవరిలో పిల్లలను కొనుగోలు చేసిన తల్లిదండ్రులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ సుధాంశు దులియా, జస్టిస్ కె వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది.

పిల్లలు లేరు అందుకే దత్తత తీసుకున్నాం

పిల్లలు లేని కారణంగానే.. ఆ పసికందులను దత్తత తీసుకున్నట్లు పిటిషనర్ల తరపు న్యాయవాది శ్రీనివాస్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఆ పిల్లలతో తమకెంతో భావోద్వేగం ఉన్నట్లు తెలిపారు. తమ నుంచి పిల్లలను స్వాధీనం చేసుకున్న నాటి నుంచి తాము విలవిలలాడుతున్నామని, వారిని తిరిగి తమకు అప్పగించాలని కోరారు.

చట్టపరమని మేము ఎలా చెబుతాం?

'మీరు తీసుకున్నదే ఇల్లీగల్ (చట్టవిరుద్ధం)గా.. మమ్మల్ని న్యాయం చేయమంటే మేం లీగల్ (చట్టపరం) అని ఎలా చెబుతాం? కొనుగోలు చేసిన వారిలో రెండు రోజుల పసికందులున్న విషయం గమనించారా? కన్న ఆ తల్లి క్షోభ మీకు ఒక్కసారి కూడా గుర్తుకు రాలేదా? మీరు చేస్తున్నది తప్పు అని మీ మనస్సాక్షికి అనిపించలేదా'అంటూ నిలదీసింది. ఈ విషయంలో మేం కేవలం మీపై సానుభూతి మాత్రమే చూపించగలం. కన్న తల్లిదండ్రుల నుంచి చిన్నారులను దత్తత తీసుకున్న వాళ్లు కాదు మీరు, పర్చేజ్ చేసిన వాళ్లు అని ఘాటు వ్యాఖ్యలు చేస్తూ.. విచారణను వచ్చే నెల 7కు వాయిదా వేసింది.



చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్.. చౌమొహల్లాలో స్వాగత విందు

- ప్రపంచ సుందరి పోటీల కోసం ఏర్పాట్లు
- అధికారులతో సమీక్షించిన స్మితాసబర్వాల్

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల ఏడో తేదీ నుంచి నెలాఖరు వరకు నగరంలో జరగనున్న ప్రపంచ సుందరి పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని పర్యాటక శాఖ కార్యదర్శి స్మితాసబర్వాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె వివిధ విభాగాల అధికారులతో చౌమొహల్లా ప్యాలెస్‌లో సమీక్షించారు. 120 దేశాల నుంచి పోటీదారులు పాల్గొంటున్నారని, ఇతర ప్రతినిధులు, ప్రపంచ మీడియా సిబ్బంది హాజరవుతున్నారని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్, చౌమొహల్లా ప్యాలెస్‌లో స్వాగత విందు ఉంటుందని పేర్కొన్నారు. చౌమొహల్లా ప్యాలెస్‌ను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమాలు ఆసాంతం తెలంగాణ, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. ప్యాలెస్‌లో ఫొటోషూట్ కోసం ప్రత్యేక ప్రాంతం, లైవ్ మ్యూజిక్‌లో సూఫీ, కవ్వాలి సంగీతం, తెలంగాణ సంప్రదాయం ప్రతిఫలించేలా 20 నిమిషాల పాటు సాంస్కృతిక కార్యక్రమాలుండాలని స్మితాసబర్వాల్ ఆదేశించారు. స్వాగత విందులో తెలంగాణ, హైదరాబాద్ రుచులుండాలన్నారు. ఆమె వెంట పర్యాటక శాఖ డైరెక్టర్ హనుమంతు, యువజన సర్వీసుల విభాగం డైరెక్టర్ వాసం వెంకటేశ్వరరెడ్డి, శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ కిషన్‌రావు, సెట్విన్ ఎండీ వేణుగోపాల్, ఇతర అధికారులున్నారు.

కొబ్బరి కాయ చెప్పింది.. పైపు లైన్ పగిలింది..



చందుర్తి (వేములవాడ): పూజారి సూచించిన చోట.. మూఢ నమ్మకంతో తవ్విన బోరువెల్.. భగీరథ పైపులైన్‌ను పగుల గొట్టింది. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మూడ పల్లిలో మంగళవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. మూడ పల్లికి చెందిన ఓ రైతు సాగునీటి కోసం బోరు వేయాలని ఓ పూజారిని ఆశ్రయించాడు. ఆ పూజారి కొబ్బరికాయను చేతిలో పెట్టుకొని.. నీటి ఊటల కోసం పొలంలో కలియతిరిగాడు. సరిగ్గా మిషన్‌భగీరథ పైపులైన్ వెళ్లిన ప్రదేశంలో నీరు ఉందని.. అక్కడ బోరు వేయాలని సూచించాడు. పూజారి సూచనలతో బోరు వేయించగా.. భూమి లోపలి నుంచి వెళ్తున్న మిషన్ భగీరథ పైపులైన్ పగిలి నీరంతా వృథాగా పోయింది. పైపులైన్ పగిలినట్లు గుర్తించిన బోర్‌వెల్ వాహన నిర్వాహకుడు.. తమపై ఎక్కడ పోలీస్ కేసు నమోదవుతుందోనన్న భయంతో.. వాహనంతో సహా పరారయ్యాడు. మంగళవారం ఉదయం సమాచారం అందుకున్న అధికారులు పైపులైన్‌కు మరమ్మతులు చేయించి, నీటి సరఫరాను పునరుద్ధరించారు.



ఒక్క సాయంత్రం.. జీవితం తలకిందులైంది..

- ఈదురు గాలులతో రైతుకు రూ.13 లక్షల నష్టం


దుగ్గొండి: వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం అడవిరంగాపురం గ్రామానికి చెందిన యువ రైతు పేరు సింగతి సునీల్.. రెండు ఎకరాల్లో రూ.2.50 లక్షల పెట్టు బడితో బొప్పాయి సాగు చేశాడు. పంట నాణ్యంగా ఉండడంతో సోమవారం వ్యాపారులే చేను వద్ద బారులుతీరి గుత్తకు ఇవ్వాలని రైతును కోరారు. అందుకు సునీల్ రూ.16 లక్షలు చెప్పగా.. రూ.13 లక్షలకు బేరం కుదిరింది. వ్యాపారులు మంగళవారం పూర్తిస్థాయిలో మాట్లాడుకుని అడ్వాన్స్ ఇస్తామని చెప్పి వెళ్లారు. సాయంత్రం రైతుల ఆశలపై ప్రకృతి నీళ్లు చల్లింది. ఈదురుగాలులతో పంటంతా విరిగిపోయి నేలపాలైంది. ఉదయాన్నే చేను వద్దకు వెళ్లిన సునీల్ కన్నీటి పర్యంతమయ్యాడు. లక్షాధికారిని అవుతున్నాననే ఆశ 12 గంటల్లోనే ఆవిరైందని రోదించాడు.

పోలీసు వాహనంతో రీల్స్



దోమలపెంట: ఇద్దరు యువకులు పోలీసు వాహనం నడుపుతూ.. రీల్స్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియోలు వివాదాస్పదమయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా ఈగలపెంటలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. జిల్లాలోని ఈగలపెంట పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఇన్నోవా టీఎస్ 09 పీఏ 4622 వాహనాన్ని మంగళవారం ఇద్దరు యువకులు నడుపుతూ రీల్స్ చేశారు. ఈగలపెంట పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఓ అధికారి బంధువులే.. దోమలపెంట సమీపంలోని శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన రీల్స్ చేసినట్టు తెలుస్తోంది. కాగా ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

ఎదిగాయి.. సవాల్ విసి‘రాయి’

ఎవరూ నాటలేదు.. నీళ్లు పోయలేదు.. సంరక్షించలేదు.. అయినా రాతి గోడలను చీల్చుకుంటూ ఎదుగుతున్నాయి. పెద్దపల్లి జిల్లా చిన్నకల్వల వద్ద మనుగడలో లేని పురాతన వంతెనపై.. వివిధ రకాల చెట్లు పెరుగుతున్నాయి. ప్రకృతి ప్రియులకు కనువిందు చేస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

‘ఎర్ర గుంటూరు’ సాగు.. ఎంతో బాగు

- నిజామాబాద్ మార్కెట్ యార్డులో ఈ రకం పసుపు వంగడమే ఎక్కువ
- ‘ఎర్ర గుంటూరు’సాగుకే అత్యధిక రైతుల మొగ్గు
- సేలం, రాజాపురి, పీతాంబర్ సాగు చాలా స్వల్పం
- కొత్త వంగడాల అభివృద్ధికి కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన కేంద్రం కృషి
- ఇరాన్, బంగ్లాదేశ్, అరబ్ దేశాలకు ఇందూరు పసుపు ఎగుమతులు





సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పసుపు పంట కొనుగోళ్లలో రాష్ట్రంలోనే 70 శాతం వాటా కలిగిన నిజామాబాద్ మార్కెట్ యార్డుకు ప్రత్యేకత ఉంది. కానీ ఇక్కడికి వచ్చే పసుపు రకాల విషయానికి వస్తే 99 శాతం ‘ఎర్ర గుంటూరు’(ఆర్మూర్ రకం) ఉండటం విశేషం. నిజామాబాద్ జిల్లా తరువాత.. పసుపు ఎక్కువగా సాగు చేస్తున్న జగిత్యాల, నిర్మల్ జిల్లాల్లో సైతం ఎర్రగుంటూరు రకం వంగడాన్నే అత్యధిక శాతం రైతులు సాగు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలోని ‘దుగ్గిరాల ఎరుపు’రకం వంగడాన్ని తీసుకొచ్చి కమ్మర్‌పల్లి పరిశోధన కేంద్రంలో మరింత అభివృద్ధి చేశారు. అప్పటినుంచి దీన్ని ఎర్ర గుంటూరు (ఆర్మూర్ రకం)గా పిలుస్తున్నారు. ‘ఎర్ర గుంటూరు’రకం వంగడం ఇక్కడి నేలకు సరిపోయిందని రైతులు చెబుతున్నారు. ఇందులో కర్కుమిన్ 3 శాతం లోపే ఉంటోంది. కాగా కర్కుమిన్ శాతం ఎక్కువగా ఉండే సోనాలి, రాజేంద్రసోని (బిహార్), పీతాంబర్ (ఉత్తరప్రదేశ్) రకాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చినప్పటికీ.. రైతులు మాత్రం స్థానికంగా అభివృద్ధి చేసిన ‘ఎర్ర గుంటూరు’రకం వైపే మొగ్గు చూపుతున్నారు. కేవలం 6 నెలల్లోనే పంట వచ్చే ప్రగతి, ప్రతిభ (కేరళ) పాట్టి రకాలను అందుబాటులోకి తీసుకొచ్చినప్పటికీ, ఈ రకాల్లో పసుపు బరువు ఎక్కువగా రావడం లేదని రైతులు ఆసక్తి చూపడం లేదు. చూసేందుకు మంచిగా, ధర ఎక్కువగా పలికే ‘ఎర్ర గుంటూరు’రకమే మేలని రైతులు అంటున్నారు. దుంప ఎక్కువగా వచ్చే తమిళనాడు సేలం రకం వంగడాన్ని సైతం నామమాత్రంగానే సాగు చేస్తున్నారు. అయితే చాలా తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్న రాజాపురి, సేలం, పీతాంబర్ రకాలను రైతులు ఎక్కువగా మహారాష్ట్రలోని సాంగ్లి మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముతున్నారు. ఈ రకాల్లో కర్కుమిన్ శాతం ఎక్కువగా ఉంటుంది. కాగా ‘ఎర్ర గుంటూరు’రకం పసుపును దేశీయంగా ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. నిజామాబాద్ పసుపు బంగ్లాదేశ్, ఇరాన్, అరబ్ దేశాలకు సైతం ఎగుమతి అవుతోంది.

13 రకాలపై పరిశోధన

రాష్ట్రంలో ఏకైక కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన కేంద్రంలో ప్రస్తుతం 13 రకాల పరిశోధనలు జరుగుతున్నాయి. అధిక కర్కుమిన్, దిగుబడి ఎక్కువ, తెగుళ్ల నివారణ, కీటకాలు, పురుగు నివారణ తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని ప్రయోగాలు చేస్తున్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నడుస్తున్న కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన కేంద్రంలో.. పరిశోధనలకు భారత సుగంధ ద్రవ్యాల పరిశోధన సంస్థ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పైసెస్ రీసెర్చ్) నుంచి సూచనలు వస్తాయి. కేరళలోని ఆలిండియా కో–ఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ ఆన్ స్పైసెస్ (ఏఐసీఆర్‌పీ)తో సమన్వయం చేసుకుంటూ.. కొన్ని పరిశోధనలు, రాష్ట్ర ఉద్యాన వర్సిటీ ఆధ్వర్యంలో మరికొన్ని పరిశోధనలు ఇక్కడ చేస్తున్నారు.

40 శాతం సాగు నిజామాబాద్ జిల్లాలో..

రాష్ట్రంలో అత్యధికంగా 40 శాతం నిజామాబాద్ జిల్లాలో సాగవుతోంది. తరువాత స్థానాల్లో జగిత్యాల, నిర్మల్, వరంగల్, వికారాబాద్, మహబూబాబాద్, హనుమకొండ, భూపాలపల్లి, ఆదిలాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లో సాగు చేస్తున్నారు. నిజామాబాద్ మార్కెట్‌కు 2019–20లో 10,78,821 క్వింటాళ్ల పసుపు వచ్చింది. 2020–21లో 8,55,516 క్వింటాళ్లు, 2021–22లో 8,38,932 క్వింటాళ్లు, 2022–23లో 7,49,072 క్వింటాళ్లు, 2023–24లో 7,23,470 క్వింటాళ్ల పసుపు వచ్చింది. ఈ ఏడాది జనవరి చివరి వారంలో సీజన్ ప్రారంభమైంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 6,74,055 క్వింటాళ్ల పసుపు నిజామాబాద్ మార్కెట్‌కు వచ్చింది. గత ఏడాది కంటే 1.50 లక్షల క్వింటాళ్లు అధికంగా పసుపు రానుందని మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు. ఈ నెలాఖరుకు మరో 50 వేల క్వింటాళ్లు, ఏప్రిల్‌లో 85 వేల క్వింటాళ్లు, మే నెలలో మరో 65 వేల క్వింటాళ్ల పసుపు ఇక్కడి మార్కెట్‌కు రానున్నట్లు అధికారుల అంచనా. గత ఏడాది రాష్ట్రంలో సగటున ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది దుంపకుళ్లు సోకక పోవడంతో ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 45 వేల ఎకరాల్లో సాగు చేయగా, ఇందులో నిజామాబాద్ జిల్లాలో 22 వేల ఎకరాల్లో పసుపు సాగు చేశారు.

కొనేది.. తినేది విషమే!

కలకలం రేపుతున్న ఆహార కల్తీ..

- దేశవ్యాప్తంగా ఇదే వ్యాపారం
- ప్రమాదకరంగా ఉత్తరప్రదేశ్.. ఆ తర్వాత జార్ఖండ్, లడఖ్‌లు..
- కల్తీ జాబితాలో మెరుగ్గా తెలుగు రాష్ట్రాలు..
- నాలుగేళ్లలో 18.59 శాతం నుంచి 10.1 శాతానికి తెలంగాణ
- ముందువరుసలో హైదరాబాద్.. ఆ తర్వాత ద్వితీయ శ్రేణి నగరాలు
- ఎఫ్ఎస్ఎస్ఏఐ, ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ ల్యాబ్‌ల పరీక్షల్లో వెల్లడి
- ఆహార కల్తీపై ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ నివేదిక

సాక్షి ప్రతినిధి, వరంగల్: పాలు, పాల ఉత్పత్తులు, వంట నూనెలు, పప్పులు, పండ్లు, కూరగాయలు, మిఠాయిలు.. కల్తీకి కాదేది అనర్హం అన్నట్లు.. పెరుగుతున్న ఆహార పదార్థాలు, వస్తువుల కల్తీ ఆందోళన కలిగిస్తోంది. ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నా.. అరికట్టే విషయమై కట్టుదిట్టమైన చర్యలు కనిపించడం లేదు. దేశ ప్రజల ఆరోగ్యం, కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రతికూల ప్రభావాలు తదితర అంశాలను అంచనా వేయడానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) అధ్యయనం చేయాల్సి ఉంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ), ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ (ఎఫ్ఎస్‌డబ్ల్యూ) ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ల ద్వారా ఆహార ఉత్పత్తుల నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఇలా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో.. మూడేళ్లుగా సేకరించిన ఆహార పదార్థాల నమూనాలను ల్యాబ్‌లో టెస్టుకు పంపి కనుగొన్న కల్తీ శాతం పరిశీలిస్తే ఒళ్లు జలదరిస్తోంది. చాలాచోట్ల భయంకరంగా ఆహార ఉత్పత్తుల కల్తీ జరుగుతున్నట్లు నివేదికల్లో తేలగా.. తెలంగాణలో నాలుగేళ్లలో ఆహార కల్తీశాతం 18.59 నుంచి 10.1 శాతానికి తగ్గగా.. ఎక్కువగా హైదరాబాద్.. ఆ తర్వాత వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం తదితర ద్వితీయ శ్రేణి నగరాల్లో ఈ కల్తీ ఆనవాళ్లు ఉన్నట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ వెల్లడించిన నివేదికలు చెబుతున్నాయి.

కల్తీ గణాంకాలివి..

ఆహార పదార్థాలకు శాస్త్రీయ ఆధారిత ప్రమాణాలు, వినియోగానికి సురక్షితమైన, ఆరోగ్యకరమైన ఆహారం లభ్యతను నిర్ధారించడంతో పాటు వాటి తయారీ, నిల్వ, పంపిణీ, అమ్మకం, దిగుమతులను నియంత్రించడానికి 2008లో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ)ని స్థాపించారు. ఆహార భద్రత, ప్రమాణాల చట్టంలో నాణ్యత లేని ఆహారం, తప్పుడు బ్రాండ్, సురక్షితం కాని ఆహారంపై చర్యలకు ఎఫ్ఎస్ఎస్ఏఐకి నిర్దిష్ట నిబంధనలున్నాయి. ఈ మేరకు ఆహార ఉత్పత్తుల నమూనాలను ఆకస్మికంగా సేకరించి.. క్రమం తప్పకుండా నిఘా, పర్యవేక్షణ, తనిఖీ నిర్వహిస్తుంది. ఆహార నమూనాలు అనుగుణంగా లేవని తేలితే.. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం ప్రకారం ఆహార వ్యాపార నిర్వాహకులపై చర్యలు తీసుకుంటారు. ఇంకా, మారుమూల ప్రాంతాల్లో కూడా ప్రాథమిక పరీక్ష సౌకర్యాలను విస్తరించడానికి ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ (ఎఫ్ఎస్‌డబ్ల్యూ) ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ల ద్వారా ఆహార ఉత్పత్తుల నమూనాలను సేకరించి పరీక్షించి నివేదికలు వెల్లడిస్తారు. ఈ క్రమంలోనే ప్రధానంగా కల్తీకి అయ్యే ఆహారాలు, వస్తువులపై 2021–22 నుంచి 2024–25 వరకు వివిధ ఆహార పదార్థాల్లో కనుగొన్న కల్తీ శాతంపై రాష్ట్రాల వారీగా వెల్లడించిన నివేదికల వివరాలివి.

2021-22లో..

36 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో సేకరించిన నమూనాల్లో ఆహార కల్తీపై నివేదికలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌లో 21,987 నమూనాలను పరీక్షించగా 13,153 (59.82 శాతం)లు కల్తీగా తేలింది. ఆ తర్వాత జార్ఖండ్‌లో 175 నమూనాల్లో 85 (48.57 శాతం), లడఖ్‌లో 47కు 19 (40.43 శాతం), హరియాణాలో 4,235కు 1182 (27.91 శాతం)లు కల్తీగా తేలాయి. గోవా, కేరళ, కర్ణాటక, గుజరాత్, మణిపూర్‌లు కల్తీగా దూరంగా ఉన్నాయి. తెలంగాణలో 3,077కు 353 (11.47 శాతం) నమూనాలు కల్తీ కాగా, ఆంధ్రప్రదేశ్‌లో 5,290కు 533 (10.08 శాతం) నమూనాల్లో కల్తీ ఉంది.

2022-23లో..


ఈ ఏడాది కూడా ఉత్తరప్రదేశ్ 30,140 నమూనాల్లో 18,108 (60.08 శాతం)లు కల్తీ జరిగినట్లు తేలగా.. ఆహార కల్తీలో అగ్రభాగాన నిలిచింది. జార్ఖండ్‌లో 943 నమూనాల్లో 370 (39.24 శాతం), తమిళనాడులో 24,188లలో 7,924 (32.76 శాతం), హరియాణాలో 4,445లలో 1,425 (32.06 శాతం), రాజస్తాన్‌లో 13,184లలో 3,965 (30.07 శాతం)లు కల్తీ అయ్యాయి. తెలంగాణలో 4,809 నమూనాల్లో 894 (18.59 శాతం), ఆంధ్రప్రదేశ్‌లో 3,607లకు 314 (8.71 శాతం)లో ఉన్నాయి. బిహార్, దయ్యూడామన్, గుజరాత్, మణిపూర్, ఛత్తీస్‌గఢ్‌లలో కల్తీ శాతం తక్కువే.

2023-24లో..

ఆహార, వస్తువుల కల్తీలో ఈ ఏడాది ఉత్తరప్రదేశ్‌ను జార్ఖండ్ అధిగమించింది. 384 నమూనాల్లో 292 (76.04 శాతం)లు కల్తీ కాగా, ఉత్తరప్రదేశ్‌లో 27,750లకు 16,183 (58.32 శాతం)లతో కల్తీలో రెండో స్థానంలో నిలిచింది. హిమాచల్‌ప్రదేశ్‌లో 1,618 నమూనాలకు 401 (24.78 శాతం), హరియాణాలో 3,485లకు 856 (24.56 శాతం), రాజస్తాన్‌లో 18,536లకు 3,493(18.84శాతం)లుగా ఉన్నాయి. మణిపూర్‌లో 1.79 శాతం, నాగాలాండ్ 2.17 శాతం, గోవాలో 2.67 శాతం, మేఘాలయలో 5.69 శాతం, బిహార్‌లో 4.49 శాతం కల్తీ ఉన్నట్లు తేలగా, తెలంగాణలో 6,156 నమూనాలకు 973 (15.81 శాతం)లుగా తేలింది.

2024-25 (2024 సెప్టెంబర్ వరకు)లో..

13,305 నమూనాల్లో 7,030 (52.8 శాతం)తో ఉత్తరప్రదేశ్ కల్తీలో మొదటిస్థానంలోనే నిలిచింది. ఆ తర్వాత 151లలో 54 (35.8 శాతం)తో జార్ఖండ్, 6,576లలో 1,865 (28.4 శాతం)లతో రాజస్థాన్, 1,628లలో 358 (22 శాతం)లతో పంజాబ్ రాష్ట్రాలు కల్తీకి చిరునామాగా నిలిచాయి. మిజోరాంలో కల్తీ ఆనవాళ్లే లేకపోగా, మేఘాలయలో 139లకు 1 (0.7 శాతం), నాగాలాండ్ 135లకు 2 (1.5 శాతం), ఢిల్లీ 1192 నమూనాలకు 42 (3.5 శాతం)లు కల్తీగా తేలాయి. తెలంగాణ 1,660 నమూనాల్లో 167 (10.1 శాతం)కు కల్తీ తగ్గినట్లు నమోదైంది.



మొక్కుబడిగా తనిఖీలు..



ఆహార, వస్తువుల కల్తీ నియంత్రణపై అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి. నామమాత్రపు తనిఖీలు, మామూలు జరిమానాలు, శిక్షలకు వెరవని వ్యాపారులు కల్తీ పంథాను వీడటం లేదు. 1954 ఆహార కల్తీ చట్టంలో భారీ జరిమానాలు, శిక్షలు ఉండేవి. ఎఫ్ఎస్ఎస్ఏఐ ఏర్పాటయ్యాక ఆ తీవ్రత లేదు. ఆహార, వస్తువుల కల్తీ పరీక్షలకు సరైన ల్యాబ్‌లు లేవు. కాకతీయ మెడికల్ కాలేజీలో ఉన్నది మూతపడగా, తెలంగాణలో కేవలం నాచారంలోనే ఉంది. ప్రతీ జిల్లా కేంద్రానికొకటి ఏర్పాటు చేసి కల్తీపై నిబంధనలను కఠినతరం చేసి అమలు చేయాలి.

– సాంబరాజు చక్రపాణి, జాతీయ ప్రధాన కార్యదర్శి, వినియోగదారుల మండలి

ఏదైనా జరిగితేనే తనిఖీలు



హైదరాబాద్ తర్వాత వరంగల్ పెద్ద నగరం. ఆహార కల్తీతో ఎవరైనా అస్వస్థతకు గురై.. వివాదాస్పదమైతే తప్ప అధికారులు తనిఖీలు నిర్వహించడం లేదు. నాలుగైదు నెలల కిందట విస్తృతంగా తనిఖీలు చేసి వదిలేస్తే మళ్లీ మామూలే అయ్యింది. కల్తీ వల్ల బయట టీ, టిఫిన్ చేయాలన్నా భయంగా ఉంది. ఇంత పెద్ద నగరంలో కనీసం ఆహార కల్తీని పరిక్షించే ల్యాబొరేటరీ లేకపోవడం దురదృష్టకరం. అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.

– అయిత హరీశ్, కిషన్‌పుర, హనుమకొండ

ఆహార కల్తీని అరికట్టాలి



హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో శుభ్రత, వంటకాల్లో నాణ్యత పాటించలేదు. నిల్వ చేసిన ఆహారాన్ని హోటల్ నిర్వాహకులు వేడి చేసి ఇస్తున్నారు. నాణ్యత ఉండటం లేదన్న ఆరోపణలపై మొక్కుబడిగా ఫుడ్ఇన్‌స్పెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. కల్తీ ఆహారం వల్ల ఎక్కువ సంఖ్యలో ప్రజలు కిడ్నీ, అల్సర్, ఇతర రోగాల పాలవుతున్నారు.

– ఎం.మిథిలా, ఎంబీబీఎస్ విద్యార్థి, వరంగల్

అరుణకు వక్ఫ్ బాధితుల కృతజ్ఞతలు

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించిన సందర్భంగా జేపీసీ సభ్యురాలు, ఎంపీ డీకే అరుణకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం అరుణను ఆమె నివాసంలో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ వక్ఫ్ భూ బాధితులు, రైతులు, మైనారిటీ మహిళలు కలిశారు. జేపీసీ సభ్యురాలిగా అరుణ క్షేత్ర స్థాయిలో పర్యటించి.. గతంలో జహీరాబాద్ పరిసరాల్లో వక్ఫ్ బాధితుల సమస్యలను తెలుసుకున్నారని గుర్తు చేసుకున్నారు. సంగారెడ్డి జిల్లా మాచిరెడ్డిపల్లి, పిచరేగడి, కోహిర్, జహీరాబాద్ ప్రాంతాల ప్రజలు.. న్యాయవాది వెంకటేశ్వర్ రెడ్డి సమక్షంలో ఎంపీ అరుణకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అవార్డుల అంజి

- బాంబ్ స్క్వాడ్ విభాగంలో ఉత్తమ విధులు
- సీఎం మెడల్, 40 నగదు రివార్డులు, ప్రశంసాపత్రాలు
- తెలంగాణకు వన్నెతెచ్చిన ఏఆర్ పీసీ కొంపల్లి అంజయ్య
- మహబూబాబాద్ జిల్లా పోలీస్‌శాఖకు మంచి గుర్తింపు



అప్పటి డీజీపీ మహేందర్ రెడ్డి నుంచి రూ.లక్ష నగదు రివార్డ్ స్వీకరిస్తున్న ఏఆర్ పీసీ అంజయ్య (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా పోలీస్‌శాఖ పరిధిలో ఆర్మ్‌డ్ రిజర్వుడ్ (బాంబ్ స్క్వాడ్ విభాగం)లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కొంపల్లి అంజయ్య అలియాస్ అంజి ఉత్తమ పనితీరుతో అవార్డులను కైవసం చేసుకుంటూ.. ఆదర్శంగా నిలుస్తున్నారు. సీఎం మెడల్, రివార్డ్‌లతో మహబూబాబాద్ జిల్లా పోలీస్‌శాఖ ప్రతిష్టను ఇనుమడింపజేస్తున్నారు.

2012లో ఉద్యోగం

మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం చింతపల్లి గ్రామానికి చెందిన కొంపల్లి సైదులు, సుభద్ర దంపతుల పెద్ద కుమారుడు అంజయ్య. అతనికి భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. అంజి చిన్నప్పటినుంచే పోలీసు కావాలనే లక్ష్యం పెట్టుకున్నారు. ఈక్రమంలో 2012 జనవరిలో పోలీస్ శాఖ ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు.

బాంబ్ స్క్వాడ్ విభాగంలో శిక్షణ..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐఎస్‌డబ్ల్యూ బాంబ్ స్క్వాడ్ విభాగంలో శిక్షణ తీసుకున్నారు. అనంతరం అత్యాధునిక టెక్నాలజీతో బాంబులు పేల్చడంలో బెస్ట్ ఐఈడీగా ఎంపికై.. ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్పీ రాజేశ్ కుమార్ అభినందనలు అందుకున్నారు. తర్వాత 2015 హరియాణాలోని భాను ఐటీబీపీలో 60వ పోలీస్ డ్యూటీ మీట్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. 2018లో చెన్నై 61వ ఏఐపీడీఎంలో రూం సెర్చ్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. తమిళనాడు రాష్ట్ర సీబీసీఐడీ అడిషనల్ డీజీపీ జయంత్ మురళి నుంచి అంజి పతకం అందుకున్నారు. అప్పటి డీజీపీ మహేందర్ రెడ్డి నుంచి రూ.లక్ష రివార్డ్ అందుకున్నారు. 2024లో లక్నో నగరంలో జరిగిన 67వ ఏఐపీడీఎంలో ఉత్తమ కోచ్‌గా ఎంపికై.. అప్పటి డీజీపీ రవిగుప్తా నుంచి సీఎం మెడల్, రివార్డ్ అందుకున్నారు. తెలంగాణ మొదటి పోలీస్ డ్యూటీ మీట్‌లో భద్రాద్రి జోన్ పరిధిలో రూమ్ సెర్చ్‌లో బంగారు పతకం అందుకుని.. అదనపు డైరెక్టర్ జనరల్ అభిలాష బిస్త్ నుంచి రివార్డ్ పొందారు. ఇటీవల జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగిన 68వ పోలీస్ డ్యూటీ మీట్ రూమ్ సెర్చ్ విభాగంలో.. వీవీఐపీలు నివసించే ప్రాంతంలో ఎలాంటి పేలుడు పదార్థాలు, హానికర వస్తువులు లేకుండా చూసుకునే విభాగంలో.. తెలంగాణ రాష్ట్రం తరఫున పాల్గొని జార్ఖండ్ ఐజీ ఎస్‌కే సిన్హా నుంచి రజత పతకం అందుకున్నారు. విధి నిర్వహణ, ఉత్తమ ప్రతిభ, పనితీరు ఆధారంగా అంజయ్య 40 నగదు రివార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువస్తున్న అంజిని.. డీజీపీ జితేందర్ రెడ్డి, మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏఆర్ డీఎస్పీలు శ్రీనివాస్, విజయ్ ప్రతాప్, అడ్మిన్ ఆర్ఐ అనిల్, అభినందించారు.



తమిళనాడు రాష్ట్ర సీబీసీఐడీ అడిషనల్ డీజీపీ జయంత్ మురళి నుంచి బ్రాంజ్ మెడల్ అందుకుంటున్న ఏఆర్ పీసీ అంజయ్య (ఫైల్)



లొంగిపోయిన మావోయిస్టులతో పోలీసు ఉన్నతాధికారులు

8 మంది నేతలు సహా 22 మంది మావోల లొంగుబాటు


చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిజాపూర్ జిల్లాలో మావోయిస్టుల లొంగుబాటు పరంపర కొనసాగుతోంది. సోమవారం 26 మంది లొంగిపోగా, మంగళవారం 8 మంది ముఖ్య నేతలు సహా మరో 22 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారు. మావోయిస్టు పార్టీ పీఎల్‌జీఏ బెటాలియన్ నంబర్–1 సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర కమిటీ సీఆర్‌సీ కంపెనీ నంబర్–2 సభ్యుడు, ఏరియా కమిటీ ర్యాంక్ కలిగిన ఇద్దరు సభ్యులతోపాటు రూ.26 లక్షల రివార్డున్న మరో నలుగురు నేతలు వీరిలో ఉన్నారని బిజాపూర్ ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్, సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ ఐజీ దేవేంద్రసింగ్ వెల్లడించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 14 మంది ఆర్‌పీసీ సభ్యులు లొంగిపోయారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన నగదు రివార్డులు వీరికే ఇస్తామని, మరింత సాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.



మండే ఎండ నుంచి రక్షణ కోసం

ఎండ, వాన నుంచి రక్షణ కోసం ఓ వ్యక్తి తన ద్విచక్రవాహనాన్ని ఇలా మార్చుకున్నాడు. విజయవాడలోని మాచవరం రోడ్డులో వెళ్తుండగా ఈ చిత్రాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



కన్నా నీకోసం.. ఈ చల్లని సాయంత్రం

ఉక్కిరి బిక్కిరి చేస్తున్న ఎండల నుంచి ఉపశమనం కోసం ఓ తల్లి తన చిన్నారిని తీసుకుని సాయంత్రం వేళ విశాఖ ఆర్కేబీచ్‌కు వచ్చింది. సముద్రపు హోరులో అందమైన సాయంత్రాన్ని ఆస్వాదిస్తూ తన చిన్నారిని ముద్దు చేస్తూ సంతోషంగా గడిపింది

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



రుణాల కోసం.. జనాలపాట్లు

కడుపులో చల్ల కదలకుండా.. గడప వద్దకే పథకాలు తెచ్చి అందించే వ్యవస్థను కాలదన్నుకున్న ఫలితమిది.. గత ప్రభుత్వ హయాంలో ఏ పథకానికైనా దరఖాస్తు చేసుకోవాలంటే వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి దరఖాస్తు నింపేవారు. ప్రస్తుతం బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు విశాఖలోని అశీల్‌మెట్ట కార్యాలయానికి జనం ఇలా పోటెత్తారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కొండే అండ

పోడు పంటలపై ఆధార పడుతున్న గిరిజనులు

ఏడాది పొడవునా పంట చేతికందేలా సాగు

ప్రభుత్వ సాయం లేదంటున్న అడవి బిడ్డలు

ఎల్ ఎన్ పేట: సీతంపేట సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలోని గిరిజనులకు కొండే అండగా నిలుస్తోంది. వీరు కొండపోడు భూములను సాగు చేసి పలు రకాల పంటలు పండిస్తుంటారు. శ్రీకాకుళం జిల్లాలోని కొండపోడు భూముల్లో గిరిజన కుటుంబాలు ఏడాది పొడవునా ఏదో ఒక పనిచేస్తూనే ఉంటాయి. పంట పండించేందుకు గిరిజనులు ఎంతగా శ్రమిస్తారో పంట దిగుబడులు, వాటి ద్వారా ఆర్థికంగాను అంతే లాభం పొందుతారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పంట పెట్టుబడికి సాయం లేదని, మార్కెట్ సౌకర్యం లేకపోవటం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని గిరిజన రైతులు వాపోతున్నారు.

పండించే పంటలు..

కొండ పోడులో ఏడాది పొడవునా ఏదో ఒక పంట దిగుబడి వచ్చేలా గిరిజనులు ముందుగానే పథకం (ప్రణాళిక) సిద్ధం చేసుకుంటారు. ఆర్థికంగా ఆదుకునే పంటల్లో పసుపు, కందులు, జీడి, సీతాఫలం, పైనాపిల్, పనస, చింతపండు, కొండ చీపుర్లు వంటివి ప్రధానమైనవి. వీటితో పాటు మామిడి, బొప్పా యి, అరటి, నిమ్మ, జునుము, చీమ మిరప, మునగ, సపోటా, రామఫలం, కర్ర పెండ్లం, చీమపెండలంతో పాటు పలు రకాల కూరగాయలు, పువ్వులు, రాగులు, జొన్నలు, కొర్రలు వంటి కొన్ని రకాల చిరుధాన్యాలు ఎక్కువగా పండిస్తుంటారు. పండించిన పంటలను గిరిజనులే మార్కెట్‌కు తీసుకువెళ్లి అమ్ముకుంటారు. గిరిజన పంటలు అమ్ముకోవటంలో దళారీ వ్యవస్థ తక్కువగానే ఉంటుంది.

సాయం ఉంటే బాగుండేది



ఏడాదంతా పోడు పంటలే మాకు ప్రధాన జీవనాధారం. మా పూర్వీకుల నుంచి పోడు పంటలు ఎలా సాగు చేయాలి, సీజన్‌తో వచ్చే కార్తెల్లో ఎలాంటి పంటలు వేసుకోవాలో అలవాటు చేసుకున్నాం. తక్కువ పెట్టుబడితో పాటు పూర్తిగా పెట్టుబడి లేకుండా దిగుబడినిచ్చే పంటల్లో పసుపు, సీతాఫలం, జీడి, పైనాపిల్, కందులు, కొండచీపుర్లు, అరటి, బొప్పాయి ఉంటాయి. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత పెట్టుబడి సాయం లేదు.

– సవర గంగయ్య, గిరిజన రైతు, మురగడలోవ

మార్కెట్ సదుపాయం కల్పించాలి



గిరిజనులు పండించే పంటను అమ్ముకునేందుకు మార్కెట్ సదుపాయం కల్పించాలి. రవాణా, సరుకు నిల్వ ఉంచే గిడ్డంగులు, మార్కెట్ సదుపాయం లేకపోవటం వల్ల కొన్ని సందర్భాల్లో పండించిన పంటను తక్కువ ధరకు విక్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నాం. కొన్ని రకాల పంటలు నిల్వ చేసుకునేందుకు శీతల గిడ్డంగులను నిర్మించాలి.

– సవర వెంపయ్య, గిరిజన రైతు, సూదిరాయిగూడ, ఎల్.ఎన్.పేట



రోడ్డు పక్కన సీతాఫలాలు విక్రయిస్తున్న గిరిజనులు



పోడుపంటగా కందిసాగు

ప్రతిరోజూ వ్యాపారం

గిరిజనులు పండించే పంటలను ప్రతీ రోజూ మార్కెట్‌కు తీసుకువెళ్లి విక్రయిస్తుంటారు. సీజన్‌తో పనిలేకుండా ఏదో ఒక పంట చేతికి అందు తుంది. వీరు మార్కెట్‌కు వచ్చే సమయంలో ఒకటి, రెండు రకాల పంటలను అమ్మకానికి తీసుకువస్తారు. ప్రతి రోజూ వ్యాపారం చేయటం వలన వీరికి ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. గిరిజను లు పోడు పంటలను ద్విచక్ర వాహనాలు, ఆటోలు, లగేజీ వ్యాన్లతోను సమీపంలో జరిగే వారపు సంతలకు, మండల కేంద్రాలకు, ప్రధాన కూడళ్లకు తీసుకుని వెళ్లి విక్రయిస్తారు. సహజ సిద్ధమైనవి కావడంతో గిరాకీ కూడా బాగుంటుంది.



ఘాటైన ధర పలికే సీమమిరప

పాపికొండల్లో అలుగుల సందడి

- అరుదైన వన్యప్రాణుల సంచారం గుర్తింపు
- బెదిరితే బంతిలా మారి పోయే గుణం
- వణ్యప్రాణులకు వేటగాళ్ల నుంచి ముప్ప



వీపుపై సంతానాన్ని తీసుకెళ్తున్న అలుగు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని పాపికొండల అభయారణ్య ప్రాంతంలోని అడవుల్లో అరుదైన అడవి అలుగులు సంచరిస్తున్నాయి. వీటిని పాంగోలియన్ అని కూడా పిలుస్తారు. చైనీస్ పాంగోలియన్, ఆసియా పాంగోలియన్, సుండా పాంగోలియన్, పాతమాన్ పాంగోలియన్ అని నాలుగు రకాలు అలుగులు ఉంటాయి. ఈ అలుగు సుమారు 20 ఏళ్ల బతుకుతాయి. చీమలు, పురుగులను ఆహారంగా తీసుకుంటాయి. ఈ జీవికి పొడవైన నాలుక ఉంటుంది. ఎక్కువ శాతం దట్టమైన అటవీ ప్రాంతాల్లో, అధికంగా వర్షాలు కురిసే ప్రాంతాలతో పాటు ఎడారి ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా జీవిస్తుంటాయి. 1821లో తొలిసారిగా ఈ జంతువుల సంచారాన్ని గుర్తించినట్లు వైల్డ్‌లైఫ్ అధికారులు చెబుతున్నారు. ఈ జీవులకు భయపడితే ముడుచుకుపోయి తమను తాము రక్షించుకుంటాయి. వీటి చర్మంపై ఉండే పెంకులు చాలా దృఢంగా ఉంటాయి. అరుదైన ఈ వన్యప్రాణులు పాపికొండల అభయారణ్యం ప్రాంతంలో సుమారు 25 నుంచి 30 పైగా సంచరిస్తున్నట్లు వైల్డ్‌లైఫ్, ఫారెస్టు అధికారులు తెలిపారు.

రాత్రి వేళ సంచారం

అలుగులు పగలు కంటే రాత్రి సమయంలోనే ఎక్కువగా సంచరిస్తుంటాయని అధికారులు చెబుతున్నారు. పగటిపూట గోతుల్లో, తొర్రల్లో, చెట్ల పైన దాగి ఉంటాయి. రాత్రి సమయాల్లో ఆహారం కోసం అన్వేషిస్తాయి. తెల్లవారేసరికి తొర్రల్లోకి చేరుకుంటాయి. ఈ అలుగు రెండు సంవత్సరాలకు ఒకసారి పిల్లలకు జన్మనిస్తుందది. కోతి మాదిరిగానే తాను జన్మనిచ్చిన పిల్లలను వీపుపై ఎక్కించుకుని ఆహార అన్వేషణ సమయంలో తిప్పుతుందని చెబుతున్నారు. అలుగులు సంచరిస్తున్న సమయంలో ఎలాంటి అలికిడి విన్నా బెదిరిపోయి బంతిలాగా ముడుచుకుపోతాయి. కదలకుండా గట్టిగా ముడుచుకుని ఉండిపోతాయి. అలుగులకు ఎదురు దాడి చేసే గుణం కూడా ఉంటుందని వైల్డ్‌లైఫ్ అధికారులు చెబుతున్నారు. ఈ అలుగుల వీపుపై ఉండే పెంకులు కత్తిలాగా పదునుగా ఉంటాయి. ఇవి సింహం కూడా తినలేనంత గట్టిగా ఉంటాయి. ఈ అలుగు సంతతి పాపికొండల అభయారణ్యంలో ఎక్కువగా ఉన్నట్లు వైల్డ్ లైఫ్ అధికారులు తెలిపారు.

అలుగులపై స్మగ్లర్ల కన్ను

ఏజెన్సీ ప్రాంతంలోని అభయారణ్యంలో సంచరిస్తున్న అలుగులపై స్మగ్లర్ల కన్ను పడింది. అరుదైన అలుగు జంతువు వీపుపై ఉండే పెంకులకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నట్లు చెబుతున్నారు. ఈ పెంకుల విలువ రూ.లక్షల్లో ఉంటుందని అంటున్నారు. అలుగు పెంకులను చైనాలోని మందుల తయారీలో ఉపయోగిస్తారని సమాచారం. గతంలో అలుగును బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు రూ.20 లక్షలకు విక్రయిస్తామని ఫేస్‌బుక్‌లో వీడియో అప్‌లోడ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఆ సమయంలో తమ ఉన్నతాధికారులు ఆ వీడియోను చూసి స్మగ్లర్లను పట్టుకునేందుకు ఆదేశాలు ఇవ్వడంతో అలుగు అమ్మకానికి పెట్టిన ఇద్దరు వ్యక్తులను వలపన్ని చాకచక్యంగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు వైల్డ్‌లైఫ్ అధికారులు తెలిపారు. అరుదైన వన్య ప్రాణులను వేటాడి విక్రయించాలని చూస్తే ఏడేళ్ల శిక్ష పడే అవకాశం ఉందని, అలాగే రూ.5 లక్షలకు తక్కువ కాకుండా జరిమానా విధిస్తారని అధికారులు పేర్కొన్నారు.



భయంతో ముడుచుకుపోయిన అలుగు

బీసీ సంక్షేమ శాఖలో నియామకాలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ పరిధిలో పలు జిల్లాలకు అధికారులను అడహక్ పోస్టుల్లో నియమిస్తూ ఆ శాఖ డైరెక్టర్ మల్లికార్జున్ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. ఎన్టీఆర్, విజయనగరం, కర్నూలు, తిరుపతి జిల్లాలకు బీసీ సంక్షేమ అధికారులుగా కె.లక్ష్మీదేవి, జె.జ్యోతిశ్రీ, కె.ప్రసూన, జి.రాజేంద్రకుమార్‌రెడ్డి నియమితులయ్యారు. విజయవాడ అసిస్టెంట్ డైరెక్టర్‌గా సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా ఎ.శ్యామలాకుమారి, జ్యోత్స్న, జి.సతీష్‌కుమార్‌లను నియమించారు.

కాపు కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ

సాక్షి, అమరావతి: కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా కొత్తపల్లి సుబ్బారాయుడు మంగళవారం తాడేపల్లిలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ కాపుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.

మంత్రి గొట్టిపాటితో ‘ఐహెచ్‌ఏ’ ప్రతినిధుల భేటీ

సాక్షి, అమరావతి: ఇంటర్నేషనల్ హైడ్రో అసోసియేషన్ (ఐహెచ్‌ఏ) ప్రతినిధులు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఆయన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం భేటీ అయ్యారు. రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల (పీఎస్పీ) నిర్మాణం, నిర్వహణ, అమలుపై చర్చించారు. యాగంటి, రాజుపాలెం, గడికోట, అరవేటిపల్లి, దిన్నేపల్లి ప్రాంతాల్లో సుమారు ఐదువేల మెగావాట్లతో ఏర్పాటు చేయబోయే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను మంత్రి గొట్టిపాటి ఐహెచ్‌ఏ ప్రతినిధులకు తెలియజేశారు.

ఆల్ ఇండియా సర్వీసుల్లో వర్గీకరణ చేయాలి

సాక్షి, అమరావతి: ఐఏఎస్, ఐపీఎస్ ఉద్యోగాలతోపాటు కేంద్ర సర్వీసుల్లో కూడా వర్గీకరణ చేయాలని కేంద్రాన్ని కోరుతూ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) జాతీయ చైర్మన్ మామిడి సుదర్శన్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 30 మంది మాల సామాజిక వర్గానికి చెందిన ఐఏఎస్, ఐపీఎస్‌లు ఉండగా మాదిగల్లో ఒక్క ఐఏఎస్ లేరని, కేవలం ఇద్దరు ఐపీఎస్‌లు మాత్రమే ఉన్నారన్నారు.

ఇంటెలిజెచర్స్‌తో నియంత్రణ సోల్‌సెన్స్‌తో బాడీ ట్రాకింగ్



- ఏయూసీఈడబ్ల్యూ విద్యార్థినుల కొత్త ఆవిష్కరణలు
- మరిన్ని ప్రయోగాలవైపు అడుగులు
- ఆంధ్ర వర్సిటీ ఆచార్యుల తోడ్పాటు



విశాఖ విద్య: ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే ఎలాంటి అసాధ్యాలనైనా సుసాధ్యం చేయవచ్చునని నిరూపిస్తున్నారు ఆంధ్రా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థినులు. సరికొత్త ఆలోచనలతో నూతన ఆవిష్కరణలవైపు దూసుకెళుతున్నారు. తమ మేథస్సుకు పదునుపెట్టి, సమాజానికి ఉపయోగకరమైన ప్రాజెక్టులను రూపొందిస్తున్నారు.

ఇవీ ప్రాజెక్టులు..

యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కాలేజ్ (ఏయూసీఈడబ్ల్యూ) కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన నాలుగో సంవత్సరం విద్యార్థులు ‘ఇంటెలిజెచర్స్...సోల్‌సెన్స్’ అనే రెండు కొత్త ప్రాజెక్టులను రూపొందించారు. ఏయూసీఈడబ్ల్యూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.పద్మశ్రీ ప్రోత్సాహంతో విభాగాధిపతులు డాక్టర్ బి.ప్రజ్ఞ, డాక్టర్ బి.ఎస్తేర్ సునంద మార్గదర్శకత్వంలో ఈ ప్రాజెక్టులను రూపొందించారు.

ఇంటెలిజెచర్స్ అంటే...



సులభమైన చేతి సంజ్ఞలతో బల్బులు, ఫ్యాన్లు వంటి విద్యుత్ పరికరాలను నియంత్రించగల గృహ ఆటోమేషన్ వ్యవస్థ. దీనికి వాయిస్ కమాండ్‌లు, స్విచ్‌ల అవసరం ఉండదు. మీడియా పైప్ ద్వారా సంజ్ఞలను గుర్తించి, ఆర్డుయినో, రిలే బోర్డు ద్వారా పరికరాలను నియంత్రిస్తుంది.

ఎవరికి ఉపయోగం?

ఈ వ్యవస్థ వల్ల ముఖ్యంగా వృద్ధులకు, కదలికల్లో ఇబ్బందులున్న వారికి ఉపయోగం. ఈ ప్రాజెక్టును ప్రదీప్తి, నవ్య, కృపారాణి, చందన కేవలం రూ.3వేల లోపే పూర్తి చేశారు.

సోల్ సెన్స్ అంటే..

ఇది ఒక స్మార్ట్ షూ ఇన్సోల్. ఒత్తిడి, ఈసీజీ ఉష్ణోగ్రత, కదలిక, జీపీఎస్ సెన్సర్ల ద్వారా ఆరోగ్య సమాచారాన్ని సేకరిస్తుంది. ఆరోగ్యాన్ని ట్రాక్ చేయడం, సమస్యలు గుర్తించడం, అవసరమైనప్పుడు సంరక్షకులను అలర్ట్ చేస్తుంది.

ఎవరికి ఉపయోగం?

ఈ వ్యవస్థ క్రీడాకారులకు, వృద్ధులకు అనువైనది. ఈ స్మార్ట్ షూ ఇన్సోల్‌ను షైని ధరావత్, ఉషశ్రీ, జయప్రియ, జెహెరా కేవలం రూ. 6వేల ఖర్చుతో రూపొందించారు.

నైపుణ్యం వెలికితీసేలా ప్రోత్సాహం

ఇంజనీరింగ్ కోర్సులు ఎంచుకున్న వారు సరికొత్తగా ఆలోచించాలి. ఏదో చదివేశాం.. పట్టా తెచ్చేసుకున్నాం అంటే కుదరదు. నేటి పోటీ ప్రపంచంలో అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే, నైపుణ్యం ఉన్న విద్య నేర్చుకోవాలి. మా కాలేజీ విద్యార్థినులకు ఇదే చెబుతున్నాం. నైపుణ్యం ఉన్న వారిని ప్రోత్సహిస్తున్నాం.

– ఆచార్య ఆర్.పద్మశ్రీ, ప్రిన్సిపాల్, ఏయూ మహిళా ఇంజనీరింగ్ కాలేజీ

బ్యాంకులతో మెప్మా సభ్యుల అనుసంధానం

- 28.74 లక్షల మంది సభ్యుల డేటాబేస్ సిద్ధం
- మెప్మా ఎండీ తేజ్‌భరత్ వెల్లడి

సాక్షి, అమరావతి: పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా)లోని గ్రూపు సభ్యుల వివరాలను బ్యాంకులతో అనుసంధానించారు. ఇప్పటికే మెప్మా ఎండీ తేజ్ భరత్ నేతృత్వంలో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ఉన్న స్వయం సహాయక సంఘాల సమగ్ర సమాచారంతో ప్రత్యేక డేటాబేస్‌ను సిద్ధం చేశారు. పట్టణ ప్రాంతాల్లో 2,74,078 గ్రూపుల్లో 28.74 లక్షల మంది సభ్యులున్నారు. వీరందరి డేటాను బ్యాంకులతో అనుసంధానం చేయడం ద్వారా రుణ మంజూరుతో పాటు ఎంత మంది చెల్లించారు.. ఎవరు ఎన్ని పర్యాయాలు రుణాలు తీసుకున్నారో తెలుస్తుంది. అలాగే సమస్త ఆర్థిక లావాదేవీలు తెలుసుకునేలా చర్యలు చేపట్టారు. గతంలో గ్రూపుల్లో లేకున్నా అధికంగా సభ్యులున్నట్టు చూపించడం, లేని సభ్యుల పేరిట రుణాలు తీసుకోవడం వంటి కొన్ని ఘటనల నేపథ్యంలో ఇందుకోసం మెప్మా లోన్ చార్జి క్రియేషన్ మాడ్యుల్ (ఎంఎల్‌సీసీ) రూపొందించారు. బ్యాంకులతో ఈ డేటాబేస్ అనుసంధానం ద్వారా గ్రూపులోని సభ్యుల వివరాలు, వారి ఆధార్ నంబర్‌పై ఉన్న ఇతర రుణాల సమాచారం అటు బ్యాంకులు, ఇటు మెప్మా సులభంగా తెలుసుకునే అవకాశం ఉంది. మంగళవారం తాడేపల్లిలోని మెప్మా కార్యాలయంలో మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ లోన్ చార్జి క్రియేషన్, మహిళాకాశం మాడ్యుల్స్‌పై రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ ప్రతినిధులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల మెప్మా ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రాపిడో, ఈ–బైక్, ఈ–ఆటోలును మంజూరు చేసిన బ్యాంకు అధికారులను అభినందించిన ఎండీ తేజ్‌భరత్.. 2025–26లో ఈ పథకాన్ని మరో 4,800 మందికి వర్తింపజేయనున్నామని, అందుకు సహకరించాలని బ్యాంకు ప్రతినిధులను కోరారు.

తక్షణం కోర్టు ఫీజు స్టాంపుల కొరత తీర్చాలి

ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ‘ఐలూ’

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మూడు నెలలుగా న్యాయస్థానాలు, రెవెన్యూ కోర్టులతో పాటు న్యాయ సంబంధిత ట్రిబ్యునళ్లలో కోర్టు ఫీజు స్టాంపుల కొరత వేధిస్తోందని, తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) మంగళవారం డిమాండ్ చేసింది. కోర్టుల్లో రోజూ వారీ కేసుల దాఖలులో కోర్టు ఫీజు స్టాంపులు తప్పనిసరని, ఇవి లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ ఐలూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు ప్రభుత్వానికి లేఖ రాశారు. రూపాయి, రెండు, ఐదు, పది, ఇరవై రూపాయల స్టాంపుల కొరత తీవ్రంగా ఉందని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. రూపాయి, రెండు రూపాయలకు కూడా బ్యాంకులకు వెళ్లి చలాన్ల ద్వారా చెల్లించాల్సిన పరిస్థితి ఉందన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

సాక్షి, అమరావతి: అకాల వర్షాలు, ఈదురు గాలులతో నష్టపోయిన మామిడి రైతులను ఆదుకోవాలని ఏపీ కౌలురైతుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘ ప్రతినిధుల బృందం మంగళవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో పర్యటించి ఈదురు గాలులకు దెబ్బతిన్న మామిడితోటలను పరిశీలించింది. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ ఈదురు గాలుల ప్రభావానికి దాదాపు 70 శాతం మామిడి తోటలు దెబ్బతిన్నాయని, గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఓ వైపు చీడపీడలు, తెగుళ్ల ప్రభావంతో దిగుబడులు అంతంతమాత్రంగా ఉన్న ప్రస్తుత సమయంలో ఈదురుగాలులు, వర్షాలు రైతుల్ని మరింత కుంగదీశాయన్నారు. మామిడి సాగు చేసే వారిలో 70 శాతం మంది కౌలు రైతులే ఉన్నారన్నారు.

టీచర్ల పదోన్నతుల్లో మెరిట్ కం రోస్టర్ అమలు చేయాలి


సాక్షి, అమరావతి: ఉపాధ్యాయుల పదోన్నతుల్లో మెరిట్ తో కూడిన రోస్టర్ విధానాన్ని అమలు చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) డిమాండ్ చేసింది. ఇందుకోసం దశల వారీగా పోరాటం చేయనున్నట్టు మంగళవారం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.మనోజ్ కుమార్, చిట్టేటి రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు తీసుకొచ్చిన నూతన చట్టం ప్రకారం సీనియారిటీ జాబితాలను కేవలం మెరిట్ ప్రకారం తయారు చేశారని, దీనివల్ల రిజర్వ్ కేటగిరీకి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. పదోన్నతుల్లో మెరిట్ కమ్ రోస్టర్ విధానం అమలు చేసేందుకు వీలుగా గతంలో ప్రభుత్వం జీవో 65, 90 జారీ చేసిందని, కానీ ఇప్పుడు కేవలం మెరిట్ ప్రకారమే సీనియారిటీ జాబితాను విడుదల చేసినట్టు పేర్కొన్నారు. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ దశల వారీ పోరాటానికి పిలుపునిస్తున్నట్టు వారు తెలిపారు. బుధవారం పదో తరగతి మూల్యాంకన కేంద్రాల వద్ద నిరసన, 10, 11, 12 తేదీల్లో ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తులు, 17న జిల్లా కలెక్టరేట్ల వద్ద నిరసన, 25న విద్యాశాఖ కమిషనరేట్ ముట్టడి చేయనున్నట్టు ప్రకటించారు.

భలే భూవస్త్రం

- కొబ్బరి పీచుతో చాపల(భూవస్త్రాల) తయారీ
- పంట పొలాల్లో వాడే ప్లాస్టిక్ మల్చింగ్ షీట్‌కు ఇది చక్కని ప్రత్యామ్నాయం
- కలుపు పుట్టుకను అడ్డుకుంటుంది.. ఐదారేళ్లలో మట్టిలో కలిసిపోతుంది
- వాలు భూములు, కాలువలు, నదులు, పొలాల గట్లను పటిష్టం చేయడానికీ ఉపయోగకరం
- రోడ్ల నిర్మాణంలోనూ పెరుగుతున్న కొబ్బరి చాపల వినియోగం
- పర్యావరణహితమైనదే కాక చవకైనవి కూడా..

మన ఆకలి తీర్చుతున్న ఆహారంలో 95% వరకు భూమాతే మనకు అందిస్తుంది. అందువల్ల భూమి పైపొర మట్టి మనకే కాదు జంతు జాలం మొత్తానికీ ప్రాణప్రదమైనది. భూమి పైమట్టి సారవంతమైనదే కాకుండా ఎంతో విలువైనది కూడా. కాబట్టి, మనకు మాదిరిగానే భూమికి కూడా ఆచ్ఛాదనగా వస్త్రం కప్పి పరిరక్షించుకోవాల్సిన ప్రాణావసరం మనది. మట్టి ఎండకు ఎండి నిర్జీవమైపోకుండా.. గాలికి, వర్షపు నీటి తాకిడికి కొట్టుకుపోకుండా రక్షించుకోవడానికి కొబ్బరి పీచుతో చేసిన చాపలు భేషుగ్గా పనిచేస్తున్నాయి. ఈ కొబ్బరి చాపలనే కాయర్ బోర్డు 'భూవస్త్రం' అని పిలుస్తోంది. ఇరవయ్యేళ్లుగా కేరళ తదితర రాష్ట్రాల్లో పీచు పరిశ్రమదారులు 'భూవస్త్రాల'ను తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అయితే, మన దేశంలో వాడకం తక్కువే. ఇప్పుడిప్పుడే ప్రాచుర్యంలోకి వస్తున్నాయి. కొబ్బరి పీచు భూవస్త్రాన్ని పంటలకు మల్చింగ్ షీట్‌గా, కాల్వలు, చెరువులు, నదుల గట్లకు రక్షణ కవచంగా కూడా వాడుకోవచ్చు. భూమిని కాపాడటమే కాకుండా ఐదారేళ్లలో భూమిలో కలిసిపోయి సారవంతం చేస్తుంది.

భూవస్త్రాల మన్నిక ఎంత?



కొబ్బరి పీచుతో తయారైన భూవస్త్రాలు పర్యావరణ హితమైనవి. వీటిని వినియోగించుకుంటే కాలువలు, చెరువులు, నదుల గట్లు, ఏటవాలు ప్రాంతాల్లో నుంచి గాలికి, వర్షానికి మట్టి కొట్టుకుపోకుండా జాగ్రత్తపడవచ్చు. రోడ్ల నిర్మాణంలోనూ ఉపయోగపడుతుంది. చెరువులు, సరస్సుల గట్లు, నదుల వరద కట్టల నవీకరణ పనుల్లో భూవస్త్రాలు చక్కగా పనికివస్తాయి. ఇంతకీ వీటి మన్నిక, పటుత్వం ఎంత? ఐదారేళ్ల వరకూ మన్నుతాయని నిపుణులు చెబుతున్నారు. 'కొబ్బరి పీచు పటుత్వం చాలా ఎక్కువ. ఇందులో లిగ్నన్ ఎక్కువ మోతాదులో ఉండటమే ఇందుకు కారణం. టేకు, ఇరుగుడు చావ కలపలో కన్నా కొబ్బరి పీచులోనే లిగ్నన్ ఎక్కువగా ఉంది. అంతేకాదు, నీటిని సంగ్రహించే సామర్థ్యం, అతినీల లోహిత(యు.వి.) కిరణాలను తట్టుకునే శక్తి కూడా ఎక్కువే, వేసిన తర్వాత ఐదారేళ్ల వరకు మన్నుతాయి.

90% తేమ, 30 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో కూడా దీర్ఘకాలంపాటు భూవస్త్రం పటిష్టంగా నిలిచినట్లు 'జెర్మన్ బుండేసంత్ ఫర్ మెటీరియల్ టెస్టింగ్ ఆన్ నేచురల్ ఫైబర్స్' తెలిపింది. పత్తి ఉత్పత్తుల కన్నా 15 రెట్లు, జనపనార ఉత్పత్తుల కన్నా 7 రెట్లు ఎక్కువ రెట్లు మన్నిక కొబ్బరి పీచు భూవస్త్రాలకు ఉంది. వరద నీటిలో 4 వేల గంటలు మునిగి ఉన్న తర్వాత కూడా ఇవి చెక్కుచెదరలేదని సంస్థ తెలిపింది. అయితే, ఆ భూమి తీరుతెన్నులు, వాతావరణ పరిస్థితులు, యువి రేడియేషన్, వర్షపాతం, ఉష్ణోగ్రతలు, ఏ విధంగా వాడారు అన్న విషయాలపై కూడా మన్నిక ఆధారపడి ఉంటుంది.

కూరగాయ పంటల్లో భూవస్త్రంతో ఆచ్ఛాదన

పంట పొలాల్లో, చెట్లు, మొక్కల పెంపకంలో భూమికి ఆచ్ఛాదన కల్పించడానికి మల్చింగ్ షీట్లుగా ప్లాస్టిక్‌కు బదులుగా కొబ్బరి పీచుతో తయారైన భూవస్త్రాలు చక్కగా పనికివస్తాయి. ఈ షీట్ మొక్కల చుట్టూ పరిస్తే ఎండ, వానల నుంచి భూమిని కాపాడటమే కాకుండా కలుపు మొలవకుండా అడ్డుకుంటుంది. కలుపు మందుల పిచికారీ అవసరం లేదు. కలుపు తీత ఖర్చులు ఉండవు. నాగాలాండ్‌లో పైనాపిల్ పంటను విస్తారంగా సాగు చేసే రైతులు భూవస్త్రాలతో మల్చింగ్ చేస్తున్నారు. అరటి, వంగ, టమాటా, బెండ తదితర పంటలకు బాగా మల్చింగ్ బాగా ఉపయోగపడుతుంది.

కొబ్బరి భూవస్త్రాలు 600 జి.ఎస్.ఎం.(గ్రామ్స్ పర్ స్క్వేర్ మీటర్) నుంచి 2,000 జి.ఎస్.ఎం. మందం వరకు దొరుకుతాయి. మల్చింగ్ షీట్‌గా 600 జి.ఎస్.ఎం.(సుమారు పావు అంగుళం) మందం ఉండే భూవస్త్రం సరిపోతుంది. ఇది భూమిపై పరిచిన ఐదారు సంవత్సరాలలో భూమిలో కలిసిపోతుంది. ఫంక్షన్ హాల్స్, స్టార్ హోటళ్లలో కార్పెట్ల అడుగున కుషన్ ఎఫెక్ట్ కోసం 2,000 జి.ఎస్.ఎం. భూవస్త్రాలను వాడుతుంటారు.













రోడ్ల మన్నిక పెరుగుతుంది

కొబ్బరి పీచు భూవస్త్రాలను మట్టి, తారు రోడ్ల నిర్మాణంలో వినియోగిస్తున్నారు. గ్రావెల్, ఎర్రమట్టికి అడుగున భూవస్త్రాలను పరుస్తారు. భూవస్త్రం వాడటం వల్ల రోడ్ల మన్నిక 20–40% పెరిగినట్లు రుజువైంది. తెలుగు రాష్ట్రాల్లో పంచాయతీ రోడ్ల నిర్మాణంలో ఇప్పటికే వాడుతున్నారు. ప.గో. జిల్లాలో చించినాడ బ్రిడ్జి అప్రోచ్‌రోడ్డు నిర్మాణంలో వాడామని, 20 ఏళ్లయినా చెక్కుచెదరలేదు.

కొబ్బరి పీచు భూవస్త్రాలను ప్రధాన మంత్రి గ్రామీణ్ సడక్ యోజన–3 కింద గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించే రోడ్లలో ఉపయోగించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఏపీలో 164 కి.మీ., తెలంగాణలో 121 కి.మీ. మేరకు రోడ్ల నిర్మాణంలో భూవస్త్రాలను వాడేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఇవి మంచి శోషణ శక్తిని కలిగి ఉంటాయని, బలంగా, చల్లగా ఉండి ఎక్కువ కాలం మన్నుతాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

కృష్ణా, గోదావరి డెల్టాలో కాలువ గట్లు జారిపోతూ ఉంటే ఏటా బాగు చేస్తూ ఉంటారు. ఈ గట్లను భూవస్త్రాలతో కప్పి, వాటిపై మొక్కలను పెంచితే గట్లు బాగా గట్టిపడతాయి. ఐదారేళ్ల వరకు చెక్కుచెదరవు. రైలు పట్టాలకు ఇరువైపులా మట్టికట్టలను కూడా ఇలాగే పటిష్టం చేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

భూవస్త్రాల ధర..?

కొబ్బరి కాయ మన ఆహార, ఆధ్యాత్మిక సంస్కృతిలో పెద్ద పీట ఉంది. కొబ్బరి పంట నుంచి కొబ్బరి కాయ ప్రధాన ఉత్పత్తి. కాయను ఒలిస్తే వచ్చే డొక్కల నుంచి పీచును వేరు చేస్తారు. ఈ క్రమంలో పొట్టు వస్తుంది. కొబ్బరి పొట్టును స్వల్ప ప్రక్రియ ద్వారా సేంద్రియ ఎరువుగా తయారు చేస్తారు. ఈనెలతో చాపలను లేదా మాట్స్‌ను తయారు చేస్తారు. ఇవే భూవస్త్రాలు (కాయిర్ జియో టెక్స్‌టైల్స్). వీటిని మీటరు వన్నాతో సుమారు 50 మీటర్ల పొడవున తయారు చేస్తారు. భూవస్త్రాలు రెండు రకాలు.. చేనేత వస్త్రం మాదిరిగా కొన్ని దశల్లో నేసేవి (వోవన్), ఒక యంత్రంతో సులువుగా అల్లిక చేసేవి (నాన్ వోవన్). నాన్ వోవన్ భూవస్త్రాల ధర చదరపు మీటరుకు రూ. 50–60 ఉంటే, వోవన్ భూవస్త్రాల ధర నాలుగైదు రెట్లు ఎక్కువగా ఉంటుంది.

అనేక దశాబ్దాలుగా కేరళ తదితర రాష్ట్రాల్లో సహకార సంఘాలు, వ్యాపారులు కొబ్బరి ఉప ఉత్పత్తులను భారీ ఎత్తున తయారు చేస్తున్నారు. కేరళలో కొబ్బరి పీచు ఉత్పత్తుల తయారీ కోట్లాది మంది (వీరిలో 80% మంది మహిళలు)కి ఉపాధినిస్తున్న కుటీర పరిశ్రమ. విదేశాలకూ ఎగుమతి చేస్తున్నారు. మన దగ్గరి నుంచి ఫ్రాన్స్ వంటి దేశాలు భూవస్త్రాలతో భూమి కోతకు గురికాకుండా జలవనరుల పరిసరాల్లో వినియోగిస్తున్న తీరును చూసి ఇటీవల మన అధికారులు నోరువెళ్ల బెట్టారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.







నిర్వహణ:
పంతంగి రాంబాబు
సాగుబడి డెస్క్



మామిడి తోటల్లో కవర్లు కట్టిన కాయలు

మధుర కవచం!

- మామిడి సాగులో వినూత్న పోకడ
- కాయలకు కవర్లు అమర్చడంతో సత్ఫలితాలు
- సగానికి సగం తగ్గిన పురుగుమందుల వాడకం, ఖర్చు
- మచ్చల్లేని నాణ్యమైన పండ్లకు మార్కెట్లో గిరాకీ
- రైతులకు 30-40 శాతం అధికాదాయం

మామిడి సాగు కొత్త పుంతలు తొక్కుతోంది. ఫ్రూట్ కవర్ల అమరిక వల్ల మామిడి పండ్లు నాణ్యత పెరగడంతో పాటు ఆకర్షణీయంగా మారుతున్నాయి. కవర్ల మాటున పెరిగిన ఈ పండ్లు మామిడి ప్రియులనే కాదు.. ఎగుమతిదార్లనూ ఆకర్షిస్తున్నాయి. అధిక ధర పలకడంతో రైతుకూ మంచి ఆదాయం వస్తోంది. ఆంధ్రప్రదేశ్ ఉద్యానవన శాఖ కృష్ణా జిల్లాలో కొత్తగా చేపట్టిన ఫ్రూట్ కవర్ల ప్రయోగం సత్ఫలితాలనిస్తోంది. రాయలసీమలో దానిమ్మ, కర్నాటకలో ద్రాక్ష సాగులో వాడుతున్న ఫ్రూట్ కవర్లు తర్వాత కాలంలో మామిడి తోటల్లోరే వాడటం ప్రారంభమైంది.

నిమ్మ కాయంత పరిమాణంలో ఉన్న మామిడి కాయలకు కవర్లు కట్టాలి. గుజ్జు పరిశ్రమల్లో ఉపయోగించే తోతాపురి రకానికి తప్ప బంగినపల్లి, రసాలు, సువర్ణరేఖ తదితర పలు రకాల మామిడి కాయలకు కవర్లను అమర్చి సత్ఫలితాలు సాధిస్తున్నారు.



మామిడి కాయలకు ఇటుక రంగు కవర్లు కడుతున్న రైతు



కవర్‌లో పెరగడం వల్ల నాణ్యంగా నిగనిగలాడుతున్న మామిడి పండ్లు

ఫ్రూట్ కవర్లతో ప్రయోజనాలెన్నో..

కాస్మొటిక్ పేపర్‌తో ఈ కవర్లు తయారయ్యాయి. నలుపు, ఇటుక రంగులో ఉంటాయి. పల్చగా ఉండే ఈ కవర్‌పై మైనం వంటి పూత ఉండటం వల్ల వర్షపు నీరు కూడా కాయకు తాకకుండా కిందికి జారిపోతుంది. పిందె/కాయ మీద వర్షం పడితే శిలీంధ్రాలు, బ్యాక్టీరియా ఆశించి మచ్చలు ఏర్పడతాయి. మచ్చల వల్ల టన్నుకు రూ. పది వేలకు పైగా ధర తగ్గిపోతుంది. కవర్లు కట్టిన మామిడి కాయపై ఎండ, వానల తాకిడి లేక మచ్చలు ఏర్పడవు. ఫ్రూట్ ఫ్లై (పండీగ) నుంచి కూడా రక్షణ దొరుకుతుంది. పురుగులు, తెగుళ్లు సోకవు. దీంతో రైతుకు పురుగుమందులు, కూలీ ఖర్చులు సగానికి సగం ఆదా అవుతాయి. కవర్ తొడిమను పట్టుకొని ఉండటంతో ఒక మోస్తరు గాలుల నుంచి కూడా కవర్ కాయలకు రక్షణ కల్పిస్తుంది. కాయలు ఏపుగా వైట్ ఎల్లో రంగులో పెరుగుతాయి. సాధారణంగా పెరిగే కాయలకంటే కవరులో పెరిగిన కాయలు నాణ్యంగా, ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఫలితంగా ఎగుమతిదార్లు వీటి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. కవర్లలో పెరిగిన కాయలకు 30–40 శాతం అధికంగా ధర పలుకుతోందని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. పురుగులు, తెగుళ్ల మందుల వాడకం, ఖర్చు సగానికి సగం తగ్గడం వల్ల ఆరోగ్యదాయకమైన మామిడి పండ్లను ఉత్పత్తి చేయడంతోపాటు రైతుకూ అధికాదాయం సమకూరడం హర్షదాయకం.

బిజినెస్ రీల్

బీపీసీఎల్‌తో సెంబ్‌కార్ప్ జత

- సమాన భాగస్వామ్య కంపెనీ ఏర్పాటు
- గ్రీన్ హైడ్రోజన్, రెనెవబుల్ ఎనర్జీపై కన్ను



న్యూఢిల్లీ: ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం భారత్ పెట్రోలియం కార్పొరేషన్(బీపీసీఎల్)తో చేతులు కలిపినట్లు సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్ తాజాగా పేర్కొంది. సొంత అనుబంధ సంస్థ సెంబ్‌కార్ప్ గ్రీన్ హైడ్రోజన్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ ద్వారా సమాన భాగస్వామ్య కంపెనీ(జేవీ) ఏర్పాటుకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. దీనిలో భాగంగా 50:50 వాటాతో జేవీ ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేసింది. తద్వారా దేశవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధనం(రెనెవబుల్ ఎనర్జీ), గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులను చేపట్టనున్నట్లు తెలియజేసింది. వెరసి దేశ ఇంధన పరివర్తన, అభివృద్ధి లక్ష్యాలను అందుకునే బాటలో వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెరతీస్తున్నట్లు వెల్లడించింది. దీంతో పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్‌తోపాటు సంబంధిత డెరివేటివ్స్ ఉత్పత్తి, నిర్వహణ, అమ్మకం తదితరాలను చేపట్టనున్నట్లు వివరించింది. అంతేకాకుండా పోర్ట్ కార్యకలాపాలలో ఉద్గారాలను తగ్గించేందుకు వీలుగా గ్రీన్ అమోనియా ఉత్పత్తి, బంకరింగ్ ప్రాజెక్టులకు సైతం తెరతీయనున్నట్లు తెలియజేసింది. వీటితోపాటు ఇతర వర్ధమాన గ్రీన్ ఎనర్జీ టెక్నాలజీలను సైతం అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొంది. పెట్రోలియం రంగంలో బీపీసీఎల్‌కున్న నైపుణ్యాలను ఇందుకు వినియోగించుకోనున్నట్లు తెలియజేసింది.

భారత్ వృద్ధికి దేశీ డిమాండ్ దన్ను: నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: వివిధ పరిస్థితులరీత్యా వేగం కాస్త నెమ్మదించినా, రాబోయే రోజుల్లోనూ అత్యంత వేగంగా ఎదుగుతున్న దేశంగా భారత్ కొనసాగుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధీమా వ్యక్తం చేశారు. దేశీయంగా నెలకొన్న వినియోగ డిమాండ్ ఇందుకు దన్నుగా ఉంటుందని తెలిపారు. బ్రిటన్‌లోని భారత హై కమిషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ విషయాలు తెలిపారు. అమెరికా భారీ టారిఫ్‌లపై స్పందిస్తూ, దేశీయంగా వినియోగ డిమాండే విదేశీ పెట్టుబడులకు ఆకర్షణీయమైన అయస్కాంతంగా నిలుస్తుందని ఆమె చెప్పారు.

శ్రీరామ్ ఏఎంసీలో వాటాకు ఓకే

సన్లామ్, శ్రీరామ్ క్రెడిట్‌కు సీసీఐ గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ: శ్రీరామ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ(ఎస్‌ఏఎంసీ)లో సంయుక్తంగా వాటా కొనుగోలు చేసేందుకు దక్షిణాఫ్రికా సంస్థ సన్లామ్‌తోపాటు శ్రీరామ్ క్రెడిట్ కంపెనీకి కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) అనుమతించింది. ఎస్‌ఏఎంసీ విస్తారిత వోటింగ్ వాటా మూలధనంలో 23 శాతానికి సమానమైన వాటాను ప్రిఫరెన్షియల్ కేటాయింపుల ద్వారా సన్లామ్ గ్రూప్‌నకు చెందిన సంస్థ సన్లామ్ ఎమర్జింగ్ మార్కెట్(మారిషస్) సొంతం చేసుకోనుంది. ఎస్‌ఏఎంసీ ఈక్విటీ షేర్లలో సబ్‌స్క్రిప్షన్ ద్వారా వాటా పొందనుంది. ఇదేవిధంగా ఎస్‌ఏఎంసీ పబ్లిక్ వాటాదారుల నుంచి 26 శాతం వాటా కొనుగోలుకి సన్లామ్ ఎమర్జింగ్‌తోపాటు శ్రీరామ్ క్రెడిట్ కంపెనీకి సీసీఐ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-4-2025

విశాఖ	435-00
చిత్తూరు	480-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415-00
విజయవాడ	440-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	390-00
వరంగల్	392-00
రిటైల్ ధర	4.50

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	5,127
ఎన్‌ఎస్‌ఈ	94,248
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	2,09,341
ఎఫ్ఐఐ	- 4,994
డీఐఐ	+3,097

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	60.07 (రాత్రి 11.30కు)	$ 60.70
బ్రెంట్	63.23 (రాత్రి 11.30కు)	$ 64.21

4 ఐపీవోలకు సెబీ ఓకే

- జాబితాలో ఆంథమ్ బయో, ఆయే ఫైనాన్స్
- బ్లూస్టోన్ జ్యువెలరీ అండ్ లైఫ్‌స్టైల్, జీకే ఎనర్జీ



న్యూఢిల్లీ: కొద్ది రోజులుగా సెకండరీ మార్కెట్లు తీవ్ర ఆటుపోట్లు చవిచూస్తున్నప్పటికీ ప్రైమరీ మార్కెట్లు కళకళలాడనున్నాయి. తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు 4 కంపెనీలను అనుమతించింది. జాబితాలో ఆంథమ్ బయోసైన్సెస్, ఆయే ఫైనాన్స్, బ్లూస్టోన్ జ్యువెలరీ అండ్ లైఫ్‌స్టైల్, జీకే ఎనర్జీ చేరాయి. 2024 డిసెంబర్‌లో సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసిన కంపెనీలు ఉమ్మడిగా రూ. 6,345 కోట్లు సమీకరించే యోచనలో ఉన్నాయి. వివరాలు చూద్దాం..

సీఆర్‌డీఎంవో..



కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవలప్‌మెంట్, తయారీ సేవలందించే కంపెనీ(సీఆర్‌డీఎంవో) ఆంథమ్ బయోసైన్స్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు అనుగుణంగా రూ. 3,395 కోట్ల విలువైన ఈక్విటీని ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. దీంతో కంపెనీకికాకుండా ఇష్యూ నిధులు ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులకు అందనున్నాయి. బెంగళూరు కంపెనీ ప్రధానంగా క్లయింట్లకు టెక్నాలజీ, నూతన ఆవిష్కరణల ఆధారిత సీఆర్‌డీఎం సర్వీసులు సమకూర్చుతోంది. ఔషధ డిస్కవరీ, అభివృద్ధి, తయారీ సంబంధిత సమీకృత కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

ఎన్‌బీఎఫ్‌సీ..

బ్యాంకింగేతర ఫైనాన్స్ కంపెనీ ఆయే ఫైనాన్స్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. దీనిలో భాగంగా రూ. 885 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు మరో రూ. 565 కోట్ల విలువైన షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 1,450 కోట్లు సమీకరించనుంది. ఈక్విటీ నిధులను మూలధన పటిష్టతకు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.



జ్యువెలరీ

బ్లూస్టోన్ బ్రాండుతో డైమండ్, గోల్డ్, ప్లాటినం ఆభరణాల తయారీ కంపెనీ బ్లూస్టోన్ జ్యువెలరీ అండ్ లైఫ్‌స్టైల్ ఐపీవోకు సిద్ధపడుతోంది. ఇందుకు వీలుగా రూ. 1,000 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 2.4 కోట్ల షేర్లు ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వీటిని కళారీ క్యాపిటల్ పార్ట్‌నర్స్ 2, సునీల్ కాంత్ ముంజాల్(హీరో ఎంటర్‌ప్రైజ్ భాగస్వామి), సామా క్యాపిటల్ 2 ఆఫర్ చేయనున్నాయి. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 750 కోట్లు వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది.



అగ్రి పంప్స్



సోలార్ పవర్ ఆధారిత వ్యవసాయ వాటర్ పంప్ సిస్టమ్స్ అందించే జీకే ఎనర్జీ ఐపీవో చేపట్టనుంది. ఇష్యూలో భాగంగా రూ. 500 కోట్ల విలువైన ఈక్విటీ తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 84 లక్షల షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 422 కోట్లు దీర్ఘకాలిక వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు కేటాయించనుంది.

భాగస్వామిపై వేదాంతా దృష్టి

గ్లోబల్ దిగ్గజాల కోసం అన్వేషణ



న్యూఢిల్లీ: విస్తరణ ప్రాజెక్టులకు దన్నునిచ్చేందుకు వీలుగా మైనింగ్ దిగ్గజం వేదాంతా గ్లోబల్ భాగస్వామి కోసం అన్వేషిస్తున్నట్లు పేర్కొంది. వివిధ విభాగాలలో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో చేపట్టనున్న ప్రాజెక్టులకు మద్దతిచ్చే దిగ్గజంతో జత కట్టే యోచనలో ఉన్నట్లు తెలిపింది. రానున్న మూడేళ్లలో భారీ విస్తరణ ప్రణాళికలు అమలు చేయనున్న కంపెనీ ఇందుకు ప్రపంచస్థాయిలో అనుభవమున్న ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్(ఈపీసీఎం) దిగ్గజం కోసం చూస్తున్నట్లు వెల్లడించింది. గ్రూప్ బిజినెస్‌లను వేదాంతా అల్యూమినియం, ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, ఐరన్ అండ్ స్టీల్ పేరుతో నాలుగు విభాగాలుగా విడదీయనుంది. రానున్న మూడేళ్లలో మెటల్స్, మైనింగ్, హైడ్రోకార్బన్స్‌పై 20 బిలియన్ డాలర్లు వెచ్చించనున్నట్లు తెలియజేసింది. ఇందుకు ఆసక్తిగల కంపెనీల నుంచి ఈ ఏప్రిల్ 30లోగా ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ) బిడ్స్‌ను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొంది. ఇంతక్రితం ప్రకటించిన విడదీత ప్రణాళికలను జూన్-జులైకు వాయిదా వేసింది.

రియల్టీలో పీఈ పెట్టుబడులు డౌన్

2024-25లో 3.7 బిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ: దేశీ రియల్టీ రంగంలోకి ఇటీవలే ముగిసిన గతేడాది(2024-25) ప్రయివేట్ ఈక్విటీ(పీఈ) పెట్టుబడులు 3 శాతం నీరసించాయి. రియల్టీ కన్సల్టెంట్ సంస్థ అనరాక్ క్యాపిటల్ వివరాల ప్రకారం 3.7 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. కార్యాలయ భవంతులకు పెట్టుబడులు తగ్గడం ప్రభావం చూపింది. దేశీ రియల్టీలోకి అంతక్రితం ఏడాది(2023-24) 3.8 బిలియన్ డాలర్ల పీఈ పెట్టుబడులు లభించాయి. 2020-21లో అత్యధికంగా 6.4 బిలియన్ డాలర్లు ప్రవహించగా.. 2021-22లో ఇవి 4.3 బిలియన్ డాలర్లకు క్షీణించాయి. అయితే 2022-23కల్లా 4.4 బిలియన్ డాలర్లకు స్వల్పంగా బలపడినప్పటికీ తదుపరి తిరిగి వెనకడుగు వేశాయి. వెరసి గత ఐదేళ్లుగా దేశీ రియల్టీలో పీఈ పెట్టుబడులు తగ్గుతూ వచ్చినట్లు అనరాక్ క్యాపిటల్ ఎండీ, సీఈవో శోభిత్ అగర్వాల్ పేర్కొన్నారు. 6.4 బిలియన్ డాలర్ల నుంచి 3.7 బిలియన్ డాలర్లకు అంటే 43 శాతం క్షీణించినట్లు తెలియజేశారు.

మే 1 నుంచి ఒక రాష్ట్రం ఒకే ఆర్ఆర్‌బీ అమల్లోకి

ఆర్థిక శాఖ నోటిఫికేషన్



న్యూఢిల్లీ: ఒక రాష్ట్రం-ఒకే ఆర్ఆర్‌బీ విధానం మే నెల 1 నుంచి అమల్లోకి వస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. ఇందుకు సంబంధించి మంగళవారం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 11 రాష్ట్రాల్లోని 15 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను (ఆర్ఆర్‌బీ) కన్సాలిడేట్ చేయనున్నారు. దీంతో నాలుగో విడత కన్సాలిడేషన్‌లో భాగంగా మొత్తం ఆర్ఆర్‌బీల సంఖ్య ప్రస్తుతమున్న 43 నుంచి 28కి తగ్గుతుంది. విలీన జాబితాలో ఆంధ్రప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ తదితర 11 రాష్ట్రాల్లోని ఆర్ఆర్‌బీలు ఉన్నాయి. విలీనం అమల్లోకి వచ్చే తేదీని మే 1గా నిర్ణయించారు. ఉదాహరణకు, వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకులు స్పాన్సర్ చేస్తున్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మొదలైన వాటిని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు కింద ఏకీకృతం చేస్తారు. కొత్త బ్యాంకు ప్రధాన కార్యాలయం అమరావతిలో ఉంటుంది. దీన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పాన్సర్ చేస్తుంది. వ్యయాలను క్రమబద్ధీకరించేందుకు, సామర్థ్యాల ను మెరుగుపర్చుకునేందుకు 10 రాష్ట్రాలు, 1 కేంద్ర పాలిత ప్రాంతంలోని ఆర్ఆర్‌బీలను విలీనం చేస్తున్నట్లు ఆర్థిక శాఖ తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న రైతులు, వ్యవసాయ కూలీలు, కళాకారులకు రుణాలు, ఇతరత్రా బ్యాంకింగ్ సదుపాయాలను కల్పించే ఉద్దేశంతో ఆర్ఆర్‌బీ యాక్ట్ 1976 కింద ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఏర్పాటయ్యాయి. వీటిలో కేంద్ర ప్రభుత్వానికి 50 శాతం, స్పాన్సర్ బ్యాంకులకు 35 శాతం, రాష్ట్ర ప్రభుత్వాలకు 15 శాతం వాటాలు ఉన్నాయి. ప్రస్తుతం 26 రాష్ట్రాల్లో, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 43 ఆర్ఆర్‌బీలు ఉన్నాయి. విలీనానంతరం ఈ సంఖ్య 28 ఆర్ఆర్‌బీలకు తగ్గుతుంది. వీటికి 700 జిల్లాల్లో 22,000 శాఖలు ఉంటాయి. ఆర్ఆర్‌బీల విలీన ప్రక్రియలో ఇది నాలుగో దశ. 2006-2010 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో తొలి విడతగా 196 ఆర్ఆర్‌బీలను 82కి తగ్గించారు.

హల్దీరామ్ బ్రాంచీల విలీనం

ఢిల్లీ, నాగ్‌పూర్ బిజినెస్‌లు ఏకం



న్యూఢిల్లీ: స్నాక్స్ ఫుడ్, రెస్టారెంట్ల కంపెనీ హల్దీరామ్ స్నాక్స్ ఫుడ్ సర్వీసెస్ తాజాగా నాగ్‌పూర్, ఢిల్లీ బ్రాంచీలను విలీనం పూర్తయినట్లు వెల్లడించింది. దీంతో హల్దీరామ్ స్టోరీలో కొత్త అధ్యాయం ప్రారంభమైనట్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ లింక్‌డ్ఇన్‌లో కంపెనీ సీఈవో క్రిషన్ కుమార్ చుటాని పేర్కొన్నారు. హల్దీరామ్ స్నాక్స్ ప్రయివేట్ లిమిటెడ్(ఢిల్లీ), హల్దీరామ్ ఫుడ్స్ ఇంటర్నేషనల్ ప్రయివేట్ లిమిటెడ్(నాగ్‌పూర్) ఎఫ్‌ఎంసీజీ బిజినెస్‌లు హల్దీరామ్ స్నాక్స్ ఫుడ్ ప్రయివేట్ లిమిటెడ్‌గా విలీనమైనట్లు తెలియజేశారు. విలీనానికి ఇప్పటికే సీసీఐ, ఎన్‌సీఎల్‌టీ అనుమతి లభించినట్లు వెల్లడించారు. విలీన సంస్థలో ఢిల్లీ యూనిట్ 56 శాతం, నాగ్‌పూర్ బ్రాంచ్ 44 శాతం చొప్పున వాటా పొందనున్నట్లు పేర్కొన్నారు. కాగా.. కంపెనీ ఇటీవల గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ టెమాసెక్, అల్ఫా వేవ్ గ్లోబల్, ఇంటర్నేషనల్ హోల్డింగ్ కంపెనీతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. హల్దీరామ్ విలువను 10 బిలియన్ డాలర్లు(సుమారు రూ. 85,000 కోట్లు)గా మదింపు చేసి ఆయా సంస్థలు ఇన్వెస్ట్ చేసినట్లు అంచనా. ఈ నేపథ్యంలో ఎఫ్‌ఎంసీజీ విభాగాల తాజా విలీనానికి ప్రాధాన్యత ఏర్పడినట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.

ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ రూ. 500 కోట్ల సమీకరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్, డిబెంచర్ల జారీ ద్వారా రూ. 500 కోట్ల వరకు సమీకరించనున్నట్లు వెల్లడించింది. వీటిపై కూపన్ రేటు వార్షికంగా 10.25 శాతం వరకు ఉంటుంది. ఈ నిధులను వ్యాపారరీత్యా క్లయింట్లకు రుణాలు ఇచ్చేందుకు, ఇతరత్రా కార్పొరేట్ అవసరాలకు వినియోగించుకోనుంది. ఈ ఇష్యూ ఏప్రిల్ 23న ముగుస్తుంది. 15 నెలల నుంచి 60 నెలల వరకు కాల వ్యవధులకు కంపెనీ ఈ డిబెంచర్లను జారీ చేయనుంది.

సీనియర్ సిటిజన్లకు రూ. 990కే బీమా పాలసీ: జెన్‌ఎస్



న్యూఢిల్లీ: అరవై ఏళ్లు పైబడిన వారి కోసం తమ యాప్ ద్వారా తక్కువ ప్రీమియంలతో వ్యక్తిగత ప్రమాద బీమా పథకాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు జెన్‌ఎస్ లైఫ్ ఫౌండర్ మీనాక్షీ మీనన్ తెలిపారు. సిల్వర్ ప్లాన్ కింద కేవలం రూ. 990కే రూ. 2.5 లక్షల పర్సనల్ యాక్సిడెంట్ లైఫ్ ఇన్సూరెన్స్ కవరేజీ, ప్రమాదం బారిన పడి ఆస్పత్రిలో చేరితే రూ. 50 వేల నగదు లభిస్తుందని పేర్కొన్నారు. ప్రత్యేక రేట్లపై రూ. 10 లక్షల వరకు హెల్త్ ఇన్సూరెన్స్ టాప్ అప్‌లు, క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీలను పొందవచ్చని తెలిపారు. ఇక గోల్డ్ ప్లాన్‌లో రూ. 4,900 వార్షిక ప్రీమియంకు రూ. 5 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా, ఆస్పత్రిలో చేరితే రూ. 1 లక్ష నగదు, రూ. 5 లక్షల వరకు సైబర్ ఇన్సూరెన్స్ లభిస్తుందని మీనాక్షి వివరించారు.

రూ. 2 లక్షల కోట్లకు మొబైల్ ఫోన్ ఎగుమతులు

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరంలో మొబైల్ ఫోన్ల ఎగుమతులు రూ. 2 లక్షల కోట్ల మార్కును దాటాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇందులో రూ. 1.5 లక్షల కోట్ల వాటా యాపిల్ ఐఫోన్లదే ఉన్నట్లు వివరించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే గత ఆర్థిక సంవత్సరంలో స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు 54 శాతం పెరిగినట్లు వివరించారు. గత పదేళ్లలో దేశీయంగా ఎలక్ట్రానిక్స్ తయారీ అయిదు రెట్లు, ఎగుమతులు ఆరు రెట్లు పెరిగినట్లు వైష్ణవ్ చెప్పారు. వివిధ పరికరాలు తయారు చేసే చిన్నా, పెద్ద సంస్థలన్నీ కలిపి 400 పైగా ప్రొడక్షన్ యూనిట్లు ఉన్నట్లు వివరించారు. ఎలక్ట్రానిక్ కాంపోనెంట్ మాన్యుఫాక్చరింగ్ స్కీమ్‌ను ఆయన ఆవిష్కరించారు. దీని కింద ఏప్రిల్ 1 నుంచి ఆరేళ్ల పాటు ప్రోత్సాహకాలు లభిస్తాయని వైష్ణవ్ తెలిపారు. టర్నోవరు ఆధారిత ప్రోత్సాహకాల లెక్కింపునకు 2024-25 ఆర్థిక సంవత్సరం బేస్ ఇయర్‌గా ఉంటుందని పేర్కొన్నారు. కన్జూమర్ ఎలక్ట్రానిక్స్, మెడికల్ ఎలక్ట్రానిక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్ తదితర ప్రతి టెక్నాలజీ ప్రోడక్టుల్లో ఉపయోగించే ఎలక్ట్రానిక్ పరికరాలన్నింటికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. రెసిస్టర్లు, కెపాసిటర్లు, ఫెరైట్లు, స్పెషాలిటీ సెరామిక్స్, కాయిల్స్ మొదలైనవి ఈ జాబితాలో ఉంటాయి. టర్నోవరు ఆధారిత ప్రోత్సాహకాల కోసం కంపెనీలు రూ. 10 కోట్ల నుంచి రూ. 1,000 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. ప్రోత్సాహకాలు 1 నుంచి 10 శాతం వరకు ఉంటుంది.



సీఈవోల సగటు వేతనం @ రూ. 10 కోట్లు..

- రెండంకెల స్థాయిలో జీతభత్యాల వృద్ధి
- ప్రోత్సాహకాలు, బోనస్‌ల రూపంలోనే అధిక భాగం
- డెలాయిట్ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయంగా ప్రమోటర్‌యేతర చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, ప్రొఫెషనల్ సీఈవోల సగటు వేతనం గతేడాదితో పోలిస్తే 13 శాతం పెరిగి రూ. 10 కోట్లకు చేరింది. కన్సల్టెన్సీ సంస్థ డెలాయిట్ ఇండియా రూపొందించిన ఎగ్జిక్యూటివ్ పర్ఫార్మెన్స్, రివార్డ్స్ సర్వే 2025 నివేదికలో ఈ విషయం వెల్లడైంది. దీని ప్రకారం సీఈవో వేతనాల్లో 40 శాతం భాగం మాత్రమే స్థిరమైనదిగా ఉంటోంది. మిగతా 60 శాతం వివిధ అంశాలపై ఆధారపడి ఉంటోంది. ఇందులో స్వల్పకాలిక ప్రోత్సాహకాలు, వార్షిక బోనస్‌ల రూపంలో 25 శాతం, దీర్ఘకాలిక ప్రోత్సాహకాల రూపంలో మిగతా 35 శాతం ఉంటోంది. మరోవైపు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్లు, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్లు వంటి సీఎక్స్‌వోల వేతనాలు 7 నుంచి 11 శాతం మేర పెరిగాయి. వీరి వేతనాల్లో 60 శాతం స్థిరమైనదిగా ఉండగా, మిగతాది స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రోత్సాహకాల రూపంలో ఉంటోంది. సీఈవోల తర్వాత సీవోవోలు, సీఎఫ్‌వోల వేతనాలు అత్యధికంగా రూ. 4 కోట్ల స్థాయిలో ఉంటున్నాయి. ఈ సర్వేలో 400 పైచిలుకు సంస్థలు పాల్గొన్నాయి. వీటిలో ప్రభుత్వ రంగ సంస్థలేవీ లేవు. సీఎక్స్‌వోలకు డిమాండ్ భారీగా ఉండటంతో వారి వేతనాలు గణనీయంగా పెరుగుతున్నాయని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ ఆనందోరూప్ ఘోష్ తెలిపారు. సీఎక్స్‌వోల వేతనాలపై ఈక్విటీ మార్కెట్ల కరెక్షన్ ప్రభావం వచ్చే ఏడాది మాత్రమే తెలుస్తుందని వివరించారు. నివేదికలోని మరిన్ని వివరాలు..

- సీఎక్స్‌వోల స్థాయిలో స్వల్పకాలిక ప్రోత్సాహకాలనేవి కేవలం ఆర్థికాంశాలతోనే ముడిపడినవి కాకుండా సమగ్రంగా వ్యాపార పనితీరుపై ఆధారపడి ఉంటున్నాయి. అయితే, దీర్ఘకాలిక ప్రోత్సాహకాలకు మాత్రం ఆర్థిక పనితీరే ప్రాతిపదికగా ఉంటోంది. చాలా మటుకు కంపెనీలు సీఈవో, సీఎక్స్‌వోల పనితీరును మదింపు చేసేందుకు ఆర్థిక, వ్యూహాత్మక ప్రాధాన్యతలకు సంబంధించిన స్కోర్ కార్డును ప్రాతిపదికగా తీసుకుంటున్నాయి. వీటిని చేరుకోవడంలో విఫలమైన సీఎక్స్‌వోలకు అంతక్రితం ఏడాదితో పోలిస్తే తక్కువ బోనస్‌లు ఇస్తున్నాయి.
- పలు కంపెనీల్లో దీర్ఘకాలికంగా షేర్ల ఆధారిత ప్రోత్సాహకాలు ఇచ్చే ధోరణి పెరుగుతోంది. ఇలా వేతనంలో షేర్ల రూపంలో ఇచ్చే పరిమాణం పెరుగుతోంది. అయితే, షేర్ల ఆధారిత ప్రణాళికలను ప్రాక్సీ-అడ్వైజరీ సంస్థలు నిశితంగా పరిశీలిస్తున్నాయి. మేనేజ్‌మెంట్ నిర్ణయాలను సవాలు చేస్తున్నాయి. ఓటింగ్ ఫలితాలనూ ప్రభావితం చేస్తున్నాయి. షేర్‌హోల్డర్లు ఇలాంటి ప్రతిపాదనలను తిరస్కరించడం గత ఏడాది వ్యవధిలో నాలుగు రెట్లు పెరిగింది.
- సీఈవోలు, సీఎక్స్‌వోల వ్యవధి తగ్గుతూ ఉండగా, పనితీరుపై అంచనాలు, షేర్‌హోల్డర్ల యాక్టివిజం గణనీయంగా పెరుగుతోంది. దీంతో జీతభత్యాలపరంగా కాంట్రాక్టుల్లో భారీగా బేరసారాలు జరుగుతున్నాయి.


భారత్‌లో మళ్లీ అల్కటెల్ ఫోన్లు

పెట్టుబడికి నెక్ట్స్‌సెల్ ఇండియా రెడీ

న్యూఢిల్లీ: దేశీ మొబైల్ ఫోన్ల మార్కెట్‌లో అల్కటెల్ బ్రాండ్‌ను తిరిగి ప్రవేశపెట్టనున్నట్లు నెక్ట్స్‌సెల్ ఇండియా తాజాగా పేర్కొంది. ఇందుకు వీలుగా తొలి దశలో 3 కోట్ల డాలర్లు(రూ. 260 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది. వెరసి ఏడేళ్ల తదుపరి తిరిగి దేశీయంగా అల్కటెల్ బ్రాండ్‌ను విడుదల చేయనుంది. భారత్‌తోపాటు ప్రపంచ మార్కెట్లకు అవసరమయ్యే ప్రత్యేక ఫీచర్స్‌తో స్మార్ట్‌ఫోన్లను రూపొందించడంపై దృష్టి పెట్టనున్నట్లు నెక్ట్స్‌సెల్ ఇండియా వివరించింది. నోకియాతో ట్రేడ్ మార్క్ ఒప్పందం కింద అల్కటెల్ బ్రాండ్‌ను చైనీస్ కంపెనీ టీసీఎల్ కమ్యూనికేషన్ నిర్వహిస్తోంది. దేశీయంగా అల్కటెల్ బ్రాండ్ అధీకృత హక్కులను నెక్ట్స్‌సెల్ ఇండియా కలిగి ఉంది. దీంతో అల్కటెల్ ప్రొడక్టుల సంబంధిత అన్నిరకాల కార్యకలాపాలను కంపెనీ నిర్వహించనున్నట్లు నెక్ట్స్‌సెల్ ఇండియా చీఫ్ బిజినెస్ అధికారి అతుల్ వివేక్ వెల్లడించారు.



రజత్ పాటీదార్‌పై రూ. 12 లక్షల జరిమానా



ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా మరో కెప్టెన్‌పై జరిమానా పడింది. వాంఖడే స్టేడియంలో సోమవారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు నిర్ణీత సమయంలో పూర్తి ఓవర్ల కోటా పూర్తి చేయలేకపోయింది. దాంతో ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఆర్‌సీబీ జట్టు కెప్టెన్ రజత్ పాటీదార్‌పై రూ. 12 లక్షలు జరిమానా విధించింది. స్లో ఓవర్ రేట్ కారణంగా ఈ సీజన్‌లో మరో మూడు జట్ల కెప్టెన్‌లు హార్దిక్ పాండ్యా (ముంబై), రిషభ్ పంత్ (లక్నో), రియాన్ పరాగ్ (రాజస్తాన్) జరిమానాకు గురయ్యారు.

ముకేశ్‌కు స్వర్ణం



జియాంగిన్ (చైనా): సాండా వరల్డ్ కప్ వుషు టోర్నమెంట్‌లో భారత ప్లేయర్ ముకేశ్ చౌధరీ స్వర్ణ పతకంతో మెరిశాడు. 75 కేజీల విభాగం ఫైనల్లో ఫ్రాన్స్ ప్లేయర్‌పై ముకేశ్ గెలుపొందాడు. భారత్‌కే చెందిన కుశాల్ (48 కేజీలు), రవి పాంచాల్ (65 కేజీలు), అనూజ్ కుమార్ (52 కేజీలు), రజత్ చరక్ (85 కేజీలు), ఛావి (48 కేజీలు) ఫైనల్లోకి ప్రవేశించారు.



సురుచి



విజయ్‌వీర్

డబుల్ ధమాకా

స్వర్ణ పతకాలతో మెరిసిన భారత షూటర్లు సురుచి, విజయ్‌వీర్

బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) ప్రపంచకప్ టోర్నమెంట్‌లో మంగళవారం భారత షూటర్లు అదరగొట్టారు. రెండు స్వర్ణ పతకాలతో సత్తా చాటుకున్నారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో 18 ఏళ్ల సురుచి ఇందర్ సింగ్... పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో విజయ్‌వీర్ సిద్ధూ పసిడి పతకాలు సొంతం చేసుకున్నారు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో సురుచి 244.6 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. సురుచి ధాటికి చైనా ద్వయం కియాన్ వె 241.9 పాయింట్లతో రజతం దక్కించుకోగా... డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ జియాంగ్ రాన్‌జిన్ 221 పాయింట్లతో కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. 41 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లోనూ సురుచి తన ఆధిపత్యం చాటుకుంది. సురుచి 583 పాయింట్లు స్కోరు చేసి టాప్ ర్యాంక్‌లో నిలిచింది. భారత స్టార్ షూటర్, పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు నెగ్గిన మనూ భాకర్ నిరాశపరిచింది. మనూ 574 పాయింట్లు స్కోరు చేసి 13వ స్థానంతో సంతృప్తి పడి ఫైనల్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. భారత్‌కే చెందిన మరో షూటర్ సయం 572 పాయింట్లతో 17వ స్థానంలో నిలిచింది.

ఆరుగురు షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో విజయ్‌వీర్ సిద్ధూ 29 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచాడు. ప్రపంచకప్ చరిత్రలో 22 ఏళ్ల విజయ్‌వీర్ వ్యక్తిగత విభాగంలో పసిడి పతకం గెలవడం ఇదే తొలిసారి. రికియార్డో మజెట్టి (ఇటలీ; 28 పాయింట్లు) రజతం నెగ్గగా... యాంగ్ యుహావో (చైనా; 23 పాయింట్లు) కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. 24 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో విజయ్‌వీర్ 579 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు. భారత్‌కే చెందిన గుర్‌ప్రీత్ సింగ్ 575 పాయింట్లతో 10వ స్థానంలో, అనీశ్ 570 పాయింట్లతో 13వ స్థానంలో నిలిచారు. ప్రస్తుతం భారత్ 4 స్వర్ణాలు, 1 రజతం, 1 కాంస్యంతో కలిపి మొత్తం 6 పతకాలతో అగ్రస్థానంలో ఉంది.

ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు రేసులో శ్రేయస్



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చాంపియన్స్ ట్రోఫీలో నిలకడైన ప్రదర్శన చేసిన భారత మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్... 'ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్'అవార్డు రేసులో నిలిచాడు. న్యూజిలాండ్‌కు చెందిన రచిన్ రవీంద్ర, జాకబ్ డఫీతో కలిసి శ్రేయస్ ఈ అవార్డుకు నామినేట్ అయ్యాడు. చాంపియన్స్ ట్రోఫీలో శ్రేయస్ 48.60 సగటుతో 243 పరుగులు చేశాడు. అందులో 2 అర్ధశతకాలు ఉన్నాయి. ఇందులో గత నెలలో 3 మ్యాచ్‌లాడిన శ్రేయస్ 57.33 సగటుతో 172 పరుగులు చేశాడు. 'భారత జట్టు చాంపియన్స్ ట్రోఫీ చేజిక్కించుకోవడంలో అయ్యర్ కీలక పాత్ర పోషించాడు. టీమిండియా తరఫున టాప్ స్కోరర్‌గా నిలిచాడు'అని ఐసీసీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇక న్యూజిలాండ్ బ్యాటర్ రచిన్ 65.75 సగటుతో 263 పరుగులు చేశాడు. ఇందులో రెండు శతకాలు ఉన్నాయి. బౌలింగ్‌లోనూ పర్వాలేదనిపించిన రచిన్ పొదుపుగా బంతులేయడంతో పాటు 3 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. న్యూజిలాండ్ జట్టు స్వదేశంలో పాకిస్తాన్‌పై టి20 సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించిన జాకబ్ డఫీ కూడా ఈ అవార్డు రేసులో ఉన్నాడు.

పోరాడి ఓడిన రుత్విక-రోహన్ జోడీ



నింగ్బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ వ్యక్తిగత చాంపియన్‌షిప్ తొలి రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత్ నుంచి నాలుగు జోడీలు బరిలోకి దిగగా... రెండు జంటలు తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాయి. మరో రెండు జోడీలు తొలి రౌండ్ అడ్డంకిని అధిగమించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాయి. తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక శివాని-రోహన్ కపూర్ జోడీ తీవ్రంగా పోరాడినా విజయాన్ని అందుకోలేకపోయారు. 56 నిమిషాలపాటు జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో రుత్విక-రోహన్ ద్వయం 21-18, 17-21, 17-21తో కింగ్ రాయ్ యాప్-వలెరి సియవ్ (మలేసియా) జంట చేతిలో ఓడిపోయింది. మరో మ్యాచ్‌లో సతీశ్ కుమార్ కరుణాకరన్-ఆద్య వరియత్ (భారత్) జంట 18-21, 19-21తో మూడో సీడ్ సూన్ హువాట్ గో-షెవోన్ జేమీ లాయ్ (మలేసియా) ద్వయం చేతిలో పరాజయం పాలైంది. మరోవైపు భారత నంబర్‌వన్ జోడీ తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల జంట 51 నిమిషాల్లో 15-21, 21-12, 21-11తో హూ పాంగ్ రోన్-సున్ యిన్ చెంగ్ (మలేసియా) జోడీని ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. మరో మ్యాచ్‌లో అశిత్ సూర్య-అమృత ద్వయం 21-9, 21-11తో తులిత్ పలియగురు-పాంచాలి అధికారి (శ్రీలంక) జోడీపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది.

నగాల్‌కు నిరాశ



మోంజా (ఇటలీ): భారత పురుషుల టెన్నిస్ సింగిల్స్ నంబర్‌వన్ సుమిత్ నగాల్ మోంజా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టోర్నీలో తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. క్వాలిఫయర్‌గా మెయిన్ 'డ్రా'లో అడుగు పెట్టిన సుమిత్ నగాల్ తొలి రౌండ్ మ్యాచ్‌లో గాయం కారణంగా రెండో సెట్‌లో వైదొలిగాడు. ఆస్ట్రియా ప్లేయర్ ఫిలిప్ మిసోలిచ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తొలి సెట్‌ను 2-6తో కోల్పోయి, రెండో సెట్‌లో 0-1తో వెనుకబడ్డాడు. ఈ దశలో సుమిత్ గాయపడటంతో మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు. 42 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి కోల్పోయాడు. తొలి రౌండ్‌లో ఓడిన సుమిత్‌కు 1,515 యూరోల (రూ. 1 లక్ష 42 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

ఓటమితో మొదలు

బిల్లీ జీన్ కింగ్ కప్ టోర్నీలో భారత్‌కు నిరాశ

- తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో పరాజయం
- శుభారంభం అందించిన రష్మిక
- సహజ, అంకిత-ప్రార్థన జోడీ ఓటమి



రష్మిక



సహజ

పుణే: సొంతగడ్డపై జరుగుతున్న ప్రతిష్టాత్మక బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్-1 మహిళల టీమ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత్‌కు శుభారంభం లభించలేదు. మంగళవారం మొదలైన ఈ టోర్నీలో భారత్ తమ తొలి లీగ్ మ్యాచ్‌లో పరాజయం పాలైంది. న్యూజిలాండ్ జట్టుతో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 1-2తో ఓటమి చవిచూసింది. న్యూజిలాండ్ జట్టులో ప్రపంచ 245వ ర్యాంకర్ లులు సన్ సింగిల్స్ మ్యాచ్‌తో పాటు డబుల్స్‌లోనూ బరిలోకి దిగి తమ జట్టును విజయతీరాలకు చేర్చింది. తొలి మ్యాచ్‌లో హైదరాబాద్ అమ్మాయి, ప్రపంచ 345వ ర్యాంకర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక 6-1, 6-1తో ఐశి దాస్ (న్యూజిలాండ్)పై అలవోకగా గెలిచింది. దాంతో భారత్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. కేవలం 57 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రష్మిక కేవలం రెండు గేమ్‌లు కోల్పోయింది. ఆరు ఏస్‌లు సంధించిన రష్మిక నాలుగు డబుల్ ఫాల్ట్‌లు కూడా చేసింది. తొలి సర్వ్‌లో 20 పాయింట్లు నెగ్గిన రష్మిక రెండో సర్వ్‌లో తొమ్మిది పాయింట్లు సాధించింది. తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా చేజార్చుకోని రష్మిక ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేయడం విశేషం.

రెండో మ్యాచ్‌లో గెలిస్తే భారత్ 2-0తో విజయాన్ని ఖాయం చేసుకునేది. కానీ న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ లులు సన్ 6-3, 6-3తో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ అమ్మాయి సహజ యామలపల్లిని ఓడించింది. దాంతో స్కోరు 1-1తో సమమైంది. 73 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ తన సర్వీస్‌ను మూడుసార్లు చేజార్చుకుంది. ఆరు ఏస్‌లు సంధించిన లులు సన్ రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. స్కోరు 1-1తో సమం కావడంతో చివరిదైన డబుల్స్ మ్యాచ్ కీలకంగా మారింది. సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ అంకిత రైనా, డబుల్స్‌లో భారత నంబర్‌వన్ ప్రార్థన తొంబారే జత కట్టి ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగారు. అయినప్పటికీ భారత్‌కు ఓటమి తప్పలేదు. 83 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత-ప్రార్థన ద్వయం 3-6, 4-6తో లులు సన్-మోనిక్యూ బ్యారీ జోడీ చేతిలో ఓడిపోవడంతో న్యూజిలాండ్ 2-1తో విజయాన్ని అందుకుంది. నేడు జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌తో భారత్ ఆడుతుంది.

'కంకషన్' ప్లేయర్ పకోవ్‌స్కీ రిటైర్మెంట్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఆటగాడు విల్ పకోవ్‌స్కీ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. పదే పదే కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా మైదానం వీడి వార్తల్లోకి ఎక్కిన పకోవ్‌స్కీ... ఇకపై ఏ స్థాయిలోనూ క్రికెట్ కూడా ఆడనని మంగళవారం వెల్లడించాడు. 2019లో టీమిండియాపై టెస్టు అరంగేట్రం చేసిన ఈ ఓపెనర్... కేవలం ఒక్క మ్యాచ్‌కే పరిమితమయ్యాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్, లిస్ట్ 'ఎ'లో కలిసి 50 మ్యాచ్‌లాడిన పకోవ్‌స్కీ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నాడు. వైద్యుల సలహా మేరకు గతేడాదే ఫస్ట్ క్లాస్ క్రికెట్ నుంచి తప్పుకున్న పకోవ్‌స్కీ... షెఫీల్డ్ షీల్డ్ మ్యాచ్‌లో మరోసారి కంకషన్‌కు గురవడంతో మొత్తానికి ఆటకే దూరమవుతున్నట్లు ప్రకటించాడు. అరంగేట్ర టెస్టులో భారత్‌పై అర్ధశతకంతో ఆకట్టుకున్న అతడు... కెరీర్‌లో 13 సార్లు కంకషన్‌కు గురవడం గమనార్హం. 'ఇక ఏ స్థాయిలోనూ క్రికెట్ ఆడను. గత కొన్ని రోజులుగా దీని గురించి ఆలోచిస్తున్నా. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా. మానసిక సంఘర్షణకు ముగింపు పలకాలని నిర్ణయించుకున్నా' అని పకోవ్‌స్కీ వెల్లడించాడు. కెరీర్ ఆరంభంలోనే భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న అతడు... ఆరు నెలలు ఆటకు దూరమయ్యాడు. తిరిగి వచ్చాక తొలి మ్యాచ్‌లోనే బ్యాటింగ్ చేస్తూ తలకు గాయం కావడంతో కంకషన్‌గా బయటకు వెళ్లాడు.

న్యూజిలాండ్ హెడ్ కోచ్ స్టెడ్ రాజీనామా

వన్డే, టి20 ఫార్మాట్‌లకు గుడ్‌బై



వెల్లింగ్టన్: న్యూజిలాండ్ క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గ్యారీ స్టెడ్ పరిమిత ఓవర్ల ఫార్మాట్ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. సుదీర్ఘ కాలంగా మూడు ఫార్మాట్లలో కివీస్ ప్రధాన కోచ్‌గా కొనసాగుతున్న స్టెడ్... వన్డే, టి20 కోచింగ్ నుంచి తప్పుకుంటున్నట్లు మంగళవారం వెల్లడించాడు. 53 ఏళ్ల స్టెడ్ 2018 నుంచి న్యూజిలాండ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. అతడి శిక్షణలో కివీస్ జట్టు 2019, వన్డే ప్రపంచకప్, 2022 టి20 ప్రపంచకప్‌లలో ఫైనల్‌కు చేరడంతో పాటు... తొలిసారి నిర్వహించిన ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. 'గ్యారీ నిర్ణయాన్ని గౌరవిస్తాం. అతడు సుదీర్ఘకాలంగా జట్టుకు సేవలందించాడు' అని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు (ఎన్‌జెడ్‌సీ) వెల్లడించింది. వన్డే, టి20ల కోచింగ్ బాధ్యతల నుంచి తప్పుకున్న స్టెడ్... సుదీర్ఘ ఫార్మాట్‌లో మాత్రం కొనసాగాలనుకుంటున్నట్లు సమాచారం. దీంతో ఇద్దరు వేర్వేరు కోచ్‌లను నియమించాలా లేక ఒకే కోచ్‌ను కొనసాగించాలా అనే అంశంపై ఎన్‌జెడ్‌సీ తర్జనభర్జనలో ఉంది. త్వరలో దీనిపై ఒక నిర్ణయానికి రానుంది. ఇటీవల స్వదేశంలో పాకిస్తాన్‌తో జరిగిన టి20, వన్డే సిరీస్‌లలో న్యూజిలాండ్ విజయాలు సాధించింది. సీనియర్ ప్లేయర్లు అందుబాటులో లేకపోయినా... యువ ఆటగాళ్లతోనే పాక్‌పై గెలుపొందింది.

దేశవ్యాప్తంగా కోటి బేళ్ల పత్తి సేకరణ

40 లక్షల బేళ్లతో అగ్రస్థానంలో తెలంగాణ

సాక్షి, న్యూఢిల్లీ: 2024–25 సీజన్‌లో 2025 మార్చి 31 వరకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)తో 100 లక్షల బేళ్ల పత్తిని సేకరించింది. ఇందులో తెలంగాణ నుంచి అత్యధికంగా 40 లక్షల బేళ్ల పత్తిని కొనుగోలు చేసింది. మహారాష్ట్ర 30 లక్షల బేళ్లతో, గుజరాత్ 14 లక్షల బేళ్లతో రెండో, మూడో స్థానాల్లో ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో కర్ణాటక (5 లక్షల బేళ్లు), మధ్యప్రదేశ్ (4 లక్షల బేళ్లు), ఆంధ్రప్రదేశ్ (4 లక్షల బేళ్లు), ఒడిశా (2 లక్షల బేళ్లు) నిలిచాయి. హరియాణా, రాజస్తాన్, పంజాబ్‌లలో కలిపి 1.15 లక్షల బేళ్ల పత్తిని సేకరించారు. ఇందుకు సంబంధించి మొత్తం 21 లక్షల మంది రైతులకు ప్రభుత్వం రూ.37,450 కోట్లు చెల్లించింది.



అహ్మదాబాద్‌లో మంగళవారం సీడబ్ల్యూసీ భేటీకి హాజరైన నేతలతో కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గ్రూప్ ఫొటో. చిత్రంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా ఉన్నారు.

కనీస వేతనాలను పెంచిన కెనడా

భారతీయ విద్యార్థులకు కాసింత ఊరట

టొరంటో: కెనడాలో జీవనవ్యయం విపరీతంగా పెరిగిన వేళ ప్రజలకు కాస్తంత ఊరటనిచ్చే నిర్ణయాన్ని కెనడా ప్రభుత్వం తీసుకుంది. ప్రైవేట్ రంగంలో కనీస వేతనాలను పెంచుతున్నట్లు మంగళవారం ప్రకటించింది. దీంతో ఉన్నత విద్య కోసం కెనడాకు వచ్చి తాత్కాలిక ఉద్యోగాలు చేసుకునే భారతీయ విద్యార్థులకు లబ్ధిచేకూరనుంది. ప్రస్తుతం ప్రతి గంటకు 17.30 కెనడియన్ డాలర్ల చొప్పున కనీస వేతనం చెల్లిస్తుండగా ఇకపై 17.75 కెనడియన్ డాలర్లను చెల్లించనున్నారు. కొత్త వేతనాలను ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే వర్తింపజేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో చదువుకుంటూనే చిరుద్యోగాలు చేస్తూ సంపాదించే భారతీయ విద్యార్థుల ఆర్థిక కష్టాలు కొంతమేర తగ్గనున్నాయి. ''ఆదాయ అసమానతలను కాస్తయినా తగ్గించే లక్ష్యంతో ఫెడరల్ కనీస వేతనాలను పెంచుతున్నాం. దీంతో వ్యాపారాలు, పరిశ్రమల్లో కార్మికులకు స్థిరాదాయం కొంతైనా పెరుగుతుంది. మరింత పారదర్శకమైన ఆర్థికవ్యవస్థను నిర్మించే క్రమంలో మేం మరో అడుగు ముందుకేశాం''అని కెనడా ఉపాధి, కార్మికాభివృద్ధి, గ్రామికుల మంత్రిత్వ శాఖ మంత్రి స్టీవెన్ మ్యాకినన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ''సంస్థలన్నీ తమ ఉద్యోగుల జీతభత్యాల జాబితాలను పెంచిన కనీస వేతనాలకు అనుగుణంగా వెంటనే సవరించాలని ఆదేశించాం. ఇంటర్న్‌లు సహా ఉద్యోగులు, కార్మికులందరికీ సవరించిన కనీస వేతనాలు అందేలా చూస్తాం''అని ఆయన అన్నారు. కెనడాలో గత ఏడాది వినియోగదారుల ధరల సూచీ వార్షిక సగటును ఆధారంగా చేసుకుని ప్రతి ఏటా ఏప్రిల్ ఒకటో తేదీన కనీస వేతనాల సవరణ విధానాన్ని అమలుచేస్తారు.

తగ్గనున్న స్థానికుల కష్టాలు

పెరిగిన జీవన వ్యయంతో కెనడాలోని మధ్య తరగతి స్థానికులకు ఆహార కష్టాలు పెరిగాయి. ఇన్నాళ్లూ వీళ్లలో చాలామంది స్థానికంగా ఉచితంగా ఆహారం అందించే ఫుడ్ బ్యాంక్‌ల మీదనే ఆధారపడ్డారు. ఉన్నత విద్య కోసం వచ్చిన విదేశీ విద్యార్థులు సైతం కాస్త డబ్బును ఆదా చేసుకునేందుకు ఈ ఉచిత ఫుడ్‌బ్యాంక్‌లనే ఆశ్రయిస్తారు. అయితే గత ఏడాది విదేశీ విద్యార్థులు వెల్లువలా పోటెత్తడంతో లక్షలాది మందికి ఉచితంగా ఆహారం అందించడం తమ వల్లకాదని ఫుడ్ బ్యాంక్‌లు చేతులెత్తేశాయి. దీంతో ఎంతో మంది విదేశీ విద్యార్థులు ఖాళీ కడుపులతో ఫుడ్‌బ్యాంక్‌ల నుంచి వెనుతిరిగారు. ఇప్పుడు కనీస వేతనాలు పెరిగిన నేపథ్యంలో స్థానిక కెనడియన్ల నిత్యావసరాల కొనుగోలు శక్తి కాస్తంత పెరిగింది. దీంతో ఇప్పుడు వీళ్లంతా మునపటిస్థాయిలో ఫుడ్‌బ్యాంక్‌లను ఆశ్రయించకపోవచ్చు. దాంతో విదేశీ విద్యార్థులకు మళ్లీ ఫుడ్‌బ్యాంక్‌లలో ఉచిత ఆహారం లభించే అవకాశాలు మెరుగుపడనున్నాయి. పెరిగిన ద్రవ్యోల్బణం అనేది జస్టిన్ ట్రూడో ప్రభుత్వానికి పెద్ద సమస్యగా తయారవడం తెల్సిందే. ఈ ఏడాది జరగబోయే ఎన్నికల్లో ధరల అంశమే ప్రధానంకానుంది. కనీస వేతనం 2.4 శాతం పెరిగిన నేపథ్యంలో అక్కడి భారతీయులకూ లబ్ధి చేకూరనుంది.

కెనడా జనాభాలో 3.7 శాతం భారతీయులే

కెనడా జనాభాలో 3.7 శాతం భారతీయులే ఉన్నారు. గత ఏడాది కెనడావ్యాప్తంగా తాత్కాలిక ఉద్యోగాలు చేసిన వారిలో 22 శాతం మంది భారతీయులే ఉన్నారు. ఇలా తాత్కాలిక(గిగ్) ఆర్థికరంగంలో భారతీయులు కీలకంగా ఉన్నారు. కెనడాలో తాత్కాలిక ఉద్యోగాలు చేస్తున్న వారిలో అత్యధిక మంది వలసదారులే. 2005 ఏడాది నుంచి 2020 ఏడాదిదాకా గమనిస్తే కెనడా కార్మికుల్లో తాత్కాలిక కార్మికుల వాటా 5 శాతం నుంచి 10 శాతానికి పెరిగింది. వీళ్లుగాక కెనడాలో ఉన్న దాదాపు 13.5 లక్షల మంది తాము భారతీయ మూలాలున్న వ్యక్తులమని వెల్లడించడం విశేషం. ముఖ్యంగా భారతీయులు రిటైల్, హెల్త్‌కేర్, నిర్మాణం, ఇతర రంగాల్లో పనిచేస్తున్నారు. ప్రైవేట్ ఉద్యోగులు మాత్రమేకాదు ఇంటర్న్‌లుగా పనులు చేసుకుంటున్న భారతీయ విద్యార్థులకు సైతం ఈ కనీస వేతన లబ్ధి ప్రయోజనాలు దక్కనున్నాయి. భారత్ నుంచి ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్, వ్యాపారాలు, ఇంజనీరింగ్, హెల్త్‌సైన్సెస్, ఐటీ రంగాల్లో విద్యనభ్యసించేందుకు భారతీయ విద్యార్థులు కెనడాకు వస్తున్నారు. చదువు పూర్తయ్యాక ఐటీ, ఇంజనీరింగ్, హెల్త్‌కేర్, వాణిజ్య, వ్యాపార రంగాల్లో ఉద్యోగులుగా కెనడాలోనే స్థిరపడుతున్నారు. భారతీయ విద్యార్థులు విద్య రూపంలో, తాత్కాలిక ఉపాధి, వస్తూత్పత్తుల వినియోగం ఇలా అన్నింటిలో కలిపి 2021 ఏడాదిలో కెనడా ఆర్థికవ్యవస్థకు 4.9 బిలియన్ కెనడియన్ డాలర్లమేర లబ్ధిచేకూర్చారు. కెనడాకు వస్తున్న విదేశీ విద్యార్థుల్లో భారతీయులే ఎక్కువ.

భారతీయురాలికి చేదు అనుభవం

- అమెరికా ఎయిర్‌పోర్ట్‌లో 8 గంటలపాటు నిర్బంధం
- 'వ్యక్తిగత' తనిఖీలు చేసిన పురుష అధికారి
- అలాస్కా యాంకరేజ్ ఎయిర్‌పోర్ట్‌లో ఘటన

వాషింగ్టన్: విదేశీ పర్యాటకులతో తరచూ అనుమాన, అవమానకర రీతిలో ప్రవర్తించిన అమెరికా దర్యాప్తు అధికారులు మరోమారు తమ బుద్ధిచూపించారు. వ్యాపార, వ్యక్తిగత పర్యటన నిమిత్తం అమెరికాలో పర్యటిస్తున్న భారతీయ యువపారిశ్రామికవేత్త శ్రుతి చతుర్వేది పట్ల అలాస్కాలోని యాంకరేజ్ ఎయిర్‌పోర్ట్‌లో పోలీసులు, ఎఫ్‌బీఐ అధికారులు అనుచితంగా ప్రవర్తించారు. మహిళ అని కూడా చూడకుండా పురుష ఆఫీసర్‌తో 'వ్యక్తిగత'తనిఖీలు చేయించారు. చలివాతావరణంలో వెచ్చదనం కోసం ధరించిన అదనపు దుస్తులను విప్పించారు. కనీసం బాత్రూమ్‌కు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఏకధాటిగా 8 గంటలపాటు తమ అధీనంలో నిర్బంధించి పలురకాల ప్రశ్నలతో వేధించారు. కనీసం సాయంకోసం ఎవరికీ ఫోన్‌చేసే అవకాశం కూడా ఇవ్వలేదు. ఎయిర్‌పోర్ట్‌లో తనకు జరిగిన అవమానాన్ని శ్రుతి తర్వాత భారత్‌కు చేరుకున్నాక 'ఎక్స్'సామాజిక మాధ్యమంలోని తన ఖాతాలో పోస్ట్‌చేశారు.

పవర్‌బ్యాంక్‌పై అనుమానంతో..

''ఎయిర్‌పోర్ట్‌కు వచ్చినప్పుడు నా హ్యాండ్‌బ్యాగ్‌లో స్మార్ట్‌ఫోన్ పవర్‌బ్యాంక్ ఉంది. అదేదో కొత్తరకం వస్తువు అన్నట్లు దానిని పోలీసులు అనుమానంగా చూశారు. వెంటనే ఎఫ్‌బీఐ అధికారులను రప్పించి తనిఖీలు చేయించారు. తర్వాత నన్ను ఇష్టమొచ్చినట్లు, అర్థంపర్థంలేని ప్రశ్నలతో వేధించారు. వాస్తవానికి మహిళా ఆఫీసర్‌కు తనిఖీలు చేయాల్సి ఉన్నా ఒక పురుష అధికారి వచ్చి నన్ను తనిఖీలు చేశాడు. విపరీతమైన చలికారణంగా ధరించిన వెచ్చటి దుస్తులను విప్పించాడు. ఏకధాటిగా 8 గంటలపాటు ఎటూ వెళ్లనివ్వలేదు. కనీసం బాత్రూమ్‌కు కూడా పోనివ్వలేదు. సాయం కోసం ఎవరికైనా ఫోన్ చేసుకోవడానికి వీల్లేకుండా ఫోన్, మనీ పర్సు లాక్కున్నారు. అన్ని రకాల తనిఖీలు చేసి చివరకు ఏమీ లేవని నిర్ధారించుకుని వదిలేశారు. నా ఖరీదైన లగేజీ బ్యాగ్‌ను వాళ్లే అట్టిపెట్టుకున్నారు. నా వస్తువులను బయటకుతీసి నాసిరకం వేరే బ్యాగులో కుక్కి ఇచ్చారు. భారత్‌కు ఆవల ఉన్నప్పుడు భారతీయులు శక్తిహీనులు అన్నట్లు అమెరికా పోలీసులు, ఎఫ్‌బీఐ అధికారులు ప్రవర్తించారు''అని శ్రుతి ఆ పోస్ట్‌లో రాసుకొచ్చారు. తన పోస్ట్‌ను భారత విదేశాంగ మంత్రి జైశంకర్, విదేశాంగ శాఖకు ట్యాగ్ చేశారు. 'ఇండియా యాక్షన్ ప్రాజెక్ట్', చర్చా వేదిక అయిన 'ఛాయ్‌పానీ'లను శ్రుతి స్థాపించారు. మహిళను గంటల తరబడి అమెరికా అధికారులు వేధించడంపై నెటిజన్లు విమర్శలు గుప్పించారు.

16ఏళ్లలోపు వారికి ఇన్‌స్టా లైవ్‌స్ట్రీమ్ కుదరదు

తల్లిదండ్రుల అనుమతి ఉండాల్సిందే

లండన్: సామాజిక మాధ్యమం ఇన్‌స్టాగ్రామ్‌లో 16 ఏళ్లలోపు టీనేజర్లు ప్రత్యక్ష ప్రసార సేవ అయిన లైవ్‌స్ట్రీమ్‌లో అనుచిత, అసభ్య, బ్లర్‌చేయని నగ్న వీడియోలు చూడకుండా కట్టడిచేసే లక్ష్యంతో కఠిన నిబంధనలను అమల్లోకి తెస్తున్నట్లు ఇన్‌స్టా గ్రామ్ మాతృసంస్థ మెటాప్లాట్‌ఫామ్స్ మంగళవారం ప్రకటించింది. తల్లిదండ్రుల సమ్మతితోనే లైవ్‌స్ట్రీమ్ సదుపాయం కల్పిస్తామని సంస్థ స్పష్టంచేసింది. తమ అనుబంధ సామాజిక మాధ్యమ వేదికలైన ఫేస్‌బుక్, మెసెంజర్‌లలోనూ 18 ఏళ్లలోపు టీనేజర్లకు అదనపు 'కట్టడి'చర్యలను అమలుచేస్తామని మెటా పేర్కొంది. టీనేజీ వినియోగదారుల సమయాన్ని, ఆరోగ్యాన్ని సోషల్ మీడియా తీవ్రంగా ప్రభావితంచేస్తున్న నేపథ్యంలో పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై తల్లిదండ్రులకు పూర్తి నిఘా అధికారాలను కట్టబెడుతూ మెటా గత సెప్టెంబర్‌లో 'టీన్ అకౌంట్ ప్రోగ్రామ్'ను అమల్లోకితేవడం తెల్సిందే. ఇన్‌స్టా గ్రామ్ నూతన కఠిన నిబంధనలను తొలుత అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియాలలో అమలుచేయనున్నారు. మరికొద్ది నెలల్లో ప్రపంచవ్యాప్తంగా ఈ నిబంధనలను అమలుచేస్తారు. నిబంధనలు అమల్లోకి వచ్చాక టీనేజర్ల ఖాతాల్లో ఇన్‌స్టా గ్రామ్ లైవ్ ఆప్షన్ కనపడదు. తల్లిదండ్రుల పర్మిషన్ వచ్చాకే కనిపిస్తుంది.

ఈ వేసవిలో 10 శాతం పెరగనున్న... విద్యుత్ డిమాండ్!

2024లోనూ 10 శాతం పెరిగిన డిమాండ్

- మూడో వంతు వాటా ఏసీలదే
- విద్యుత్ ఉద్గారాల్లోనూ రికార్డు

న్యూఢిల్లీ: ప్రపంచమంతటా విద్యుత్ డిమాండ్ ఏయేటికాయేడు విపరీతంగా పెరిగిపోతోంది. ఈ వేసవిలో భారత్‌లో విద్యుత్ డిమాండ్ 9 నుంచి 10 శాతం పెరగనుందని గ్లోబల్ ఎనర్జీ థింక్ ట్యాంక్ 'ఎంబర్ గ్లోబల్ ఎలక్ట్రిసిటీ రివ్యూ'అంచనా వేసింది. ''ఏప్రిల్ నుంచి జూన్ దాకా దేశవ్యాప్తంగా సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చు. వడగాల్పుల రోజులు కూడా పెరుగుతాయి. అందుకే విద్యుత్ డిమాండ్ బాగాపెరగనుంది''అని మంగళవారం విడుదల చేసిన కొత్త నివేదికలో వెల్లడించింది. వచ్చే దశాబ్ద కాలంలో దేశంలో ఎయిర్ కండిషన్ల సంఖ్య మరో 15 కోట్ల దాకా పెరుగుతుందని పేర్కొంది. దాంతో 2035 నాటికి పీక్ అవర్ విద్యుత్ డిమాండ్ ఏకంగా 180 గిగావాట్లకు పెరిగి విద్యుత్ గ్రిడ్‌పై తీవ్ర భారం పడుతుందని తెలిపింది.

2024లో ప్రపంచవ్యాప్తంగా..

2024లో భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆ ఏడాది ప్రపంచ విద్యుత్ డిమాండ్ పెరుగుదలలో ఐదో వంతుకు వడగాలులే కారణం. దాంతో ప్రపంచ విద్యుత్ రంగ ఉద్గారాలు 2024లో 1.6 శాతం పెరిగాయి. 22.3 కోట్ల టన్నుల కార్బన్ డయాక్సైడ్ విడుదలైంది. దాంతో మొత్తం ఉద్గారాలు రికార్డు స్థాయిలో 1,460 కోట్ల టన్నులకు పెరిగాయి.

భారత్‌లో...

2024 ఏప్రిల్–జూన్ మధ్య మన దేశంలో విద్యుత్ డిమాండ్ 10.4 శాతం పెరిగింది. మొత్తం విద్యుత్ వాడకంలో ఎయిర్ కండిషనర్ల వాటాయే 30 శాతం! 2024 మే 30న జాతీయ స్థాయిలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 250 గిగావాట్లు దాటింది. ఇది అంచనాల కంటే 6.3 శాతం ఎక్కువ! 2024లో దేశంలో వడగాల్పుల తరచుదనం, తీవ్రత పెరిగాయి. జాతీయ గృహ విద్యుత్ వినియోగం వాటా 2012–13లో 22 శాతం కాగా 2022–23 నాటికి 25 శాతానికి పెరిగింది. ఆర్థిక వృద్ధి, పెరిగిన వేడి వంటివి శీతలీకరణకు డిమాండ్ పెరగడానికి ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. ఈ విషయంలో చైనా, నైజీరియా, ఇండొనేషియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, బ్రెజిల్, ఫిలిప్పీన్స్, అమెరికా తరువాతి స్థానాల్లో ఉన్నాయి.

ఆర్థిక అణుయుద్ధం!

- ట్రంప్ సుంకాలపై బిలియనీర్ల ధ్వజం
- ప్రపంచ ఆర్థికమే కుప్పకూలుతోంది: ఆక్‌మన్
- ద్రవ్యోల్బణం తప్పదు: జేపీమోర్గాన్ సీఈఓ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల పెంపు నిర్ణయాన్ని ఆ దేశ బిలియనీర్లు తీవ్రంగా తప్పుబడుతున్నారు. ఈ జాబితాలో రిపబ్లికన్ దాత బిల్ ఆక్‌మన్ వంటి ట్రంప్ కీలక మద్దతుదారులు కూడా ఉండటం విశేషం. ఈ సుంకాలు వాణిజ్య భాగస్వామిగా అమెరికా ప్రతిష్టను దెబ్బతీస్తాయని ఆయన హెచ్చరించారు. టారిఫ్‌ల అంచనాకు ట్రంప్ ప్రభుత్వం వాడిన ఫార్ములాయే తప్పు. దాంతో టారిఫ్‌లు వాస్తవం కంటే నాలుగు రెట్లు పెద్దవిగా కనిపించాయి. ట్రంప్ ఆర్థికవేత్త కాదు. కనుక ఈ లెక్కల కోసం సలహాదారులపై ఆధారపడతారు. ఈ తప్పుడు అంచనాల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థే కుప్పకూలుతోంది''అని ఎక్స్ వేదికగా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపారం విశ్వాసానికి సంబంధించిన ఆట. ఆ నమ్మకాన్ని ట్రంప్ ఉల్లంఘించారు''అంటూ ఆక్‌మన్ ఆవేదన వెలిబుచ్చారు. ట్రంప్ టారిఫ్‌లు అంతిమంగా ఆర్థిక అణుయుద్ధానికి దారి తీసే ప్రమాదముందని హెచ్చరించారు. వాటివల్ల ద్రవ్యోల్బణం తీవ్రరూపు దాలుస్తుందని జేపీమోర్గాన్ సీఈఓ జేమీ డైమన్ అంచనా వేశారు. భారత్ వంటి దేశాలతో అమెరికా సన్నిహిత వాణిజ్య సంబంధాలను పెంపొందించుకోవాలని సూచించారు. ట్రంప్‌కు బలమైన విధేయుడైన సెనేటర్ టెడ్ క్రూజ్ సైతం టారిఫ్‌లపై తీవ్ర విమర్శలకు దిగారు. ''మనం మళ్లీ మాంద్యంలోకి వెళితే, 2026 నాటికి దేశ రాజకీయమే రక్తసిక్తమవుతుంది''అని ఆయన పాడ్‌కాస్ట్‌లో హెచ్చరించారు. మొత్తానికి అధికార రిపబ్లికన్ శిబిరంలో కూడా టారిఫ్‌లపై నానాటికీ పెరుగుతున్న అసమ్మతి, వ్యతిరేకత త్వరలో తిరుగుబాటుగా మారే సూచనలు కనిపిస్తున్నాయి!

ఇందుకా ఓటేసింది?

''ప్రపంచ వ్యాపారవేత్తల విశ్వాసాన్ని ట్రంప్ శరవేగంగా కోల్పోతున్నారు. దేశానికి, అధ్యక్షుడికి మద్దతిచ్చిన లక్షలాది మంది అమెరికన్లకు పరిణామాలు తీవ్రంగా ప్రతికూలంగా మారనున్నాయి. మేం ఓటేసింది దీనికోసం కాదు''అని ఆక్‌మన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ''అన్యాయమైన వాణిజ్య విధానాలకు అమెరికా బాధితురాలని నేనూ ఒప్పుకుంటా. కానీ అసమాన సుంకాలు అమెరికాపై ప్రపంచ దేశాల వాణిజ్య విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. శత్రువులతో పాటు మిత్రులపైనా భారీ సుంకాలు విధించి ప్రపంచంపై ట్రంప్ ఆర్థిక యుద్ధానికి తెర తీశారు. ఫలితంగా వాణిజ్య భాగస్వామిగా, వ్యాపార, పెట్టుబడి మార్కెట్‌గా అమెరికాపై నమ్మకాన్ని నాశనమవుతోంది''అన్నారు. ''సుంకాల దెబ్బకు పెట్టుబడులు ఆగిపోతాయి. పెద్దా, చిన్నా వ్యాపారాలన్నీ దెబ్బతింటాయి. వినియోగదారుల కొనుగోలు శక్తి నిండుకుంటుంది. కార్మికులు రోడ్డున పడతారు. అమెరికా ప్రతిష్ట దెబ్బతింటుంది. ఆ నష్టాన్ని పూడ్చేందుకు దశాబ్దాలు పట్టవచ్చు'' అని ఆక్‌మన్ హెచ్చరించారు.

హృదయాలను గెలుచుకోవడమే భారతీయులకు ఇష్టం: రాష్ట్రపతి ముర్ము

లిస్బన్: దేశాలను గెలుచుకోవడం కంటే ప్రజల హృదయాలను గెలుచుకోవడమే భారతీయులకు ఇష్టమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. పోర్చుగల్ పర్యటనలో ఉన్న రాష్ట్రపతి మంగళవారం చంపలిమాడ్ సెంటర్ ఫర్ అన్‌నోన్స్‌లో జరిగిన కార్యక్రమంలో భారతీయ పరిశోధకులతో ఆమె ముఖాముఖి సంభాషించారు. భారత్ పేరు నిలపాలని, దేశపు అత్యుత్తమ రాయబారులుగా నిలవాలని వారిని కోరారు. 'మీరు విద్యలో, పరిశోధనలో రాణించడంతోపాటు, ఆర్థిక వ్యవస్థకు, సమాజానికి తోడ్పాటుగా ఉంటున్నారు. ఇక్కడి నియమ నిబంధనలను అనుసరిస్తున్నారు. ఇలాగే ముందుకు సాగండి, భారతదేశం గర్వపడేలా చేయండి'అని ముర్ము వారికి పిలుపునిచ్చారు. 'ఒక దేశానికి వెళ్లినప్పుడు ఓ సీనియర్ నేత నన్ను ప్రశ్నించారు.. భారతీయులు ప్రపంచాన్ని గెలవాలని అనుకుంటున్నారా అని. దేశాలపై విజయం సాధించడం కంటే హృదయాలను గెలుచకోవడమే భారతీయులకు ఇష్టమని ఆయనకు బదులిచ్చా'అని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

లక్షలాది మందికి మరణశాసనం

అమెరికా ఆహార సాయం నిలిపివేతపై డబ్ల్యూఎఫ్‌పీ

రోమ్: లక్షలాది మందికి ఆహార సాయాన్ని నిలిపేస్తూ అమెరికా తీసుకున్న నిర్ణయాన్ని వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం (డబ్ల్యూఎఫ్‌పీ) తీవ్రంగా తప్పుబట్టింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఆకలితో అలమటిస్తున్న లక్షలాది మంది పాలిన మరణశాసనంగా అభివర్ణించింది. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సోమవారం విజ్ఞప్తి చేసింది. ప్రాణాలను కాపాడే కార్యక్రమాలకు నిరంతరం మద్దతివ్వాలని కోరేందుకు ట్రంప్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నట్టు వెల్లడించింది. అఫ్గానిస్తాన్, సిరియా, యెమన్, మరో 11 పేద దేశాల్లో లక్షలాది మంది అన్నార్తులకు సాయపడే యూఎస్ వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం అత్యవసర కార్యక్రమాలకు ట్రంప్ ప్రభుత్వం నిధులను నిలిపేయడం తెలిసిందే. ఎలాన్ మస్క్ డోజ్లో టాప్ లెఫ్టినెంట్ జెరెమీ లెవిన్ ఆదేశాల మేరకు వాటికి నిధుల కేటాయింపును రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. అత్యవసర ఆహార కార్యక్రమాలకు సాయాన్ని కోతల నుంచి మినహాయిస్తామని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఇతర ఉన్నతాధికారులు హామీ ఇచ్చినా లాభం లేకపోయింది.

ట్రంప్ టార్గెట్ చేసిన కార్యక్రమాలు

13 ఏళ్ల అంతర్యుద్ధం, ఇస్లామిక్ స్టేట్ గ్రూపు తిరుగుబాటు తర్వాత సిరియా పేదరికం, ఆకలి, అభద్రతతో సతమతమవుతోంది. ఆ దేశానికి తాజాగా 23 కోట్ల డాలర్ల ఒప్పందాలను అమెరికా రద్దు చేసింది. ఇక ప్రపంచంలోనే అత్యంత ఘోరమైన మానవీయ విపత్తును ఎదుర్కొంటున్న యెమన్‌లో డబ్ల్యూఎఫ్‌పీ ఆహార కార్యక్రమాలకు సాయం నిలిపేసింది. సిరియా శరణార్థులు తీవ్రంగా ప్రభావితమయ్యే లెబనాన్, జోర్డాన్లలో కార్యక్రమాలూ పడకేశాయి. సోమాలియా, అఫ్గాన్, జింబాబ్వేల్లో యుద్ధాలతో నిరాశ్రయులైన వారికి జలకు ఆహారం, నీరు, వైద్య సంరక్షణ, ఆశ్రయం వంటి కార్యక్రమాలు కూడా ప్రభావితమయ్యాయి. అఫ్గాన్‌కు మానవతా సహాయంలో అమెరికా 56 కోట్ల డాలర్లు కోత పెట్టింది. తాలిబన్ ఆంక్షల వల్ల విదేశాల్లో చదువుతున్న అఫ్గాన్ యువతులకు అందించే సాయాన్ని శుక్రవారం నిలిపేసింది. అమెరికా కోతలతో ప్రపంచవ్యాప్తంగా ఇలా సుమారు 1,000కి పైగా కార్యక్రమాలు నిలిచిపోయాయి. 5,000 మందికి పైగా ఉద్యోగులను తొలగించారు. డబ్ల్యూఎఫ్‌పీకి గతేడాది అందిన 980 కోట్ల డాలర్ల విరాళాల్లో 450 కోట్లు అమెరికా ఇచ్చినవే!

కోర్టులు నైతిక కాపలాదారులు కారాదు: సుప్రీం

న్యూఢిల్లీ: కోర్టులు మోరల్ పోలీసింగ్ బాధ్యతల్లోకి వెళ్లరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జైన గురువు తరుణ్ సాగర్‌ను గేలి చేసినందుకు గాను రాజకీయ వ్యాఖ్యాత తెహసీన్ పూనావాలాకు రూ.10 లక్షల జరిమానా విధిస్తూ పంజాబ్ హరియాణా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై పైవ్యాఖ్య చేసింది. పూనావాలాతో పాటు సంగీత దర్శకుడు విశాల్ దద్లానీ ఈ మొత్తం చెల్లించాలంటూ 2019లో హైకోర్టు ఆదేశాలిచ్చింది. మరొకరు ఇదేవిధంగా మతాచారాలను అవమానించరాదనే జరిమానా విధించినట్లు పేర్కొంది. దీనిపై పూనావాలా సుప్రీంకోర్టుకు వెళ్లారు. మంగళవారం విచారణ చేపట్టిన జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం హైకోర్టు తీర్పును కొట్టివేసింది. 'ఇదేం తీర్పు? నిర్దోషులుగా విడుదల చేస్తూనే పరిహారం చెల్లించమనడమేంటి? ఇది తప్పు. కోర్టులు మోరల్ పోలీసింగ్ చేయజాలవు'అని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

సుప్రీంలో మమత ప్రభుత్వానికి ఊరట

న్యూఢిల్లీ: సూపర్ న్యూమెరరీ పోస్టుల విషయంలో పశ్చిమ బెంగాల్‌లోని మమతా బెనర్జీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించాలంటూ బెంగాల్ కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై సీబీఐ దర్యాప్తునకు కలకత్తా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం మంగళవారం ఈ మేరకు తీర్పు వెలువరించింది. అదేసమయంలో, ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లలో 25,753 మంది టీచర్లు, సిబ్బంది నియామకాలపై చేపట్టిన విచారణను సీబీఐ యథాప్రకారం కొనసాగించవచ్చని స్పష్టతనిచ్చింది. ఎంపిక ప్రక్రియ లోపభూయిష్టంగా ఉందంటూ మొత్తం 25,753 మంది టీచర్లు, సిబ్బంది నియామకాలను రద్దు చేస్తూ ఈనెల 3న అత్యున్నత న్యాయస్థానం తీర్పు వెలువరించడం తెల్సిందే. రద్దయిన ఉపాధ్యాయ పోస్టుల స్థానంలో తాత్కాలికంగా సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే, దీనిపై హైకోర్టు సీబీఐ దర్యాప్తునకు ఆదేశించడాన్ని సవాల్ చేస్తూ మమత సర్కార్ సుప్రీంను ఆశ్రయించింది. మంత్రివర్గం నిర్ణయాలను న్యాయస్థానాలు ప్రశ్నించజాలవని విచారణ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది.

కశ్మీర్ ప్రాజెక్టులు, భద్రతపై అమిత్ షా సమీక్ష

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో అభివృద్ధి ప్రాజెక్టుల అమలు తీరు, భద్రతా పరిస్థితిపై హోం మంత్రి అమిత్ షా సమీక్ష జరిపారు. మంగళవారం రాజ్‌భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతోపాటు హోం శాఖ, జమ్మూకశ్మీర్ ఉన్నతాధికారులు పాల్గొన్నారని అధికారులు వివరించారు. అభివృద్ధిపై రెండు గంటలపాటు, భద్రతా పరిస్థితులపై రెండున్నర గంటలపాటు సమీక్ష జరిగిందని తెలిపారు. భద్రతపై సమీక్షలో సీఎం మినహా పోలీసులు, ఆర్మీ సహా భద్రతా బలగాల ఉన్నతాధికారులు పాలుపంచుకున్నారన్నారు.

దక్షిణ కొరియాలో జూన్ 3న ఎన్నికలు

సియోల్: దక్షిణ కొరియా అధ్యక్ష ఎన్నిలకు ముహూర్తం ఖరారైంది. జూన్ 3వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు దేశ తాత్కాలిక అధ్యక్షుడు హన్ డక్ సూ మంగళవారం ప్రకటించారు. ఈ ఎన్నికల్లో పదవీచ్యుత అధ్యక్షుడు యూన్ సుక్ యెల్ స్థానంలో మరొకరిని ప్రజలు ఎన్నుకోవాల్సి ఉంది. గతేడాది డిసెంబర్‌లో దేశంలో మార్షల్ విధిస్తూ యూన్ తీసుకున్న నిర్ణయంపై పార్లమెంట్ ఆయన్ను అభిశంసించింది. పార్లమెంట్ నిర్ణయాన్ని నాలుగు రోజుల క్రితం రాజ్యాంగ న్యాయస్థానం సమర్థించింది. దీంతో, యూన్ పదవిని కోల్పోయారు. కొరియా రాజ్యాంగం ప్రకారం కొత్త అధ్యక్షుడిని 60 రోజుల్లోగా ఎన్నుకోవడం తప్పనిసరి.

ఆందోళన వద్దు.. నేనొచ్చేస్తున్నా: షేక్ హసీనా

న్యూఢిల్లీ: ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తాను బంగ్లాదేశ్‌కు వచ్చేస్తున్నానని అవామీ లీగ్ అగ్రనేత, మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా చెప్పారు. ఆమె అవామీ లీగ్ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులతో తాజాగా వర్చువల్‌గా సమావేశమయ్యారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో స్వదేశంలో అడుగుపెడతానని, తమ పార్టీ శ్రేణులపై దాడులు చేసినవారిపై దర్యాప్తు జరిపించి, శిక్షిస్తానని అన్నారు. 2024 ఆగస్టులో పదవి కోల్పోయిన షేక్ హసీనా ప్రస్తుతం ఇండియాలో ఉంటున్న సంగతి తెలిసిందే. బంగ్లాదేశ్ ఉగ్రవాద దేశంగా మారిందని ఆమె ఆరోపించారు. ప్రస్తుత పాలకుడు మొహమ్మద్ యూనస్ బంగ్లాదేశ్‌ను నాశనం చేస్తున్నాడని మండిపడ్డారు. అధికారం సుస్థిరం చేసుకోవడానికి ప్రత్యర్థులకు అరాచకాలకు పాల్పడుతున్నాడని ధ్వజమెత్తారు.

25 మంది పాలస్తీనియన్లు మృతి

జెరుసలేం: గాజా ప్రాంతంపై సోమవారం అర్ధరాత్రి నుంచి ఇజ్రాయెల్ సైన్యం జరుపుతున్న దాడుల్లో కనీసం 25 మంది చనిపోయారు. వీరిలో 8 మంది చిన్నారులు, ఐదుగురు మహిళలు ఉన్నట్లు వైద్య సిబ్బంది మంగళవారం వెల్లడించారు. దెయిర్ అల్–బలాహ్‌పై జరిగిన దాడిలో ఐదుగురు చిన్నారులు సహా 11 మంది మరణించారు. మృతుల్లో రెండేళ్ల చిన్నారులు సైతం ఉన్నారని అల్ అక్సా ఆస్పత్రి వైద్య సిబ్బంది తెలిపారు. ఇదే నగరంలో జరిగిన మరో దాడిలో నలుగురు చనిపోయారు. బెయిట్ లహియాలో ఓ నివాసం నేలమట్టం కాగా ఒకే కుటుంబంలోని ఏడుగురు మృత్యువాత పడ్డారు. గాజా నగరంలోని ఓ బహిరంగ ప్రదేశంలో గుమికూడిన జనంపై జరిగిన దాడిలో నలుగురు ప్రాణాలు కోల్పోయారని ఆరోగ్య శాఖ తెలిపింది.

బీజేపీ నేత ఇంటిపై గ్రెనేడ్ దాడి

పంజాబ్‌లో ఘటన • ఐఎస్ఐ హస్తం: నిఘా వర్గాలు

చండీగఢ్: పంజాబ్‌లోని జలంధర్‌లో మాజీ మంత్రి, బీజేపీ నేత మనోరంజన్ కాలియా ఇంటిముందు మంగళవారం తెల్లవారుజామున భారీ పేలుడు సంభవించింది. ఆ సమయంలో కాలియా ఇంట్లోనే ఉన్నారు. ఆయనతో పాటు ఎవరికీ గాయాలు కాలేదు. ఇంటి అద్దాలు పగలడంతో పాటు కారు, ఇతర వాహనాలు దెబ్బ తిన్నాయి. ఘటనాస్థలం నుంచి పోలీసులు నమూనాలు సేకరించి విచారణ ప్రారంభించారు. గుర్తు తెలియని వ్యక్తి రిక్షాలో వచ్చి హ్యాండ్ గ్రెనేడ్ విసిరి పారిపోయిన దృశ్యాలు రికార్డయ్యాయి. అనుమానితుడిని గుర్తించడానికి సీసీ టీవీ ఫుటేజీని విశ్లేషిస్తున్నారు. పేలుడు శబ్దం విని మేల్కొన్నానని, ట్రాన్స్‌ఫార్మర్ పేలుడో, ఉరుముల శబ్దమో అని భావించానని కాలియా తెలిపారు. దీని వెనక పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ, లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ హస్తమున్నట్టు నిఘా వర్గాలు తెలిపాయి.

జైపూర్ పేలుళ్ల కేసు.. నలుగురికి జీవిత ఖైదు

జైపూర్: రాజస్తాన్ రాజధాని జైపూర్‌లో 2008లో సంభవించిన వరుస పేలుళ్లలో 71 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనపై ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం తీర్పు వెలువరించింది. పేలుళ్లకు బాధ్యులుగా తేలిన నలుగురికి జీవిత ఖైదు విధించింది. ఐపీసీ, ఉపా, పేలుడు పదార్థాల చట్టంలోని పలు సెక్షన్ల కింద పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న సర్వర్ అజ్మి, షహబాజ్, సైఫుర్ రెహ్మాన్, మహ్మద్ సైఫ్ అనే వారిని కోర్టు ఈ నెల 4న దోషులుగా నిర్ధారించింది. నగరంలో బాంబులు అమర్చి రక్తపాతం సృష్టించిన వీరి పట్ల కనికరం చూపలేమని ప్రత్యేక కోర్టు జడ్జి రమేశ్ కుమార్ జోషి పేర్కొన్నారు. 2008 మే 13వ తేదీన జైపూర్‌లో వేర్వేరు ప్రాంతాల్లో 8 బాంబులు పేలి 71 మంది మృతి చెందగా 180 మంది గాయపడ్డారు. చంద్‌పోల్ బజార్‌లో పేలని మరో బాంబును గుర్తించి నిర్వీర్యం చేశారు.

మేధా పాట్కర్‌కు ఏడాది 'ప్రొబేషన్'

న్యూఢిల్లీ: పరువు నష్టం కేసులో ఐదు నెలల జైలు శిక్ష ఎదుర్కొంటున్న పర్యావరణ ఉద్యమకారిణి మేధా పాట్కర్ (70)కు కోర్టు ఊరట కల్పించింది. వయోభారం తదితరాల దృష్ట్యా ఆమెను ప్రొబేషన్‌పై విడుదల చేయాలని మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జరిమానాను కూడా రూ.10 లక్షల నుంచి రూ.లక్షకు తగ్గించింది. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సివిల్ లిబర్టీస్ అనే సంస్థకు అధ్యక్షుడిగా ఉండగా ఆయన్ను మేధా విమర్శించారు. ఈ కేసులో ఆమెను దోషిగా కోర్టు గతేడాది మేలో నిర్ధారించింది. జూలై ఒకటో తేదీన ఆమెకు ఐదు నెలల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఇది జైలు శిక్ష విధించదగిన నేరం కాదని తాజా తీర్పులో కోర్టు పేర్కొంది.

జీరో అవర్ కాలపరిమితి ఎంత?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

పార్లమెంటరీ పద్ధతులు - పారిభాషిక పదజాలం

పార్లమెంట్ సమావేశాల్లో వివిధ చర్చలు, తీర్మానాలు, ఓటింగ్ మొదలైన ప్రక్రియలుంటాయి. పార్లమెంట్‌లో ఉపయోగించే ప్రతి పదానికి ప్రత్యేక అర్థం ఉంది. పార్లమెంటరీ ప్రక్రియను బ్రిటన్ రాజ్యాంగం నుంచి గ్రహించారు.

Session - సమావేశ కాలం: పార్లమెంటు సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజు నుంచి చివరి రోజు వరకు ఉన్న మధ్య కాలాన్ని సమావేశాల కాలం అంటారు. సమావేశాలను అవసరాన్ని బట్టి ఎన్ని రోజులైనా నిర్వహించుకోవచ్చు. నిబంధన- 85 ప్రకారం ఆరు మాసాలకు ఒకసారి, సంవత్సరానికి రెండుసార్లు జరపాలి.

Agenda - ఎజెండా: పార్లమెంటులో చర్చించాల్సిన కార్యక్రమాల పట్టికను ఎజెండా అంటారు. ఎజెండాను సభ వ్యవహారాల కమిటీ నిర్ణయిస్తుంది. ఈ కమిటీలో 15 మంది సభ్యులు ఉంటారు. వీరిలో 10 మందిని లోక్‌సభ నుంచి, 5 గురిని రాజ్యసభ నుంచి తీసుకుంటారు. దీని అధ్యక్షుడిగా స్పీకర్ ఉంటారు.

Dissolution-సభ రద్దు: రాజకీయ అనిశ్చిత పరిస్థితి సమయంలో లోక్‌సభ పదవీ కాలం పూర్తి కాకముందు లేదా అయిన తర్వాత నిబంధ న-85 ప్రకారం రాష్ట్రపతి లోక్‌సభను రద్దు చేస్తారు.

Adjournment - సభ వాయిదా: సభా కార్యక్రమాలను నిర్వహించేందుకు తగిన పరిస్థితి లేనప్పుడు సభల అధ్యక్షులు సభలను వాయిదా వేస్తారు. తిరిగి ఎప్పుడు సమావేశం అవుతాయో వాయిదా వేసినప్పుడే ప్రకటిస్తారు. దాని ప్రకారం తిరిగి సభలు సమావేశం అవుతాయి.

Sine-die - నిరవధిక వాయిదా: సభ కార్యక్రమాలను నిర్వహించేందుకు తగిన పరిస్థితి లేనప్పుడు సభాధ్యక్షులు సభను వాయిదా వేస్తారు. తిరిగి ఎప్పుడు సమావేశం అవుతాయో తర్వాత ప్రకటిస్తారు. దాని ప్రకారం సభలు సమావేశం అవుతాయి.

Prorogue- దీర్ఘకాలిక వాయిదా: సభ సమావేశాలు ముగియడం లేదా పరిసమాప్తం కావడాన్ని దీర్ఘకాలిక వాయిదా అంటారు. రాష్ట్రపతి దీర్ఘకాలిక వాయిదా వేస్తారు. తిరిగి రాష్ట్రపతి పిలుపు ఇచ్చేంతవరకు సభలు వాయిదా పడతాయి. గరిష్ఠంగా ఆరు నెలలు వాయిదా పడొచ్చు.

Question Hour- ప్రశ్నోత్తరాల సమయం: సమావేశాల్లోని ప్రతిరోజూ మొదటి గంటనే ప్రశ్నోత్తరాల సమయంగా పేర్కొంటారు.ఈ సమయంలో సభాధ్యక్షుడి పూర్వానుమతితో సభ్యులు ప్రశ్నలు అడుగుతారు. వాటికి సంబంధిత మంత్రి సమాధానం ఇస్తారు. ప్రశ్నలు ప్రధానంగా రెండు రకాలు..

1. నక్షత్రం గుర్తు ఉన్న ప్రశ్నలు: అంటే ప్రాధాన్యత గల ప్రశ్నలు. వీటికి సమాధానాలను మౌఖికంగా ఇస్తారు. వీటి విషయంలో అనుబంధ ప్రశ్నలను అడగవచ్చు.
2. నక్షత్రం గుర్తు లేని ప్రశ్నలు: అంటే ప్రాధాన్యత లేని ప్రశ్నలు. వీటికి సమాధానాన్ని సంబంధిత మంత్రి లిఖిత పూర్వకంగా ఇస్తారు.వీటి విషయంలో అనుబంధ ప్రశ్నలను అడిగే అవకాశం లేదు.

Zero Hour - శూన్య కాలం: ప్రశ్నోత్తరాలు - భోజన సమయానికి మధ్య గల సమయమే.. శూన్య కాలం. ఈ టైమ్‌లో సభాధ్యక్షుడి ఆమోదం తీసుకొని అప్పటికప్పుడు వివిధ సమస్యలపై సభ్యులు ప్రశ్నలు అడుగుతారు. మంత్రులు సమాధానం ఇస్తారు. ఇది పార్లమెంట్ ప్రక్రియలో పేర్కొనలేదు. ఈ పదాన్ని మీడియా ప్రవేశపెట్టింది. 1962 నుంచి పాటిస్తున్నారు.

Calling attention motion - సావధాన తీర్మానం: ఏదైనా అత్యంత ముఖ్యమైన, ప్రజాసంబంధ అంశంపై సంబంధిత మంత్రి నుంచి అధికారికంగా సమాధానం రాబట్టేందుకు ఈ తీర్మానం ప్రవేశపెడతారు. దీన్ని ప్రవేశపెట్టేందుకు ఇద్దరు సభ్యుల మద్దతుతో సభాధ్యక్షుడికి నోటీస్ జారీ చేయాలి. అధ్యక్షుడు అంగీకరిస్తే సంబంధిత మంత్రి సమాధానం ఇస్తారు. దీన్ని 1954 నుంచి ఉపయోగిస్తున్నారు.

Half an Hour Discussion - అరగంట చర్చ: లోక్‌సభలో సోమ, బుధ, శుక్రవారాల్లో, రాజ్యసభలో ఏ రోజైనా లేదా ప్రతిరోజైనా చివరి అరగంటను కేటాయించుకోవచ్చు. ఈ సమయంలో ప్రశ్నోత్తరాలకు తగిన ప్రాధాన్యత లభించని అంశాలపై చర్చిస్తారు.

Short Duration Discussion - స్వల్ప కాలిక చర్చ: ప్రజా సంబంధమైన ముఖ్యాంశాల మీద సభ్యులు చర్చ లేవనెత్తవచ్చు. సభా కార్యక్రమాల చివర దీన్ని స్పీకర్ అనుమతిస్తారు. ఇందులో ఓటింగ్ ఉండదు.



No confidence Motion-అవిశ్వాస తీర్మానం: ప్రభుత్వం ప్రజా విశ్వాసం కోల్పోయిందని భావించినా లేదా ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఆ ప్రభుత్వాన్ని తొలగించేందుకు ఈ తీర్మానాన్ని ప్రతిపక్షాలు ప్రవేశపెడతాయి. దీన్ని ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ సభ్యుల్లో 50 మంది మద్దతుతో స్పీకర్‌కు నోటీస్ జారీ చేయాలి. స్పీకర్ ఆమోదిస్తే తీర్మానం చర్చకు వస్తుంది. అనంతరం ఓటింగ్ జరుపుతారు. ఈ ఓటింగ్‌కు హాజరై ఓటువేసిన సభ్యులు సాధారణ మెజార్టీతో తీర్మానాన్ని ఆమోదిస్తే ప్రభుత్వం కూలిపోతుంది. మొట్టమొదట 1961లో నెహ్రూ ప్రభుత్వంపై జె.బి. కృపలానీ ఈ తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఎక్కువసార్లు (8) పి.వి. నరసింహారావు ప్రభుత్వంపై ప్రవేశపెట్టారు. ఈ తీర్మానం ద్వారా 1999లో అటల్ బిహారి వాజ్‌పేయి ప్రభుత్వం కూలిపోయింది.

Confidence Motion-విశ్వాస తీర్మానం: ప్రజా విశ్వాసం తమ ప్రభుత్వానికి ఉందని నిరూపించుకునేందుకు అధికార పక్షం తనపై తాను పెట్టుకునే తీర్మానం. ఇది లోక్‌సభలో సాధారణ మెజార్టీతో నెగ్గాలి. లేకుంటే ప్రభుత్వం కూలిపోతుంది. ఈ తీర్మానం ద్వారా వి.పి.సింగ్ (1990) ప్రభుత్వం పడిపోయింది.

Quorum - నిర్దిష్ట పూర్వక సంఖ్య: నిబంధన -100 ప్రకారం పార్లమెంట్ కోరం సభాధ్యక్షుడితో కలుపుకొని 1/10. కోరం అంటే పార్లమెంట్ సమావేశాలకు హాజరు కావాల్సిన సభ్యుల సంఖ్య. కోరం లేకుంటే సమావేశాలను వాయిదా వేయవచ్చు.

Adjournment motion-వాయిదా తీర్మానం: అత్యంత ముఖ్యమైన సమకాలీన సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చేందుకు ఈ తీర్మానాన్ని ప్రవేశపెడతారు. దీన్ని ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ సభ్యుల్లో 50 మంది మద్దతుతో నోటీస్ జారీ చేయాలి. స్పీకర్ ఆమోదిస్తే తీర్మానం చర్చకు వస్తుంది.

Lame duck session: గత లోక్‌సభలో సభ్యులుగా ఉండి ప్రస్తుత లోక్‌సభకు పోటీచేసి ఓడిపోయిన వారితో ప్రస్తుత లోక్‌సభ సభ్యులు జరిపే చివరి సమావేశం. ఇది బ్రిటన్‌లో ఉంటుంది. మన దేశంలో లేదు.

Filibustering - ఫిలిబస్టరింగ్: పార్లమెంట్ కార్యక్రమాల్లో ఒక బిల్లు ఆమోదం పొందకుండా చేసేందుకు సభ్యులు ఉద్దేశపూర్వకంగా చేసే దీర్ఘకాలిక ఉపన్యాసం. సభ సమయం ముగిసేందుకు ఇబ్బందులు సృష్టించడం.

Gerry mandering-గెర్రిమాండరింగ్: అధికార పార్టీ నియోజకవర్గాల సరిహద్దులను తమకు అనుకూలంగా మార్చుకోవడం. ఎన్నికల్లో విజయం సాధించేందుకు చేసే ప్రయత్నం.

Floor Crossing - ఫ్లోర్ క్రాసింగ్: ప్రతిపక్ష పార్టీ నుంచి అధికార పక్షంలోకి పార్టీ ఫిరాయిస్తే ఫ్లోర్ క్రాసింగ్‌గా పేర్కొంటారు.

Carpet Crossing - కార్పెట్ క్రాసింగ్: అధికార పక్షం నుంచి ప్రతిపక్షంలోకి పార్టీ ఫిరాయిస్తే కార్పెట్ క్రాసింగ్‌గా పేర్కొంటారు.

Crossing - క్రాసింగ్: ఒక ప్రతిపక్ష పార్టీ నుంచి మరో ప్రతిపక్ష పార్టీలోకి మారడం.

Carpetbagger - కార్పెట్ బెగ్గర్: ఒక స్థానికేతర అభ్యర్థి స్థానిక అభ్యర్థిపై ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నిక కావాలనుకోవడమే కార్పెట్ బెగ్గింగ్.

గిలెటిన్: పార్లమెంట్ సమావేశాల ముగింపు దశలో వివిధ బిల్లులపై సమగ్రమైన చర్చ జరిపేందుకు తగిన సమయం లేని సందర్భంలో ఎలాంటి చర్చ లేకుండానే బిల్లులను ఆమోదించడాన్ని 'గిలెటిన్' అని పేర్కొంటారు.

హంగ్ పార్లమెంట్: లోక్‌సభకు జరిగిన సాధారణ ఎన్నికల్లో ఏ పార్టీ సంపూర్ణమైన మెజార్టీని సాధించనప్పుడు ఏర్పడే పరిస్థితిని 'హంగ్ పార్లమెంట్' లేదా 'త్రిశంకు సభ' అంటారు.

Horse Trading - హార్స్ ట్రేడింగ్: లోక్‌సభ లేదా విధాన సభ ఎన్నికల్లో ఏ పార్టీ పూర్తి మెజార్టీ సాధించనప్పుడు ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీని సాధించేందుకు సభ్యుల కొనుగోలు కోసం జరిపే బేరసారాలను 'హార్స్ ట్రేడింగ్' అంటారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. **జీరో అవర్ (Zero Hour) అంటే?**
   1) ముందుగా నోటీస్ ఇవ్వకుండానే అత్యంత ముఖ్యమైన విషయాలు లేవనెత్తడం
   2) లోక్‌సభలో ద్రవ్య బిల్లును ప్రవేశపెట్ట డం
   3) ప్రతిపక్ష పార్టీల మనవిని పరిశీలించడం
   4) ఉదయం, మధ్యాహ్నం సెషన్‌లకు మధ్య భోజన విరామం
2. **అవిశ్వాస తీర్మాన మనవిని స్పీకర్ అనుమతించాలంటే ఎంత మంది లోక్‌సభ సభ్యుల మద్దతు ఉండాలి?**
   1) 35 2) 50 3) 25 4) 20

సమాధానాలు: 1) 1; 2) 2;

మాదిరి ప్రశ్నలు

1. **గ్యాలప్‌పోల్ అంటే ఏమిటి?**
   1) ప్రతిపక్షాల అభిప్రాయాన్ని తీసుకోవడం
   2) సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరడం
   3) ప్రజాభిప్రాయాన్ని సేకరించడం
   4) ఎన్నికల ప్రచారం
2. **గెర్రి మాండరింగ్ అంటే అర్థం?**
   1) నియోజకవర్గ సరిహద్దులను మార్చడం
   2) ఓటర్లను ప్రభావితం చేయడం
   3) సైనిక పరిపాలన విధించడం
   4) ఏదీ కాదు
3. **పార్లమెంటరీ ప్రక్రియలో పేర్కొనని పదం?**
   1) ప్రశ్నల గంట (Question Hour)
   2) శూన్య కాలం (Zero Hour)
   3) దీర్ఘకాలిక వాయిదా (Prorogue)
   4) వాయిదా తీర్మానం (Adjournment Motion)
4. **'గిలెటిన్' తీర్మానం అంటే?**
   1) బిల్లులను చర్చించి ఓటింగ్ జరపడం
   2) సమావేశ గడువు ముగిసేలోగా బిల్లులన్నింటినీ మూకుమ్మడిగా ఆమోదించడం
   3) 1, 2 4) ఏదీకాదు
5. **మనదేశంలో మొదట ఏ లోక్‌సభ ద్వారా 'హంగ్ పార్లమెంట్' ఆవిర్భవించింది?**
   1) 9వ లోక్‌సభ 2) 10వ లోక్‌సభ
   3) 8వ లోక్‌సభ 4) ఏదీకాదు
6. **మన పార్లమెంట్‌లో ఉపయోగించని పదం ఏది?**
   1) Lame - duck - session
   2) Point of order
   3) Censure motion
   4) Vote on Account
7. **పార్లమెంటరీ కమిటీల్లో అతిపెద్ద కమిటీ?**
   1) ప్రభుత్వ ఖాతాల సంఘం
   2) ప్రభుత్వ అంచనాల సంఘం
   3) ప్రభుత్వ ఉపక్రమాల సంఘం
   4) సభ వ్యవహారాల సంఘం
8. **ఏ కమిటీకి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ 'మిత్రునిగా, మార్గదర్శిగా, తాత్వికునిగా' వ్యవహరిస్తారు?**
   1) జీతభత్యాల కమిటీ
   2) సభ హక్కుల కమిటీ
   3) ప్రభుత్వ ఖాతాల సంఘం
   4) గ్రంథాలయ కమిటీ
9. **వీటిలో ఏ కమిటీకి స్పీకర్ అధ్యక్షుడిగా కొనసాగుతారు?**
   1) ప్రభుత్వ ఉపక్రమాల కమిటీ
   2) ప్రభుత్వ ఖాతాల కమిటీ
   3) సభ వ్యవహారాల కమిటీ
   4) ప్రభుత్వ అంచనాల కమిటీ
10. **ఒక బిల్లు స్వభావాన్ని బట్టి నిబంధన 110 ప్రకారం ఆ బిల్లు సాధారణ బిల్లు లేదా ఆర్థిక బిల్లు అని ఎవరు నిర్ణయిస్తారు?**
    1) రాష్ట్రపతి
    2) కేంద్ర ఆర్థిక మంత్రి
    3) లోక్‌సభ స్పీకర్
    4) అటార్నీ జనరల్
11. **జీరో అవర్ కాలపరిమితి ఎంత?**
    1) ఒక గంట 2) 45 నిమిషాలు
    3) అర్ధ గంట 4) నిర్ణీత సమయం ఉండదు
12. **నక్షత్రం గుర్తు గల ప్రశ్నలకు సమాధానాలను ఎలా ఇస్తారు?**
    1) లిఖితపూర్వకంగా
    2) మౌఖికంగా
    3) 1, 2
    4) ఏవీకాదు
13. **ఆర్థికేతర బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి పంపినప్పుడు?**
    1) ఆమోదించవచ్చు
    2) పునఃపరిశీలనకు పంపవచ్చు
    3) తన వద్దే ఉంచుకోవచ్చు
    4) పైవన్నీ
14. **నిబంధన 120 ప్రకారం పార్లమెంట్ వ్యవహారాల్లో ఏ భాషను ఉపయోగించాలి?**
    1) సభ్యుని మాతృభాష 2) హిందీ
    3) ఇంగ్లిష్ 4) అన్నీ
15. **ఆర్థిక కమిటీల్లో ఏ కమిటీ సంయుక్త పార్లమెంటరీ కమిటీ?**
    1) ప్రభుత్వ ఖాతాల కమిటీ
    2) అంచనాల కమిటీ
    3) దత్త శాసనాల కమిటీ
    4) ఎస్సీ, ఎస్టీలపై కమిటీ
16. **వీటిలో సరికానిది?**
    1) బడ్జెట్ - ఆర్టికల్ -112
    2) ఉమ్మడి సమావేశం - 108
    3) తాత్కాలిక బడ్జెట్ - 116
    4) పార్లమెంట్ - 78
17. **వీటిలో ఏ తీర్మానం అత్యంత ముఖ్యమైన తీర్మానం?**
    1) సమాపాన తీర్మానం
    2) విశ్వాస తీర్మానం
    3) వాయిదా తీర్మానం
    4) సావధాన తీర్మానం
18. **భారత పార్లమెంట్ సార్వభౌమాధికార సంస్థ కాదు ఇందుకు కారణం?**
    1) సమాఖ్య వ్యవస్థ
    2) లిఖిత రాజ్యాంగం
    3) న్యాయ సమీక్ష 4) అన్నీ
19. **ప్రోరోగ్ (Prorogue) అంటే ఏమిటి?**
    1) పార్లమెంట్‌ను వాయిదా వేయడం
    2) పార్లమెంట్‌ను రద్దు చేయడం
    3) సమావేశం కొనసాగించడం
    4) పార్లమెంట్ సమావేశాన్ని ముగించడం
20. **పార్లమెంటరీ ప్రభుత్వానికి మరోపేరు?**
    1) లౌకిక ప్రభుత్వం
    2) సంక్షేమ ప్రభుత్వం
    3) సమాఖ్య ప్రభుత్వం
    4) బాధ్యతాయుత ప్రభుత్వం
21. **పార్లమెంట్ ఉమ్మడి సభ సమావేశానికి స్పీకర్, డిప్యూటీ స్పీకర్ లేనప్పుడు ఎవరు అధ్యక్షత వహిస్తారు?**
    1) రాజ్యసభ చైర్మన్
    2) రాజ్యసభ డిప్యూటీ చైర్మన్
    3) ప్యానల్ స్పీకర్స్‌లో సీనియర్
    4) రాష్ట్రపతి

సమాధానాలు

1) 3; 2) 1; 3) 2; 4) 2;
5) 1; 6) 1. 7) 2; 8) 3;
9) 3; 10) 3; 11) 4; 12) 2;
13) 4; 14) 4; 15) 1; 16) 4;
17) 3; 18) 4; 19) 4; 20) 4;
21) 2.

మానవ శరీరంలో అతిపెద్ద ధమని ఏది?

పోషక కణజాలం ద్వారా ఆహార పదార్థాలు ముఖ్యంగా చక్కెరలు రవాణా అవుతాయి. అందువల్ల కొన్ని జీవులు పోషక కణజాలంలో ఉండే ఆహారం కోసం చెట్టు బెరడును తొలుస్తాయి. సాధారణంగా పోషక కణజాలంలోని చక్కెర కోసం శీతాకాలంలో ఆహార కొరత ఉన్నప్పుడు ఇలా చేస్తుంటాయి. ఎఫిడ్‌లు లేత కాండం చుట్టూ గుమిగూడి, పొడవుగా, సూదిలా ఉండే తొండాన్ని (ప్రోబోసిస్) మొక్క కణజాలంలోకి చొప్పించి రసాన్ని పీలుస్తాయి. చిట్టెలుక లాంటి కొన్ని జీవులు చిన్న చిన్న మొక్కలకు హాని చేస్తుంటే, కుందేళ్ల లాంటివి పెద్ద చెట్లను నాశనం చేస్తుంటాయి.

ప్రసరణ - పదార్థ రవాణా వ్యవస్థ

జీవుల్లో శరీరం పెరుగుదల, అనేక జీవక్రియల నిర్వహణల కోసం పోషకాలు, వాయువులు, హార్మోన్లు, ఇతర ద్రవ పదార్థాలు అవసరం. ఏకకణ జీవుల్లో ఈ పదార్థాలను ఎక్కువ దూరం రవాణా చేయాల్సిన అవసరం లేదు. భూమిపై నివసించే జంతువుల్లో, వృక్షాల్లో ఎక్కువ దూరం పదార్థాలను రవాణా చేయాల్సి వస్తుంది.

'ప్రసరణ - పదార్థ రవాణా వ్యవస్థ' పాఠ్య భాగంలో విద్యార్థులు నాడీ స్పందన, హృదయ స్పందనల మధ్య సంబంధాలు; హృదయంలోని వివిధ భాగాలు - అవి పనిచేసే విధానం; ధమనులు, సిరలకు మధ్య భేదాలు, రక్త ప్రసరణ వ్యవస్థ, మొక్కల్లో పదార్థాల రవాణాకు మధ్య పోలికలు, తేడాల గురించి నేర్చుకుంటారు.

- అమీబా, హైడ్రా లాంటి నిమ్నస్థాయి జీవు ల్లో పదార్థాల రవాణా వ్యాపనం (Diffu- sion), ద్రవాభిసరణ (Osmosis) లాంటి సరళమైన పద్ధతుల ద్వారా జరుగుతుంది.
- ఉన్నతస్థాయి బహుకణ జీవుల్లో ప్రత్యేకమైన, వేగవంతమైన, సమర్థమైన వ్యవస్థ ద్వారా పదార్థాల రవాణా జరుగుతుంది. ఈ వ్యవస్థనే 'రవాణా వ్యవస్థ'(Circulatory System)అంటారు.
- మానవుల్లో హృదయ స్పందన, నాడీ స్పందన సమానంగా ఉంటాయి. ఏ పరికరం సహాయం లేకుండానే హృదయ స్పందనను తెలుసుకోవచ్చు.
- 'రెని లెన్నిక్' అనే శాస్త్రవేత్త స్టెతస్కోప్‌ను కనుగొన్నాడు.
- మానవ హృదయం హృదయావరణ త్వచాలతో ఆవరించి ఉంటుంది. వీటి మధ్య ఉండే 'హృదయావరణ ద్రవం' గుండెను అఘాతాల నుంచి కాపాడుతుంది.
- గుండెలో నాలుగు గదులుంటాయి. పూర్వభాగంలో రెండు కర్ణికలు, పరభాగంలో రెండు జఠరికలు ఉంటాయి.
- గుండె ఒక సంకోచ సడలికను హృదయ స్పందన అంటారు.
- శరీర అవయవాలకు చేరేటప్పుడు రక్తం ఒక్కసారి మాత్రమే గుండెకు చేరడాన్ని 'ఏక వలయం' అని, రెండుసార్లు రావడాన్ని 'ద్వంద్వ వలయం' అని అంటారు.
- మొక్కల్లో నీరు దారువు ద్వారా, పోషక పదార్థాలు పోషక కణజాలం ద్వారా సరఫరా అవుతాయి. మొక్కల్లో భాష్పోత్సేకం,ప్రసరణ వ్యవస్థకు మధ్య సంబంధం ఉంటుంది.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

కీలక పదాలు - నిర్వచనాలు

ప్రసరణ: శరీరం లోపల పదార్థాల రవాణాను ప్రసరణ అంటారు.

కర్ణికలు: హృదయంలో పై గదులను కర్ణికలు అంటారు.

జఠరికలు: హృదయంలో కింది గదులను జఠరికలు అంటారు.

నాడీ స్పందన: ధమనిలో రక్తం ప్రవహించేటప్పుడు ఏర్పడే ఒత్తిడిని నాడీ స్పందన అంటారు.

ధమనులు: హృదయం నుంచి రక్తాన్ని తీసుకెళ్లే రక్త నాళాలను ధమనులు అంటారు.

సిరలు: హృదయానికి రక్తాన్ని తీసుకొని వచ్చే రక్త నాళాలను సిరలు అంటారు.

స్టెతస్కోప్: హృదయ స్పందనను పరిశీలించడానికి వైద్యులు ఉపయోగించే పరికరాన్ని స్టెతస్కోప్ అంటారు.

దైహిక చాపం: ఎడమ జఠరిక నుంచి బయలుదేరే పెద్ద ధమనిని బృహద్ధమని లేదా దైహిక/ధమనీ చాపం అంటారు.

రక్తకేశనాళిక: ధమనులు, సిరల మధ్య ఉండే అతి సన్నని, చిన్నవైన రక్త నాళాలను రక్త కేశ నాళికలు అంటారు.

సిస్టోల్: హార్దిక వలయంలో గుండె కండరాలు చురుకుగా పాల్గొనే సంకోచ క్రియను సిస్టోల్ అంటారు.

డయాస్టోల్: హార్దిక వలయంలో గుండె కండరాలు సడలే స్థితిని డయాస్టోల్ అంటారు.

హార్దిక వలయం: హృదయ స్పందనలో క్రమానుగతంగా జరిగే సంకోచ, సడలిక ప్రక్రియలన్నింటినీ కలిపి హార్దిక వలయం అంటారు.

రక్త పీడనం: రక్తనాళాల్లో ఏ పీడనంతో రక్తం ప్రవహిస్తుందో దాన్ని 'రక్త పీడనం' అంటారు.

శోషరసం: రక్తం, కణాలను జోడించే ప్రధానమైన పదార్థం శోషరసం.

ఏక ప్రసరణ వలయం: రక్తం గుండె ద్వారా ఒకసారి మాత్రమే ప్రయాణిస్తే ఆ ప్రసరణను ఏకవలయ ప్రసరణ (Single Circulation) అంటారు.

ద్వివలయ ప్రసరణ: రక్తం గుండె ద్వారా రెండుసార్లు ప్రయాణిస్తే ఆ ప్రసరణను ద్వి లేదా ద్వంద్వ వలయ ప్రసరణ (Double Circulation) అంటారు.

రక్త స్కందనం: శరీరానికి గాయమైనప్పుడు రక్తం గడ్డకట్టి ఆ ప్రదేశంలో ఎర్రని గడ్డ ఏర్పడటాన్ని రక్త స్కందనం అంటారు.

స్పిగ్మో మానోమీటర్: రక్త పీడనాన్ని కొలిచే పరికరాన్ని స్పిగ్మో మానో మీటర్ అంటారు.

ప్రోత్రాంబిన్: రక్తనాళాలు తెగినప్పుడు రక్తం గడ్డ కట్టడంలో సహాయపడే ప్రోటీన్.

త్రాంబిన్: త్రాంబిన్ అనేది ప్రోత్రాంబిన్ మరో రూపం.

ఫైబ్రినోజన్: రక్తం గడ్డ కట్టడంలో సహాయపడే రక్తంలోని ద్రవరూప పదార్థం.

ఫైబ్రిన్: రక్తం గడ్డ కట్టడంలో సహాయపడే ఘన రూపంలో ఉండే తంతువుల లాంటి నిర్మాణాల నుంచి ఏర్పడుతుంది.

మాదిరి ప్రశ్నలు

1. **విశ్రాంతిలో, జాగింగ్ తర్వాత నాడీ స్పందన ఒకే విధంగా ఉంటుందా?**
   జ. ఉండదు. జాగింగ్ తర్వాత నాడీ స్పందన రేటు పెరుగుతుంది.
2. **ఏయే సందర్భాల్లో నాడీ స్పందన రేటు పెరుగుతుంది?**
   జ. 1. నాడీ స్పందన రేటు వ్యక్తికి వ్యక్తికీ, సందర్భాన్ని బట్టి మారుతుంది.
   2. భయపడినప్పుడు, ఉద్రేకపడినప్పుడు నాడీ స్పందన రేటు పెరుగుతుంది.
   3. మెట్లు ఎక్కేటప్పుడు, పరుగెత్తేటప్పుడు కూడా నాడీ స్పందన పెరుగుతుంది.
3. **హృదయ స్పందన, నాడీ స్పందనకు మధ్య సంబంధం ఏమిటి?**
   జ. హృదయ స్పందన, నాడీ స్పందన రేటు ఎప్పుడూ సమానంగా ఉంటాయి.
4. **మానవ శరీరంలో అతిపెద్ద ధమని ఏది? ఇది పెద్దదిగా ఉండటానికి కారణమేమిటి?**
   జ. 1. శరీరంలో అతిపెద్ద ధమని బృహద్ధమని లేదా ధమనీచాపం.
   2. ఇది శరీరంలోని అన్ని భాగాలకు ఆమ్లజనితో కూడిన రక్తాన్ని సరఫరా చేస్తుంది. అందువల్ల ఇది పెద్దగా ఉంటుంది.
5. **ఏ రక్త నాళాల్లో కవాటాలు ఉంటాయి? కవాటాల ఉపయోగం ఏమిటి?**
   జ. 1. సిరల్లో కవాటాలు ఉంటాయి.
   2. రక్తం గురుత్వాకర్షణకు వ్యతిరేకంగా పై దిశలో ప్రవహించడానికి కవాటాలు తోడ్పడతాయి. కింది దిశలో ప్రవహించనీయవు.
6. **ఆక్సీకరణం చెందడం కోసం రక్తాన్ని తీసుకువెళ్లే రక్తనాళాలేవి?**
   జ. పుపుస ధమని ఆక్సీకరణం కోసం రక్తాన్ని కుడి జఠరిక నుంచి ఊపిరితిత్తులకు తీసుకువెళుతుంది.
7. **చేతికి బిగుతుగా కట్టు కట్టినప్పుడు గుండెకు దూరంగా ఉన్న వైపున రక్తనాళాలు ఎందుకు ఉబ్బుతాయి?**
   జ. 1. సాధారణంగా గుండెకు రక్తం సిరల ద్వారా సరఫరా అవుతుంది.
   2. చేతికి బిగుతుగా కట్టు కట్టినప్పుడు సిరల్లో రక్త ప్రవాహానికి అవరోధం ఏర్పడి, గుండెకు దూరంగా ఉన్న రక్తనాళాలు ఉబ్బుతాయి.
8. **శరీరం లోపల ఉన్న రక్తనాళాలను (ధమనులు) బంధించినప్పుడు అవి హృదయం వైపు ఉబ్బడానికి కారణం ఏమిటి?**
   జ. 1. హృదయం నుంచి రక్తం ధమనుల ద్వారా శరీర భాగాలకు సరఫరా అవుతుంది.
   2. ఒకవేళ శరీరంలో లోపలి వైపున ఉన్న రక్తనాళాలను (ధమనులు) బంధిస్తే, ధమనుల్లో రక్త ప్రసరణకు అవరోధం ఏర్పడి హృదయం వైపు ఉబ్బుతాయి.
9. **గుండెలో కర్ణికలు, జఠరికల మధ్య కవాటాలు ఉంటాయి. ఈ కవాటాలు, సిరల్లో ఉండే కవాటాల వల్ల కలిగే ప్రయోజనం ఒకటేనని నీవు భావిస్తున్నావా?**
   జ. గుండెలో కర్ణికలు, జఠరికల మధ్య ఉండే కవాటాలు, సిరల్లో ఉండే కవాటాలు రక్తాన్ని ఏక మార్గంలో ప్రవహించడానికి తోడ్పడుతాయి. అందువల్ల ఈ రెండు రకాల కవాటాల వల్ల కలిగే ప్రయోజనం ఒకటే అని చెప్పవచ్చు.
10. **ధమనుల గోడలు దృఢంగా ఉండి, స్థితి స్థాపక శక్తి కలిగి ఉండటానికి కారణం?**
    జ. ధమనులలోకి రక్తం హృదయం నుంచి వస్తుంది. అందువల్ల ధమనుల్లో రక్త పీడనం ఎక్కువ. ఈ పీడనాన్ని భరించడానికి ధమనుల గోడలు దృఢంగా ఉండి, స్థితిస్థాపక శక్తి కలిగి ఉంటాయి.
11. **ధమనులతో పోల్చితే సిరల్లో రక్త ప్రవాహ మార్గం (Lumen) పరిమాణం పెద్దదిగా ఉంటుంది. ఎందుకు?**
    జ. ధమనుల్లో కండర పొర మందంగా, సిరల్లో కండర పొర పల్చగా ఉంటుంది. సిరల్లో రక్త పీడనం చాలా తక్కువగా ఉంటుంది. కాబట్టి సిరల్లో రక్తం వేగంగా హృదయానికి ప్రసరణ చెందడానికి వీలుగా రక్త ప్రవాహ మార్గం పరిమాణం పెద్దదిగా ఉంటుంది.
12. **రాత్రంతా బస్సులో కదలకుండా కూర్చొని ప్రయాణం చేసిన తర్వాత పాదాలు వాచినట్లవుతాయి. ఎందుకు?**
    జ. రాత్రంతా బస్సులో కదలకుండా ఎక్కువ సేపు కూర్చొని ప్రయాణం చేసినప్పుడు రక్తంలోని ద్రవం రక్త కేశనాళికల ద్వారా కణజాలాల్లోకి చేరుతుంది. దీన్ని కణజాల ద్రవం అంటారు. దీని వల్ల పాదాలు ఉబ్బి వాచినట్లు స్పష్టంగా తెలుస్తుంది. దీన్నే ఎడిమా (EDEMA) అంటారు.
13. **వివృత రక్త ప్రసరణ వ్యవస్థ అంటే ఏమిటి?**
    జ. బొద్దింక లాంటి కీటకాల్లో (ఆర్థ్రోపొడా) రక్తనాళాలు లేకపోవడం వల్ల రక్తం పెద్ద పెద్ద కోటరాల (ఖాళీ ప్రదేశాలు) లోకి ప్రవహిస్తుంది. కణజాలాలకు పోషకాలను సరఫరా చేస్తుంది. రక్తనాళాలు లేని ప్రసరణ వ్యవస్థను 'వివృత రక్త ప్రసరణ వ్యవస్థ' అంటారు.
14. **సంవృత రక్త ప్రసరణ వ్యవస్థ అంటే?**
    జ. రక్తం రక్తనాళాల్లో ప్రవహించే వ్యవస్థను 'సంవృత రక్త ప్రసరణ వ్యవస్థ' అంటారు.
15. **హీమోఫీలియా (Haemophilia) అంటే ఏమిటి?**
    జ. జన్యు లోపం వల్ల కొందరిలో రక్తం గడ్డకట్టదు. ఈ లోపాన్ని హీమోఫీలియా అంటారు.
16. **భాష్పోత్సేకం, వర్షపాతానికి మధ్య ఏదైనా సంబంధం ఉందా?**
    జ. భాష్పోత్సేకం ద్వారా నీరు ఆవిరి రూపం లో మొక్క నుంచి వెలుపలికి వెలువడుతుంది. దీనివల్ల గాలి ఎక్కువగా నీటి ఆవిరితో సంతృప్తం చెందుతుంది. నీటి ఆవిరితో నిండి పవనాలు వీచేటప్పుడు వర్షం కురుస్తుంది. అంటే భాష్పోత్సేకం ఎంత ఎక్కువగా జరిగితే అంత ఎక్కువగా వర్షపాతం ఉంటుంది.
17. **కుందేళ్ల లాంటి జంతువులు పెద్ద చెట్లను నాశనం చేయకుండా అటవీశాఖ అధికారులు ఏం చేస్తారు?**
    జ. అటవీశాఖ అధికారులు అడవుల్లో కుందేళ్ల బారి నుంచి వృక్షాలను కాపాడటానికి మాంస భక్షకులైన నక్కలు, గుడ్ల గూబలను పెంచుతారు.
18. **ప్రసరణ వ్యవస్థ అంటే ఏమిటి? ఘన, ద్రవ, వాయు పదార్థాలన్నింటినీ ఒకే వ్యవస్థ ద్వారా రవాణా చేయడం సాధ్యమవుతుందని మీరు భావిస్తున్నారా?**
    జ. 1. జీవుల్లో పదార్థాల రవాణాను నిర్వహించే ప్రత్యేకమైన, వేగవంతమైన వ్యవస్థను 'ప్రసరణ వ్యవస్థ' అంటారు.
    2. ఘన, ద్రవ, వాయు పదార్థాలన్నింటినీ ప్రసరణ వ్యవస్థ ద్వారా రవాణా చేయడం సాధ్యమవుతుంది. ఎందుకంటే మనం తీసుకునే ఆహారం, నీరు, గాలి రక్తం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకు రవాణా అవుతున్నాయి.

ఏకస్వామ్య పోటీ సిద్ధాంతం ఎవరిది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఎకానమీ



విలువ సిద్ధాంతం

మార్కెట్.. వస్తువులు, సేవల అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించింది. ఇక్కడ వస్తు సేవల ధరలను నిర్ణయిస్తారు. ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి చేసిన వస్తువులను ప్రజలు వినియోగించాలంటే ముందుగా మారకం జరగాలి. వస్తువులు, సేవల అమ్మకాలు, కొనుగోళ్లను మారకం లేదా వినిమయం అంటారు. నేటి ఆధునిక కాలంలో సమాచార వ్యవస్థ, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడం వల్ల 'నిర్ణీత ప్రదేశం' అవసరం లేకుండానే అమ్మకాలు, కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఉత్తరాలు, ఏజెన్సీలతోపాటు టెలిఫోన్, ఫ్యాక్స్, ఇంటర్నెట్, కంప్యూటర్లు తదితర సౌకర్యాల ద్వారా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

మార్కెట్ వర్గీకరణలో మూడు ప్రధాన అంశాలున్నాయి. మార్కెట్‌లోని వస్తువు, ఆ వస్తువుకున్న అమ్మకందార్ల సంఖ్య, కొనుగోలుదారుల సంఖ్యలు మొదటి అంశం. ఒక వస్తువు ఎంత భౌగోళిక విస్తీర్ణానికి విస్తరించి ఉంది అనేది రెండో అంశం. డిమాండ్‌కు అనుగుణంగా సప్లయ్ ఏ విధంగా మార్కెట్‌లో సర్దుబాటు అవుతుందనేది మూడో అంశం. ఇది వివిధ కాలవ్యవధులపై ఆధారపడి ఉంటుంది.

పోటీని బట్టి మార్కెట్లు:
పోటీని బట్టి మార్కెట్లు రెండు విధాలుగా ఉన్నాయి. అత్యధిక సంఖ్యలో అమ్మకందార్లు, కొనుగోలుదార్లు ఈ మార్కెట్‌లో ఉంటారు. ఇక్కడి పరిస్థితులు పోటీని పెంచేలా ఉంటాయి. ఈ మార్కెట్‌ను సంపూర్ణ పోటీ అంటారు. పరిమితమైన సంఖ్యలో ఉత్పత్తిదార్లు, కొనుగోలుదార్లు ఉండే మార్కెట్‌ను అసంపూర్ణ పోటీ అంటారు. ఉత్పత్తిదార్ల సంఖ్య ఆధారంగా ఇవి ఏకస్వామ్యం, ఏకస్వామ్య పోటీ, పరిమితస్వామ్య మార్కెట్‌లుగా ఉన్నాయి.

స్థలాన్ని, ప్రదేశాన్ని బట్టి మార్కెట్లు:
స్థలాన్ని బట్టి స్థానిక, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లుగా వర్గీకరించారు. ఇవి ఒక వస్తువు పరిమాణం లేదా ఎంతమేరకు మార్కెట్ ఉందో తెలుపుతాయి. కొన్ని వస్తువులకు పరిమిత విస్తీర్ణంలో కొనుగోళ్లు, అమ్మకాలు జరుగుతాయి. మరికొన్నింటికి వివిధ దేశాల్లో విస్తృత మార్కెట్ ఉంటుంది. మన్నిక ఆధారంగా ఒక వస్తువుకు మార్కెట్ విస్తీర్ణం, డిమాండ్ ఉంటుంది.

కాలాన్ని బట్టి మార్కెట్లు:
ఒక వస్తువు సప్లయ్‌లో సర్దుబాట్లను అనుసరించి మార్కెట్లున్నాయి. కాల వ్యవధి ప్రకారం వస్తువు సప్లయ్‌లో మార్పులు జరుగుతాయి. దీన్ని బట్టి మూడు రకాల మార్కెట్లు ఉన్నాయి. అవి అతి స్వల్పకాలిక, స్వల్పకాలిక, దీర్ఘకాలిక మార్కెట్లు.

సంపూర్ణ పోటీ మార్కెట్:
అమ్మకందార్లు, కొనుగోలుదార్ల మధ్య పోటీ సంపూర్ణంగా లేదా పరిపూర్ణంగా ఉంటే దానిని సంపూర్ణ పోటీ మార్కెట్ లేదా పరిపూర్ణ పోటీ మార్కెట్ అంటారు. ఈ మార్కెట్లో ఒక కాలంలో ఒక వస్తువుకు ఒకే ధర ఉంటుంది. మార్కెట్లో నిర్ణయమైన ధరనే అమ్మకందార్లు, కొనుగోలుదార్లు అంగీకరిస్తారు. సజాతీయ వస్తువులుంటాయి. సంస్థల స్వేచ్ఛా ప్రవేశం, నిష్క్రమణ, ఉత్పత్తి కారకాల గమనశీలత, సంపూర్ణ జ్ఞానం, రవాణా ఖర్చులు, పోటీ ప్రకటనలు ఉండవు. సగటు రాబడి (AR) రేఖ X అక్షానికి సమాంతరంగా ఉంటుంది.

సంపూర్ణ పోటీ మార్కెట్‌లో డిమాండ్, సప్లయ్‌లు వస్తువు సమతౌల్యధరను నిర్ణయిస్తాయి. ఉత్పత్తిదార్లు సప్లయ్‌ను.. కొనుగోలుదార్లు మార్కెట్ డిమాండ్‌ను నిర్ణయిస్తారు. ఏ ధర వద్ద సప్లయ్, డిమాండ్ సమానం అవుతాయో ఆ ధరను సమతౌల్యధర అంటారు.

నిర్ణీత కాలంలో వివిధ ధరల వద్ద కొనుగోలు చేసే వస్తు పరిమాణాన్ని వైయక్తిక డిమాండ్ అంటారు. ఈ ధరను మార్కెట్లో కొనుగోలుదార్లు ఏ పరిమాణంలో కొంటారో దాన్ని డిమాండ్ అంటారు. వస్తుధర తగ్గితే డిమాండ్ పెరుగుతుంది. ధర పెరిగితే కొనుగోలుదార్లు తక్కువ వస్తువులను డిమాండ్ చేస్తారు.

వివిధ ధరల వద్ద ఉత్పత్తిదార్లు లేదా అమ్మకందార్లు ఎంత పరిమాణాన్ని విక్రయించడానికి సంసిద్ధత వ్యక్తం చేస్తారో దాన్ని సప్లయ్ అంటారు. ధర పెరిగితే సప్లయ్‌ను అమ్మకందార్లు పెంచుతారు. ధర తగ్గితే సప్లయ్‌ను తగ్గిస్తారు.

సమతౌల్య ధర వద్ద అమ్మకందార్ల, కొనుగోలుదార్ల మధ్య వస్తురాశి వినిమయం జరుగుతుంది. ఆ వస్తురాశిని సమతౌల్య వస్తురాశి అంటారు. వస్తువు ధరను డిమాండ్, సప్లయ్‌లు నిర్ణయిస్తాయి. ఇవి ఒకదానినొకటి వ్యతిరేకంగా ఉంటాయి.

ధరపై సప్లయ్, డిమాండ్‌ల్లో ఏది ఎక్కువ ప్రభావం చూపుతుందనే అంశాన్ని మార్కెట్ కాల వ్యవధి ఆధారంగా విశ్లేషించారు. కాలవ్యవధిని మార్షల్ 3 రకాలుగా వర్గీకరించారు. అవి..

1) మార్కెట్ కాలం
2) స్వల్పకాలం 3) దీర్ఘకాలం

- మార్కెట్ కాలంలో సప్లయ్ స్థిరంగా ఉంటుంది. డిమాండ్ పెరిగితే ధర పెరుగుతుంది. డిమాండ్ తగ్గితే ధర తగ్గుతుంది. దీన్ని బట్టి మార్కెట్ కాలంలో ధర మీద డిమాండ్ ప్రభావం ఎక్కువ ఉంటుందని చెప్పవచ్చు.
- స్వల్పకాలంలో.. ఒక ఉత్పత్తి సంస్థ తన వద్ద ఉన్న పరికరాలను, యంత్రాలను ఉపయోగించుకొని ఎక్కువ ముడిపదార్థాలను, శ్రామికులను నియమించి ఉత్పత్తిని పెంచడానికి ప్రయత్నం చేస్తుంది. స్థిర సాధనాలను పెంచడానికి అవకాశం లేనందున సప్లయ్‌ని అనుకున్నంత పరిమాణంలో సాధించలేకపోతుంది.
- దీర్ఘకాలంలో ఎక్కువ ఉత్పాదక శక్తి కలిగిన కొత్త యంత్రాలను ప్రవేశపెట్టి డిమాండ్ పెరిగిన మేరకు సప్లయ్‌ని పెంచవచ్చు. ఈ కాలంలో అన్ని సాధనాలు చర సాధనాలే. అందువల్ల అన్ని వ్యయాలు చర వ్యయాలే. దీర్ఘకాలంలో డిమాండ్ పెరిగిన మేరకు సప్లయ్ పెరుగుతుంది.

సంపూర్ణ పోటీ మార్కెట్‌లో సమష్టి డిమాండ్, సమష్టి సప్లయ్‌లు కలిసి సమతౌల్య ధరను నిర్ణయిస్తాయి. పరిశ్రమలో నిర్ణయించిన ధరను ప్రతి సంస్థ స్వీకరిస్తుంది. ధరను బట్టి సంస్థ తయారుచేసే వస్తురాశి నిర్ధారితం అవుతుంది. ప్రతి సంస్థ సమతౌల్యం పొందడానికి ప్రయత్నం చేస్తుంది. ఉపాంత వ్యయం, ఉపాంత రాబడి సమానంగా ఉండాలి (MC = MR). MC రేఖ MR రేఖను కింది నుంచి ఖండిస్తూ పైకి పోవాలి.

అసంపూర్ణ పోటీ మార్కెట్:
ఏకస్వామ్యాన్ని ఆంగ్లంలో 'మోనోపాలి' అంటారు. 'మోనోపాలి' అంటే ఒకే ఒక అమ్మకందారుడు ఉండే మార్కెట్ అని అర్థం. ఒకే అమ్మకందారుడు ఉండి సమీప ప్రత్యామ్నాయాలు లేని మార్కెట్‌ను ఏకస్వామ్య మార్కెట్ అంటారు. దీన్నే గుత్తాధిపత్య మార్కెట్ అని కూడా అంటారు. ఉత్పత్తి తరహా, ముడి పదార్థాల సప్లయ్, పేటెంట్ హక్కులు, ప్రభుత్వ విధానాలు మొదలైన అంశాలు ఏకస్వామ్య సంస్థ కొనసాగడానికి సహకరిస్తాయి.

మాదిరి ప్రశ్నలు

1. ఏకస్వామ్య పోటీ సిద్ధాంతం ఎవరిది?
1) కార్‌నాట్ 2) చాంబర్లిన్
3) రాబిన్‌సన్ 4) పాల్ స్వీజీ
2. ఒకే ఒక అమ్మకందారు ఉన్న మార్కెట్?
1) ద్విదాధిపత్యం 2) పరిమితస్వామ్యం
3) శుద్ధ ఏకస్వామ్యం 4) ఏదీకాదు
3. సంస్థ తన వస్తు అమ్మకాలను పెంచుకోవడానికి చేసే వ్యయాలను ఏమంటారు?
1) అమ్మకపు వ్యయాలు
2) అవకాశ వ్యయాలు
3) అప్రకటిత వ్యయాలు
4) ప్రకటిత వ్యయాలు
4. పరిమితస్వామ్యాన్ని వివరించిన ఆర్థికవేత్త ఎవరు?
1) అగస్టిన్ 2) కార్‌నాట్
3) మార్షల్ 4) పాల్ స్వీజీ
5. అగ్‌మార్క్ ముద్ర ఏ వస్తువులకు చెందింది?
1) వ్యవసాయ వస్తువులు
2) వినియోగ వస్తువులు
3) మూలధన వస్తువులు 4) పైవన్నీ
6. ఒక సంస్థ ధరను పెంచితే మిగతా సంస్థలు ధరను పెంచని మార్కెట్ ఏది?
1) ఏకస్వామ్యం 2) ద్విదాధిపత్యం
3) పరిమిత స్వామ్యం 4) ఏకస్వామ్యపోటీ
7. అసంపూర్ణ పోటీలో భాగం కానిదేది?
1) ఏకస్వామ్యం 2) సంపూర్ణపోటీ
3) పరిమిత స్వామ్యం
4) ద్విదాధిపత్యం
8. ధరల దృఢత్వం ఉన్న మార్కెట్?
1) మోనోపాలి 2) సంపూర్ణపోటీ
3) డ్యుయోపాలి 4) పరిమితస్వామ్యం
9. ద్విదాధిపత్యాన్ని గురించి వివరించిన ఆర్థికవేత్త ఎవరు?
1) మార్షల్ 2) రికార్డో
3) స్వీజీ 4) కార్‌నాట్
10. సంస్థకు స్వల్పకాలంలో లాభాలు ఎలా ఉంటాయి?
1) సామాన్యంగా 2) గరిష్ఠంగా
3) స్థిరంగా 4) కనిష్ఠంగా
11. వ్యాపార ప్రకటనలపై చేసే ఖర్చు వేటికి సంబంధించింది?
1) అమ్మకపు వ్యయాలు
2) అవకాశ వ్యయాలు
3) అప్రకటిత వ్యయాలు
4) ప్రకటిత వ్యయాలు
12. దీర్ఘకాలంలో కూడా అత్యధిక లాభాలను ఆర్జించే మార్కెట్ ఏది?
1) ఏకస్వామ్యం 2) పరిమిత స్వామ్యం
3) ద్విదాధిపత్యం 4) పైవన్నీ
13. కిందివానిలో డిమాండ్‌ను బట్టి ఏర్పడని మార్కెట్ ఏది?
1) అంతర్జాతీయ మార్కెట్
2) స్థానిక మార్కెట్
3) జాతీయ మార్కెట్
4) సంపూర్ణ పోటీ మార్కెట్
14. సగటు వ్యయ కనిష్ఠ బిందువునేమంటారు?
1) స్థిరవ్యయం
2) అభిలషణీయ ఉత్పత్తి
3) చర వ్యయం 4) ఏదీకాదు
15. కొద్దిమంది అమ్మకందార్లు ఉండి అనేక మంది కొనుగోలుదార్లు ఉన్న సంస్థ ఏది?
1) ద్విదాధిపత్యం 2) ఏకస్వామ్యం
3) పరిమిత స్వామ్యం 4) ఏదీకాదు
16. ఉత్పత్తి వ్యయం, అమ్మకపు వ్యయాలు లేని మార్కెట్ ఏది?
1) ఏకస్వామ్య పోటీ
2) పరిమిత స్వామ్యం
3) ద్విదాధిపత్యం 4) ఏదీకాదు
17. ఏకస్వామ్యంలో రాబడి రేఖలు ఏ విధంగా ఉంటాయి?
1) స్థిరంగా 2) ధనాత్మకంగా
3) రుణాత్మక వాలు 4) ఏదీకాదు
18. గరిష్ఠ లాభాలను సంస్థ ఏ కాలంలో ఆర్జిస్తుంది?
1) అతిదీర్ఘకాలం 2) దీర్ఘకాలం
3) స్వల్పకాలం 4) పైవన్నీ
19. సన్నిహిత ప్రత్యామ్నాయాలు లేని వ్యవస్థ ఏది?
1) ఏకస్వామ్యం 2) ఏకస్వామ్యపోటీ
3) పరిమిత స్వామ్యం 4) ద్విదాధిపత్యం
20. సంపూర్ణ పోటీలో ధర నిర్ణయం ఏ విధంగా జరుగుతుంది?
1) సప్లయ్
2) సమష్టి సప్లయ్, సమష్టి డిమాండ్ కలిసి
3) డిమాండ్ 4) ఏదీకాదు
21. ఏకస్వామ్య పోటీలో సంస్థకు స్వల్ప కాలంలో వచ్చేవి?
1) నష్టాలు 2) గరిష్ఠ లాభాలు
3) గరిష్ఠ లాభాలు, నష్టాలు
4) సామాన్య లాభాలు
22. ఇటుకలకు ఉండే డిమాండ్ ఏది?
1) అంతర్జాతీయ 2) స్థానిక
3) జాతీయ 4) ఏదీకాదు
23. మార్కెట్ కాలంలో సప్లయ్?
1) సాపేక్ష వ్యాకోచత్వం
2) సాపేక్ష అవ్యాకోచత్వం
3) పూర్తి అవ్యాకోచత్వం
4) పూర్తి వ్యాకోచత్వం
24. జాతీయ డిమాండ్ లేని వస్తువు ఏది?
1) గోధుమ 2) పంచదార
3) వస్త్రాలు 4) చేపలు
25. మార్కెట్ల వర్గీకరణలో ఉండే అంశాలు?
1) ఐదు 2) మూడు
3) నాలుగు 4) ఏదీకాదు
26. ధర నాయకత్వం ఉన్న ఆర్థిక మార్కెట్‌కు ఉదాహరణ?
1) ఏకస్వామ్య పోటీ
2) పరిమిత స్వామ్యం
3) పరిపూర్ణ పోటీ 4) ద్విసామ్యం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 4; 5) 1; 6) 3; 7) 2; 8) 4; 9) 4; 10) 2; 11) 1; 12) 1; 13) 4; 14) 2; 15) 2; 16) 3; 17) 3; 18) 3; 19) 1; 20) 2; 21) 3; 22) 2; 23) 3; 24) 4; 25) 2; 26) 2.

What is an E-mail attachment?

Bank Exams

Computer Awareness



1. Which of the following device is used as the standard pointing device in a Graphical User Environment?
a) Keyboard b) Mouse
c) Joystick d) Trackball
e) None of these
2. An example of a telecommunications device:
a) Keyboard b) Mouse
c) Printer d) Modem
e) None of these
3. Every component of your computer is either
a) software or CPUIRAM
b) input or output device
c) application software or system software
d) hardware or software
e) None of these
4. What is an E-mail attachment?
a) A receipt sent by the recipient
b) A separate document from another program sent along with an E-mail message
c) A malicious parasite that feeds off your messages and destroys the contents
d) A list of CC or BCC recipients
e) None of these
5. Correcting errors in a program is called?
a) Interpreting b) Translating
c) Debugging d) Compiling
e) None of these
6. The main folder on a storage device is called?
a) Platform b) Interface
c) Root directory d) Device driver
e) None of these
7. 'DOS' floppy disk does not have___
a) A Boot Record
b) A File Allocation Table
c) A Root Directory
d) Virtual Memory
e) BIOS
8. The word FIP stands for:
a) File Translate Protocol
b) File Transit Protocol
c) File Typing Protocol
d) File Transfer Protocol
e) None of these
9. Power supplied to a low-power USB device ___
a) through a power cable
b) from an external power supply
c) directly from the computer's power supply
d) through the USB cable
e) None of these
10. Which of the following are used to identify a user who returns to a Website?
a) Cookies b) Plug-ins
c) Scripts d) ASPs
e) None of these
11. A proxy server is used for the which of the following?
a) To provide security against unauthorized users
b) To process client requests for web pages
c) To process client requests for database access
d) To provide TCP/IP
e) None of these
12. Memory unit is one part of ____.
a) Control unit
b) Central Processing Unit
c) Input device d) Output device
e) None of these
13. The number of pixels displayed on a screen is known as ____
a) Screen Resolution
b) Screen colour depth
c) Screen refresh rate
d) Screen viewing size
e) None of these
14. Word processing, spreadsheet, and photo-editing are example of ___
a) application software
b) system software
c) operating system software
d) platform software
e) None of these
15. A ____ is approximately a million bytes.
a) Gigabyte b) Kilobyte
c) Megabyte d) Terabyte
e) None of these
16. A computer cannot 'boot' if it does not have the ___
a) Compiler b) Loader
c) Operating System
d) Assembler e) None of these
17. To view information on the web you must have a ___
a) cable modem
b) web browser
c) Domain Name Server
d) hypertext viewer
e) None of these
18. What type of computer could be found in a digital watch?
a) Mainframe computer
b) Super computer
c) Embedded computer
d) Notebook computer
e) None of these
19. The arrow keys can be used to___
a) delete text
b) move the cursor in the text that has already been entered
c) save the document
d) move the cursor while deleting text
e) None of these
20. Office LANS, which are scattered geographically on large scale, can be connected by the use of corporate are called:
a) CAN b) LAN c) DAN
d) WAN e) TAN
21. Directory in directory is called:
a) Mini directory
b) Junior directory
c) Part directory
d) Sub directory
e) None of these
22. A ____ is a microprocessor-based computing device.
a) personal computer
b) mainframe c) workstation
d) server e) None of these
23. RAM can be thought of as the ___ for the computer's processor.
a) factory b) operating room
c) waiting room
d) planning room
e) None of these
24. One thousand bytes are equal to __
a) Kilobyte b) Megabyte
c) Gigabyte d) Terabyte
e) None of these
25. The way that computers manipulate data into information is called:
a) Programming
b) Calling c) Storing
d) Organizing e) Processing
26. The components that process data are located in the:
a) Input devices b) Output devices
c) System unit
d) Storage component e) CPU
27. To locate a data item for storage:
a) Field b) Feed c) Fetch
d) Defrag e) None of these
28. Smaller and less expensive PC-based systems are replacing ____ in many businesses.
a) supercomputers
b) clients c) laptops
d) users e) mainframes
29. The difference between people with access to computers and the Internet and those without this access is known as the ___
a) Digital divide
b) Internet divide
c) Web divide
d) Broadband divide
e) Cable divide
30. ____ controls the way in which the computer system functions and provides a means by which users can interact with the computer.
a) The platform
b) The operating system
c) Application software
d) The motherboard
e) Power socket
31. Programs designed to perform specific task is known as ___
a) System software
b) Application software
c) Proprietary programs
d) Open source software
e) None of these
32. The operating system is the most common type of ____ software.
a) communication
b) application c) system
d) word-processing software
e) digital
33. Which of the following menu types is also called a drop-down menu?
a) Fly-but b) Cascading
c) Pop-up d) Pull-down
e) None of these
34. Data information is stored in computer as:
a) Files b) Directories
c) Floppies
d) Matter
e) None of these
35. The PC (personal computer) and the Apple Macintosh are examples of two different:
a) Platforms b) Applications
c) Programs d) Storage devices
e) CPU's
36. Hundreds of Universities, Government entities, and Research labs have formed?
a) internet b) WWW
c) internet2 d) TCP/IP
e) intranet
37. The radian of a number system
a) Is variable
b) Has nothing to do with digit position value
c) Equals the number of its distinct counting digits
d) Is always an even number
e) None of these
38. In a Computer _____ is capable to store single binary bit.
a) Inductor b) Capacitor
c) Flip Flop d) Register
e) BUS

KEY

1) b; 2) d; 3) d; 4) b; 5) c; 6) c; 7) d; 8) a; 9) d; 10) a; 11) a; 12) b; 13) a; 14) a; 15) c; 16) c; 17) b; 18) c; 19) b; 20) d; 21) d; 22) a; 23) c; 24) a; 25) e; 26) c; 27) c; 28) e; 29) a; 30) b; 31) b; 32) c; 33) c; 34) a; 35) a; 36) c; 37) c; 38) c.

విద్య, ఉద్యోగ సమాచారం

డీఎంహెచ్‌వో అనంతపురంలో 16 పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురంలో డిస్ట్రిక్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్(డీఎంహెచ్‌వో).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 16.
- **పోస్టుల వివరాలు:** క్లినికల్ సైకాలజిస్ట్-01, ఆడియాలజిస్ట్/స్పీచ్ థెరపిస్ట్-01, ఆప్టోమెట్రిస్ట్-01, ఫార్మసీ ఆఫీసర్-01, డేటా ఎంట్రీ ఆపరేటర్-04, లాస్ట్ గ్రేడ్ సర్వీస్(గ్రేడ్-4)-08.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, డిగ్రీ, డి.ఫార్మసీ, బి. ఫార్మసీ, ఎం.ఫిల్(సోషల్ సైకాలజీ, మెంటల్ హెల్త్), ఎంఏ సైకాలజీలో ఉత్తీర్ణులవ్వాలి. -వయసు: 01.01.2025 నాటికి 42 ఏళ్ల లోపు ఉండాలి.
- **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఆఫీస్ ఆఫ్ ది డిస్ట్రిక్ మెడికల్ హెల్త్ ఆఫీసర్, అనంతపురం చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 10.04.2025.
- **వెబ్‌సైట్:** https://ananthapuramu.ap.gov.in

రాష్ట్రీయ రక్షా యూనివర్శిటీ, బెంగళూరులో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

బెంగళూరులోని రాష్ట్రీయ రక్షా యూనివర్శిటీ (ఆర్ఆర్‌యూ) శివమొగ్గ క్యాంపస్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సుల వివరాలు:** బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ ఇన్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్, బీఏ/బీఎస్సీ ఇన్ డిఫెన్స్ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, ఎంఏ/ఎస్సీ ఇన్ డిఫెన్స్ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, ఎంఏ/ఎంఎస్సీ క్రిమినాలజీ-ఫోరెన్సిక్ సైన్స్, మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ క్లినికల్ సైకాలజీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ పోలీస్ సైన్స్-మేనేజ్‌మెంట్.
- **అర్హత:** కోర్సులను అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్‌లో 50 శాతం, డిగ్రీలో 50 శాతం, 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి.
- **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్, రాతపరీక్ష ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఈమెయిల్:** admissions.karnataka@rru.ac.in.
- **వెబ్‌సైట్:** https://rru.ac.in